# మన కథ నిజం కాదు!

నవల

\- మన్నెం శారద



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 187

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి డిసెంబర్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**మార్గశిర మధ్యమం!**

సంధ్యాసమయం

అయిదుగంటలకే చీకట్లు ఒక పక్కనుండి కమ్ముకొస్తున్నాయి. క్రుంగిపోతున్న సూర్యకాంతితో కలిసిన చీకటి ఒక వింత రంగుతో ఆకాశమంతా కమ్ముకుంటున్న ఆ సాయంత్రం ఆ ఇద్దరూ పొలాల మధ్యన వున్న సన్నని కాలిబాటపై నడుస్తున్నారు.

అతని చేతిలో సూట్‌కేసు.

ఆ అమ్మాయి చేతిలో గిటార్.

వీస్తున్న చలిగాలికి పంటకొచ్చిన పచ్చని పైరు వణుకుతున్నట్లుగా కదులుతున్నది. కంకుల మీద పడిన సూర్యకాంతిలో కంకులు పగడాలు పొదిగినట్లు మెరుస్తున్నాయి.

మరో అప్పుడయితే ఆ యిద్దరూ ఆ ప్రకృతిని చూసి పరవశించేవారేమో!

కాని.. ఇప్పుడలా కాదు.

వారికి నచ్చనిదేదో జరుగుతున్నట్లుగా వారిద్దరి మొహాలు ముడుచుకుని ఉన్నాయి.

అతను కొంత నిర్లక్ష్యంగా కాలికి తగులుతున్న రాళ్ళని తన్నుతూ నడుస్తున్నాడు.

ఆ అమ్మాయి బ్లూయిష్ గ్రేకలర్ జీన్స్ పేంట్ మీద నలుపు రంగు టీ షర్టు వేసుకుంది. నడుంకి స్వెట్టర్ బిగించి చలికి గిటార్‌ని గట్టిగా కౌగలించుకుని అయిష్టంగా అడుగులు ముందుకి వేస్తున్నది.

అతనొకసారి ఆమె వైపు చూశాడు.

"అలా చలికి వణకకపోతే ఆ స్వెటర్ తొడుక్కోవచ్చుగా!" అన్నాడతను.

ఆమె జవాబు చెప్పలేదు. మరోప్పుడయితే మాటకి మాట విసిరేదేమో! ఇప్పుడేదో దిగులావరించినదానిలా అతనికేసి చూసి చూపు దించుకుంది.

దూరంగా కనిపిస్తున్న నేషనల్‌హైవే దగ్గరవుతోంది.

అక్కడ బాట రెండుగా చీలింది. ఒక బాట హైవే వైపు మలుపు తీసుకుంది.

అక్కడ వాళ్ళిద్దరూ నిలబడిపోయారు.

హైవేమీద నిలబడిన కారు వాళ్ళిద్దరి కళ్ళలో నిలబడింది. కారు దిగిన వ్యక్తి వాళ్ళని చూసి చెయ్యి ఊపాడు.

అతను ఆమెకు సూట్‌కేసు అందించాడు.

ఆమె అందుకుంటూ అతని కళ్ళలోకి చూసింది.

ఆమె కళ్ళలో మెరుస్తున్న కన్నీటిలో సంధ్య ఎర్రగా మెరుస్తోంది.

అతను చిన్నగా నవ్వడానికి ప్రయత్నించాడు.

ఆమె షేక్‌హేండ్ ఇవ్వడానికి చెయ్యి చాపింది. అతనా చేతిని అందుకుని చిన్నగా నొక్కుతున్నప్పుడు రెండు కన్నీటి చుక్కలతని చేతిమీద పడ్డాయి.

అతనామె చేతిని వదిలేస్తూ "మన గమ్యాలిప్పుడు రెండుగా చీలిపోయాయి" అన్నాడు నిస్పృహని దాస్తూ.

"ఈ బాటలు మరెక్కడో కలిసి ఒకే గమ్యమవుతాయేమో?" అందామె అతని కళ్ళలోకి చూస్తూ.

"చీకటిపడుతోంది. వెళ్ళు"

ఆ అమ్మాయి వెనక్కి చూస్తూ ముందుకి నడిచింది.

"ఏయ్! నువ్విలా రా!" కారు దగ్గర వ్యక్తి చేతులూపుతూ చప్పట్లు కొడుతూ అతన్ని పిలిచాడు.

"ఎందుకు? అవసరమైతే నువ్వే రా" అన్నాడు తను నిర్లక్ష్యంగా వెనక్కు మళ్ళుతూ.

అతను గబగబా పరిగెత్తుకొచ్చి కరెన్సీ కట్టొకటి అతనికివ్వబోయాడు.

"ఏవిటిది?"

"సారు ఇమ్మన్నారు"

"ఎందుకు?"

"అమ్మాయిని జాగ్రత్తగా అప్పజెప్పావు కదా!"

అతను పరిహాసంగా నవ్వి ఆ చేతిని వెనక్కి తోసేసాడు.

"ఈ డబ్బుతో వీలయితే ప్రేమని కొని.. ఆడపిల్ల యింట్లోంచి పారిపోకుండా మీ సార్‌ని పెంచమను"

మరోమాటకాస్కారం లేకుండా అతను వచ్చిన బాటపట్టాడు.

అతని పేరు 'సుబ్బు' అని పిలవబడే సుబ్రమణ్యం. వయసు ఇరవైఆరు.

ఆ అమ్మాయెక్కిన కారు సాగిపోయింది.

ఆమె పేరు 'మహా' అని పిలవబడే మహాలక్ష్మి. వయసు ఇరవైమూడు.

ఇంటి తాళం తెరిచాడు సుబ్బు.

రెండుగదుల పోర్షన్ అది. లోయర్ మిడిల్ క్లాసు ఏరియా.

చిన్న చిన్న పోర్షన్‌లుగా విభజించిన పాతకట్టడం అది. ఆటోడ్రైవర్లు, చిన్న చిన్న ప్రయివేటు ఉద్యోగాలు చేసే వారక్కడ నివాసముంటారు. సాయంత్రమయ్యేసరికి తాగుబోతుల గొడవలు, నీళ్ళకోసం ఆడవాళ్ళ తన్నులాటలు, వస్తువులు పోయాయని ఒకరిమీద మరొకరు నేరాలేసుకుని నిందించుకోవడాలూ, పిల్లల ప్రేమాయణాలు, కులాలెత్తుకుని తిట్టుకోవడాలూ... ఆనక ఎవరికైనా కష్టం వస్తే కలిసిపోవడాలు. పోయినప్పుడు తాగి ఏడవడాలూ.. అక్కడన్నీ మామూలే.

"తిన్నావురా?" అక్కడే గుమ్మంలో కూర్చున్న పాపాయమ్మ అడిగింది.

సుబ్బు జవాబు చెప్పలేదు.

"పిల్లేదిరా?" మళ్ళీ ప్రశ్న.

సుబ్బు మాట్లాడకుండా లోపలికి వెళ్ళి తలుపేసుకున్నాడు.

లైటువేసి గబుక్కున మంచమ్మీద పడుకోబోయి ఠక్కున షాక్కొట్టినట్లుగా ఆగిపోయాడు.

మంచమ్మీద లేత గులాబీరంగు దుప్పటి. దానిమీద ఎర్రగులాబీల ప్రింటు నీటుగా కనిపించింది.

మహా వచ్చిందగ్గర్నుండి ఆ మంచం తనదే

ఇప్పుడతనికి దానిమీద పడుకోవడానికి మనస్కరించలేదు.

చాప పరుచుకుని క్రిందనే పడుకున్నాడు.

కళ్ళుమూసుకున్నాడు నిద్రరావడం లేదెంతకి. లేచి సిగరెట్టు వెలిగించి కుర్చీలో కూర్చున్నాడు.

కిటికీకి కట్టిన నీలంరంగు పల్చని తెరలు గాలికి ఊగుతున్నాయి. అక్కడక్కడా గోడలకి అమర్చిన నీటిరంగు చిత్రాలు అస్పష్టమైన దృశ్యాల్ని కంటికింపుగా చూపిస్తున్నాయి. వాటి అర్థాలూ, అంతరార్థాలేవిటో మహా చెప్పిందిగాని.. అతనికి వాటి భావాలేమిటో అంతుపట్టలేదు. "ఇంకొంచెం రంగులేడవచ్చుగా. మరీ నీళ్ళు పూసినట్లు తేలిపోవడం లేదూ!" అన్నాడు అతను.

ఆమె పకపకా నవ్వింది "మొద్దు!" అంటూ మొట్టికాయ కొడుతూ.

సుబ్బు గబుక్కున తల తడిమి చూసుకున్నాడు.

"వెళ్ళిపోయింది. తనెళ్ళిపోయింది'

ఏడవాలనిపిస్తుంది తనకు.

ఇదేవిటి, కోపంతో తల్లిదండ్రుల్ని వదిలేసినప్పుడురాని బాధ ఇప్పుడిలా పిచ్చెక్కిస్తున్నదేవిటి?

ఆ రోజు -

రాత్రి పదిగంటలు దాటింది.

ఒక కేసు విషయం చాలా చిందరవందర చేసిందతన్ని తన మనసుకి విరుద్ధంగా చెయ్యి చేసుకోవాల్సొచ్చిందతనిమీద.

అప్పుడతను చూసిన చూపు.

తన తండ్రి వయసుంటుంది.

ఎర్రబడిన కళ్ళలో అసహాయత. అవమానం.

సారీ చెప్పడం తన నైజమైనా తన వృత్తి ధర్మంకాదు.

"బాబూ, నువ్వు చంపేసినా చచ్చిపోతానుకాని నాదగ్గరిప్పుడు డబ్బుల్లేవు. వడ్డీపేరుతో చాలా కట్టాను బాబూ ఏం చెయ్యను?"

"అలా చెప్పి తప్పించుకోవాలనా?"

అతను కాళ్ళు పట్టుకున్నాడు.

సుబ్బు విదిలించుకున్నాడు.

"నేనెగ్గొట్టాలని అప్పు చెయ్యలేదు బాబూ, కొడుకుని బాగా చదివించుకోవాలని చేసాను"

"వాడు చదవలేదా?"

"చదివాడు. మంచి ఉద్యోగమే వచ్చింది."

"మరి?"

"వాడిప్పుడు అమెరికా వెళ్ళిపోయి పెళ్ళి చేసుకున్నాడు. అప్పుతో నాకు సంబంధం లేదంటున్నాడు" అతను ఏడుస్తూ చెప్పాడు.

"ఫోను కలుపు"

"వద్దు బాబూ, నేను చెప్పి తిట్టించేననుకుంటాడు" సుబ్బు అతన్ని ఎర్రబడి చూశాడు.

"వేషంగా వుందా, దేనికిక వాడితో నీకు సంబంధం?" అతను నెంబర్ డయల్ చేసిచ్చాడు.

అవతల్నుండి 'హలో' అన్నాడతను విసుగ్గా.

"నేను మీ బాబుని కాను. నీ బాబుకి అప్పిచ్చిన వాణ్ణి. వాడు కట్టడానికి డబ్బుల్లేవంట. నీ చదువుకోసమేగా వాడప్పుచేసింది. నీకు బాధ్యత లేదా?"

"వాణ్ణప్పుచేసి చదివించమన్నానా?"

"చదివించబట్టేకదా.. అమెరికా దాకా దేకేవు"

"వాడేం ఘనకార్యం చేసాడు. కన్నాక చదివించడా! అందరూ చేసే పని వాడూ చేసాడు. అప్పు తీర్చాల్సిన బాధ్యత చేసిన వాడిదే నాకేం పని?" అంతకంటే నిర్లక్ష్యం అతని కంఠంలో.

సుబ్బు నిర్ఘాంతపోయాడొక క్షణం.

"నీ బాబుని మర్యాదగా అడగడానికి మేం బాంకు వాళ్ళంకాదు. రక్తం తాగే వడ్డీ వ్యాపారస్తులం మేము"

"అయితే?"

"నీ బాబుని చంపేస్తాం"

"చంపుకోండి. అయామ్ లీస్ట్ బాదర్డ్"

సుబ్బు కుతకుతా నిలువెల్లా ఉడికిపోయాడు. బూతులెందుకు పుట్టాయో అర్ధమైందతనికి.

తిట్టాడు.

అవతల ఫోన్ కట్.

సుబ్బు అతని తండ్రివైపు చూశాడు.

"చంపేయండి బాబూ! ఫర్వాలేదు." అతను దణ్ణం పెట్టి కాళ్ళదగ్గర కూర్చున్నాడు ఏడుస్తూ.

సుబ్బు మరేం మాట్లాడకుండా బయటకి వచ్చేసాడు.

మనసు మాత్రం చిందరవందరగా వుంది.

ఒక కొడుకు తండ్రిపట్ల అంత దారుణంగా మాట్లాడటం అతని మనసు కీర్ణించుకోలేకపోతున్నది. అతను గబగబా బార్లో దూరి పెగ్ మీద పెగ్ తాగాడు.

అప్పుడు కనిపించింది మహ!

ఒక మూల సీట్లో కూర్చుని పిజ్జా తింటోంది.

ఆమె ఎదురుగా నలుగురు ఆకతాయిలు కూర్చున్నారు.

"ఆకలిగా వుందా?"

"ఊఁ" అంటూ తలూపారు వాళ్ళు.

"ఏం కావాలి? పిజ్జానా?"

"ఊఁ" కోరస్‌గా అన్నారు వాళ్ళు.

బేరర్‌ని పిలిచి వాళ్ళకి పిజ్జా తెప్పించిందా పిల్ల.

సుబ్బు చూపు తిప్పుకున్నాడు.

మళ్ళీ ఆ తండ్రీ కొడుకులే గుర్తొస్తున్నారు.

మళ్ళీ అనుకోకుండా చూపులా పిల్లవైపు మళ్ళాయి.

మళ్ళీ వాళ్ళు కోక్ తాగుతున్నారు.

సుబ్బు బిల్లు చెల్లించి రోడ్డుమీద నడుస్తున్నాడు. చెవుల్లో ఆ కొడుకు మాట్లాడిన మాటలే గుర్తొస్తున్నాయి.

ఎంత ప్రేమరాహిత్యం! ఎంత దయలేనితనం. డాలర్లు సంపాదిస్తూ... ఇక్కడుంటే నిజంగా మర్డర్ చేసేవాడు.

ఇంతలో కెవ్వున కేక.

పరిగెత్తుతున్న అడుగులు చప్పుడు.

వెనక్కి తిరిగి చూశాడు సుబ్బు.

ఆ పిల్ల.

ఒక చేతిలో గిటారు - మరో చేతిలో సూట్‌కేస్.

"రక్షించండి! సేవ్ మీ!"

వెనక ఆ నలుగురూ.

పరిగెత్తలేకపోతోంది.

వాళ్ళు దగ్గరగా వచ్చేస్తున్నారు.

సుబ్బు ఆమె దగ్గరగా వెళ్ళాడు.

ఆమె గబగబా సుబ్బు వెనక్కొచ్చి దాక్కుంది.

వాళ్ళు కాస్త దూరంగా నిలబడిపోయారు.

"రండి.. ఆగిపోయారేం?" అన్నాడు సుబ్బు. వాళ్ళకి ఎదురుగా నిలబడి.

వాళ్ళు చిల్లరగా పెరిగిన ఆకతాయిలు. రౌడీలు కాదు. సుబ్బుని చూసి వెనక్కి పరిగెత్తారు.

"ఎక్కడికి?" మహావైపు చూసి అడిగాడు.

ఆ అమ్మాయి నీళ్ళు నములుతూ చూసింది.

"ఇంటినుండి పారిపోయిన బాపతా?"

"అంటే.. అంటే.. పెళ్ళిచేస్తామన్నారు" అంది నసుగుతూ.

"ఇష్టం వచ్చినట్లు బట్టలు కట్టుకోకుండా తిరగడం తెలుసు. ఇష్టంలేని పెళ్ళి వద్దని చెప్పడం తెలియదా?"

ఆమెకి కోపం వచ్చింది కాని అది సమయం కాదని మౌనంగా చూసింది.

"పద" సూట్ కేసందుకున్నాడతను.

రూమ్ తాళం తీస్తుంటే దగ్గు తెరలు తెరలుగా వస్తూ మంచమ్మీదనుండి లేచి కూర్చుని కిటికీలోంచి చూసింది పాపాయమ్మ.

"ఇన్నాళ్ళూ యీ యేషాల్లేవనుకున్నాను. ఇది కూడా ఏడ్చిందా యెదవకి. దయ్యిద్రం! దయ్యిద్రం!" అంది పాపాయమ్మ దగ్గుతూ.

"పడుకో! లెక్చర్ రేపిద్దువుగాని. గుద్దేనంటే డాక్టరు లేకుండా చచ్చిపోతావ్" సుబ్బు గదిమేసరికి నిండా దుప్పటి కప్పుకుని పడుకుంది పాపాయమ్మ.

మహా అంతా ఆశ్చర్యంగా చూస్తోంది.

బాగా చీకటిగా వుందేమో ఆ సన్నటి కారిడార్‌లో ఏమీ సరిగ్గా కనిపించడంలేదు.

"రా!"

అతని వెనుక గదిలోకి నడిచింది.

గుప్పున ఏదో సహించలేని వాసన.

మొహం చిట్లించి చూసింది చుట్టూ.

"మింగేవుకదా! ఇక పడుకో. అదిగో మంచం" అంటూ చాప పరచుకున్నాడతను.

మంచం వంక చూసింది మహా.

దానిమీద సగం సంసారం ఉంది. పుస్తకాలూ, పేపర్లూ సీసాలూ.. దుప్పటి ఏ యుగంలో వుతికారో! వాంతొచ్చింది.

"ఇక్కడా?"

"అంటే?"

"ఏం .. ఏం లేదు" అంది బెదురుగా.

ఆమె మెల్లిగా వాటిని పక్కకి తోసి ముడుచుకున్నట్లుగా పడుకుంది. దోమలు కుడుతున్నాయి. ఆ పైన అదేంటో సహించలేని వాసన.

ఏడుపు తన్నుకొస్తున్నది.

ఇదంతా రాణి చేసింది. దాన్ని చంపేయాలి. ఎలాగైనా. స్నేహంలో ఎంత ద్రోహం చేసింది. పళ్ళు నూరుకుంది కోపంగా.

క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి.

సుబ్బుకి కూడా నిద్రపట్టడంలేదు.

ఆ అమ్మాయి అక్కడ పడుకోలేకపోతున్నదని అర్థమవుతోంది. తను మాత్రం.

తన యిల్లూ, తల్లిదండ్రులూ గుర్తుకొచ్చారు.

తల విదిలించుకుని పక్కకి తిరిగి పడుకున్నాడు.

ఎప్పటికో ఏ ఝాముకో నిద్ర అతన్నావరించింది.

అతను లేచేటప్పటికి ఆ అమ్మాయి లేచి కూర్చుని మోచేతులూ కాళ్ళూ చూసుకుంటోంది. మొహం ఎర్రగా చుక్కలతో వాచిపోయింది.

"లేచావా?"

"అసలు పడుకుంటే కదా!"

"ఏం పాపం?" అతను లేచి అద్దం పక్కన బ్రష్, టంగ్ క్లీనర్ తీసుకుంటూ అడిగాడు.

"ఎలా పడుకుంటారిక్కడ? దోమలు తినేసాయి." అంది ఏడుపు మొహంతో.

సుబ్బు ఆమె మొహం కేసి చూశాడు.

నిజంగానే మొహం ఎర్రగా కందిపోయింది. చేతులనిండా దద్దుర్లు.. జాలేసిందతనికి.

"రెండ్రోజులుంటే అలవాటవుతుంది. ఇంతకీ తమ నామధేయం ఏమిటో?"

"మహాలక్ష్మి"

"చక్కటిపేరు. లక్ష్మీ"

"అలా పిలిస్తే పలకను. మహా! అను"

"అబ్బో! సర్లే ఒక పూటకి ఎలా పిలిస్తే ఏమవుతుందిలే!" అంటూ అతను తలుపు తీసుకుని బయటకి వెళ్ళాడు.

మహాకి అర్థం కాలేదు ముందు.

ఆ తర్వాత మంచమ్మీదనుండి గబుక్కున లేచి ఇల్లంతా తిరిగి చూసింది. బాత్రూం, లెట్రిన్ ఛాయలే లేవు యింట్లో.

గుండె ఆగినంత పనయింది.

పరిస్థితి తలచుకుని కెవ్వున అరిచింది.

అప్పుడే లోపలికొచ్చిన సుబ్బు తెల్లబోతూ "ఏవయింది?" అన్నాడు.

"ఇంట్లో టాయిలెట్ లేదా?"

"ఉండవు. ఆ వరండాలో చివరికెళ్తే అక్కడ ఆడవాళ్ళకి లెట్రిన్స్, బాత్రూంలు సెపరేట్‌గా ఉంటాయి. వెళ్ళు"

మహా బయటకి తొంగి చూసింది.

వెంటనే కరెంట్ షాక్కొట్టినట్లు లోపలకొచ్చేసింది.

"ఏం?"

"అక్కడ నిలబడి అంతా నన్నే చూస్తున్నారు"

"అలానే చూస్తారు కొత్త పిట్ట వచ్చి వాల్తే"

"మరెలా?"

"ఒక పని చెయ్యి. నువ్వు వాళ్ళవంక చూడకు"

మహా ఏడుపు మొహం పెట్టి అలానే నిలబడింది. సుబ్బా బయటకెళ్ళి "అమ్మాజీ!" అని పిలిచాడు.

"అన్నా!" అంటూ వచ్చింది అమ్మాజి.

సుబ్బా ఏం చెప్పాడోగాని అమ్మాజీ నవ్వుతూ "రాండి" అంటూ మహాని తీసుకెళ్ళి నిల్చోబెట్టి ఒక బాత్రూం ఫినాయిలేసి కడిగి "మీరెల్లండి. నేనిక్కడే నిలబడి ఎవర్నీ రానీకుండా చూస్తా" అంది.

మహా వెళ్ళింది బెరుకుగా లోనికి.

ఆ కాస్సేపటిలో ఆ ప్రపంచం, అమ్మాజీ అవసరం, అన్నీ తెలిసొచ్చాయి మహాకి.

మహా ఎలాగొలా స్నానం ముగించుకొచ్చేసరికి టిఫిన్ తెచ్చిపెట్టాడు సుబ్బు.

అవి నోట్లో పెట్టడానికి వీలుగా లేకపోయినా ఎలాగోలా తింది మహా.

"మీ యిల్లెక్కడ?"

"ఎందుకు?"

"నిన్ను వదిలేయడానికి"

"ఈ ఊరు కాదు"

"ఏ ఊరయితేనేలే రైలెక్కిస్తా పద"

"నేనింటికెళ్ళను" మొండిగా అంది మహా.

"మరి?" ఆశ్చర్యంగా చూశాడు సుబ్బు.

మహా దగ్గర అతని ప్రశ్నకి జవాబు లేదు.

"అంటే.. అంటే ఇంట్లోంచి వచ్చేసాను కదా! ఎలా వెళ్ళను. చంపేస్తాడు మా డేడీ"

"నేను నచ్చచెపుతానులే"

"వద్దొద్దు. ఆ రాణీని ఏదన్నా చేసేవరకు ఇంటికెళ్ళను. ప్లీజ్" అంది మహా బ్రతిమిలాడుతున్న ధోరణిలో.

"రాణీయా? ఈ కొత్త కేరక్టరెవరూ?"

"అమ్మో, దాని గురించి చాలా చెప్పాలి. అది పె...ద్ద డెవిల్! ఛీట్! రోగ్"

"అమ్మో అన్ని పేర్లున్నాయా ఆవిడకి"

"ఇంకా చాలా.." పళ్ళు కొరికింది మహా కోపంగా.

"అద్సరే. నువ్వేం చదివావ్?"

"బి.టెక్ కంప్యూటర్స్"

కళ్ళెగరేసాడు సుబ్బు.

"గుడ్ మరింత చదివినా బుర్రలేదేంటి నీకు. ఇలా ఇంట్లోంచి పారిపోయి వస్తారా ఎవరైనా? అంత కామన్‌సెన్స్ లేదా నీకు?"

ఆ మాటకి కళ్ళనీళ్ళొచ్చాయి మహాకి.

"నీకు తెలియదు. అసలేం జరిగిందో.."

"అద్సరే. ఏడవకు. ఇక్కడ నువ్వుండలేవు. పోనీ ఎవరయినా ఫ్రెండ్స్ వుంటే చెప్పు. తీసుకెళ్ళి వదులుతాను." అన్నాడు సుబ్బు అనునయంగా.

"ఉంటాను. అలవాటు చేసుకుంటాను. ఫ్రెండని నమ్మి వెళ్తేనే దాని మోసం బయటపడింది. ప్లీజ్" అంది మహా.

సుబ్బు నిస్సహాయంగా ఆమె వైపు చూసి "సరే ఒక గంటలో వస్తాను. ఏమైనా సాయం కావాలంటే అమ్మాజీని పిలువు. తలుపేసుకో" అంటూ బయటకెళ్ళిపోయాడు.

తలుపి తలుపేసుకుని అప్పుడేడ్చింది మహా - రాత్రి దోమలు కుట్టిన చేతుల్ని మొహాన్ని తడిమి చూసుకుని.

**తలుపు దబదబా** బాదిన చప్పుడుకి ఉలిక్కిపడి లేచింది మహా.

కాసేపు తనసలెక్కడ వుంది కూడా అర్థంకాలేదామెకు.

మళ్ళీ తలుపు టకటక.

కళ్ళు నులుముకుని చుట్టూ పరికించి చూసింది. అప్పుడర్థమయింది రాత్రి ఘటన.

ఇక్కడ యిలాంటి వాతావరణంలో తను నిద్రపోగల్గిందా? నిజంగానే చాలా ఆశ్చర్యపోయింది మహా.

ఆ వెంటనే మంచం మీంచి దూకి వెళ్ళి తలుపు తెరచింది.

ఎదురుగా అమ్మాజీ... నవ్వుతూ "పడుకున్నారేటి? అయ్యో లేపేసానా?" అంది అమ్మాజీ నొచ్చుకుంటున్నట్లుగా.

మహా ఏం జవాబు చెప్పకుండా అమ్మాజీ రావడానికి దారిచ్చి మంచమ్మీద కూర్చుంది.

అమ్మాజీ మరేం పట్టించుకోనట్లుగా చొరవగా వచ్చి అక్కడున్న ఒకే ఒక్క కుర్చీలో కూర్చుని "అన్న రాలేదేటండీ?" అనడిగింది.

లేదన్నట్లుగా తలూపింది మహా.

"అయ్యబాబో, టయిము ఒంటిగంటేసేసిందండి. ఏవీ తినపోవడమేటండి?" అంది గాభరాగా.

"ప్రొద్దున్న టిఫిను తిన్నానులే" అంది మహా.

"చాల్లెండి. మిమ్మల్ని చూస్తుంటేనే తెల్సిపోతంది ఏం తిన్నారో. నేనెల్లి ఏవన్నా అట్టుకొచ్చేయనాండీ?" అంది అమ్మాజి.

"వద్దొద్దు. సుబ్బు వస్తానన్నాడు" అంది మొగమాటంగా మహా.

"చాల్లెండి. ఎదవ కబుర్లలాగే చెబుతాడు. ఏ వసూలుకో ఎల్లేడంటే రోజులు రోజులు రాడు. ఇక్కడేనండి. ఆ ఎదురు సందులో సుబ్బరాజు ఒటల్లో బోజనం బాగానే ఉంటది. వస్తారా తీసుకెల్తాను" అంది అమ్మాజీ పట్టువదలని విక్రమార్కుడిలా.

"వద్దొద్దు" అంది మహా.

ఇంతలో పాపాయమ్మ లోపలికి తొంగి చూసింది.

"నువ్విక్కడున్నావేంటే.. ఒక్కిదానా.. ఆ సామానంతా తోవనేలేదు" అంటూ లోపలికొచ్చింది. ఆమె మాట్లాడుతున్నది అమ్మాజీతో. కానీ చూపంతా మహామీదనే ఉంది.

"తోవుతలే మామ్మా. ఇప్పుడే ఇన్ని నీళ్ళు పోసుకొనెచ్చా. పాపగారు అన్నం తిన్లేదంట. ఆ సంగతి కనుక్కుందావని."

పాపాయమ్మ "నువ్వు లేవ్వే.." అంటూ కుర్చీలోంచి అమ్మాజీని లేపి తను కూర్చుంది.

అమ్మాజీ లేచి అక్కడున్న స్టూలు మీద కూర్చుంది.

పాపాయమ్మ ఆయాసంగా కూర్చుని "ఆ టూలు పీట నా కాళ్ళకిందెయ్యవే. పొద్దుట్నుండి కింద కూసుని కూసుని అట్లేసి కాళ్ళు గుంజేస్తన్నాయ్" అంది.

అమ్మాజీ స్టూలు ఆవిడ పాదాల క్రిందకు తోసి క్రింద చతికిలబడింది.

మహా అదంతా చిత్రంగా చూస్తున్నది.

పాపాయమ్మ పై కప్పుకేసి చూసి "ఇదేటిది, ఫేనింత స్పీడుగా ఎట్టేసారు. ఇది గాలికి ఎండాకులా ఎగిరిపోద్ది" అంది అమ్మాజీ వంక చూసి వెటకారంగా నవ్వుతూ.

"ఊరుకో మామ్మా కొత్తోళ్ళ దగ్గర కూడా ఎదవ ఎటకారాలూ. నేనెగిరిపోకుండా పట్టుకోడానికి నువ్వు లేవా లంగరేసిన స్టీమర్లా" అంది అమ్మాజీ.

వాళ్ళ మాటలు విచిత్రంగా వున్నాయి మహాకి.

అయినా వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు హేళన చేసుకుంటున్నారని అర్థమవుతోంది.

అయినా వాళ్ళు కోపాలు తెచ్చుకోవడంలేదు.

ఇద్దరూ హాయిగా నవ్వుకుంటున్నారు.

నిజంగానే అమ్మాజీ చాలా సన్నగా వుంది. ఆ అమ్మాయి కట్టుకున్న చీరే ఆమెని ఊడ్చుకు పోతున్నట్లుంది.

ఇక పాపాయమ్మ సరేసరి.

పెద్ద నీళ్ళ డ్రమ్ము మీద ఇత్తడి చెంబు బోర్లించినట్లుగా తలకాయ. అక్కడక్కడా గోదావరి డెల్టాపాయల్లా జుట్టు. దాన్ని బిగించి రబ్బరు బేండు వేసింది. కాళ్ళు పాపం వాచి ఉన్నాయి. ఏ రంగో తెలీని వెలిసిన వాయిల్ చీర - లూజు రవిక కొట్టొచ్చినట్లు కనబడుతున్న బీదరికం.

అమ్మాజీని చూస్తే అసలు ఆ అమ్మాయి తిండి తింటుందో లేదోనన్నట్లుగా ఉంది. మాట మాత్రం ఖంగున వస్తున్నది. నవ్వు మొహం. అయినదానికి కాని దానికీ నవ్వుతూనే మాట్లాడుతోంది.

"పాపగారన్నం తిన్లేదంట. సుబ్బరాజు ఒటేల్నుండి తెస్తానంటే వద్దంటున్నారు" అంది అమ్మాజి.

"నీ మొహం సంతకెల్ల. పెద్దోల్లు అయ్యేటి..టారు ఒటేళ్ళల్లో గడ్డిపెట్టినా తింటారు. అలాటి సోట తినరు." అంటూ మహా వైపు చూసి "ఇంతకీ నువ్వేటవుతావేటి మా సుబ్బిగాడికి. సుట్టానివా?" అని ఆరాగా అడిగింది పాపాయమ్మ.

కాదన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది మహా.

"నేనప్పుడే అనుకున్నాలే. ఈ జడ్డిగాడికి నీలాటి సుట్టాలేటీ?" అంది పాపాయమ్మ.

"మరేటని ఈడి కొంపకొచ్చేవు? ఇక్కడుందావనే?" అంది పాపాయమ్మ తిరిగి.

మహాకి ఏడుపొస్తున్నది. అసలే ఆకలి. వీళ్ళేమో వెధవ ప్రశ్నలూ.

అమ్మాజీ మహా మొహం కేసి చూసి అర్థం చేసుకుంది. "ఊరుకో మామ్మా. అసలే ఆవిడగారాకలి మీదున్నారు. ఎదవ పెశ్నలేస్తావేటి? రెండు పుల్లట్లేసుకురారాదూ" అంది గదమాయిస్తూ.

"అయ్యో ఇప్పుడే కుంపటార్పేనే" అంది పాపాయమ్మ నొచ్చుకుంటున్నట్లుగా. ఆ వెంటనే "ఆఁ ఆఁ నీకని రెండట్లు గూట్లో పెట్టొచ్చాను. ఎల్లి తీసుకురా" అంది మళ్ళీ.

మహా 'వద్దొద్దు' అంటున్నా అమ్మాజీ తేవడానికి పరిగెత్తింది. పాపాయమ్మ మహావైపు సీరియస్సుగా చూస్తూ "ఇదిగో పాపా! పాపాయమ్మ పుల్లట్లంటే మరీ సీపనుకోకు. పెద్దపెద్దోల్లే పొట్లాలు కట్టిచ్చుకెల్తారు నా దగ్గర. సూడ్డానికి పేదోల్లవే గాని శుచిగా తానవాడి దేవుడికి దణ్ణవెట్టుకుని పేటుల్లో అరిటాకు లేసి మరి ఎడతాను. తెలుసా!" అంది గర్వంగా.

ఇంతలో అమ్మాజీ స్టీలు పళ్ళెంలో వేసిన అరిటాకులో రెండట్లు, శుభ్రమైన గ్లాసుతో నీళ్ళు కూడా తెచ్చి "తినండి" అంది మంచమ్మీద పెట్టి.

మహా ఇబ్బందిగా చూసి "వద్దు ఆకల్లేదు" అంది.

పాపాయమ్మ అసహనంగా చుసింది మహావైపు.

"నాకోపిక లేదు నువ్వు జెప్పవే పిల్లా!" అంది అమ్మాజీ కేసి చూస్తూ.

అమ్మాజీ మహా కాళ్ళ దగ్గర కూలబడింది. "గొప్పలు చెప్పకూడదుగాని మామ్మ అట్లకి చాలా డిమాండండి. సుట్టుపక్కల పెద్దోల్లు కూడా వచ్చి తింటారు. మామ్మకి ఓపికా డబ్బూ లేకగాని.. లేకపోతేనా టారు ఒటేలు కట్టేసేది. ముందు రుచి చూసి చెప్పండి అంది"

"అంత పెద్ద మాటలెందుకు లేవే. ఆకలేస్తే ఆ పిల్లే తింటది పద పోదాం. ఇంతవొరకూ ఒణ్ణం తిన్లేదు. కాసేపుంటే ఆ కోడలు రాచ్చసి కావుకావని కేకలెడతది" అంది పాపాయమ్మ కుర్చీలోంచి భారంగా లేస్తూ.

అప్పుడే సరిగ్గా సుబ్బా లోపలికొచ్చి ఆ యిద్దర్నీ చూసి "మీరు చేరారా యిక్కడ?" అన్నాడు.

"ఆఁ నువ్వయిసు పూటు తెచ్చి అట్టే పెట్టేవని తిందావని వొచ్చేం. ఒక మడిసిని తీసుకొచ్చేక బతికేరా సచ్చేరా అని సూడక్కర్లే? ఆ పిల్లకి ఒణ్ణవెట్టద్దా?" అంది పాపాయమ్మ మందలిస్తున్నట్లుగా.

సుబ్బు మహావైపు చూసి "సారీ, పని మీద ఆలస్యమైంది. భోజనం తెచ్చాను" అన్నాడు.

పాపాయమ్మ వెనకాల అమ్మాజీ కూడా బయటకి అడుగులేసింది.

గుమ్మం దాటిందో లేదో "ఇంతకీ ఆ గుంటెవరే? ఈ సన్నాసోణ్ణి ప్రేమించిందా? శని బాగా నెత్తికెక్కేసినట్టుంది సూస్తుంటే" అంది పాపాయమ్మ.

అమ్మాజి 'ష్' అనే లోపునే స్టీలు గ్లాసొకటి స్సరున వచ్చి పాపాయమ్మ కాళ్ళదగ్గర పడింది.

పాపాయమ్మ ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసి "ఎదవ సచ్చినోడా.. పెద్దంతరం సిన్నంతరం లేదు నీకు. గ్లాసిసిరేస్తావా పెద్దదాని మీదకి" అంది కోపంగా.

"ఇంక చాల్లే పద. నువ్వసలు ఎదవ్వాగుడు వాగందీ నిమిషముండలేవు. ఇంకెల్లి ఇంత తిని పడుకో" అంటూ తన వాటావైపు వెళ్ళిపోయింది అమ్మాజి.

సుబ్బు తలుపులు మూసి తాను కొత్తగా కొనుక్కొచ్చిన గాజు ప్లేటులో భోజనం పెట్టి గాజుగ్లాసుతో నీళ్ళు కూడా పెట్టి "తిను" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

పాపాయమ్మ మాటలు ఎలావున్నా ఆ వాతావరణం నచ్చక బిత్తరపోతూ కళ్ళనీళ్ళతో సుబ్బూ వైపు చూసి "ఆవిడేంటేంటో మాట్లాడారు" అంది.

"అలాగే మాట్లాడతారు. నీకు నచ్చినట్లుగా వాళ్ళు మాట్లాడలేరు. నువ్వొచ్చింది వాళ్ళున్న చోటికి. అందుకే నిన్ను మీ ఇంటికి పంపిస్తానంటున్నాను. ఇప్పుడయినా ఎడ్రస్ చెప్పు. వదిలేస్తాను" అంటూ అక్కడున్న పుల్లట్లు చూసి "అరె పాపం, మామ్మ నీకోసం అట్లు తెచ్చిందా? అనవసరంగా తిట్టాను" అంటూ ప్లేటందుకుని తింటూ "ముందన్నం తిను లేకపోతే తీసుకెళ్ళి రైల్వే స్టేషన్లో వదిలేస్తాను. నాకేంటీ సంత?" అన్నాడు చిరాగ్గా.

ఆ మాట వినగానే భయంతో తినడం మొదలెట్టింది మహా. "నేనేం అక్కడా ఇక్కడా అల్లాటప్ప హోటల్నుంచి తేలేదు. గోదారొడ్డున ఈ మధ్యన కట్టిన మంచి హోటల్నుండే తెచ్చాను" అన్నాడు.

మహా ఏం మాట్లాడకుండా తింటూ అతనివైపు క్రీగంట చూసింది.

సుబ్బు దోసెలు మహదానందంగా తింటూ "ఏ మాట కామాట చెప్పుకోవాలి ముసిల్ది బ్రహ్మాండంగా వేస్తుంది దోసెలు. తిన్నావంటే వదలవు. ప్రొద్దుట నే తెచ్చేటప్పటికి ముసల్ది దుకాణం తెరవలేదు" అన్నాడు సుబ్బు.

"సుబ్బూ"

తలెత్తి చూశాడు సుబ్బు.

"సారీ నిన్నలా పిలవొచ్చా? అయి మీన్ అందరూ నిన్నలానే పిలుస్తున్నారు కదా!" అంది మహా సందేహంగా.

"పిలువ్. అదేగా నా పేరు. ఇంతకీ సంగతేంటి?"

"నువ్వేమీ అనుకోకపోతే మనం ఇంకోచోటికి అంటే ఓ రెండుగదులు కనీసం టాయిలెట్ వున్న యింటికి మారొచ్చుకదా!" అంది నసుగుతున్నట్లుగా.

కళ్ళు పెద్దవి చేసి చూశాడు సుబ్బు.

"ఏంటి తల్లీ? అంటే నువ్విక్కడ తిష్టవేయడానికే నిశ్చయించుకున్నావా? నీ కోసం నేనిల్లు మారాలా? ఇప్పటికే నా జేబుకి చిల్లు పెట్టేస్తున్నావ్. సాయింత్రం బాటిల్ కొచ్చే డబ్బులు నీ టిఫిన్లకి, భోజనాలకీ ఖర్చుపెట్టేస్తున్నా. ఇంకా నయం. ఎక్కడన్నా పేలస్‌లోకి తీసుకెళ్ళమన్లేదు. లాభంలేదు. రేపు రెక్కట్టుకుని నిన్ను ఏ చొల్లంగి సంతలోనన్నా వదిలేస్తే కానీ నాకు సుఖముండదు." అన్నాడు చిరాగ్గా.

"అది కాదు"

"ఏది కాదు?" అంటూ తను తెచ్చిన బాగ్‌లోకి చూస్తూ "అయ్యో నీ గొడవలో పడి అమ్మాణమ్మగారి సంగతి మర్చేపోయాను. పాపాలు కూడా చేయించేస్తున్నావు నా చేత నువ్వు" అంటూ గబగబా లేచి "అమ్మాజీ" అని కేకపెట్టాడు సుబ్బు.

అమ్మాజీ "వస్తున్నా అన్నా" అంటూ తోముతున్న గిన్నెలొదిలేసి చేతులు కడుక్కుని పరిగెత్తుకొచ్చింది.

"సారీ అమ్మాజీ, అమ్మాణమ్మగారికి భోజనం తెచ్చాను. ఈ సందట్లో పడి మరచేపోయాను. తీసుకెళ్ళి కాస్త యిచ్చిరా! అసలేమన్నా తిన్నదో లేదో పాపం" అన్నాడు సుబ్బూ నొచ్చుకుంటూ.

"పొద్దున్న నీ ఖాతాలో రాసి అట్లు తీసుకెళ్ళిచ్చానన్నా" అంది అమ్మాజి అతనిచ్చిన బాగ్ అందుకుంటూ.

"మంచి పని చేసేవ్. గబగబా యిచ్చిరా పాపం" అని చెయ్యి కడుక్కుని చాప పరచుకుని పడుకున్నాడు సుబ్బు.

ఆ వెంటనే అయిదునిముషాల్లో నిద్రలోకి జారుకుని గుర్రు పెడుతున్న సుబ్బుని చూసి కసిగా పళ్ళు కొరుక్కుంది మహా.

'కొరకరాని కొయ్య. మాట వినడు. నిజంగానే తనని పంపించేస్తే ఎక్కడికెళ్ళాలి తను? ఎక్కడికెళ్ళినా వాళ్ళు తన తండ్రికి తెలియజేస్తారు. తనని ఆ దిబ్బరొట్టిగాడికిచ్చి పెళ్ళి చేసేస్తుంది తల్లి. ఆవిడకి ఆస్తులు, డబ్బు, నగలూ తప్ప మరేది అందంగా కనిపించవు. అసలు వాడితో పెళ్ళేంటి, అసలు వాడికి పెళ్ళేంటి చింపాంజీ వెధవ' మహా మొహం జుగుప్సతో నిండిపోయింది.

మళ్ళీ కౌశిక్, రాణీలు గుర్తొచ్చారు.

ఎంత మోసం? ఎంత దగా? కోతిని కుక్కని నమ్మొచ్చుగాని మనుషుల్ని నమ్మకూడదు. తననెంత ఛీట్ చేసారు. పైగా తను సైకో అట. తను చేసిన దగాని మోసాన్ని కప్పిపుచ్చుకోడానికి అవతలి వారిమీద ఎంత తేలిగ్గా నిందలు వేసి ప్రచారం చేస్తారు. వీళ్ళకసలు ఆత్మలున్నయా? కన్నీళ్ళొచ్చాయి మహాకి.

సుబ్బు గుర్రు చిరాగ్గావుంది.

నిద్రపోతున్న సుబ్బూ వైపు చూసింది.

తల పక్కకి పెట్టి చాపమీద బోర్లా పడుకుని నిద్రపోతున్నాడు - ఈ లోకంలో లేనట్లుగా.

చెదరిపోయిన క్రాపు, ఎండలో తిరిగి నల్లకప్పేసిన శరీరం - అయిదడుగుల ఆరంగుళాలుంటాడేమో, మాసిన జీన్స్ చెమటకంపు టీ షర్టు - బలిష్టంగా వున్న శరీరం - అసలు మంచోడేనా? ఇంకా వచ్చి ఇరవై నాలుగ్గంటలు కాలేదు ఎలా తెలుసుకోవాలి? రకరకాల ఆలోచనలు చుట్టుముడుతున్న మహా బయట గట్టిగా అరుపులు ఏడుపులూ విని ఉలిక్కిపడి బిగుసుకుపోయింది.

సుబ్బూ కూడా కంగారుగా లేచి "ఏం జరిగింది?" అనడిగాడు మహా వైపు చూస్తూ.

"ఏమో, తెలియదు?" అంటూ బిక్కమొగమేసింది మహా.

సుబ్బూ తలుపు తెరవగానే అమ్మాజీ పరిగెత్తుకొచ్చి "మీరాబాయిగారు పోయారన్నా. ఆస్పత్రి నుండి బాడీ అట్టుకొచ్చారు" అంది తను ఏడుస్తూ.

"మీరాబాయా?" అర్థం కానట్లడిగాడు సుబ్బూ.

"అదే మన అవుసోనరమ్మ. చాలాకాలం నుండి జబ్బుతో వుంది కదా, ఈ మజ్జె కొడుకులే ఇంటద్దెలట్టు కెల్తన్నారు" అంటూ వివరణిచ్చింది అమ్మాజీ.

"ఓ, పైన మేడమీదుంటారు కదా!" అన్నాడు సుబ్బు.

"అవును పాపం" అంటూ మళ్ళీ ఘొల్లుమంది అమ్మాజీ. అప్పటికే ఎవరికి తగిన శక్తిలో వాళ్ళు రాగాలు తీస్తున్నారు.

నెత్తీ నోరు కొట్టుకుంటున్నారు.

క్షణాల మీద బయట షామియానా వేసారు. ఆమె భౌతిక శరీరమున్న గాజు పెట్టెని ఒక బల్లమీద పెట్టి ఆమె కొడుకులూ కోడళ్ళు, మనవలు పూలదండలు వేసి అటు పక్కగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు.

సుబ్బూ వెళ్ళి అక్కడే స్థంభానికి జేరబడి చూస్తూ నిలబడ్డాడు.

పాపాయమ్మ అక్కడే ముక్కాల పీటేసుకుని రాగాలు తీస్తోంది.

"అమ్మ నా కూతురో. మమ్మల్నొదిలేసి ఎల్లిపోయావా? మేమేం సేయలే తల్లీ? ఆ సావు నాకెందుకు రాలేదో? దేవుడు నన్నెందుకు ఎత్తుకుపోలేదో? నడిసెల్తుంటే సీమ దొరసానిలా వుండేదానివి. కడిగిన ముత్తెంలా మెరిసిపోయేదానివి" అంటూ ఆవిణ్ణి రకరకాలుగా వర్ణించి ఏడుస్తోంది.

సుబ్బు పాపాయమ్మ ప్రావీణ్యాన్ని కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాడు.

తనక్కడ కొచ్చి రెండేళ్ళయింది. మీరాబాయిని ఎన్నడూ చూడను కూడా చూడలేదు. ఆవిడెప్పుడు దొరసానిలా చకచకా నడిచిందో, ఎప్పుడు ముత్యంలా మెరిసిపోయిందో అర్థంకాలేదు. కంటివెంట ఒక చుక్క కన్నీరు లేకుండా అలసిపోకుండా ఒకే స్థాయిలో నేలని కొట్టి కాసేపు తలకొట్టుకుని గంగిరెద్దువాడి సన్నాయి మేళంలా ఒకే రీతిలో ఏడుస్తున్నది.

మిగతావాళ్ళు సరేసరి.

ఎవరికి తగిన స్థాయిలో వారు ఏడుస్తున్నారు.

నిజానికి ఆమె తాలూకా వాళ్ళంతా మౌనంగా కుర్చీల్లో కూర్చున్నారు.

అద్దెలకున్నవాళ్ళే తతంగమంతా నడుపుతున్నారు.

ఇంతలో సుడిగాలిలా ఉమ్మడి సీతొచ్చి పడింది.

"అక్కా ఎల్లిపోయావా? అసలు నువ్వెల్లిపోటమేంటక్కో. అప్పుడేవన్నావూ మల్లితోటలో పూలు తెమ్మన్నావా లేదా? నేను తెచ్చాను కాదక్కో. మోటబావికాడేవన్నావు. ముంజెలు తినాలుందే సీతా, అట్టుకొస్తావా అనడిగావు. నేను తెచ్చాను కాదో.. అక్కా. కోటగుమ్మానికెల్లి కోకలట్టుకు రావే సీతా యియ్యి బరువుగున్నాయి కట్టలేనే అన్లేదూ! నేను తెచ్చేను కాదో అక్కా..." అంటూ ఒక చాంతాడంత లిస్టు చెబుతా అక్కడ రాలిన పూలరేకుల్ని ఏరి బుట్టకేస్తూ ఏడుస్తోంది సీత.

సీత లౌడ్ స్పీకర్ లేకుండా ఆ స్థాయిలో ఏడుస్తుంటే మిగతావాళ్ళ నోర్లు ఠక్కున మూతబడిపోయాయి.

మీరాబాయి పెద్దకొడుకు సుబ్బుని దగ్గరకి రమ్మని సైగ చేసాడు. సుబ్బు వెళ్ళి నిలబడ్డాడు.

"ఎవరీవిడ?"

"వీళ్ళకి ఎడ్రస్ ఏముంటుందని చెప్పనండీ. ఇక్కడే నాలుగిళ్ళల్లో పనిచేస్తుంటుందండి."

"పేరు?"

"ఉమ్మడి సీతంటారండి"

"సరే సరే!" అంటూ తమ్ముడి వైపు చూసి "త్వరగా తతంగం కానిద్దాం. వీళ్ళెందుకు ఏడుస్తున్నారో తెలుసు" అన్నాడు.

వెంటనే మీరాబాయికి జరగాల్సిన తంతు పూర్తి చేసారు. సుబ్బుకూడా బాడీతో స్మశానం దాకా వెళ్ళాడు.

సీత ఆ ప్రాంతమంతా కడిగింది.

పాపాయమ్మ, అమ్మాజీలు స్నానాలు కానిచ్చారు.

అప్పుడు గుర్తొచ్చింది అమ్మాజీకి మహా.

గబుక్కున పరిగెత్తుకుని సుబ్బు యింట్లోకెళ్ళింది.

మహా మంచమ్మీద ముడుచుకుని ఏడుస్తోంది.

"ఏంటి పాపగారూ మీరు కూడా మీరాబాయికోసం ఏడుస్తున్నారాండీ, సాల్లేండి. ఆవిడకి తొంబైయేళ్ళు. చాలారోజుల్నుండి రోగంతో పీక్కుంటున్నది. ఎప్పుడో రాజస్థాన్నుండి వచ్చారు. బాగా సంపాదించారు. కోటగుమ్మం కాడ చాలా షాపులు ఈళ్ళయ్యే. అందరూ దానవాయిపేటలో, ప్రకాష్ నగర్లో కొంపలు కట్టుకుని సెటిలయిపోయారు. ఇది ఆళ్ళుకొన్న మొదట కొంప. అందుకే ఆవిడకి ఎల్లటం యిట్టం లేక పైనుంటది. డబ్బుకి చాలా గట్టిది. ఏవట్టుకెల్లింది. ఆవిడకోసం మీరేడవడవేంటి?" అంది అమ్మాజీ మహాని మందలిస్తున్నట్లుగా.

మహా గబుక్కున అమ్మాజీని కౌగలించుకుంది.

"నాకు.. నాకు భయమేస్తోంది అమ్మాజీగారూ! ఆ ఏడుపులు నేను అలా ఎప్పుడూ వినలేదు" అంది.

అమ్మాజీ గట్టిగా నవ్వింది రెండు చేతుల్తో మహాని పొదవి పట్టుకుని.

"చాల్లెండి. ఇయ్యన్నీ ఎదవ నాటకాలు. రాత్రి ఆళ్ళు పెట్టే తిండికోసం - పోసే మందుకోసం ఈళ్ళంతా యిలాగే ఏడుస్తారు. అప్పుడే ఏవయింది. రాత్రి చూడాలి బాగోతం. ఇయ్యన్నీ మనసులో ఎట్టుకోకండి మీరు."

"నేనెప్పుడూ యిలా చూడలేదు." అంది మహా వణికిపోతూ.

"అవునండి మీలాటోరు యిలాటిసోట్లు సూసుండరు కదా!" అంది అమ్మాజీ భుజమ్మీద తట్టి ఊరడిస్తూ.

**ఆ రాత్రి** అమ్మాజీ అన్నట్లే జరిగింది.

మీరాబాయి అంత్యక్రియులు జరిగాక తిరిగొస్తున్నప్పుడు మీరాబాయి పెద్దకొడుకు భజన్‌సింగ్ సుబ్బు భుజమ్మీద చెయ్యేసి 'థాంక్స్' అన్నాడు మెల్లిగా.

సుబ్బూ ఆయన వైపు చూశాడు.

భజన్‌సింగ్ మొహంలో విషాదం చోటు చేసుకుంది.

"అమ్మ...చాలా మంచిది" అన్నాడు చిన్నగా.

సుబ్బూ మాట్లాడలేదు.

అతనికి తన తల్లి గుర్తొచ్చింది.

"రాజస్థాన్ నుండి వచ్చినప్పుడు మాకేమీ పెద్దగా లేదు. నాన్న ఇక్కడకొచ్చి చిన్నపాటి బట్టల వ్యాపారం మొదలుపెట్టి, ప్రింటింగ్ పెట్టి మెల్లిగా వృద్ధిలో కొచ్చారు. అమ్మ నాన్నకి చాలా సాయపడేది. స్వయంగా ప్రింట్ చేసేది. నా తర్వాత వాళ్ళందరూ ఇక్కడే పుట్టారు.

మేము మొదట కొన్న యిల్లు యిదే నా తర్వాతవాళ్ళందరూ ఈ యింట్లోనే పుట్టారు. మేము అందరం రాజమండ్రిలోనే రకరకాల ప్రాంతాల్లో ఇళ్ళు కట్టుకున్నా అమ్మ మాతో రానంది. నాన్న పోయిన యీ యింట్లోనే తనూ పోవాలని. చివరకు అదే జరిగింది. అందరికీ అద్దెలకిచ్చి మేం వెళ్ళిపోయాం. ఆమె కోరినట్లుగానే ఆమె బాడీ యిక్కడికే తెచ్చి ఇక్కడ్నుంచే స్మశానానికి తీసుకెళ్ళాం."

భజన్‌సింగ్ కళ్ళు చెమర్చడం గమనించాడు సుబ్బు.

వయసులో చాలా చిన్నవాడైన సుబ్బూకి తిరిగి ఏం చెప్పాలో కూడా తోచలేదు. ఆటపాటలతోనూ అల్లరితోనూ ఖుషీగా జీవితాన్ని గడిపిన అతను కష్టాలని, కన్నీళ్ళని సమాజంలో తనకి నిజంగా ఏమాత్రం తెలియని విభిన్న కోణాన్ని యిప్పుడే గమనిస్తున్నాడు.

"నాదొక చిన్న రిక్వెస్టు"

భజన్‌సింగ్ మాటకి ఏమిటన్నట్లుగా చూశాడు సుబ్బు. "బంధువులంతా దిగుతున్నారు. మా ఆచారం ప్రకారం చెయ్యాల్సిన తతంగాలు చాలా వున్నాయి. ఈ బిల్డింగులో వాళ్ళు అమ్మపట్ల చాలా శ్రద్ధకనపరిచారు. వారందర్నీ చాలా రోజులు భోజనాలు పెట్టకుండా ఆపడం తగదనిపిస్తున్నది నాకు. మీకు డబ్బిస్తాను. రాత్రికి మన బిల్డింగులో వాళ్ళకి డిన్నర్ ఏర్పాటు చెయ్యండి. ఇలా అడిగినందుకు మీరేమీ అనుకోకూడదు" అన్నాడు భజన్‌సింగ్ ప్రాధేయపూర్వకంగా.

సుబ్బూ మొగమాటంగా తలూపాడు.

"మరోమాట. వీళ్ళకి మందు ముఖ్యం. అదిప్పించండి. సీమ మందే అమ్మ పేరు చెప్పుకుని సంతోషపడతారు"

భజన్‌లాల్ తమ్ముణ్ణి పిలిచి సుబ్బూకి డబ్బిమ్మన్నాడు.

అతను సుబ్బూ చేతికి పాతికవేలిచ్చి" ఎక్కువపడితే చెప్పండి" అన్నాడు.

సుబ్బూ ఆ డబ్బందుకుని 'సరే'నని తిన్నగా కేటరింగ్‌కెళ్ళి ఆర్డరిచ్చి ఇంటికి వచ్చేసరికి ఆరుదాటింది.

సుబ్బూకి దూరం నుండే తమ బిల్డింగ్ ముందు హడావుడి కనిపించి ముందు ఆశ్చర్యపోయాడు.

తను వచ్చి ఇంకా చెప్పనేలేదు. సీత షామియానా కింద వూడ్చి నీళ్ళు జల్లుతోంది.

అమ్మాజీ గబగబా ఎదురొచ్చి "అన్నా, రాత్రికి డిన్నరంటకదా అందరికీ తెలిసిపోయింది" అంది నవ్వుతూ.

సుబ్బూ ఆశ్చర్యంగా చూశాడు.

"పాపాయమ్మ కొడుకు రామక్రిష్ణ అందరికీ చెప్పేసాడు. ఆడు మీతోనే వచ్చాడు. అంతా యిన్నాడంట" అంది.

సుబ్బూ వెళ్ళి స్నానం చేసి "ఏమైనా తిన్నావా?" అని కుర్చీలో మౌనంగా కూర్చున్న మహాని అడిగాడు.

"ఇప్పుడే అమ్మాజీగారు టీ తెచ్చి యిచ్చారు" అంది.

"సరే! మొహమాటంగా కూర్చోకు. ఈ రోజు రాత్రి కొంచెం భరించు. గొడవ పతాకస్థాయిలో వుంటుంది." అన్నాడు అనునయంగా.

ఇంతలో చీర మార్చుకుని అమ్మాజీ వచ్చింది.

"చుడమ్మాజీ, నువ్వే పనీ చెయ్యక్కర్లేదు. మహా దగ్గర కూర్చో చాలు. నేను భోజనం పంపిస్తాను" అన్నాడు సుబ్బు.

అమ్మాజీ తలూపింది.

"అమ్మాణమ్మగారి సంగతి మాత్రం మరచిపోకు" అని చెప్పి బయటకి నడిచాడు.

అప్పటికే కుర్చీలూ బల్లలూ అన్నీ వచ్చేసాయి.

రామక్రిష్ణ అన్నీ హడావుడి పడుతూ సర్దిస్తున్నాడు.

అసలే కారునలుపు, ఆ పైన పెసరరంగు చైనా సిల్కు పైజమా లాల్చీ వేసుకుని పౌడరు దట్టించి తయారయ్యాడు.

ఇంతలో ఎవరు పోయినా ఏడ్చి రాగాలు తీసి పాటలుపాడే అప్పారావు&కో ఆర్కెస్ట్రా హార్మోనియం తబలాలతో అక్కడికి చేరుకుంది.

"వీళ్ళకెవరు చెప్పారు?" అన్నాడు సుబ్బు చిరాగ్గా.

"ఆళ్ళనెవరూ సెప్పి పిలవక్కర్లేదండి. తెలుసుకుని వచ్చేత్తారంతే" అన్నాడు రామక్రిష్ణ పళ్ళికిలిస్తూ.

నాలుగు బెంచీలు కలిపి జంఖానా పరచుకుని ఆర్కెస్ట్రా కూర్చున్నారు. కాసేపట్లో బిల్డింగులో వాళ్ళంతా తమశక్తి కొద్దీ తయారయి వున్న వాటిల్లో మంచి బట్టలు వేసుకుని షామియానాలో కొచ్చి కూర్చున్నారు.

ఇంతలో ఇంటికెళ్ళి తయారయి ఉమ్మడి సీత కూడా వచ్చేసింది.

నల్లరంగు లంగా మీద ఫ్లోరెసెంట్ గులాబీ రంగు నైలాన్ చీరకట్టుకుని బ్లూరంగు లోలాకులు, బ్లూరంగు గులాబీ పువ్వు చెవి దగ్గర పెట్టుకుని, లిప్‌స్టిక్ వేసుకుని వచ్చేసిన సీతని వెటకారంగా చూసి 'నువ్వు రాగానే ఎలిగి పోతందే" అన్నాడు రామక్రిష్ణ వెటకారంగా.

"సాల్లేండి, మీకన్నా గేసులైటెవరూ!" అంది సీత అదే స్పీడులో.

"సర్లే, నువ్వసలే పారిన్ రిటర్నడివి. ఇంతకీ యియ్యి దుబాయి సరుకా - మన కోటగుమ్మం కాడియ్యా?" అన్నాడు రామక్రిష్ణ.

సీత జవాబు వినపడకుండానే హార్మోనియం కెవ్వుమంది. తబలా దఢాలున మోగింది.

"అమ్మా మీరాబాయో....పయనమైపోయావా.." అంటూ ఓ గొంతు మైకులో చించుకుంది.

ఆ వెంట వెంటనే 'చిలక ఎగిరిపోయింది. పంజరం బావురుమంది... అమ్మా మాయమ్మా మీరాబాయమ్మా' అంటూ మరోపాట.

గదిలో మహా బిక్కుబిక్కుమంటూ అమ్మాజీ వైపు చూసింది.

"భయపడకండి. వాళ్ళెవరు చచ్చిపోయినా ఆ పాటలే పాడతారు. పేర్లు మార్చుకుంటారు. ఈ కిటికీ తలుపు కొద్దిగా తెరుస్తాను. తతంగమంతా సరదాగా చూడండి" అంది.

"వద్దొద్దు" అని అమ్మాజీ చెయ్యి పట్టుకుంది. భోజనాలు వచ్చేసాయి.

సుబ్బా అమ్మాజీని పిలిచి మహాకి, అమ్మాణమ్మగారికి భోజనాలు సెపరేట్‌గా పంపించి తలుపులు గడియలేసుకోమని చెప్పాడు.

మందు చూసి అందరిలో హుషారు తన్నుకొచ్చింది. పాటల తీరు మారిపోయింది.

హుషారయిన సినిమా పాటల జోరందుకుంది. పాపాయమ్మతో సహా అందరూ మందుకొట్టేస్తున్నారు.

"ఎక్కువ తాగకు. గుండాగి ఛస్తావ్" అన్నాడు సుబ్బు తను తాగుతూ పాపాయమ్మతో.

"అంతకన్నా ఏం కావాలా. పుట్టాక ఏటి సుకపడ్డాను గనక! ఏడి.. ఆడేడి.. దొంగ సచ్చినోడు. ఇప్పటికి ఒక రుపాయి, సంపాదనలేదు. తల్లి మీద పడి బతుకుతున్నాడు దొంగ సచ్చినోడు" అంటూ ఆ మూల వున్న చీపురందుకుంది పాపాయమ్మ రామక్రిష్ణ తన్నడానికి వెళ్తూ. అక్కడే తాగుతున్న రామక్రిష్ణ "అమ్మ దీని జిమ్మడి పోనూ! దీనికి యేళాపాళా లేదు మందెక్కువైపోయింది సుబ్బుగారు, దీన్నింట్లోకంపేయండి" అని దూరంగా వెళ్ళి దాక్కున్నాడు.

సుబ్బూ చిన్నగా పాపాయమ్మని సముదాయించి యింట్లోకి పంపి తిరిగొచ్చాడు.

అమ్మాజీ స్వీటుకోసం వచ్చి అక్కడ షామియానాలో డాన్సు చేస్తున్న సుబ్బూని చూసి అంతే హుషారుగా లోపలికి పరిగెత్తి 'అమ్మాయిగారూ, మన సుబ్బూ డాన్సకడతన్నాడండి. బలేసేస్తున్నాడు అచ్చూ... సిరంజివిలాగే సూడండి' అంటూ కిటికీ తలుపు తెరిచింది.

సుబ్బూ వూగిపోతూ స్టెప్పులేస్తున్నాడు.

మహా చాటుగా చూసి ఆశ్చర్యపోయింది.

చాలా లయబద్ధంగా స్ప్రింగ్‌లా శరీరాన్ని తిప్పుతూ పాట భావానికి తగ్గట్లు ముఖకవళికల్ని మారుస్తూ అతను చేస్తున్న డాన్స్ చూసి ఆశ్చర్యపోయింది మహా.

డాన్సు అందరూ చేస్తారు.

కాని.. అది కొన్ని శరీరాలకే అందంగా అతుకుతుంది. శరీరపు తీరు, భావప్రకటన చాలా ముఖ్యం. మొహం రాయిలా ఫీలింగ్స్ పలకకుండా పెట్టి డ్రిల్లులా చేస్తే అది రాణించదు.

సుబ్బూ శరీరం తీరు బాగుంటుంది.

దానికి తోడు అతని పెద్దకళ్ళలో ఫీలింగ్స్ బాగా పలకడం గమనించి సంతోషపడింది.

"అవును అమ్మాజీగారూ.. భలే చేస్తున్నాడు" అంది ఆనందంగా.

"అదే మరి! అందుకే చూడమంట" అంది అమ్మాజీ ఉత్సాహంగా.

ఏ అర్ధరాత్రికో అక్కడి తతంగం ముగిసింది. అందరూ ఏదేదో వాగుతూ, ప్రేలుతూ ఎవరి పోర్షన్స్‌లోకి వాళ్ళెళ్ళి పడుకున్నారు.

సుబ్బు మాత్రం షామియానాలోని బెంచీమీదనే సొమ్మసిల్లి నిద్రపోయాడు. ఈ లోకంతో సంబంధం లేనట్లుగా.

మర్నాడు నిద్రలేచేసరికి ఎండెక్కిపోయింది.

చుర్రున ఎండ కాల్చేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు సుబ్బూ.

ఆ రోజు పాపాయమ్మ పుల్లట్ల దుకాణం పెట్టలేదు. అందరూ దాదాపు మత్తులోనే జోగుతున్నారు.

షామియానాల వాళ్ళు, టేబుల్స్ కుర్చీల వాళ్ళొచ్చి డబ్బుల కోసం కూర్చున్నారు.

సుబ్బు గబగబా కళ్ళునులుపుకుని ఇంట్లోకెళ్ళి తగిలించిన చొక్కాలోని డబ్బు ఒక పేపరు పెన్నూ తీసుకుని ఒకసారి మహా మంచం వైపు చూశాడు. మంచమ్మీద అమ్మాజీ మహా ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని ఈలోకంతో సంబంధం లేనట్లుగా నిద్రపోతున్నారు.

"తలుపు గెడకూడా పెట్టుకోకుండా పడుకున్నారు. కేర్‌లెస్" అని గొణుక్కుంటూ బయటకెళ్ళి పోయాడు.

అన్నీ లెక్కలు చూసి డబ్బులిచ్చి సాగనంపాక అక్కడే మూలగా నిలబడి వున్న సీత మీద పడిందతని దృష్టి.

"ఇలారామ్మా" అన్నాడు సుబ్బు.

సీత నెమ్మదిగా వచ్చి చేతులు కట్టుకుని నిలబడింది.

సుబ్బు ఆమె చేతిలో వెయ్యిరూపాయిలు పెట్టి "సరిపోతుందా?" అనడిగాడు.

సీత అతనికేసి విస్మయంగా చూసింది.

అతను నిజంగానే యిస్తున్నాడా అని ఆశ్చర్యపోతూ ఆ డబ్బు అందుకోకుండా అలానే నిలబడిపోయింది.

"ఏమ్మా చాలదా చెప్పు?"

"లేద్సార్ మీరంతిస్తుంటే నాకు నమ్మబుద్ధికాలే..." అంటూ సందిగ్ధంగా చూసింది సీత.

"లేదు. నీతో హాస్యమా! ఇక్కడందరికన్నా ఎక్కువ కష్టపడింది నువ్వే. ఉంచుకో. కాస్త బాగా తినమ్మా. గాలికే పడిపోయేట్లున్నావు. పనెలా చేస్తావు?"

సుబ్బూ మాటలకి సీత కళ్ళవెంట నీళ్ళు జలజలా రాలాయి.

సుబ్బు మనసు చివుక్కుమంది కాని.. ఇంకేం మాట్లాడాలో తోచలేదు.

సీత అతనికి నమస్కారం పెట్టి వెళ్ళిపోయింది.

సుబ్బూ లెక్కలన్నీ ఫైనల్ చేసి లేచి లోనికెళ్ళబోతుంటే 'సార్' అని వినపడి వెనక్కి తిరిగి చూశాడు.

"సార్, మేము రాత్రి పాటలు పాడిన అప్పారావు &కో ఆర్కెస్ట్రా వాళ్ళం" అని సిగ్గుపడుతూ నవ్వారు వాళ్ళు.

"అయితే..?" సుబ్బూ నొసలు చిట్లించి చూశాడు.

"మాకూ..ఏదయినా.. మీ దయసారూ" అంటూ మెడ గోక్కుంటూ నిలబడ్డాడు అప్పారావు.

"నేను మిమ్మల్ని ఎంగేజ్ చెయ్యలేదే?"

"మమ్మల్నెవరూ పిలవరు సారు. మేమే తెలిసి వచ్చేస్తాం. ఏదో ఇలా ఎవరన్నా పోయినపుడే కదా మాకు గిరాకీ."

"ఏం చావులకే పాడతారా?"

సుబ్బూ ప్రశ్నకి అప్పారావు దిగులుగా నవ్వాడు.

"ఇదివరకు పెళ్ళిళ్ళకి, సమర్తలకీ కూడా పిలిచి పాడించుకునేవారు సారూ. ఇప్పుడన్నిటికి ఆ సినిమాల్లో పాడేవాళ్ళే వచ్చేస్తున్నారు. ఆళ్ళంటే జనానికి మోజు. మమ్మల్నెవరు పిలుస్తారు?"

"కొన్నాళ్ళకి ఈటిక్కూడ ఆళ్ళే వచ్చేట్లున్నారండి" అన్నాడు ఆ పక్కనే నిలబడ్డవాడు.

సుబ్బూ వాళ్ళకో రెండువేలిచ్చి సాగనంపి ఇంట్లోకొచ్చాడు.

"అయ్యో అన్నా. బాగా నిద్రపట్టేసింది" అంది అమ్మాజీ కంగారుగా.

"సర్లే. మీరిద్దరూ మెల్లిగా మీ పనులు కానిచ్చి టిఫిన్స్ తెచ్చుకుని తినండి. నాకు పనుంది" అంటూ అమ్మాజీకి డబ్బు లిచ్చి స్నానానికెళ్ళిపోయాడు సుబ్బూ.

సుబ్బూ వచ్చేసరికి మహా మొహం కడుక్కుని వచ్చి కూర్చుంది.

"అమ్మాజీనడుగు ఏవన్నా కావాలంటే..." అని సుబ్బూ జవాబుకోసం చూడకుండా బయటకొచ్చాడు.

టైము పది దాటింది.

కోటగుమ్మం దగ్గర ఎప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణమే. రాజమండ్రికి వ్యాపార కేంద్రం అది. రాజమండ్రి బట్టలషాపులకి ప్రసిద్ధి. చుట్టుపక్కల వాళ్ళంతా పల్లెటూర్ల నుండి వచ్చి పెళ్ళిళ్ళకి పేరంటాలకి అక్కడే కొనుగోలు చేస్తుంటారు.

నడుస్తుంటే రోడ్డున ఎవర్నీ పోనివ్వరు.

"కొత్త సరుకొచ్చింది రాండి రాండి" అని చీరలు వంటికి చుట్టుకుని ఏ మాత్రం సిగ్గుపడకుండా "ఇది ఖైదీ 150లో కాజల్ కట్టిన చీరండి" అంటున్నాడు సేల్స్‌మాన్.

"చాల్లే వూరుకో, ఆ సినిమాలో కాజలు చీర గుడ్డెక్కడ కట్టింది? ఇంటే సాలా చెబుతావ్. ఇంతకీ అదెంత? నాకు బాగుంటుందా?" అనడుగుతోంది ఏభయ్యేళ్ళు మాత్రమే దాటిన ఓ పల్లెటూరావిడ.

"కడితే కాజల్ బాబులా వుంటారు" సేల్స్‌మాన్ వుబ్బేస్తున్నాడు.

సుబ్బూ ఆ సంభాషణ నవ్వుకుంటూ వింటూ మీరా&వీరా క్లాత్ ఎంపోరియమ్‌లోకి నడిచి "భజన్‌సింగుగారొచ్చారా?" అని అడిగాడు షాపులో ఒకతన్ని.

"ఇప్పుడే వస్తానని ఫోను చేసారు. కూర్చోండి" అన్నాడతను.

సుబ్బూ స్టూల్ మీద కూర్చుని రోడ్డుకటువైపున్న మీరాబాయి స్వీట్‌షాపుకేసి చూశాడు. అటునుండి భజన్‌లాల్ వస్తూ కనిపించాడు.

లోపలికి వస్తూనే సుబ్బూని చూసి నవ్వుతూ "అయ్యో అప్పుడే వచ్చేసారా? ఇంతకీ రాత్రి బాగా జరిగిందా?" అనడిగాడు.

"చాలా బాగా. అందరూ సేటిస్‌ఫై అయ్యారు. మీకు లెక్కలు చూపించి మిగతా సొమ్ము అప్పజెప్పి వెళ్దామని..." అన్నాడు సుబ్బూ.

"అయ్యో, దీనికి తొందరేమొచ్చింది. అసలు నేను లెక్కలడిగానా?" అన్నాడతను సుబ్బూ యిచ్చిన కాగితం మిగతా డబ్బూ అందుకుంటూ.

"ఏమీ అనుకోకపోతే.. ఇది మీరుంచుకోండి" అంటూ ఆ డబ్బుని తిరిగి సుబ్బూ కివ్వబోయాడు భజన్‌సింగ్.

సుబ్బూ చిన్నగా నవ్వుతూ "మీరు చిన్న సహాయమన్నారు చేసాను. దట్సాల్. "అన్నాడు లేచి నిలబడుతూ.

"ఛ ఛ! మీరెందుకలా అంటారు. నేను నా సంతోషం కొద్దీ యివ్వాలనుకున్నాను. అంతే. ఇలా రండి" అంటూ అతను ముందుకి నడుస్తుంటే ఎందుకో అర్థంకాకపోయినా అతన్ని వెంబడించాడు సుబ్బూ.

భజన్‌సింగు అతన్ని రెడీమేడ్ వింగులోకి తీసుకెళ్ళి "ఇందులోంచి ఒక పెయిర్ డ్రెస్ తీసుకోండి. ప్లీజ్. నా తృప్తికోసం" అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

సుబ్బూ నిస్సహాయంగా చూశాడతని వైపు.

"ప్లీజ్, అమ్మ సంతోషిస్తుంది" అతను ఆఖరు బాణం ప్రయోగించాడు.

ఇక తప్పలేదతనికి. అతని దృష్టి పోలో టీ షర్టువైపు పడింది.

భజన్‌లాల్ అర్థమయినట్లుగా అతని సైజు రెడ్ టీ షర్టు, జీన్స్ తీసి పేక్ చేయించాడు.

మొగమాటపడుతూనే పాకెట్ అందుకుని థాంక్స్ అన్నాడు సుబ్బూ.

తిరిగి కౌంటర్ దగ్గర కొచ్చి మజా కూల్ డ్రింక్ తెప్పించి సుబ్బూ కిచ్చి తనొకటి తాగుతూ చెప్పసాగాడు భజన్‌సింగ్.

"ఇంటినిండా రాజస్థాన్ నుండి దిగిన బంధువులున్నారు. ఏవో ప్రార్థనలు జరుగుతున్నాయి. పనులున్నాయని ఒక్కసారి రాకుంటే వ్యాపారం తల్లక్రిందులవుతుంది. అమ్మ ఎప్పుడూ చెప్పేది. 'నీ దగ్గర పనిచేసేవాళ్ళకి అవసరమైతే పదికి వందివ్వు, కాని వ్యాపారం నమ్మి ఎవరిమీదా వదలకు' అని. అందుకే ఎంత పనివున్నా ఒకసారి తమ్ముడూ నేనూ వచ్చి చూసుకుంటాం."

"వీరా అంటే ఎవరండి?"

"మా నాన్నగారు. వీరప్రతాప్‌సింగ్. ఇద్దరు పేర్లూ కలిపి అలా పెట్టాం. అవతల వెండి, బంగారు షాపుంది. మా మరదలు తనే చూసుకుంటుంది" అని చెప్పాడు భజన్‌సింగ్.

"సరే నేనొస్తానండి" అంటూ లేచి నిలబడ్డాడు సుబ్బూ.

"ఇంకో సహాయం అడిగితే ఏమీ అనుకోరుగా"

"లేదు చెప్పండి"

"ఏం లేదు. అమ్మ యిల్లు ఎవరి చేతనైనా శుభ్రం చేయించాలి. ఆవిడెవరూ.. ఆఁ సీతన్నారే. అందులో వున్న గాస్‌స్టవ్, ఫ్రిజ్ తప్పా మిగతావన్నీ ఆవిడకిచ్చేయండి. కాస్త రంగులేయిస్తే ఎవరికన్నా అద్దెకిచ్చేయచ్చని. అద్దె ముఖ్యమని కాదు. ఎవరన్నా వుంటే కళగా వుంటుంది. ఏంతో కొంతకి. ఆ సంగతి కూడా మీరు చూస్తే సంతోషం"

కాదనలేకపోయాడు సుబ్బూ.

రెండ్రోజుల్నుండి డబ్బు వసూళ్ళకెళ్ళలేదు. కాళిదాసెంత గెంతుతాడో.

"ఏంటాలోచిస్తున్నారు. ఇబ్బందేమన్నా వుందా?"

"అహ! లేదు లేదు. చేయిస్తాను" అన్నాడు సుబ్బూ మొహమాటంగా.

"ఇదిగోండి నా విజిటింగు కార్డు. మీరన్నీ మాట్లాడాక డబ్బు పంపిస్తాను" అంటూ తన విజిటింగు కార్డిచ్చాడు భజన్‌సింగు.

కార్డు తీసుకుని 'ఇదేవి లంపటంరా' అన్నట్లు బయటపడ్డాడు సుబ్బు.

🦋🦋🦋

"**తమర్నోపాలి** కాలిదోసుగోరు కాపడమన్నారండి" అన్నాడు అంజి గుమ్మంలో నిలబడి.

షేవ్ చేసుకుంటున్న సుబ్బు వెనక్కి తిరిగి "వస్తున్నాలే పద" అన్నాడు అంజికేసి చూస్తూ.

"అలాకాదండి. ఎంటెట్టుకొచ్చేయమన్నారు" అన్నాడు అంజి మొండిగా. వాడికి పద్నాలుగేళ్ళుమాయి.

కాళిదాసుగారింట్లో పనిచేస్తుంటాడు. ఎప్పుడో ఎక్కడో దిక్కులేక తిరుగుతుంటే కాళిదాసుగారు తీసుకొచ్చి యింట్లో పెట్టుకున్నారట. ఆ పనీ యీ పనీ చేస్తూ వాళ్ళింట్లో చనువుగా తిరుగుతుంటాడు.

సుబ్బూ వెనక్కి తిరిగి సీరియస్‌గా చూశాడు.

అంజి వెంటనే భయపడ్డట్లు వెనక్కి తగ్గి "అది కోదండీ. ఆరు కొంచెం అగ్గిమీన గుగ్గిలంలా వున్నారు. ఓ..సిరాకు పడిపోతున్నారు. మీరుగాని రాపోతే నా యీపు దూదేకిసినట్టేకేస్తారండి. అందుకు" అన్నాడు నసుగుతూ.

సుబ్బూ చిన్నగా నవ్వి "వస్తున్నాలే. నువ్వెళ్ళు. నేనూ అక్కడికే బయల్దేరతున్నా" అన్నాడు.

"రావాలి మరి" అంటూ అంజి వెళ్ళిపోయాడు.

సుబ్బు "అమ్మాజీ" అని కేకపెట్టాడు.

అమ్మాజీ పరుగున వచ్చి "అన్నా" అంది.

"నేను కాళిదాసుగారింటికెళ్తున్నా. ఈ మధ్యన వెళ్ళక ఆయన చాలాకోపంగా ఉన్నారట. వసూళ్ళు కూడా చెయ్యడంలేదుకదా. ఒక్కో మహాతల్లి కాలుపెడితే.. అంతే." అంటూ మంచమ్మీద కూర్చుని వున్న మహాని క్రీగంట చూస్తూ అన్నాడు.

మహాకి కోపం వచ్చింది కాని దాన్ని అదుపు చేసుకుని సుబ్బూ వైపు కోరగా చూసింది.

అమ్మాజీ వస్తున్న నవ్వాపుకుని దొంగ చూపులు చూసింది మహావైపు.

"అద్సరే. పైన మీరాబాయిగారున్న భాగం రిపేర్ చేసి రంగులేయడానికి మనుషులొస్తారు. ఆ ఫ్రిజ్, గాస్‌స్టౌ తప్పా అన్నీ సీతకిచ్చేయమన్నారు. సీతని కాస్త దగ్గరుండి చూసుకోమను. నువ్వు కూడా వంటేం పెట్టుకోకు. అందరూ బయటనుండి తెచ్చుకోండి. సీతకి సామాను పట్టుకెళ్ళడానికి పనివాళ్ళని సాయపడమని చెప్పు. అమ్మాణమ్మగారి సంగతి మాత్రం మరచిపోకు" అంటూ అమ్మాజీకి డబ్బిచ్చి స్నానానికెళ్ళిపోయాడు సుబ్బు.

సుబ్బు వచ్చేలోపున అమ్మాజీ వెళ్ళి పాపాయమ్మ దగ్గర దోసెలు తెచ్చి, మహాకిచ్చి సుబ్బూకి పక్కన పెట్టింది.

సుబ్బూ గబగబా టిఫిన్ తిని వెళ్ళిపోయాడు.

"ఎప్పుడు చూసినా అమ్మాణమ్మగారంటాడు. ఆవిడెవరూ?" అనడిగింది మహా టిఫిన్ తింటూ అమ్మాజీని.

"ఆ మూలగదిలో ఉంటారండి. ఎవరితోనూ మాట్లాడరు. బయటకిరారు. బాగా బతికిన మనిషిలా అనిపిస్తారండి. ఉంటే తింటారు లేకపోతే లేదు" అంది అమ్మాజీ.

"మరి.. ఇంటద్దెలా?"

"ఏదో మనియార్డర్ వస్తదండి. ఎవరంపుతారో తెలియదు"

"మరి సుబ్బూకేంటి ఇంటరెస్టు?"

అమ్మాజీ నవ్వింది.

"అలా అడిగితే ఏం చెబుతావండి. ఇప్పుడు మీరెవరో తెలీదు. సుబ్బూ మిమ్మల్ని సూడ్డంలేదా! అన్న మనసు ఎన్నపూస."

మహా ఇంకేం మాట్లాడలేదు.

పని వాళ్ళొస్తే వాళ్ళని తీసుకుని పైకెళ్ళింది అమ్మాజీ.

సుబ్బా లోపలికెళ్తూనే కాళిదాసుగారికి నమస్కరించాడు.

కాళిదాసుగారు సుబ్బావైపు కోపంగా చూసి తన భారి శరీరాన్ని అసహనంగా కుర్చీలో కదిలించారు.

"రావయ్యా పెళ్ళి కొడుకా, రా నిలబడ్డావేం కూర్చో నేకూ మీ అయ్యగారికీ సరిపోయింది. ఎందుకయ్యా మీకు చాతకాని యవ్వారాలూ!" అంది అప్పుడే చేటలో బియ్యం పోసుకుని వచ్చి కాళిదాసుగారి ఎదుట కూర్చుని అతని భార్య సత్యవతి.

కాళిదాసు భార్యవైపు కోపంగా చూసి "మొగోళ్ళవ్వారంలో తలదూర్చొద్దని ఎన్నిసార్లు చెప్పాను. బియ్యవేరుకోటానికి ఇక్కడే తగలడాలా. ఎల్లి ఎనకవైపు సావకూడదూ!" అన్నాడు.

సత్యవతి మూతి తిప్పింది.

"నాకేంటంత కర్మ! ఎనకేపు కూర్చోడానికి. నా బాబిచ్చిన బంగారంలాంటి పొలవమ్మి ఈ ముదనష్టపు వడ్డీయాపారంలో పెట్టి నిలువునా ముంచారు. మీ ముఖం, ఆడి మొహం సూసి ఎవడన్నా టయిముకి వడ్డీ యిస్తన్నాడా! దానికీ తెలివితేటలు కావాల!" అంది సత్యవతి అంతకంటే కోపంగా.

కాళిదాసు కోపాన్ని గుటకలుగా మింగి సుబ్బా వైపు గుర్రుగా చూసి "కొంపేవన్నా గుర్తుందా? వసూళ్ళేవీ?" అన్నాడు.

సుబ్బా చేతులు కట్టుకుని "తిరుగుతూనే వున్నానండి. రేపురా మాపురా అంటున్నారు. వసూలు కాకుండా ఏ మొహం పెట్టుకురాను" అన్నాడు అతి వినయంగా.

"అవునిలా చెవులేడాలేసుకుని ఎల్తే యిస్తారు" అంది సత్యవతి వెటకారంగా.

సుబ్బాకి నవ్వొచ్చిందామాటలకి. కానీ పెదవులు బిగబెట్టి ఆవిడకేసి జాలిగా చూశాడు.

"చాల్లే ఎదవేషం. ఇద్దరికిద్దరే. ఏవన్నా తిన్నావా. కూచుని తగలడు. కాఫీ తెస్తా" అంటూ చేట టీపాయ్ మీద పెట్టి లోపలికెళ్ళింది.

సుబ్బా అనుమానంగా చూస్తూ నిలబడ్డాడు.

"కూర్చోమందిగా, కూర్చుని తగలడు" అన్నాడు కాళిదాసు.

అదే అదనుగా గబుక్కున కూర్చున్నాడు సుబ్బా.

"ఆ మాస్టారిగాడి కేసేవయ్యింది?

"ఏం చెయ్యను సర్, అతని దగ్గర పైసాలేదు. కొడుకుకి ఫోను చేస్తే నాకేం సంబంధం లేదంటున్నాడు. చంపితే చంపుకోమన్నాడు. ఇతనుకూడా కాళ్ళట్టుకుని ఆమాటే అంటున్నాడు."

"మరేసెయ్యలేకపోయావా?" కసిగా అన్నాడు కాళిదాసు.

"అలాగే అనుకున్నానుగాని మీ మొహం చూసి. వూరుకున్నాను" అన్నాడు సుబ్బు.

"మధ్యలో నా మొహం దేనికి? ఆడేవన్నా నా మేనమావకొడుకా?"

"అదికాదండి. కేసులూ, జైళ్ళూ బెయిళ్ళూ.. లాయర్లూ చాలా ఖర్చుకదాండీ"

"మీ మొహాలకి మర్డర్లొకటే తక్కువ. ఎలాగో ముళ్ళమీద బట్ట చిరక్కుండా వసూలు చెయ్యండి" అంటూ ఇద్దరికీ కాఫీ తెచ్చిచ్చింది సత్యవతి.

"అవునే, నువ్వు నిజంగా ఏవన్నా మర్డర్లు చేసావా? ఎదవ గొప్పలు పోతున్నావా?" అనడిగాడు కాళిదాసు ఆరాగా.

"చెయ్యలేదనుకోండి. కోపం వస్తే చేస్తానేమో!" అన్నాడు సుబ్బు.

"సరి సర్లే. మనకంతదాకా వద్దుగాని. కాస్త వసూళ్ళయ్యేట్లు చూడు. తెలియని యవ్వారంలో తలదాక దిగిపోయాను. అసలన్నా రావాలి కదరా! నువ్వేమో అమాసకి పున్నానికి కనిపిస్తే డబ్బులెలా వసూళ్ళవుతాయిరా! కాస్త గట్టిగా వుండు మరి" అన్నాడు మెత్తబడి.

సుబ్బూకి ఈ రెండేళ్ళలో ఆ భార్యాభర్తల ధోరణి బాగా అర్థమయింది.

ఇద్దరూ చూడ్డానికి ఆకారాలకి భీకరంగానే వుంటారు. కాళిదాసుగారయితే నేరేడు పండురంగు, బానపొట్ట, బుర్రమీసాలు ఎర్రజీరల కళ్ళు. చూడగానే భయపడతారు. సత్యవతిగారు నోరు మనిషి. మాటకి ముందు గయ్యిన లేస్తుంది. కానీ యిద్దరికీ బ్రతకడం చేతకాదు. ఏవో వ్యాపారాలు చేసి నష్టపోయి ఎవరో స్నేహితుడు మాటలు నమ్మి భార్యకి కట్నంగా యిచ్చిన బంగారంలాంటి పొలం అమ్మి ఈ రంగంలోకి దూకాడు. వసూళ్ళ కోసం పెట్టిన మనుషులు ఇతన్నే తినేయడం మొదలు పెట్టారు. కేసులు నెత్తికి చుట్టుకునే స్థితిలో దిక్కులేక రైల్వేస్టేషన్‌లో కూర్చున సుబ్బు ఎవరితోనో గొడవపడి వాణ్ణి తన్నడం చూసి యింటికి తెచ్చుకున్నాడు. కొంతవరకు సజావుగా వడ్డీలు వసూలు చెయ్యడంతో కొంత మనశ్శాంతిగా బ్రతుకుతున్నాడు."

సుబ్బూకి ఆ కుటుంబం అంటే జాలి, ప్రేమా ఉన్నాయి.

అందుకే కాళిదాసుని వదిలేసి పోవడం యిష్టంలేక అతని దగ్గరే కొనసాగుతున్నాడు.

"కొద్దిగా నా పనుల్లో కూడా పడి మీ పని పట్టించుకోలేకపోయాను. ఈ వారం అన్నీ చేసుకొస్తాను" అన్నాడు వినయంగా.

"చూడు మరి! ఎవర్నీ ఏవీ చెయ్యకు" అన్నాడు కాళిదాసు.

"పాముని కరవొద్దన్నారుగాని బుసకొట్టొద్దనలేదు. కాస్త కరకుగానే వుండు" అంది సత్యవతి.

"సుబ్బు బుద్ధిగా తలూపి లేచి నిలబడ్డాడు"

"అన్నం తినెళ్ళరా" అంది సత్యవతి.

"వద్దండి. ఇంటిదగ్గర.."

"ఏంర్రా, పెళ్ళిగాని చేసుకున్నావా?"

"అవునండి. మీరిచ్చే డబ్బుకి అదొకటే తక్కువ"

"ఎదవకి ఎటకారాలెక్కువ. ఇంట్లో ఎవరో ఆడలేడీసున్నారని మా అంజిగాడు చెప్పాడు" అంది సత్యవతి.

"భలేవారండి. లేడీసుంటే ఒకటేవరసాండీ" అంటూ బుర్ర గీక్కుంటూ నవ్వాడు సుబ్బు.

"సర్లే.. నువ్వు పెళ్ళి చేసుకుంటే మాకు సంతోషమే కదరా.. ముందు మాకు చెప్పి ఏడు" అన్నాడు కాళిదాసు కూడా నవ్వుతూ.

"అలాగేనండీ, ఏడ్చే రోజొస్తే తప్పక చెప్పే చేసుకుంటాను" అంటూ బయటపడ్డాడు సుబ్బూ. ఎలాగైనా ఈ వారంలో కొంతన్నా డబ్బు వసూలు చేసి కాళిదాసుగారికి ముట్టజెప్పాలన్న కృతనిశ్చయంతో.

పనివాళ్ళతో అమ్మాజీ కూడా మీరాబాయిగారింట్లోకి ప్రవేశించి ఆశ్చర్యపోయింది.

కారణం క్రింద వాళ్ళుంటున్న భాగాలకి, పైన మీరాబాయి వున్న పోర్షన్‌కి అసలు సంబంధమేలేదు.

పైభాగమంతా పాలరాతి ఫ్లోరింగ్‌తో, విశాలమైన కిటికీలతో రెండు బాత్రూమ్ టాయిలెట్లతో అందంగా వుంది. నిజానికి చాలా పెద్ద యిల్లేం కాదది. ఒక వంటగది, విశాలమైన హాలు, బెడ్‌రూమ్ పెద్ద టెర్రస్ ఉన్నాయి. గోడలు కాస్త మాసి ఉన్నాయి. ఒంటరి, జబ్బుతో వున్న వృద్ధురాలుండటం వలన ఆ భాగం కళ తప్పింది.

వెంటనే ఏదో తోచినదాన్లా రివ్వున మెట్లదాకా వచ్చి 'అమ్మాయిగారూ, అమ్మాయ్‌గారూ' అంటూ కేకపెట్టింది.

ఆ పిలుపుకి మహా బయటకొచ్చింది.

"అమ్మాయ్ గారూ మీరోసారి పైకి రండి" అంది అమ్మాజీ ఉత్సాహంగా.

"ఎందుకూ?" అనడిగింది మహా సందేహంగా చూస్తూ.

"ఒకసారి రమ్మంటే"

మహా వెంటనే పైకెళ్ళింది.

అమ్మాజీ మహా చేతిని పట్టుకుని "ఈ ఇల్లు చూడండి" అంది లోపలికి లాక్కెళ్తూ.

మహా అయిష్టంగానే లోపలికెళ్ళి ఆ యింటిని చూస్తూ అప్రతిభురాలయింది. కారణం విశాలమైన ఆ కిటికీలోంచి దూరంగా ఒక వలయాకారంలో ప్రవహిస్తున్న అఖండ గోదావరి కనిపించడమే. రెండు కొత్త బ్రిడ్జీలతో పాటు చాలా దూరంగా లీలగా ధవళేశ్వరం బారేజ్ కనిపించడం. పచ్చగా ఆ ప్రాంతమంతా మెరిసిపోతున్న కొబ్బరి తోపులు.

"భలేవుంది కదూ!" అంది మహా.

"అద్సరేలెండి. మీరిల్లు మారదావంటే సుబ్బూ ఒప్పుకోవడంలేదు కదాండీ. ఈ యిల్లన్నా తీసుకోమనండి. ఇక్కడే వున్నట్లుంటుంది. మీకు సదుపాయంగానూ వుంటుంది" అంది అమ్మాజీ.

అమ్మాజీ సలహాకి మహా కళ్ళు మెరిసాయి.

ఆ వెంటనే కొంత నిరుత్సాహపడుతూ "అద్దెంత చెబుతారో.. అసలొప్పుకుంటాడో లేదో" అంది సందేహంగా మహా.

"ఒప్పుకుంటాడు లెండి అలా మొండిగా కనబడతాడు గాని. మీరిబ్బంది పడుతున్నారని బాధవుంది. నే చెబుతాగా" అంది అమ్మాజీ మహాని సముదాయిస్తూ.

అంతలో సీత కొంతమంది మనుషుల్ని తీసుకొనొచ్చింది.

వాళ్ళు మంచం, అక్కడున్న కుర్చీలు, టేబుల్ వంట సామానూ తీసుకెళ్తుంటే మహా ఆశ్చర్యంగా చూస్తూ "సీతగారూ.. అవన్నీ ఏం చేసుకుంటారూ" అనడిగింది అమాయకంగా.

"నన్ను గోరంటన్నారా అమ్మాయిగోరూ!" అంది సీత నొచ్చుకుంటున్నట్లుగా.

"అద్సరే. ఇవన్నీ నీ గుడిసెలో ఎక్కడ పెడతావ్?" అనడిగింది అమ్మాజీ.

"బలేటోరండి. ఇయ్యి సూసుకునెల్లి అమ్మేసానండి. నాకెందుకీ సామానూ!" అంది సీత.

వాళ్ళు సీతకి డబ్బులిచ్చి వెళ్ళిపోయారు.

"పదండి పదండి ఇక్కడంతా దుమ్మొస్తాది. నేను సుబ్రం చెయ్యాల" అంది సీత అమ్మాజీని, మహాని.

ఇద్దరూ కిందకి దిగొస్తుంటే సుబ్బూ ఎదురొచ్చాడు.

"పైనేం చేస్తున్నారు?" అనడిగాడు వస్తూనే.

అమ్మాజీ మహాని క్రింద వదిలేసి "నువ్వోసారి యిటురా అన్నా" అంటూ సుబ్బూ చెయ్యి పట్టుకుని పైకి లాక్కెళ్ళింది.

సుబ్బూ అర్ధంకానట్లుగా చూసి "ఏంటీ?" అన్నాడు

"ఇల్లు బాగుంది కదన్నా" అంది అమ్మాజీ సంబరంగా.

సుబ్బు తలూపాడు.

దూరంగా మెలికలు తిరిగి ప్రవహిస్తున్న గోదావరి అతనికి నచ్చింది.

"ఈ యిల్లు నువ్వు తీసుకో అన్నా! నువ్వడిగితే బజన్‌లాలు కాదనడు" అంది అమ్మాజీ.

"నాకెందుకు?"

"అదేంటన్నా అలాగంటావు. పాపం అమ్మాయిగారు అక్కడుండలేకపోతున్నారు కదా!"

సుబ్బూ అమ్మాజీవైపు కోపంగా చూశాడు.

"అంటే ఉండటానికి ఆవిడా - ఉంచడానికి నువ్వూ సిద్ధపడిపోయారన్నమాట" అన్నాడు.

అతని మాటకి అమ్మాజీ కొద్దిగా భయపడింది.

"లేదన్నా. నాకెం తెలుసు ఆవిడ ఆ బయట బాత్రూంలో స్నానం చెయ్యలేక యిబ్బంది పడ్తున్నారు. ఆవిడ బయటకొస్తేచాలు - ఆ రామక్రిష్ణగాడు పళ్ళికిలించుకుని వచ్చి నిలబడి వంకరమాటలంటున్నాడు. అందుకని చెప్పా. అంతే!" అంది మెల్లిగా.

"నువ్వు వాళ్ళు రంగులెలా వేస్తున్నారో చూసుకో" అంటూ క్రిందకొచ్చేసాడు.

వెనకాలే వస్తున్న అమ్మాజీని చూసి "చెప్పావా?" అన్నట్లు సైగ చేసి అడిగింది మహా.

అమ్మాజీ తల పంకించింది చెప్పానన్నట్లుగా. వారిద్దరి సైగలూ సుబ్బూ చూపుల్ని దాటిపోలేదు.

ఇల్లంతా శుభ్రం చేసి సుబ్బూకి తాళాలిచ్చి వెళ్ళింది సీత.

"ఒకసారి పైకెళ్దాం రా" అంటూ పిలిచాడు మహాని సుబ్బూ.

"ఎందుకు?"

"పైన బాగుంది. చూద్దువుగాని రా"

"నిన్న చూశాన్లే" అంది మహా నిర్లిప్తంగా.

"ఇప్పుడు కలర్స్ వేసారు కదా! రా" అన్నాడు సుబ్బూ.

మహా కొంచెం కోపంగా మరి కొంత అయిష్టంగానూ సుబ్బూ వెంటనడిచింది.

అప్పుడే సరిగ్గా రామక్రిష్ణ బయటకొచ్చి నిలబడి "ఏంటో చూస్తుండగానే మన బిల్డింగ్‌కి కలర్సొచ్చేస్తన్నాయి" అన్నాడు వెటకారంగా మహావైపు చూస్తూ.

సుబ్బూ రెండు మెట్లు దిగి వెనక్కొచ్చి రామక్రిష్ణ చెంపఛెళ్ళుమనిపించి "ఇప్పుడు రంగులు మరీ బాగా కనబడతాయి చూడు" అన్నాడు కోపంగా.

అనుకోని ఆ చర్యకి రామక్రిష్ణ నివ్వెరపోయి చెంపపట్టుకున్నాడు.

"ఇప్పుడు అద్దంలోకెళ్ళి చెంపచూసుకోరా. మంచి రంగుతో ఉంటది. పనీపాటా లేని ఎదవ" అంది అక్కడే కూర్చుని అంతా చూస్తున్న పాపాయమ్మ.

రామక్రిష్ణ లోపలికి పరిగెత్తాడు.

పాపాయమ్మని చూసి "సారీ మామ్మా" అన్నాడు సుబ్బూ.

"మరేం పర్లేదు. ఎద్దంత ఎదవని నేను చెయ్యలేని పని నువ్ జేసావ్. ఆడి పెళ్ళాం లేదు. అదికూడా సూసుంటే మా సంబరంగా వుండేది" అని తిట్టిపోసింది పాపాయమ్మ.

ఆ సంఘటన చూసి బెదిరిపోయింది మహా.

''నీకు కోపమెక్కువా?'' అనడిగింది పైకెళ్ళాక.

సుబ్బూ జవాబు చెప్పలేదు.

తాళం తీసి ''రా'' అన్నాడు.

క్రీం కలర్ గోడలతో ఆ భాగం యిప్పుడు మరింత అందంగా వెలుగుగా కనిపిస్తున్నది. తలుపులకి కిటికీలకి వేసిన ఎమల్షన్ మెరుస్తున్నది.

''బాగుందా?''

''ఊ'' అంది మహా మౌనంగా.

''నీ కోసమే తీసుకుంటున్నా''

ఆ మాట విని మహా కళ్ళు మెరిసాయి.

''నిజంగానా?'' అంది సుబ్బూ చేతిని పట్టుకుని ఊపుతూ.

అలా మహా చిన్నపిల్లలా సంతోషంతో ఊగిపోతున్నప్పుడు సుబ్బూ మనసులో ఏవో ఆశలు తీగెలు సాగుతాయిగాని వెంటనే ఆమె ఎవర్నో ప్రేమించిందన్న విషయం గుర్తొచ్చి అవి తలలు వంచి ముడుచుకుపోతాయి.

''నా వలన అద్దె ఎక్కువ యివ్వాల్సి వస్తుందా?'' అంది కొద్దిగా అపరాధభావంతో

''లేదు. ఈ బాధ్యతంతా నాకే అప్పచెప్పాడు నిజానికి భజన్‌లాల్. కాని నాకు తట్టలేదు మనమే తీసుకుందామని. అమ్మాజీ అంతా చెప్పింది అందుకే కోపంతో వాణ్ణి వాయించాను''

''నాకు భయమేసింది - వాడు పాపాయమ్మగారి కొడుకుని నీతో చెప్పలేదు'' అంది మహా కన్నీళ్ళతో.

''లేదు. ఇలాంటివి దాయకు. నాకు కోపమెక్కువా - అని అడిగావు కదూ! అవును. ఎక్కువే. ఆడవాళ్ళని వంకర మాటలని సతాయించేవాళ్ళంటే. సరదాగా ఉండటవంటే ఇంకొకరి మనసు నొప్పించడం కాదు. ఆ విషయంలో నేను ఉపేక్షించను'' అన్నాడు సుబ్బు.

ఇద్దరూ టెర్రస్ మీద కెళ్ళారు.

''ఇక్కడ మనం మొక్కలు పెంచొచ్చు కదా సుబ్బూ!'' అంది మహా కలల్లో తేలిపోతూ.

''అవును డ్యూయట్లు కూడా పాడొచ్చు'' అన్నాడు సుబ్బూ వెక్కిరింతగా.

మహా అతనివైపు ఆశ్చర్యంగా చూసింది.

మళ్ళీ వెంటనే పరిహాసంగా నవ్వుతూ ''అయ్ మీన్ నాతో కాదులే. పద కిందకెళ్దాం'' అన్నాడు.

ఇద్దరూ క్రిందకి దిగొస్తుండగా అమ్మాజీ గుమ్మంలో నిలబడి 'ఏవయ్యింది' అన్నట్లుగా సైగ చేసింది.

'సక్సెస్' అన్నట్లుగా బొటనవ్రేలు చూపించి నవ్వింది సుబ్బూ వెనకాలే వస్తూ మహా.

**''బాబూ నువ్వున్న** పళంగా రావాల!''

ఫోనులో మెసేజి చూసి ఆ నెంబరుకి ఫోను చేసాడు సుబ్బు.

''ఎవరండీ మీరు? నేనెక్కడికి రావాలి?'' అనడిగాడు వెంటనే.

"నేను మాస్టారిగారి భార్యని బాబూ, ఆయనకి సీరియస్‌గా వుంది. ఆస్పత్రిలో ఉన్నారు." అందావిడ ఏడుస్తూ.

సుబ్బూ అయోమయంలో పడ్డాడు.

"మాస్టారా? ఎవరాయన? నాకేం అర్థంకావడంలేదండి" అన్నాడు చిరాగ్గా.

"అదే బాబూ, మొన్నాయన మీకు డబ్బివ్వలేక కాళ్ళట్టుకున్నారు" అందామె ఏడుస్తూనే.

సుబ్బూకి అర్థమయ్యింది.

వెంటనే "ఏ హాస్పిటల్?" అనడిగాడు కంగారుగా.

"దానవాయి పేటలో శంకర్రావుగారి ఆస్పత్రి. చాలా పాతది. అక్కడ ఫీజులు తక్కువని.."

సుబ్బూ వెంటనే బయల్దేరి ఆస్పత్రికి చేరుకున్నాడు. శంకర్రావుగారంటే తేలిగ్గానే చెప్పేసారు ఎడ్రస్ ఆ ప్రాంతం వాళ్ళు.

సుబ్బూని చూడగానే ఆవిడ భోరున ఏడ్చింది.

ఆ తర్వాత నర్సులు కసరడంతో కొంగు నోట్లో కుక్కుకుంది.

"ఏం జరిగిందమ్మా?" అన్నాడు సుబ్బూ.

"నువ్వొచ్చి లెంపకాయేసేటప్పటికి మనోయాది పడ్డాడయ్యా. బళ్ళో పిల్లల్ని కూడా దెబ్బేసినోడు కాదు. చిన్నపిల్లోడి చేతిలో దెబ్బ తిన్నానని.." ఆవిడ చెప్పడం ఆపి సుబ్బూ కేసి చూసింది.

సుబ్బూ ఆ మాటకి ఖంగు తిన్నాడు గాని.. వెంటనే సర్దుకుని "అప్పు తీర్చకపోవడం తప్పు కాదామ్మా?" అనడిగాడు గంభీరంగా.

"ఆ మాట నిజవే బాబూ. కాదనటంలేదు. అందుకని తాళ్ళరేవు కాడ వున్న అరెకరం అమ్మి జమ చేద్దామని ఎళ్ళేరు. తీరా ఎళ్తే.." ఆవిడ మళ్ళీ ఏడ్చింది మౌనంగా.

ఆ వెంటనే సర్దుకుని కన్నీళ్ళు తుడుచుకుంది.

"అక్కడెవరో రాజకీయ నాయకుడంట. మాలాంటోళ్ళ బూవులన్నీ ఆక్రమించుకుని కూర్చుని కాపలాగా రౌడీలని పెట్టాడు. ఏం చేయాలి? అవన్నీ మాలాంటి దిక్కుమాలినోళ్ళ బూవులేనంట. ఆ పాటికే ఆళ్ళు కాళ్ళరిగేటట్లు అందరి చుట్టూ తిరిగి కూలబడిపోయారంట. ఈయనకి గుండాగినంత పనయ్యింది. తిరిగొచ్చి ఈ పని చేసారు." అని మళ్ళీ ఏడ్చిందామె.

సుబ్బూకి నిలువున్నా ప్రాణం పోయినట్లయింది.

తన మూలానా ఒక మనిషి చచ్చిపోవడమా? ఇలాంటి దరిద్రపు పనిలో యిరుక్కున్నందుకు మొదటిసారి చాలా సిగ్గు పడిపోయాడు సుబ్బూ.

వెంటనే డాక్టరు దగ్గరకెళ్ళి ఆయన పరిస్థితి కనుక్కున్నాడు.

"ఫర్వాలేదు. వెంటనే తీసుకొచ్చిందావిడ. సాయంత్రం ఇంటికి తీసుకెళ్ళొచ్చు" అన్నాడు శంకర్రావుగారు.

ఆ మాటే తిరిగొచ్చి ఆవిడకి చెప్పాడు సుబ్బు.

ఆవిడ మెడలోని మంగళసూత్రం తీసి సుబ్బూ చేతిలో పెడుతూ "ఏవనుకోకపోతే కాస్తమ్మి పెట్టు బాబూ.. డాట్టరుగారు ఎంత మంచోడయినా కొద్దిగా అన్నా పీజిచ్చుకోవాలగదా!" అంది.

సుబ్బూ దానికేసి చూశాడు.

అరకాసు అరిగిపోయిన బంగారంతో అల్పంగా వేలాడుతోంది డబ్బా మూతలు తీసి తీసి వంకర్లు తిరిగి పోయిన మంగళ సూత్రం.

ఎప్పుడో తల్లితో కలిసి మార్నింగు షోల్లో చూసిన పాత తెలుగు సినిమాలు గుర్తొచ్చాయి.

***పేదరికమెప్పుడూ బ్లాక్ ఎండ్ వైట్ తెలుగు సినిమానే***

సుబ్బూ చెయ్యి పెట్టి వారించి వెళ్ళి ఆ ఫీజు తనే కట్టాడు.

"ఆవిడ దగ్గరకి తిరిగొచ్చి మీరేం కట్టనక్కరలేదు. ఈ డబ్బులుంచండి. ఆయన్ని తీసుకెళ్ళాలిగా యింటికి" అంటూ ఓ వెయ్యి రూపాయిలావిడ చేతిలో పెట్టి మాస్టారు రూములోకి వెళ్ళాడు.

మాస్టారు సుబ్బూని చూసి తల పక్కకి పెటుకున్నారు.

"ఇలాంటి పిచ్చిపని మరోసారి చెయ్యకండి. నేను మీ మీద చెయ్యి చేసుకోవడం తప్పే. నా వృత్తిలాంటిది. చావడానికి ఒకటే దారి. బ్రతకడానికి చాలా మార్గాలున్నాయి" అంటూ వెనుతిరిగాడు సుబ్బూ.

అడుగులు పడుతున్నాయేగానీ ఆలోచనలనిండా ఆ భార్యాభర్తలే ముసురుతున్నారు.

తను వేసిందొక దెబ్బే. కానీ అది వారి ఆత్మగౌరవం మీద తీరని దెబ్బ తీసింది. ప్రాణమే తీసుకోబోయాడతను. ఛీ! ఛీ! చాలా నీచమైన పనిచేసాడతను. అసలైనా ప్రపంచంలో పనేలేనట్లు ఇంత నీచమైన నికృష్టమైన పనిలో చేరాడేమిటి తను. 'ఒరే ధర్మవడ్డీ తప్ప ఎక్కువ వడ్డీ తీసుకుంటే కుష్టురోగమొస్తుందిరా' అన్న తాత మాటలు గుర్తొస్తున్నాయి. ఏ సందర్భంలో అన్నాడో కూడా గుర్తులేదు. మరేంటి మనుషులు బ్రతకడానికి మరో వృత్తి లేనట్లుగా, హాయిగా వుండటానికి మరో ప్రవృత్తి లేనట్లుగా డబ్బు డబ్బు అంటూ దాని వెంటపడ్డారు. దానికోసం ఎంతకైనా దిగజారి పోతున్నారు. ఈ పని వదిలేసి పోదామంటే కాళిదాసుగారి దీన గంభీరమైన మొహం గుర్తొస్తుంది. నేరక ఈ పనిలో దిగి నష్టపోతున్నాడతను.

దూరంగా కల్వర్టు మీద తమ అభిమాన హీరోల గురించి చిన్న తగవే నడుపుతున్నారు కుర్రకారు కొందరు. తనూ మొన్నటిదాకా ఈ పని చేసినవాడే తెలియకుండానే భారమైన జీవితాన్ని ఎన్నుకున్నాడు తను.

సుబ్బూ ఆలోచనలొక కొలిక్కి రాకుండానే ఇల్లొచ్చేసింది.

లోపలికి రాగానే అమ్మాజీ, మహా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

సుబ్బూని చూడగానే అమ్మాజీ మొహం చాటంత చేసుకుని "వచ్చావా అన్నా, నీకోసమే చూస్తున్నాం. రేపు మంచి రోజట. పైకెళ్ళి పోదామా?"

సుబ్బూకి పట్టరాని కోపం వచ్చింది. "అవును పైకే వెళ్ళిపోదాం సగం దరిద్రం వదిలి పోతుంది" అన్నాడు కసిగా.

ఆ మాటకి గతుక్కుమన్నారు ఇద్దరూ.

అమ్మాజీ వెనక్కి తగ్గి "మళ్ళీ వస్తా" అంటూ గుమ్మం దాటబోయింది.

"అమ్మాజీ"

సుబ్బూ పిలుపుకి ఠక్కున బిగుసుకున్నట్లు అలానే నిలబడింది.

"కొంచెం టీ పెట్టుకురా"

"అలాగే అన్నా" అంటూ పరిగెత్తినట్లు తన యింటివేపు వెళ్ళింది.

పదినిముషాల్లో సుబ్బూతో పాటుగా మహాకి కూడా టీ పట్టుకొచ్చింది అమ్మాజీ.

"టీ చప్పరిస్తూ పాలెక్కడివి అమ్మాజీ, ఉన్నాయా?" అనడిగాడు సుబ్బూ కొద్దిగా శాంతపడుతూ.

"పొద్దున్న నువ్విచ్చిన డబ్బులతో పాలట్టుకొచ్చే ఒక పేకట్టు, పంచదార, టీపొడి అంతకుముందే కొనిపెట్టుకున్నా అన్నా. పాపగారొచ్చాకా సాయంత్రాలు టీ పెడతన్నా కదా!" అంది అమ్మాజీ.

"ఊ. ఏంటీ రేపు మంచిరోజా?" అన్నాడు సుబ్బు కొద్దిగా శాంత పడుతూ.

"అవునన్నా పొద్దున్న మన యీది చివర మరిడమ్మ గుడి పూజారిగారెల్తంటే అడిగాను. రేపు రోజంతా మంచేనంట. వర్జాలూ గ్రటా లేవంట" అంది అమ్మాజీ ఉత్సాహంగా.

"సరే మరి. కానివ్వండి" అన్నాడు.

ఆ మాట విని యిద్దరి మొహాల్లో ఉత్సాహం పొంగి పొర్లింది.

సుబ్బూ టీ తాగి మరేం మాట్లాడకుండా చాప మీద బోర్లా పడుకున్నాడు.

అమ్మాజీ మళ్ళీ వస్తానన్నట్లుగా మహాకి సైగ చేసి తలుపు దగ్గరకేసి వెళ్ళిపోయింది.

మహా పడుకున్న సుబ్బూవైపు చిత్రంగా చూసింది.

అతని ప్రవర్తన ఆమెకు చాలా చిత్రంగా అనిపిస్తుందొక్కోసారి.

"అప్పుడే తారాజువ్వలా పైకి లేస్తాడు. అంతలోకే మతాబులా వెన్నెల ముద్దలు నేలకి రాలుస్తాడు" అని భుజాలెగరేసి మంచమ్మీద పడుకుని తనదగ్గరున్న రస్కిన్‌బాండ్ పుస్తకం తెరచింది.

సాయంత్రం ఆరుగంటలవుతుండగా గబుక్కున మెలుకువొచ్చి లేచి ‘ఇప్పుడు టైమెంత..?‘ అన్నాడు సుబ్బూ చుట్టూ చూస్తూ.

"ఆరవుతున్నది" అంది వాచీ చూసుకుంటూ.

"ఓ మైగాడ్" అంటూ గబగబా చొక్కా వేసుకుని ఏమీ చెప్పకుండానే బయటకి పరిగెడుతున్న సుబ్బూని చూసి అవాక్కయింది మహా.

అప్పుడే భర్త హాస్పిటల్ తాలూకు కాగితాలు, మందులు వగైరా సర్దుకుని ఆటోకోసం బయటకొచ్చిన మాస్టారి భార్య సుబ్బూని చూసి "వచ్చావా బాబూ" అంది కొంత ధైర్యంగా, మరి కొంత సంతోషంగా.

"అంతా రెడీ చేసారా? నేను ఆటో తెస్తాను" అన్నాడు సుబ్బూ.

ఆమె తల ఊపింది.

సుబ్బూ ఆటో తెచ్చి మాస్టార్ని పట్టుకుని ఆటో ఎక్కించాడు. పక్కన అతని భార్యని కూర్చోపెట్టి తను ఆటో డ్రైవరు పక్కన కూర్చున్నాడు.

ఇల్లు చేరగానే ఆయన్ని మంచమ్మీద పడుకోబెట్టి "వంట చెయ్యగలరా అమ్మా?" అనడిగాడు సుబ్బూ.

"చేస్తాను బాబూ అదెంత పని.." అందామె ఉత్సాహంగా.

సుబ్బూ అండ ఆమెకి చెప్పలేని ధైర్యాన్నిచ్చింది. వయసులో తల్లిదండ్రుల చేతులు పట్టుకుని తడబడుతూ అడుగులేసిన పిల్లలు పరుగులు రాగానే ఎంతో నిర్లక్ష్యంగా నిర్దయగా వణుకుతున్న చేతుల్ని నిర్దయగా వదిలేసి వెళ్ళిపోతున్నారు. కొడుకుని ఎంతో గారాబంగా, తము తినకున్నా అడిగిందల్లా ఇచ్చి పెంచిన జ్ఞాపకాలు ఆమెను వెంటాడుతున్నాయి.

"సరే మాస్టారూ, వస్తాను. ఏమంటే ఫోను చెయ్యండి" అంటూ లేచి నిలబడ్డాడు సుబ్బూ.

మాస్టారు చేతులు జోడించారు.

"దీనికేంలెండి. తిడితే పెద్దోళ్ళని తిట్టిన పాపం నాకు. ఈ వయసులో ఆవిణ్ణెంత యిబ్బంది పెట్టేసారు. అప్పు సంగతాలోచించకండి. వడ్డీ చాలానే కట్టారు కదా! నే జూసుకుంటా!" అన్నాడు సుబ్బూ కొంచెం మొరటుగానే ధైర్యం చెబుతూ.

"ఏమనుకోకపోతే ఒక మాట"

"చెప్పండి."

"కింద మన బైకొకటి పడివుంది. ఆడెళ్ళేముందు కొన్నదే వాడక తుప్పు పట్టిపోతున్నది. నువ్వటూ యిటూ తిరుగుతున్నావ్ వాడుకో!" అన్నారాయన.

బైకనగానే సుబ్బూ కళ్ళు మెరిసేయిగానీ "వద్దండి వడ్డీ వసూలు చెయ్యడం రాదుగాని, బండి కావాల్సొచ్చిందా అని మా సారు మండి పడతాడు" అన్నాడు బుర్రగోక్కుంటూ సుబ్బూ.

మాస్టారు నీరసంగా నవ్వి "మరయితే తిరగడానికి బండి కొనివ్వ మను ఆయన్ని" అన్నారు.

అంతలోనే ఆయన భార్య తాళం తెచ్చి సుబ్బూ చేతిలో పెట్టింది.

సుబ్బూ మొగమాటంగా నవ్వి "సరేనండి మరి. మీరెప్పుడు కావాలంటే అప్పుడు తెచ్చిస్తాను" అంటూ రివ్వున క్రిందకి దిగాడు రెట్టింపు ఉత్సాహంతో.

బైక్ మీద వెళ్తుంటే గోదారి గాలి తగిలి ప్రాణం తేలిపోతున్నది సుబ్బూకి. తన కాలేజీ రోజులు గుర్తొచ్చి మనస్సు చివుక్కుమంది. వెంటనే దాన్ని దులిపేసుకుని రాజానగరం మీదుగా కాకినాడ అక్కడనుండి ఏనాం వెళ్ళడానికి బయల్దేరాడు సుబ్బూ.

డబ్బులు వసూలు చేయకుండా బండిమీదెళ్తే భగ్గుమంటాడు కాళిదాసు. అందుకే కాకినాడలో యానాంలో వున్న కొన్ని మొండి వసూళ్ళ కోసం బయల్దేరాడు.

బండి బాగానే వెళ్తున్నది. ఎటొచ్చీ ఒకసారి వోవరాయిలింగ్ చేయిస్తే విమానంలా సాగిపోతుంది.

వెంటనే మహా గుర్తొచ్చి ఫోను చేసాడు.

"ఏంటి?" అంది మహా.

"నేను కాకినాడ వెళ్తున్నా. మీ యిద్దరూ కలిసి పైకి షిఫ్టయి పొండి. ఎవరి సాయమన్నా తీసుకోండి" అన్నాడు సుబ్బూ.

"అదేంటీ... నువ్వుండవా?" అనడిగింది మహా. నిజానికి అలాంటి అవకాశం కోసమే చూస్తోంది మహా.

"రెండురోజులు పడుతుంది. అటునుండి ఏనాం వెళ్ళాలి"

"అయ్యో.." అంది దిగులు నటిస్తూ మహా.

"అమ్మాజీ వుంటుందిగా. కొన్ని బాకీలు వసూలు చెయ్యాలి. ఇప్పటికే ఆలస్యమైపోయింది."

"మిస్ యూ" అంది మహా విచారం నటిస్తూ వస్తున్న నవ్వాపుకుని.

"గాడిదగుడ్డు" అంటూ ఫోన్ కట్ చేసాడు సుబ్బూ.

నిజానికి పైకలా అన్నాడేగానీ లోపల్నుండి సంతోషం తన్నుకొచ్చింది సుబ్బూకి.

చల్లగ వీచే పిల్లగాలిలో ఒక పిల్ల నిన్ను మిస్సవుతున్నానన్న మాటకన్నా కిక్కేముంది? హుషారుగా ఎక్సిలేటర్ బలంగా తొక్కాడు సుబ్బూ.

"అమ్మాజీని పిలిచి తొందరగా తయారవ్వు మనం ఒక చోటకి వెళ్ళాలి" అంది మహా తను తయారయి.

"ఎక్కడికండీ?" అనడిగింది అమ్మాజీ అమాయకంగా.

"చెబుతాగా. తయారయిరా" తొందర పెట్టింది మహా.

అమ్మాజీ చీర మార్చుకుని ఇంత పౌడరు మొహానికద్దుకుని తన దగ్గరున్న పూసల పర్సు పట్టుకుని వచ్చింది హడావుడిగా.

మహా అమ్మాజీవైపు నవ్వుతూ చూసింది.

దానికే అమ్మాజీ బోల్డంత సిగ్గుపడిపోయి "దీంట్లో ఏవీ ఉండవండి. ఊరికే సరదాగా.." అంది నవ్వుతూ.

"నువ్వు బాగుంటావు" అంది మహా.

"చాల్లే వూరుకోండి.. నా మొకానికి బాగోటమొకటే తక్కువ."

"కాదు అమ్మాజీ నిజంగానే చెబుతున్నా. ఆ కళ్ళు చూడు కలువరేకుల్లా ... అదే కవులలానే వర్ణిస్తారు కదా" అంది మహా నవ్వుతూ.

అమ్మాజీ సిగ్గుగా కళ్ళు వాల్చేసింది.

"అప్పుడెప్పుడో ఆడన్నాడు. మళ్ళీ తిరిగిప్పుడు మీరు.." అంది సణిగినట్లు.

"ఆడా.. అతనెవరూ?"

"ఎవడో తల మాసినోడు. ముందు మన పని చూడండి. ఆనక టైమయిపోద్ది." అంది అమ్మాజీ మాట మారుస్తూ.

ఇద్దరూ ఇంటికి తాళం వేసి రోడ్డుమీదదాకా వచ్చారు. ఆటో ఒకటి వారి ముందుకొచ్చి ఆగింది.

ఇద్దరూ ఆటో ఎక్కాక "కొవ్వూరికి" అని చెప్పింది మహా.

"అయ్యో, కొవ్వూరికాండీ. ఎవరయినా చుట్టాలింటికా?" అనడిగింది అమ్మాజీ అమాయకంగా.

"ష్" అంది మహా.

రైలు కమ్ రోడ్డు బ్రిడ్జిమీద ఆటో వెళ్తుంటే విశాలమైన గోదావరిని విస్ఫారిత నేత్రాలతో చూసింది మహా.

"రాజమండ్రికి ఈ నదే అందం కదూ!"

"అవునండి. ఇక్కడేం చూశారు మా అమలాపురంలో చూడాలి. జిల్లా అంతా ఓ క్లబ్బు డేన్సర్‌లా మెలికలు తిరిగిపోద్ది మాయదారి గోదారి" అంది అమ్మాజీ పరవశంగా.

"క్లబ్ డాన్సర్! వండ్రఫుల్ కంపారిజన్" మహా చప్పట్లు కొట్టింది.

అమ్మాజీ సిగ్గుపడింది.

"మీదేవూరు?"

"పుల్లేటుకుర్రు. ఏదో పేరుకి. ఎప్పుడన్నా అమ్మమ్మగారింటికెళ్ళినప్పుడే మిగతా బతుకంతా కాకినాడ్లోనే."

"ఎక్కడ దింపాలమ్మా?" ఆటో అతని మాటలకి స్పృహలో కొచ్చి బాంక్ పేరు చెప్పింది మహా.

ఇద్దరూ బాంక్ ముందు ఆటో దిగాక. ఎ.టి.ఎంలో కెళ్ళి డబ్బు డ్రా చేసుకొచ్చింది మహా.

డబ్బు బాగ్‌లో పెట్టి మరో ఆటో కోసం చూస్తుండగా అడిగింది అమ్మాజీ.

"ఈ పాటి పనికి మనూళ్ళో లేవా బాంకులు?" అంటూ.

"చెబుతా" అంటూ వారించింది మహా.

ఇద్దరూ ఇంటికి చేరాక తలుపులు మూసి చెప్పింది మహా.

"డబ్బు డ్రా చేసాను కదా. మాడాడీ ఎక్కడ డ్రా చేసానో కనిపెట్టేస్తారని.. ఇప్పుడయినా తెలుసుకోవచ్చునుకో" అంది మహా చిన్నగా.

"అంటే... ఇంట్లోంచి పారిపోయొచ్చేసారా?" అంటూ కళ్ళు పెద్దవి చేసి అడిగింది.

అవునన్నట్లుగా తలూపింది మహా.

"ఇప్పుడు తెలుసుకుని వచ్చి అట్టుకుపోతే..?"

"లేదు. డేడీ ఆ తొందర పనులు చెయ్యరు. ఎందుకంటే ఆయన మరో లక్షరూపాయలు నా ఎకౌంట్‌లో వేసారు. నేను డ్రా చేయడం వల్ల నా క్షేమం తెలిసి సంతోషిస్తారు" అంది మహా తండ్రిని తలుచుకుని పరవశంగా.

అమ్మాజీ తెల్లబోయి చూసింది మహా వైపు.

"లక్షరూపాయలా?"

మహా నవ్వింది. "అది నెలకు నా పాకెట్ మనీ"

అమ్మాజీకి నోటమాట రాలేదు.

ఆ తర్వాత గబగబా మహా దగ్గరగా వచ్చి "ఈ మాట నాతో అంటే అన్నారు. ఇంకెవరితోనూ అనకండి. డబ్బు కోసం ఏవన్నా చేసే మనుషులున్నారు." అంది గుసగుసగా.

మహా ఆశ్చర్యంగా చూసింది.

"ఏం చేస్తారు?"

"మీకు లోకం సంగతి బొత్తిగా తెలీదండి. నీళ్ళలోంచి ఒడ్డున పడ్డారు. ఒడ్డునే అసలైన తిమింగలాలున్నాయి. ఇకీ సంగతి నేనూ మర్చిపోతాను. మీరూ మరిచిపొండి. మరి పై కెప్పుడెళ్దాం?"

"ఇప్పుడు మనం షాపింగుకు వెళ్దాం."

"షాపింగా, ఏటి కొంటారు?"

"ముందు నాకు అన్నీ దొరికే సెంటరు చూపించు."

"పదండి మన సెంటరు కోటగుమ్మమే కదా! అక్కడే అన్నీ దొరుకుతాయి" అంది అమ్మాజీ.

ఇద్దరూ బయటకొస్తుంటే "ఏటే పొద్దుట్నుండీ సూస్తన్నా ఒకటే మార్నింగ్‌సోలూ మాటనీలూనా! ఆడు లేడని రెచ్చిపోతున్నారు. ఏటెవ్వారం?" అంది గడపలో కూర్చుని ఉన్న పాపాయమ్మ.

"నీ కంట్లో పడ్డావూ! అమ్మాయిగారు ఏయో కొనుక్కుంటారంట మామ్మా. నీకేవన్నా కావాలా? చెప్పు" అంటూ మహాని చూసి కన్నుగీటింది అమ్మాజీ.

"ఆఁ! ఒక అరవంకీ, రవ్వలొడ్డాణం తెచ్చి పెట్టండి. దీని బతుక్కి ఎటకారాలు!" అంది పాపాయమ్మ.

"సర్లే ఆ డ్రామా కంపెని సత్తిగాడి షాపులో దొరికితే తెస్తాం" అని నవ్వింది అమ్మాజి అంతకంటే మొండిగా.

"ఈసారి నిజంగానే అడుగుతున్నానే. ఈ పేలతో సచ్చిపోతున్నాను. రోడ్డుమీద కొమ్ము దువ్వెనొకటి తెచ్చిపెట్టవే" అంది పాపాయమం బ్రతిమలాడుతున్న ధోరణిలో.

ఇద్దరూ తల పంకించి బయటకి వచ్చారు.

వాళ్ళు కోటగుమ్మానికి ఆటో మాట్లాడుకుంటుండగా అక్కడే నిలబడి తననే చూస్తున్న ఆ నలుగుర్నీ చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడింది మహా.

**ఆ వెంటనే** వాళ్ళకి కనపడకూడదని అమ్మాజీ వెనక్కి దాక్కుని "అమ్మాజీ.. త్వరగా ఆటో ఎక్కేద్దాం ప్లీజ్" అంది కంగారుగా.

"ఊరుకోండి, ఈడు మరీ పాతికరూపాయలడుగుతున్నాడు" అంది అమ్మాజీ.

"పర్లేదు. ఇచ్చేద్దాం" అంటూ గబుక్కున ఆటో ఎక్కేసింది మహా.

అమ్మాజీ అప్పుడు చూసింది మహా వంక, ఆ నలుగురి వంకా.

తను కూడా ఆటో ఎక్కి "ఏటండీ, ఎందుకలా ఆ సన్నాసుల్ని చూసి గాబరా అడతన్నారూ?" అనడిగింది అయోమయంగా.

"వాళ్ళు రౌడీలు" అంది మహా భయంగా.

బదులుగా పకపకా నవ్వేసింది అమ్మాజీ. "ఎవరూ.. ఆ ఎదవలా.. మనీదిలోనే ఆ కొసకంటా వుంటారండి. ఉత్త ఆకతాయెదవలు. ఎవరైన పని జేస్కుంటూ చెంబూ తపాలా వదిలేస్తే ఎత్తుకెల్లి అమ్మేసుకుని ఆ పూట తాగేస్తారు. ఆళ్ళేం జేస్తారు మిమ్మల్ని?" అంది.

"ఊహూ, నీకు తెలియదు అమ్మాజీ. వీళ్ళే ఆ రాత్రి నన్ను తరుముతుంటే సుబ్బూ రక్షించాడు. లేకపోతే నా లైఫ్ ఏమయ్యేదో?" అంది మహా ఆ రోజు సంఘటన తలచుకుని భయంగా.

"ఏడిసేరెదవలూ.. మీ పర్సూ గ్రటా కొట్టేద్దావని ఎంటబడుంటారు. ఊరికే బయపడకండి" అంది అమ్మాజీ నవ్వుతూ.

వాళ్ళ మాటల్లోనే కోటగుమ్మం వచ్చేసింది.

"ఏ సాపుకో చెప్పండి" అన్నాడు ఆటో అతను.

"ఏదైనా మంచి ఎలక్ట్రానిక్ షాపుకి" అంది మహా.

ఆటో రాజమండ్రిలో వున్న అతిపెద్ద ఎలక్ట్రానిక్ షాపు ముందాగింది.

ఆటోకి డబ్బులిచ్చి ఇద్దరూ ఆ షాపులోకి అడుగుపెట్టారు. ఏ.సి గాలి మొహానికి తగలగానే ప్రాణం లేచొచ్చింది అమ్మాజీకి. పేరుకి రాజమండ్రిలో అన్ని సంవత్సరాల నుండి వుంటుందే కానీ అలాంటి షాపు ఎన్నడూ చూడలేదు. అక్కడ మనుషుల్ని చూడగానే తన వాటం చూసుకుని సిగ్గుపడుతూ బెరుగ్గా మహా వెంట నడిచింది.

మహా అనేక వస్తువుల్ని చూస్తూ కంపెనీ పేర్లని బట్టి వివరాలు తెలుసుకుంటూ కేటలాగులు చూస్తుంటే అమ్మాజీకి ఆశ్చర్యంగా అనిపించింది. తమ దగ్గర వున్న మహా ఈమె కాదనిపిస్తున్నది మహా ఇంగ్లీషులో మాట్లాడుతుంటే.

మహా చివరికి ఒక కంప్యూటర్, ఒక మ్యూజిక్ సిస్టం... ఇంకా కొన్ని వస్తువులు కొని బిల్ చేయించింది. వాళ్ళు అవి ఇంటికి తెచ్చి ఫిక్స్ చేయడానికి ఎడ్రస్ తీసుకున్నారు.

ఇద్దరూ బయటకి వచ్చి ఆటో ఎక్కి మరో బట్టల షాపుకెళ్ళారు.

అది భజన్‌లాల్ బట్టల షాపే.

"ఇది భజన్‌లాల్ దండి. అడిగో ఆయన" అంది అమ్మాజీ గుసగుసగా.

భజన్‌లాల్ అమ్మాజీని గుర్తుపట్టేసాడు. ఆ వెంటనే మహా వంక చూసాడు. ఆ అమ్మాయెవరో అతనికి తెలియలేదు.

అమ్మాజీ అతనికి నమస్కారం పెట్టింది.

"ఏం కావాలి?" అనడిగాడు భజన్‌లాల్.

"నాక్కాదండి. ఈ పాపగారికి. ఊరికే ఆరికూడ...సాయానికి" అంది అమ్మాజీ సిగ్గుగా.

మహా చెప్పింది.

భజన్‌లాల్ ఆమెను కర్టెన్స్ వింగ్‌కి తీసుకెళ్ళాడు.

ప్లెజంట్‌గా వుండే పల్చని తెరలు కిటికీలకి, అదే షేడ్‌లో వున్న కొంచెం దళసరి తెరలు గుమ్మాలకి కొన్నది. మహా. అలానే కొన్ని టవల్స్, నేప్‌కిన్స్, బెడ్ షీట్స్ తీసుకుంది.

చివరికి చీరల వింగ్‌లో కెళ్ళింది మహా.

"చీరలెందుకండి? మీరు కట్టరు కదా!" అని సందేహంగా అడిగింది అమ్మాజీ గుసగుసగా.

"ష్!" అంది మహా.

రెండు నేత చీరలు, మరి రెండు సిల్కు చీరలు. చివరిలో ఒకటి రెండు కొద్దిపాటి జరీవున్న వెంకటగిరి చీరలు తీసుకుంటూ "చూడమ్మాజీ.. వీటిని అమ్మాణమ్మగారు కడతారా?" అనడిగింది.

"అమ్మాజీ ఆశ్చర్యపోతూ చూసి అమ్మాణమ్మగారికా? కడతారండి. అచ్చు ఇలాటియ్యే వున్నాయావిడకి. పాపం పాతయ్యియిపోయాయి" అంది అమ్మాజీ విచారంగా.

చివరిగా రెండు వాయిల్ చీరలు తీసుకుని వాటి మీదకి బ్లౌజ్ పీసెస్ తీసుకుంది మహా.

"ఇవన్నీ మీరు తీసుకెళ్ళగలరా ఇంటికి పంపించనా?" అనడిగాడు భజన్‌లాల్ ఎడ్రస్ అడుగుతూ.

ఆమె చెప్పిన అడ్రస్ వినేసరికి అతను ఆశ్చర్యంగా చూస్తూ "ఏంటి? మా యింటికా?" అన్నాడు తెల్లబోతూ.

"అవునండీ.. మీరాబాయిగోరి పోర్షన్‌లోకి ఈరే వస్తన్నది" అంది అమ్మాజీ ఉత్సాహంగా.

భజన్‌లాల్ మొహం వికసించింది.

"అవునా.. అయితే నేను పంపిస్తాను" అన్నాడు భజన్‌లాల్ నవ్వుతూ.

మహా మనీ పే చేసింది.

"చాలా సంతోషం. అమ్మ యిల్లు ఇప్పుడు కళకళలాడబోతోందన్నమాట. ఇంకేది కావాలన్నా మీరొక కాల్ చేస్తే చాలు మన షాపులో లేకపోయినా నేను వేరే షాపుల్నుండి పంపే ఏర్పాటు చేస్తాను" అంటూ విజిటింగ్ కార్డు యిచ్చి కూల్‌డ్రింక్స్ తెప్పించి ఇచ్చాడు.

కూల్‌డ్రింక్ తాగుతూ "నాకు ఫర్నీచర్ షాపేదన్నా వుంటే చెప్పండి" అనడిగింది మహా భజన్‌లాల్‌ని.

భజన్‌లాల్ సూచించిన మేరకి అక్కడికెళ్ళారు.

అలా తిరిగి తిరిగి అన్నీ కొనేసరికి ఇద్దరికీ ఆకలేసింది.

ఇద్దరూ ఎవరో సూచన మేరకి గోదావరొడ్డున వున్న మహాలక్ష్మి హోటల్‌కి వెళ్ళారు.

ఇద్దరూ లోనికెళ్తుండగా ఆ నలుగురూ అక్కడ నిలబడి వున్నారు మళ్ళీ.

వాళ్ళని చూసి బిగుసుకుపోయింది మహా మళ్ళీ.

"అక్కా" ఆ నలుగురు కోరస్‌లా పిలిచారు మహాని.

అమ్మాజీ వాళ్ళకేసి చూసి "ఏంటి పిచ్చేషాలేస్తన్నారా.. సుబ్బూకి తెలిసిందంటే ఒళ్ళు చీరేస్తాడు.. తొత్తుకొడుకుల్లారా!" అంది కోపంగా.

"అదికాదక్కా మమ్మల్ని క్షమించు. ఏదో బుద్ధిగడ్డితిని.. మేం మారిపోయాం. మాకేదన్నా పనిప్పించక్కా. ఆకలేస్తంది అన్నం తిని రెండ్రోజులయ్యింది" అన్నారు జాలిగా.

"ఛీ, ఎదవల్లారా! అన్నీ అబద్ధాలు" అంది అమ్మాజీ కోపంగా.

మహా మాత్రం మెత్తబడిపోయింది.

ఎవరైనా అన్నం తినలేదంటే మహా ప్రాణం ఉసూరు మంటుంది.

"మీరు నిజంగానే మారారా?" అనడిగింది.

"ఒట్టు, పెమాణకం అక్కా. లేకపోతే సుబ్బూ అన్నకి చెప్పి తోలు తీయించేయ్" అన్నారు వాళ్ళు.

"సరే.. లోపలికి రండి" అంటూ రెస్టారెంటులోకి నడిచింది మహా. ఆమెతోపాటూ వాళ్ళూ.

హోటల్ బాగా నచ్చింది మహాకి.

చుట్టూ కిటికీల్లోంచి కనిపిస్తున్న గోదావరి.

అందరూ భోంచేసాక బయటకి వచ్చారు.

"ఇంకెళ్ళండి" అంది అమ్మాజీ వాళ్ళని.

"మాకేదన్నా పని" అన్నారు నసుగుతూ.

"సాయింత్రం ఇంటికి రండి" అని చెప్పింది మహా.

వాళ్ళు సంతోషంగా వెళ్ళిపోయారు.

"మళ్ళీ వాళ్ళెందుకు?" అనడిగింది అమ్మాజీ.

"ఇంట్లో అన్నీ సర్దిస్తాను. వాళ్ళకి పని యిప్పించినట్లవుతుంది" అంది మహా.

పేల దువ్వెనతోపాటూ మహా యిచ్చిన పాకెట్ చూసి తెల్లబోయింది పాపాయమ్మ.

"ఏటిది?" అనడిగింది ఆశ్చర్యంగా.

"నువ్వే చూడు మామ్మా" అంది అమ్మాజీ.

"పేకెట్లోంచి చీరలు తీసి ఏంటివి?" అని ఇంకా ఆశ్చర్యంగా అడిగింది పాపాయమ్మ.

"చీరలు నీకే పాపగారు కొన్నారు"

ముదురు ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లో వున్న ఆ చీరల్ని చూసి కళ్ళనీళ్ళు కార్చింది పాపాయమ్మ.

"ఏటమ్మా.. నువ్వు నాకు కొన్నావా నేనేటి సేసేనని. నాయమ్మో.. నాయమ్మో" అంది ముక్కు, కళ్ళూ తుడుచుకుంటూ

"మీ చీరలు పాతవిగా అయిపోయాయికదా.. మామ్మా ఇవి కట్టుకోండి. నేను తెచ్చానని ఏమీ పొరబాటుగా అనుకోకండి" అంది మహా చిరునవ్వుతో.

"అయ్యో నా మొహానికి అనుకోటమా.? కట్టుకున్నోడు ఏనాడో ఎల్లిపోయాడు. అన్నం పెట్టాల్సిన ఎదవ బొడ్లో డబ్బులు ఎత్తుకుపోయి ఎదవవేషాలేస్తన్నాడు. నేనొంగలేనుగాని చిన్నదానివయినా కాళ్ళకి దణ్ణవెట్టాలనిపిస్తన్నది తల్లీ" అంటూ మళ్ళీ ఏడ్చింది పాపాయమ్మ.

"అంతమాటొద్దు మామ్మా. మీరు నాక్కూడా మామ్మేకదా అంది.

పాపాయమ్మ తన గరుకు చేతుల్తో మహ బుగ్గలు పుణికింది.

ఇద్దరూ గదిలోకెళ్ళాక మహ మంచమ్మీద ఎగిరిదూకి పడుకుని సుబ్బా వచ్చేలోగా మనం ఆ యింట్లోకి వెళ్ళిపోయి అతన్ని సర్ప్రయిజ్ చేసేయాలి. ఈలోపున అమ్మాణమ్మగారికీ చీరలిచ్చి "ఆవిడ సంగతి చూడు" అంది.

"అవునండి. ఏటి తిన్నారో.. చూసొస్తా" అంది అమ్మాజీ అమ్మాణమ్మగారి చీరల పేకెట్టు తీసుకుంటూ.

"ఇదిగో ఇది కూడా తీసుకో. ఈ సిల్కు చీరలు నీవి" అంది మహ.

"అవునాండీ. నాక్కూడా కొన్నారా! ఇంతోటి మంచివి" అంటూ మురిసిపోయింది అమ్మాజీ.

"ఈ వాయిల్ చీరలు ఆవిడెవరూ అదే ఉమ్మడి సీతవి" అంది మహ

అమ్మాజీ అవి తీసుకుని వెళ్ళగానే ఏదో పెద్ద రిలీఫ్ దొరికినట్లు ఆనందంగా పడుకుని నిద్రపోయింది మహ.

అనుకున్న దానికన్నా మరో రెండురోజులు ఎక్కువగానే పట్టింది సుబ్బాకి.

కారణం యానాంలో వుండే ఎస్తేరు రాజు" మొత్తం అంతా తీర్చేస్తాను, ఆగమ"ని చెప్పడమే. అతనికి ఫ్రెంచి గవర్నమెంటు నుండి రావాల్సిన డబ్బులేవో అందేయట. నర్సాపూర్లో వుండే వాళ్ళ అమ్మ సువార్తమ్మ పెంతికోస్తు మతస్తురాలు. ఆవిడకి ప్రపంచమంతా ప్రభువే. పరుల సొమ్ము తింటే యెహోవా పై లోకాలకి అడుగుపెట్టనివ్వడని అప్పులు తీర్చేయమని మరీమరీ చెప్పిందట. అదీగాక ఎస్తేరు రాజుకీమధ్య ఏదో చర్మవ్యాధి సంక్రమించి చాలా బాధపడుతున్నాడట. దాంతో ఆయనకి కనువిప్పు కలిగి మొత్తం తీరుస్తానని చెప్పాడు కన్నీళ్ళతో.

ఆ మాట విని సుబ్బా చాలా సంతోషించాడు.

మన దేవుళ్ళు కూడా యిలానే చెబుతారు. కానీ ఎవరూ వినడంలేదు అని అనుకున్నాడు బాధగా.

ఆ డబ్బు తీసుకుని - మరికొన్ని చిల్లర వడ్డీలు వసూలు చేసుకుని వెళ్ళేటప్పుడు కన్నా మరింత ఆనందంతో తిరుగు ప్రయాణం పట్టి తిన్నగా కాళిదాసుగారిల్లే చేరుకున్నాడు - ఆ ఆనందాన్ని వెనువెంటనే ఆయనకి అందజేయాలని.

సుబ్బా బైక్ని గోడవార ఆపి బాగ్ తీసుకుని అరుగు మీద వాలు కుర్చీలో కూర్చుని చుట్ట కాలుస్తున్న కాళిదాసుగారికి "నమస్కారం సార్!" అని చెప్పి అరుగు పక్కన రాటకానుకుని కూర్చున్నాడు.

"నువ్వా... బండిమీనొస్తే ఎవరో ఏటో అనుకున్నాను బండెక్కడిది?" అన్నాడు కాళిదాసు ఆరాగా.

"అదంతా తర్వాత చెబుతాను కానీ ముందమ్మగార్ని పిలవండి" అన్నాడు సుబ్బా హుషారుగా.

"ఏటమ్మగారితో పని? ఇక్కడరుగు మీన నేను మడిసిలా కనబడ్డంలేదా?" అన్నాడు కాళిదాసు చిరుకోపంగా.

"ఎందుక్కనబడ్డం లేదండి. మా బాగా ఆన్తన్నారు. నేను జరిగిన సంగతి రెండుసార్లు చెప్పలేను. అందుకని" అన్నాడు అంతకన్నా మొండిగా.

"ఇదిగో ఈడొచ్చాడు ఒకసారి ఇలా తగలడు" అన్నాడు కాళిదాసు స్టీమింజను రైలు కేకలా గావుపెట్టి.

సత్యవతి బయటకొచ్చి "నువ్వటా.. ఏంటి పొద్దునే దిగడ్డావు? ఏంటి కత?" అంది.

"చాలావుందండి. చీకట్నే యానాం నుండి ఏకాయెకీ మీ దగ్గరకే వచ్చేసానండి. కాఫీ కూడా తాగలేదు. బండి మధ్యలో ఆపితే కేష్ పోతుందని" అన్నాడు సుబ్బూ.

"ఏంటీ? కాషా?" అంటూ తెల్లబోతూ అడిగాడు కాళిదాసు.

"అవును. అంతా చెబుతాను. లోపలికి నడవండి. అరుగు మీద డిస్కషన్ వద్దు" అన్నాడు సుబ్బూ పెద్దరికంగా.

కేష్ అనగానే ఆయనకి ప్రాణం లేచొచ్చింది.

వాలు కుర్చీలోంచి లేవలేక అవస్థపడుతుంటే సుబ్బూ లేవదీసి "లేవడం తెలిస్తేనే కూచోవాలండీ" అన్నాడు నవ్వుతూ.

"అది తెలుస్తే బంగారంలాంటి పొలవమ్మి ముదనష్టపు వడ్డీలకెందుకిస్తారూ!?" అంటూ రాగం తీసింది సత్యవతి వెనుకనుండి. ఆ మాటకి కళ్ళురిమాడు కాళిదాసు.

"ఆడొస్తే చాలు పెచ్చిపోతావు. ఒకటిచ్చానంటే యెల్లి చెవిటిలంకలో పడతావు"

చెవిటిలంక సత్యవతి పుట్టినూరు. రాజమండ్రి దగ్గర్లో వుంటుంది.

"ఆ పని చెయ్యండి. సుకంగా వుంటది నా పేనం" అంది సత్యవతి విసురుగా.

"మీకో మంచివార్త తెస్తే ఇప్పుడు కూడా కొట్లాటేనా రండి రండి" అంటూ యింట్లోకి దారి తీసాడు సుబ్బూ.

వాళ్ళు కూర్చోగానే తన బాగ్‌లోంచి మూటగట్టిన డబ్బు తీసి వాళ్ళకందించి "లెక్క జూసుకోండి" అన్నాడు.

డబ్బు చూడగానే ఆ యిద్దరి కళ్ళలో మెరుపులు మెరిసాయి.

"ఏట్రా యిదంతా. బాగానే వసూలు చేసావ్" అన్నాడు కాళిదాసు మురిపెంగా.

సుబ్బూ కొంచెం గర్వంగా కాలరెగరేసి "మరేంటనుకున్నారు సుబ్బూ అంటే" అని జరిగిందంతా చెప్పాడు.

"మొత్తం పదిలక్షలు. అందులో ఏడులక్షల పదమూడు వేలు ఎస్తేరు రాజుగారివి. మిగతాది కాకినాడ్లో వసూలు చేసిన చిల్లర వడ్డీలు. అవధాన్లుగారు కూడ వచ్చేనెల అంతా యిచ్చేస్తానన్నారు. ఆళ్ళబ్బాయికి అమెరికాలో వుద్యోగమొచ్చిందట."

బదులుగా వాళ్ళిద్దరి కళ్ళూ చెమర్చాయి. ఆనందంతో.

"నీ రుణం తీర్చుకోలేనురా! ఆ ఎస్తేరు రాజువి రావనుకున్నాను" అన్నాడు కాళిదాసు గద్గదమైన గొంతుతో

"సర్లెండి. ఈ డబ్బంతా అమ్మగారికిచ్చేయండి. మళ్ళీ ఏ సన్నాసులకీ యివ్వకండి. తిరిగి రావు" అన్నాడు.

ఆ పాటికే సత్యవతి మూట యింట్లోకి తీసుకుపోయింది.

"అలాగేలేరా" అన్నాడు కాళిదాసు నవ్వుతూ.

సత్యవతి వస్తూ యిద్దరికీ ఇడ్లీ, కారప్పొడి తెచ్చి యిచ్చి "ఇంక ఆయన చేతికిస్తానేంట్రా" అంటూ.

సుబ్బూ, కాళిదాసు టిఫిన్ తింటుంటే మళ్ళీ ఫిల్టర్ కాఫీ పట్టుకొచ్చి వాళ్ళకిచ్చి తనూ గడపెక్కి కూర్చుంది సత్యవతి.

"అవునూ అంతా లోనికట్టుకెల్లిపోయావేంటీ? ఆడికేవీ యివ్వవా?" అన్నాడు కాళిదాసు.

"వద్దులెండి. బండి తీసుకున్నాను" అన్నాడు సుబ్బు.

"అవునా వచ్చిన కాణ్ణించి అడుగుదావనుకుంటున్నా. ఆబండెక్కడిదిరా?" అన్నాడు కాళిదాసు.

"ఆ మాస్టారుగారు లేరండీ. ఆయన కొడుకుదంట. ఊరికే పడి తుప్పట్టిపోతోందని నాకిచ్చారు."

"అంటే అప్పు కింద ఆ బండి జమేసాడా?"

"ఏదో ఒకటి. చావబోతుంటే అడ్డం పడ్డాను. కావాలంటే తీసుకోండి. పాతికో పరకో జీళ్ళొస్తాయి. చీక్కుంటూ కూర్చుందురిగాని" అన్నాడు సుబ్బా నిష్ఠూరంగా.

"ఆయన మాటలకేంటి. ఇప్పుడాయన అదెక్కి వూరేగుతాడా? మా నాన్న పెళ్ళికిచ్చిన రేలీ సైకిలే తొక్కలేక పట్టుకు తిరుగుతుంటే నాకు సిగ్గేసి మా తమ్ముడికిచ్చేసా. అదుండబట్టేగా ఆడు యానం ఎల్లి ఇంత డబ్బట్టుకొచ్చాడు. సిగ్గుండాలి" అంది సత్యవతి ఈసడింపుగా.

"ఇప్పుడు నేనేవన్నాని. ఏనాటి సంగతులో అరికతలా ఆడికి పాడి యనిపిస్తున్నావు! ముందాడికి ఎంతో కొంత యివ్వు" అన్నాడు కాళిదాసు అసహనంగా.

సత్యవతి పదివేలు తెచ్చి "చాలా?" అనడిగింది.

సుబ్బా వాటినందుకుని "చాలండి. వస్తా. డబ్బు జాగ్రత్తండి. వెంటనే బాంకులో జమ చేసుకోండి" అని రివ్వున బైక్‌మీద ఇంటిదారి పట్టాడు.

❦❦❦

"వచ్చావా ఆళ్ళు పైకెల్లిపోయార్రా. పైకెల్లు" అంది పాపాయమ్మ దోసెలేస్తూ సుబ్బాని చూసి.

"నాకు దోసెలు పంపు మామ్మా బాగా ఆకలేస్తోంది" అంటూ పైకెళ్ళాడు సుబ్బా.

మహా తలుపు తియ్యగానే అతను ఆశ్చర్యపోయాడు.

"తను సరిగ్గానే వచ్చాడా?" అని తెల్లబోయి ఇంటిని పరికించి చూశాడు.

కిటికీలకి లేత నీలం రంగులో గాలికి ఊగుతున్న పరదాలు, కిటికీలపై అందంగా అమర్చిన లేత నీలం రంగు చిత్రాలు, కొత్త కుర్చీలు ఎదురుగా టేబుల్ మీద అమర్చిన కంప్యూటర్, కొత్త మంచాలు, కొత్త పరుపులు వాటిపై అందమైన బెడ్‌స్ప్రెడ్స్.."

"ఏంటిదంతా?" అన్నాడు కొంత ఆశ్చర్యంగా, మరికొంత అసహనంగా సుబ్బా.

"ముందు బాగుందా? లేదా? చెప్పు"

"బాగోకేం చేస్తుంది. ఇంత డబ్బెక్కడిది?"

"నాదే. బాగోలేదా?"

"ఇన్ని సుఖాలు అవసరమా! ఏదో టాయిలెట్ కోసం నువ్వు అవస్థపడుతున్నావని తీసుకుంటే మరీ యిలా వేస్టు చేస్తావా? నాకిష్టం లేదసలు" అన్నాడు సుబ్బా కోపంగా.

మహా వెళ్ళి అతని రెండు భుజాలూ చేతులేసి పట్టుకుని "మైడియర్ మొద్దు సుబ్బా! డబ్బు లేనప్పుడు అప్పులు చేస్తే తప్పు. ఇది నా డబ్బే. మనం వున్న చోట చిన్న చిన్న కంఫర్ట్స్ ఏర్పరచుకోవడం వేస్టుకాదు. చుట్టూ చూడు. గోదారి.. ఇప్పుడు ఆ నీలి తెరల్లోంచి మరింత అందంగా. ఈ కుర్చీలు మరీ ఖరీదైనవేం కావు. ఆ పక్కలు మనకి రోగాలు రాకుండా నీట్‌గా పడుకోడానికి. ఇంత చిన్నవి కూడా వదులుకోవడం దేనికి చెప్పు"

సుబ్బా ఆమె మాటలు వినడం లేదు. తన భుజాల్ని పట్టుకున్న ఆమె మృదువయిన చేతులు అతన్ని గాలిలో తేలుస్తున్నాయి. ఆ స్పర్శ మనోహరంగా వుంది. అసలే డబ్బు వసూలు చేసి కాళిదాసుగారికిచ్చిన ఆనందంతో వున్నాడతను.

సరిగ్గా అప్పుడే అమ్మాజీ పాపాయమ్మ యిచ్చిన దోసెలు తీసుకుని లోపలికి వచ్చింది.

వస్తూనే ఆ సన్నివేశం చూసి కొంచెం సిగ్గుపడి నవ్వుతూ "ఇదిగో అన్నా టిఫిను - మళ్ళీ వస్తా" అని వెళ్ళబోయింది.

"చూడు అమ్మాజీ, ఇవన్నీ కొన్నానని సుబ్బూ చిరాకుపడుతున్నాడు" అంది మహా గోముగా.

అమ్మాజీ నవ్వింది.

"అదసరే.. అమ్మాణమ్మగారెలా వున్నారూ?" అనడిగాడు సుబ్బూ.

"అదే బాగు.. ఆ గదిలో" అంది అమ్మాజీ విచారంగా.

"సుబ్బూ..."

మహావైపు ఏవిటన్నట్లుగా చూశాడు సుబ్బూ.

"నా మాట వింటానంటే.. చెబుతాను."

"ముందు చెప్పు"

"మనం ఖాళీ చేసిన గదిలోకి అమ్మాణమ్మ గారిని, అమ్మాజీని షిఫ్ట్ చేసి ఆ రెండు పోర్షనులు వేరే అద్దెకిచ్చేయి. ఆ గదికి ఒక కిటికీ వుంది. గాలి, వెలుతురూ లేక ఆ మూలగదిలో ఆమె మరీ సిక్ అయిపోతున్నారు. అమ్మాజీకి మాత్రం వచ్చేపోయే వారెవరున్నారూ! ఆవిణ్ణి కనిపెట్టుకుని వుంటుంది" అంది మహా సుబ్బూ మొహంలోకి గుచ్చి చూస్తూ.

ఆమె ఆలోచనకి సుబ్బూ విస్తుపోయాడు.

ఒక డబ్బున్న ఆడపిల్ల అతి త్వరలోనే అక్కడి స్థితిగతులు అర్థం చేసుకుని సహాయపడాలనుకోవడం అతనికి చాలా నచ్చింది. ఆడపిల్లలు మానసికంగా చాలా త్వరగా ఎదిగిపోతారు. చివరికి అదే మనసుతో మగవాడి చేతిలో ఓడిపోతారు.

సుబ్బూ అమ్మాజీ వైపు ప్రశార్థకంగా చూశాడు.

"నాకే ఇబ్బందీ లేదన్నా. ఇంతవండి పెడతాను ఆవిడకి. కన్నతల్లిలాంటిది. నాకు మాత్రం ఎవరున్నారూ?" అంది అమ్మాజీ.

"సరే కానివ్వండి. ఇందులో కాదనడానికేముంది?" అన్నాడు సుబ్బూ స్నానానికెళ్ళిపోతూ.

అతను బాత్రూంలోకి వెళ్ళగానే అమ్మాజీ మహాని కౌగలించుకుంది.

"మీరు చాలా మంచోరు పాపగారూ" అంటూ ఆనందంగా.

మహాకి చాలా తృప్తిగా, సంతోషంగా వుంది సుబ్బూని ఒప్పించినందుకు.

సుబ్బూ స్నానం చేసి వచ్చి "సాయింత్రం రెడీగా వుండు. నిన్నో చోటికి తీసుకెళ్తాను. అక్కడ మాత్రం నువ్వు నీ డబ్బులు తియ్యకూడదు" అంటూ టిఫిన్ తిని బయటకి వెళ్ళిపోతుంటే ఆశ్చర్యంగా చూశారు మహా, అమ్మాజీలు.

**బైక్ ఆ** సాయంత్రం వెంకటాపురం మీదుగా కడియం వైపు సాగుతోంది. గోదావరి పిల్లగాలి మొహానికి తగులుతుంటే సుబ్బూ బైక్‌ని మెల్లిగా నడుపుతున్నాడు. విశాలమైన గోదావరి చిన్న సముద్రంలా తోడొస్తుంది - కొన్ని చోట్ల దగ్గరవుతూ మరికొన్ని చోట్ల దూరమవుతూ. తీరమంతా పెనవేసుకుని గుంపులు గుంపులుగా వున్న కొబ్బరి చెట్లు గాలికి సుతారంగా కదులుతున్నాయి. పైన నీలాకాశం, ఆకుపచ్చని పరిసరాలు కలిసి నది కలనేతగా మెరుస్తోంది.

బైక్ వెనుక కూర్చున్న మహా ఆ సౌందర్యాన్నంతా వింతగా సంతోషంగా చూస్తోంది. మహదానంద పడిపోతోంది.

"సుబ్బూ, సుబ్బూ, ఇక్కడ ఆపవూ గోదావరి మన దగ్గరగా వచ్చేసింది. భలేగుంది" అంది ఎగురుతున్న చున్నీని పట్టుకుంటూ.

ఎగురుతున్న క్రాఫ్ సరిచేసుకుంటూ సుబ్బూ నవ్వాడు.

"గోదారి మన దగ్గరకి రాలేదు - మనమే గోదారి దగ్గరగా వచ్చాం"

"ఏదో ఒకటి. ఇక్కడ ఆపు"

"ఆగితే మనం వెళ్ళే చోటుకి చీకటి పడుతుంది. మళ్ళీ తీసుకొస్తాగాని యిప్పుడు అలా చూడు చాలు"

"మహా బుంగమూతి పెట్టి నువ్వెప్పుడు అంతే" అంది కోపంగా.

సుబ్బా నవ్వాడు.

మహా అప్పుడప్పుడూ ఎగుడు దిగుళ్ళలో అతనికి తగులుతుంది. ఆ స్పర్శ గమ్మత్తుగా వుంది. నరాల్లో ఏదో ఉద్విగ్నత.

కానీ వెంటనే గుర్తొస్తుంది. ఆ అమ్మాయి ఎవర్నో ప్రేమించిందన్న సంగతి.

వెంటనే పోటుకి గురయిన సముద్రంలా అతని మనసు చప్పబడి పోతుంది.

కాలేజీలో అతను అల్లరి పిల్లోడే అమ్మాయిల్ని ఆట పట్టించినవాడే కానీ ఎప్పుడూ ఎవర్నీ తాకలేదు. అసలే అమ్మాయిని చూసినా ఆ భావం కలిగేది కాదు.

అమ్మాయిలు వినయంగా, రిజర్వ్‌డ్‌గా వుంటే అబ్బాయిలకి ఆకర్షణ కలుగుతుందన్న విషయం చాలామంది అమ్మాయిలకి తెలియదు. విపరీతమైన అలంకరణ, తెగించినట్లు జవాబులు చెప్పడం, సెల్ ఫోనుల్లోనే జీవితాలు గడపడం - అల్లరి పెట్టడానికే పనికొస్తాయి గాని ప్రేమకి కాదు.

కానీ ఈ లోపున చాలా తమాషాలూ, అదే టైములో అనర్థాలూ జరిగిపోతుంటాయి. అందుకే సుబ్బా వాటి జోలికి పోలేదు.

ఇప్పుడేంటో మహా సాన్నిత్యం అతని మనసు కొత్తరాగాలు పలికిస్తోంది.

మహా మాత్రం ఇదేం పట్టించుకోకుండా పరిసరాల్ని చూస్తోంది.

ఇంతలోనే ఒక మహాద్భుత నందనవనం ఆమె కళ్ళకి సాక్షాత్కరించింది.

ఒక్కసారిగా లెక్కలేనన్ని రకరకాల చెట్లు, పూలు కనుచూపుమేరంతా పరచుకుని కనిపించాయి.

"సుబ్బా... ఏంటిదంతా?" అంటూ కెవ్వున అరచింది.

సుబ్బా ఒక చోట బైక్ ఆపి "దిగు, చెబుతా!" అన్నాడు.

మహా దూకినట్లు బైక్ దిగింది.

"పద. ఇదే కడియం. ఇవన్నీ నర్సరీలు" అన్నాడు సుబ్బా బైక్‌కి తాళం వేసి ముందుకి నడుస్తూ.

"అబ్బా, ఏమిటి ఇవి నర్సరీలా నందనవనాలా? ఏ కాశ్మీరుకో వచ్చినట్లుంది" అంది ఎగిరి గంతేస్తూ.

"ఇక్కడ నుండి దేశవిదేశాలకి కూడా మొక్కలు ఎగుమతి అవుతాయి"

మహా సంబరపడిపోతూ నర్సరీలో ప్రవేశించింది.

రకరకాల పేరు తెలియని పూలచెట్లు, ఇండోర్ ప్లాంట్స్ పళ్ళ చెట్లు చూసి పరుగులు పెడుతోంది మహా.

ఆమెనలా వెళ్ళనిచ్చి "మాకు కొన్ని టెర్రస్ మీద పెరిగే మొక్కలు కావాలి" అనడిగాడు నర్సరీ చూస్తున్న వ్యక్తిని.

అతను కొన్ని ఎంపిక చేసి చూపించాడు.

ఇంతలో మహా వచ్చి మరి కొన్ని సెలక్ట్ చేసింది.

అతనే వాటిని తొట్టెల్లో మట్టివేసి నాటాడు.

సుబ్బూ బిల్ పే చేసాక "నేను ట్రాలీలో పంపిస్తాను ఇంటికి. పదిహేనురోజుల కొకసారి మా మాలి వచ్చి మందులు వేసి సరిచేస్తాడు" అని చెప్పాడతను.

సుబ్బూ ఎడ్రస్ ఇచ్చాడు.

మహా మహదానందపడిపోయి "థాంక్యూ సుబ్బూ, థాంక్ యూ" అంది షేక్ హాండ్ ఇస్తూ.

సుబ్బూ మహా కళ్ళలో ఆనందం చూసి నవ్వుకున్నాడు.

ఇద్దరూ ఇంటికి తిరిగిరాగానే గుమ్మంలో కూర్చున్న పాపాయమ్మ అడిగింది "ఎటా ఎక్కడికెళ్లేరూ?" అంటూ.

"అలా బృందావనానికి ఎల్లొచ్చేవే మామ్మా" అన్నాడు సుబ్బూ మెట్లెక్కుతూ.

పాపాయమ్మ మహా వైపు చూసింది ఆరాగా.

"అవును మామ్మా.. నిజంగా. ఎన్ని చెట్లు.. ఎన్ని పూలు. ఎంత బాగుందో. నువ్వెప్పుడన్నా చూశావా?" అంది.

పాపాయమ్మ అర్థంకాక చిరాగ్గా బుర్ర గోక్కుంది.

అంతలోనే ట్రాలీ గుమ్మంలో ఆగింది.

మాలి మొక్కలు దించుతుంటే వాటిని చూసి అప్పుడర్థమైంది పాపాయమ్మకి.

"ఓసి మీరెల్లింది కడియానికా? మరామాట చెప్పక బుందావనాలూ... నందనఅనాలు అంటే నాకేంటి తెలుస్తది" అంది.

విరగబడి పూసిన పూలతో ఒరిగిపోయిన పూల తొట్టెలు పైకెళ్తుంటే రామక్రిష్ణ తొంగి చూసి "ఏటింక, పైన సూటింగులూ, డూయట్లూనా?" అన్నాడు వెటకారంగా.

పాపాయమ్మ చేతిలో వున్న దువ్వెనతో రామక్రిష్ణ కాలిమీద కొట్టి "ఆ వాగుడు మాను. ఇన్నాడంటే ఇప్పుడిక్కడే మొదలయ్యేది పయిటింగ్ సీను." అంది కోపంగా.

"అది సరేగాని నేను తెచ్చిన బియ్యం రోజు రోజు తగ్గిపోతున్నాయి. మీరు నా బియ్యం దోసెలకి పోసేసుకుంటున్నారా?" అని సర్రున వచ్చి కోపంగా అడిగింది రామక్రిష్ణ భార్య లత.

"అమ్మ నీ జిమ్మడిపోనో! నేను తెల్ల కాడ్డుమీద తెచ్చుకున్న బియ్యం వాడుకుంటున్నా. నీ బియ్యం నేనెందుకు ముట్టుకుంటా! ఆసికాలాడతన్నావా నువ్వు" అంటూ రెచ్చిపోయింది పాపాయమ్మ.

"ఊరికే మాటలు తూలకండి. మీరు తియ్యకపోతే బియ్యం ఏవయిపోతాయి? ఇంకెవరికి కావాలి?" అంది లత అంతకంటే తీవ్రంగా.

పాపాయమ్మ అరికాలి మంట నెత్తికెక్కింది.

లేచి నిలబడి వున్న నాలుగుపాయలు ముడి చుట్టుకుంది.

కొంగు గట్టిగా దోపి "ఏటి, నీ కొంపలో పడి నాలుగు మెతుకులు తింటున్నానని దొంగతనాలు కడతావా? ఆడికి పనిలేదని. నేను కష్టపడి దోసెలేసి పాతికా పరకా యిస్తానే వున్నాను. అయినా సుప్పనాతి మాటలాడి సిరాకు తెప్పించేవో రోకలి బండతో బాది పెద్ద జైలు కెల్లిపోతాను. ఏటనుకుంటున్నావో.. ఏంటో!" అంటూ దాదాపు నాట్యమే చేసింది.

అప్పుడే ఆ చోద్యం చూద్దామని నాలుగు పోర్షను వాళ్ళూ గుమ్మాల్లో చేరారు.

లత కొంచెం వెనక్కి తగ్గింది.

కారణం పాపాయమ్మకి భయపడికాదు.

ఆమెకి పరువు కావాలి. అక్కడున్న పోర్షన్లలో చదువుకున్నదీ, ఉద్యోగం చేస్తున్నదీ తనేనని - తనకొక ప్రత్యేక మర్యాదా వుండాలన్నది ఆమె భావన.

అందుకే గొంతు పెంచదు వీలయినంతవరకు.

"మీరు అరచినంత మాత్రాన నిజం అబద్ధమయిపోదు. బియ్యం కాజేస్తున్నది మీరే. ఆ దొంగని పట్టుకుని తీరతాను" అని పాపాయమ్మకి వినిపించేలా అని లోపలికెళ్ళిపోయింది.

ఆ మాట విని పాపాయమ్మకి బి.పి పెరిగిపోయింది.

వెంటనే ఆమె దృష్టి మెల్లిగా జారుకుంటున్న రామక్రిష్ణ మీద పడింది. కోపంతో గుమ్మం మూలున్న చీపురుకట్ట రామక్రిష్ణ మీదకి విసిరేసి "ఎదవకానా నువ్వు పనీపాటా లేకుండా పడి తినబట్టికాదూ అదిన్ని మాటలంటందీ ఏవన్నా పౌరుసవుందరా వంట్లో" అంటూ చిందులేసింది.

"ఏటే, యిద్దరూ కలిసి నామీదడతన్నారూ.. నువ్వు తియ్యకపోతే బియ్యవేవయిపోతాయా? అది తెచ్చి అదే దొంగతనం సేస్తదా?" అన్నాడు రామక్రిష్ణ బయటకెళ్ళిపోతూ.

కొడుకు మాట వినగానే పాపాయమ్మ కోపం ఏడుపుగా మారిపోయి గుమ్మంలో కూలబడిపోయింది.

ఎంతమాటన్నావురా ఎదవకానా... నా మొగుడే వుంటే ఇంతింత మాటలనేవారా? ఒక్కముక్క సదువుకోకుండా ఏబ్రాసెదవలా తిరుగుతుంటే ఆ పనీ ఈ పనీ జేసి ఎద్దులా పోసించి వుంకో దున్నపోతును తెచ్చి పెళ్ళిచేసాను. సివరికి నాకు దొంగతనం కడతారా? మీ కళ్ళూ కాళ్ళూ వూడిపోనూ ఉండండి. నేనింక సచ్చిపోతా! ఇంతమాటన్నాకా నే బతకను. గోదాట్లో దూకేస్తా" అంటూ మళ్ళీ రయ్యిన లేచి వీధివేపు పరిగెట్టింది.

ఆ గొడవకి అమ్మాజీ పరిగెత్తుకొచ్చి పాపాయమ్మని గట్టిగా పట్టుకుని "ఏటా మాటలు, మామ్మా గోదారి తేరగా దొరికింది మాటిమాటికి దూకెయ్యడానికి. పద లోపలికి" అంది మందలిస్తున్నట్లుగా.

"నన్నట్టుకోకు. నేనింక దానిసేతి కూడు తినను. నన్నొదులు" అంటూ గింజుకుంది పాపాయమ్మ.

"పోనీ నా యింట్లోకి రా. కాసేపుంటే కోపాలు తగ్గుతాయి" అంది అమ్మాజీ పాపాయమ్మ గడ్డం పుచ్చుకుని.

"చూశారా ఆవిడ ఫార్సు. నేనన్నది చిన్నమాట. ఆవిడెంత డాన్సు చేస్తున్నదో" అంది లత వచ్చి అమ్మాజీతో.

"సిన్నమాట సిన్నమాటా! దొంగతనం కట్టి సతాసారిలా మాట్లాడతంది. తేలులా సటుక్కున కుట్టేసి నేను డాన్సు కడతన్నానంట" అని రొప్పింది పాపాయమ్మ.

"ఏంటి గొడవ, ఏమయ్యింది?"

సుబ్బు గొంతు విని చటుక్కున అందరూ తలలు లోపలికి లాక్కున్నారు.

"ఏం లేదులే అన్నా ఏదో ఇంటి గొడవ" అంది. అమ్మాజీ పై మెట్టుమీద నిలబడ్డ సుబ్బూని చూస్తూ.

"ఆవిడ పెద్దావిడ. బి.పి వుంది. ఎందుకావిణ్ణి బాధించడం?" అన్నాడు సుబ్బూ కోపంగా.

పాపాయమ్మ గడప మీద కూర్చుని వెక్కెక్కి ఏడుస్తోంది ముక్కు చీదుతూ.

"మామ్మా నీకే చెప్పేది. ఏంటి చిన్నపిల్లననుకుంటున్నావా? ఆ ఏడుపేంటి? ఏ పక్షవాతమన్నా వస్తే ఎవరూ మొహం చూడరు. అన్నం తిని పడుకో. ఆవిడకి అన్నం పెట్టండి" అని లోపలికెళ్ళాడు సుబ్బూ.

"అవును లతొౖదినా మామ్మ దొంగతనాలు చెయ్యదు. నిజమేంటో తెలుస్తాది నిదానంగా. మామ్మకి అన్నం పెట్టు అంది లతతో. సుబ్బూ గొంతు వింటేనే భయం లతకి.

ఆ దెబ్బకి మాట్లాడకుండా కంచంలో అన్నం పెట్టుకుని తెచ్చి అమ్మాజీ కిచ్చి వెళ్ళిపోయింది లత.

నేను తిననని మొరాయించిన పాపాయమ్మని బుజ్జగించి అన్నం తినిపించింది అమ్మాజీ ఎలానో.

తెలతెలవారుతుందన్న సంకేతంగా పక్షుల అరుపులు విని ఏదో గుర్తొచ్చిన దానిలా గబగబా లేచి టెర్రస్ మీదకి పరిగెత్తుకెళ్ళింది మహా.

తొలి సూర్యకిరణాల్లో టెర్రస్ మీద అమర్చిన మొక్కలన్నీ తళతళా మెరుస్తున్నాయి. పూలుగాలికి సయ్యాటలాడుతున్నాయి. గుత్తులు గుత్తులుగా గులాబీలు, రంగురంగుల మందారాలు, హైబ్రీడ్ బంతి, చామంతి పూలతో తోటంతా మెరుస్తుంటే పరవశంగా రెండు ఫైబర్ కుర్చీలు అక్కడ వేసి గబగబా 'సుబ్బూ, సుబ్బూ' అని కుదిపిలేపింది.

సుబ్బూ చిరాగ్గా కళ్ళు తెరచి "ఏవయ్యింది?" అన్నాడు.

"నువ్వొక సారి రమ్మంటే" అంటూ కంగారు పెట్టింది మహా.

సుబ్బూ కళ్ళు తెరచి బద్ధకంగానే లేచి మహాని అనుసరించాడు.

సుబ్బూని కుర్చీలో కూర్చోబెట్టి "చూడు పూలెంత అందంగా వున్నాయో! టెర్రస్ ఎంతందంగా వుందో కదా!" అంది మహా.

సుబ్బూ చుట్టూ చూశాడు. టెర్రస్ నిజంగానే చాలా అందంగా వుంది. మొక్కలతో. రకరకాల రంగుల పూలు రమణీయంగా మెరిసిపోతున్నాయి. దూరంగా నిశ్చల చిత్రంలా కనిపిస్తూ ప్రవహిస్తున్న గోదావరి.

"అవును అయితే ఏం చెయ్యాలిప్పుడు బంగారంలాంటి నిద్ర చెడగొట్టేసావ్"

"ఎప్పుడూ పోయే నిద్రే మొద్దూ! ఇంతందమెప్పుడయినా చూశావా?" అంది మహా.

సుబ్బూ ఆమె వైపు చిత్రంగా చూశాడు.

సంతోషంగా వున్నప్పుడు నోరు జారుతుంటుంది మహా.

"అద్సరే. ఎప్పుడూ ఈ షోకులేనా.. ఏదో ఇంజనీరింగ్ చేసేనన్నావుకదా.. ఉద్యోగం చెయ్యకూడదూ! కాలక్షేపంగా వుంటుంది" అన్నాడు సుబ్బూ.

బదులుగా సుబ్బూవైపదోలా చూసింది.

"నేనేమన్నా తప్పుగా మాట్లాడేనా?"

తల అడ్డంగా వూపింది మహా.

"మరి?"

మహా తలదించుకుని "డిగ్రీ పూర్తి చెయ్యలేదు" అంది గొణిగినట్లుగా

"ఏం?"

మళ్ళీ మౌనం వహించింది మహా.

"నీ లా ఎఫైర్‌లో పడి వదిలేసావా?"

"ఏంకాదు"

"సర్లే. నువ్వెందుకొదిలేస్తే నాకేంటిగాని. ఇప్పుడయినా పూర్తిచెయ్యొచ్చేమో కదా" అన్నాడు సుబ్బు.

సరిగ్గా అప్పుడే అమ్మాజీ వచ్చింది కాఫీ కలపడానికి.

"గుడ్‌మార్నింగన్నా.. అప్పుడే లేచిపోయావేంటీరోజు" అని నవ్వుతూ.

"ఇదిగో ఈ మహాతల్లి లేపేసింది కొంపంటుకున్నట్లు. తీరా చూస్తే ఈ మొక్కలు చూడటానికంట" అన్నాడు సుబ్బు వెటకారంగా.

అమ్మాజీ కళ్ళు మెరిసాయి మొక్కలు చూసి.

"అబ్బా.. నిజంగానే ఎంతబాగున్నాయో అన్నా. ఇంటికందం వచ్చేసింది" అంది ఆనందంగా.

"సర్లే ముందెళ్ళి కాఫీ కలుపు" అంటూ బాత్రూం వైపు వెళ్ళాడు సుబ్బు.

అమ్మాజీ వంటగదిలో కెళ్ళింది. పైభాగంలో కొచ్చిందగ్గర్నుండి అమ్మాజీయే వచ్చి ఫిల్టరేసి కాఫీ పెడుతుంది.

సుబ్బా వచ్చేసరికి కాఫీ రెడీ చేసింది.

ముగ్గురూ కూర్చుని కాఫీ తాగుతుంటే "చదువెలాగూ లేదు వంటన్నా నేర్చుకో" అన్నాడు సుబ్బా మహా వైపు చూస్తూ.

"ఛ! పాపగారేం వంట చేస్తారన్నా. నేనున్నాగా ఎంతసేపు చేస్తా" అంది అమ్మాజీ.

"చదువు పూర్తిచేయమనే చెబుతున్నా" అంటూ క్రీగంట మహా వైపు చూశాడు సుబ్బు.

"కుదరదన్నాను కదా!" మొండిగా జవాబిచ్చింది మహా.

"అదే. ఎందుకని అడుగుతున్నా?"

"అదే.. ఎందుకని.. ఇంట్రస్టు లేదా?"

"అదేం కాదు. డీబార్ చేసారు."

సుబ్బాకి ఒక్కసారి పొలమారి కాఫీ బట్టలమీద పడింది.

"డీబారా.."

"డీబారంటే తెలుసా?" కళ్ళు తిప్పి అడిగింది మహా.

"తెలుసు. ఎందుకు?"

"ఎందుకంటే.. ఎందుకంటే.. కాపీ కొడుతూ దొరికిపోయా" కళ్ళు చికిలించి సిగ్గుపడింది మహా.

వెంటనే షాక్ తిన్నట్లు బిగుసుకుపోయాడు సుబ్బా.

ఆవెంటనే అమాంతం కుర్చీలోంచి క్రింద కూలబడి "ఓరి దేవుడా.. నీకీ కళలు కూడా వున్నాయా తల్లీ! అంత బాగా చదివేదానివా?" అన్నాడు తలకొట్టుకుంటూ.

అమ్మాజీకి కూడా కొంత అర్థమయ్యింది.

ఆడపిల్ల అందులో కాపీ కొట్టడం. చాలా ఆశ్చర్యమనిపించింది అమ్మాజీకి.

"అదేం కాదు. నేను మెరిట్ స్టూడెంటుని" గోముగా చెప్పింది మహా.

"తల్లీ, కాస్త అర్థమయ్యేట్లు చెప్పు"

"అంటే ఫ్రెండ్స్‌తో బెట్ వేశా. ఇన్విజిలేటర్‌కి దొరక్కుండా చేస్తానని. కానీ ఆ రాస్కెల్ వుంది చూశావా. అది నా చేత బెట్ వేయించి మళ్ళీ చిన్నగా ఇన్విజిలేటర్‌కి చెప్పేసింది. అందుకని దొరికిపోయా. లేకపోతేనా?"

సుబ్బూ తలపట్టుకున్నాడు.

"మా మమ్మి మేనేజ్ చెయ్యగలదనుకో. కానీ డేడీ ఒప్పుకోలేదు. అందుకే చదువు మానేయాల్సొచ్చింది." అంది కాస్త బాధగా మహా.

"అవున్లే తల్లీ, మీలాంటి డబ్బున్న వాళ్ళకి చదువులెందుకులే" అంటూ అమ్మాజీ వైపు తిరిగి రాత్రి గొడవేంటి?" అనడిగాడు సుబ్బూ.

"ఏవుందిలే అన్నా మామూలే. పాపం పాపాయమ్మకి అన్నీ కష్టాలే. ఆ రామకిష్టగాడు మామూలే. ఆ రామకిష్టగాడు పనీపాటా చెయ్యడు. ఆ లతొదిన రోజూ యిన్ని బియ్యం అని తెచ్చి డబ్బాలో పోస్తుంది. అయ్యి తగ్గాయంట. పాపాయమ్మ మామ్మ దోసెలకి వాడేస్తుందని గొడవ. కానీ మామ్మ తెల్లకార్డు మీద బియ్యవే వాడతది. నేనేకదా పిండి రుబ్బేది నాకు తెలుసు." అంది అమ్మాజీ.

"రోజూ బియ్యం తెస్తుందా? అదేంటి?"

"ఏమో అన్నా... ఎందుకో మరి అలాగే రెండు మూడు కేజీలు తెస్తది."

సుబ్బూ మహా వైపు తిరిగి "చూశావా, నిజమైన కష్టాలు యిలా వుంటాయి. మీరు వూహించుకున్న కష్టాలు అలా వుంటాయి. వీళ్ళంతా బీదవాళ్ళే. చితికిపోయిన వాళ్ళే. కానీ లేకివాళ్ళు కాదు. వీళ్ళ కష్టాలకి కారణం మగవాళ్ళు పనిచేయకుండా తాగితందనాలాడటం ఆడవారు ఆర్థికంగా చిదికిపోయి రోడ్డున పడటం" అన్నాడు.

"నాకెందుకు చెబుతున్నావ్?" అంది కాస్త కోపంగా మహా.

"ఆలోచిస్తావని"

"మరి నువ్వు కూడా తాగుతున్నావుగా" అంది మహా సూటిగా.

మహా మాటకి తెల్లబోయినట్లు చూశాడామె వైపు.

అమ్మాజీ కూడా ఇబ్బందిగా యిద్దరివైపు చూసి "మళ్ళీ వస్తా అన్నా" అంటూ జారుకుంది అక్కడినుండి.

**టైము** పదకొండు గంటలవుతుండగా అమ్మాజీ శుభ్రంగా స్నానం చేసి వుతికిన చీర కట్టుకుని దారపుండలు, సగం అల్లిన లేసూ, సూదులూ తీసుకుని వచ్చి గోడవారగా చతికిలబడి "ఏం చేస్తన్నారండీ, కాఫీగానీ పెట్టిమ్మంటారా?" అంది చిరునవ్వుతో.

నెట్‌లో ఏదో చూస్తూ కూర్చున్న మహా వెనక్కు తిరిగి అదేం వద్దు కానీ "ఏంటవి?" అంది అమ్మాజీ చేతిలోని లేసుని, దారాల్ని చూస్తూ.

"లేసులండి" అంది అమ్మాజీ.

మహా వచ్చి అమ్మాజీ పట్టుకున్న లేసుల్ని చూస్తూ "ఇదంతా నువ్వే అల్లావా..భలేగా వుంది" అంది ఆశ్చర్యంగా.

అమ్మాజీ సిగ్గుగా నవ్వింది.

"నేనేం అల్లుతానండీ, మా అమ్మ ఇంకా బాగా అల్లేదండి." అంది తల్లిని తలచుకుని విచారంగా.

"ఇప్పుడెక్కడున్నారావిడ?"

"లేదండి. నా చిన్నతనానే చచ్చిపోయిందండి. టి.బి. బతికేం చేస్తదిలెండి. అన్నీ కష్టాలే" అంది అమ్మాజీ.

మహాకి నిన్న సుబ్బూ మాట్లాడిన మాటలు గుర్తొచ్చాయి.

"ఇక్కడివాళ్ళు బీదవాళ్ళేకానీ లేకివాళ్ళు కాదు."

అవును. తనొచ్చి ఇన్ని రోజులయింది. అమ్మాజీ తనకి అన్నివిధాలా తోడ్పాటుగా వుంటున్నది. కానీ తను ఆమె గురించి తెలుసుకునే ప్రయత్నమే చెయ్యలేదు. ఆమె ఒక్కతే వుంటుంది. ఆమె కోసం ఎవరూ రారు, పోరు. మెడలో పసుపుతాడులో మంగళసూత్రం వుంటుంది. మరి ఆమె భర్త ఎవరో ఇంతవరకూ కనపడలేదు.

''అమ్మాజీ!''

''ఏంటండీ?'' అమ్మాజీ చేతులు లాఘవంగా కదులుతూ లేసుని అల్లుతున్నాయి.

''నీకెవరూ లేరా?''

అమ్మాజీ తలెత్తి ఆశ్చర్యంగా మహావైపు చూసింది.

''ఎందుకలా అడిగారు?'' అంది తిరిగి.

''అంటే.. అంటే ఇలా అడిగానని ఏమీ అనుకోకు. నేను వచ్చాక నీకోసం ఎవరూ వచ్చినట్లు కనపడలేదు - అందుకని'' అంది అమ్మాజీ నవ్వుతూ. ఆ నవ్వులో విషాదముంది.

''అంటే మీ ఆయన.''

''లేదండి''

''చచ్చిపోయాడా?'' బెరుకుగా అడిగింది మహా.

''లేదండి. నిక్షేపంగా వున్నాడు. దానవాయిపేటలో మూడంతస్తుల మేడ.''

''వదిలేసాడా?''

''వదిలేయటానికి ఆడు నన్ను తాళికట్టి పెళ్ళిచేసుకున్నాడేంటి, దొంగసచ్చినోడు'' అంది అమ్మాజీ కోపంగా.

మహాని అమ్మాజీ జవాబులు ఇంకా తికమకకి గురి చేస్తున్నాయి.

అమ్మాజీ మహా మొహం చూసి పకపకా నవ్వింది.

''నాకు తెల్సండి. మీరు నా మాటలకి తికమక పడిపోతున్నారు. నా మెళ్ళో మంగళసూత్రాలు చూసి. ఇయ్యి ఆడు కట్టలేదండి. నేనే కట్టుకున్నాను. మన బతుకు మనం బతికినా జనం బతకనియ్యరు కదండీ. అందుకు.''

మహా అలానే చూస్తూ కూర్చుంది.

''ఇంతకీ నా సంగతేంటో కావాలి మీకు - అదేం సినిమా కాదండి. అందులో డూయట్సు - సీనరీలు వుండవండి. ఈ గోదారంత కన్నీళ్ళుంటాయి. యింటారా మరి.''

''నువ్వు చెబితే.''

''మా వూరెక్కడో కాదండి. యిక్కడే ఇదే దానవాయి పేట. మా అమ్మా నాన్నా పెద్ద ఆస్తిమంతులు కాదుగానీ మర్యాదస్తులు. మా నాన్న యిక్కడే పేపరు మిల్లులో పని చేసేవాడు. నాకిద్దరు తమ్ముళ్ళు. దానవాయిపేటలో మా నాన్న అన్నదమ్ములతోపాటూ మా తాతగారి సరంభి యింట్లో మాకో రెండుగదుల వాటా వచ్చింది. బాగానే జరిగిపోయేది. మా అమ్మపేరు నాగరత్నం. ఎప్పుడూ భుజాల్నిండా కొంగు కప్పుకుని పనయ్యాక లేసులల్లుతుండేది. నేను ఎనిమిదో క్లాసు చదువుతుండగా ఏదో మిషనులో పడి మా నాన్న చెయ్యిపోయింది. నాన్నకెంతో కొంత డబ్బిచ్చి పనిలోంచి తీసేసారు మిల్లు యజమాన్లు. అప్పట్నుండి మొదలయ్యాయి మాకు కష్టాలు.

అమ్మ ఏం చేసేదో పాపం యింటి గడప దాటకుండానే మాకు అన్నీ చూసేది. చుట్టాలు ఏదో సాయం చేస్తుండేవారు.

అలా కూడా జరగడం చూడలేని దేవుడు మా నాన్నకి టి.బి వరంగా ఇచ్చాడు. ఆ జబ్బుతో ఆయన పోయాడు - రాత్రింబగళ్ళూ సేవ చేసిన మా అమ్మకి ఆ జబ్బు దానం చేసి. అమ్మ కూడా పోయింది.

అమ్మాజీ చెప్పడం ఆపింది.

కళ్ళు ధారాపాతంగా కురుస్తున్నాయి.

"సారీ వద్దులే అమ్మాజీ చెప్పొద్దు" అంది మహా ఒక రకమైన వుద్వేగానికి గురవుతూ.

అమ్మాజీ కాసేపు తలదించుకుని "ఫర్వాలేదండి. అప్పట్నుంచి సంసారభారం నామీద పడింది. చదువాపేసాను. తమ్ముళ్ళిద్దర్నీ సాకే భారం నా మీద పడింది. వీధంతా మా వాళ్ళే కాబట్టి తలో చెయ్యి వేసారు. నెలకి పదిరూపాయలు, రెండు కే.జీల బియ్యం, పప్పు - ఇలా తల ఒకటి యిచ్చేవారు. ఫస్టొచ్చిందంటే బిక్కు బిక్కు మనేది మనసు. ఎవరూ ఆళ్ళంత వాళ్ళివ్వరు. వెళ్ళడగాలి. వెంటనే అడిగితే 'అప్పుడే తయారయ్యారా' అని తిట్టేవారు. అడక్కపోతే 'ఎంత పొగరో - చింత చచ్చినా పులుపు చావలేదని అనేవారు.

'ఒకరోజా - రెండురోజులా.. సంవత్సరాలు. ఫస్టుకి తమ్ముళ్ళని వెళ్ళి అడగమంటే వెళ్ళమని ఏడ్చేవాళ్ళు. కోపంతో తన్నేదాన్ని. ఆ తర్వాత ముగ్గురం కలిసి ఏడ్చేవాళ్ళం. ఇక ఇలా కాదని నేనే అడగటం మొదలు పెట్టాను. ఒక గది అద్దికిచ్చేసాను. అదే నా ఖర్మ" అంటూ ఆగింది అమ్మాజీ వూపిరి తీసుకోడానికన్నట్లుగా.

మహా అలా చూస్తూనే వుంది.

ఆ బాధలు వినడానికే కష్టంగా వున్నాయి.

ప్రతి మనిషికి ఆత్మాభిమానం వుంటుంది. దాన్ని చంపుకోవడమంటే దానికి మించిన చావులేదు. కానీ ఒక మనిషికి ఏదైనా అవసరం పడినప్పుడే మనిషిలోని శాడిజం పురివిప్పుతుంది. మాటలతో హింసించి ఆనంద పడతాడు కాబోలు. తనకింతవరకూ యిలాంటి బాధలుంటాయనే తెలియదు.

"ఆ గదిలోకి ఒక తల్లి కొడుకూ వచ్చారు. కొడుకు పేరు సత్యనారాయణ. సత్యం అని పిలిచేది వాళ్ళమ్మ. ఆవిడపేరు లక్ష్మీ నరసమ్మ. భర్తలేడు. సత్యం ఏదో కంపెనీలో పనిచేసేవాడు. వయసులో వున్నాడు. బాగానే వుండేవాడు. చాలా నెమ్మది. అందరూ చాలా మంచివాడనే వారు. మంచివాడే కానీ నా వైపు దొంగచూపులు చూసేవాడు. నాకు పదహారేళ్ళొచ్చాయి. ఆ చూపులు బాగానే అనిపించాయి. అందులో నాకు నవ్వెక్కువ. అయినదానికీ కాని దానికీ నవ్వుతుండేదాన్ని. మా చుట్టాలు పెట్టకపోయినా అలా నవ్వుతున్నానని తిడుతుండేవారు. నేనతని ఆకర్షణలో పడ్డాను. ఏ రాత్రిపూటో కాసేపు సందుచూసుకుని మండువా వరండాలోనో పెరట్లోనో కలిసేవాళ్ళం. పేరుకి రెండేసి గదులే అయినా వరండాలన్నీ అందరం కలిసే వాడుకునేవాళ్ళం. నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పాడు. నా తమ్ముళ్ళ చదువులకి రహస్యంగా కొంత డబ్బు సాయంచేసేవాడు. అలా నేనతనికి లొంగిపోయాను. ఫలితంగా మూడో నెల వచ్చేంది.

"అంటే?" అమాయకంగా అడిగింది.

అమ్మాజీకి కూడా ఎలా చెప్పాలో తెలియలేదు.

"అంటే అదేనండీ, ఆం ప్రెగ్నెన్సీ ఏదో అంటారే... అది"

"అయ్యో" అంది మహా జాలిగా.

"అందరికీ తెలిసిపోయింది. అమ్మా బాబూ లేనోళ్ళ మీద అందరికీ పెత్తనాలే. అందరూ తిట్టిపోసారు. మూలనున్నవాళ్ళు కూడా లేచొచ్చి తన్నారు. పరువు తీసానన్నారు. మా దూరపు చుట్టాల్లో ఒకావిడుంది. ఆవిడకి చాలా డబ్బుంది. అందుకని అందరూ ఆమెకే

పెత్తనమిస్తారు. ఆవిడ జోక్యం చేసుకుని నేనెంత మొత్తుకున్నా వినకుండా కడుపు తీయించేసింది. సత్యాన్ని, వాళ్ళమ్మని యింట్లోంచి పంపించేసారు. సత్యానికి ఒక పోలియో మరదలుంది. పేరు కాంతం. ఆ పిల్లని చేసుకుంటే ఆస్తియిస్తామని అతని మేనమామ ఎప్పట్నుంచో అడుగుతున్నాడట. ఈళ్ళందరూ కలిసి సత్యానికి ఆ పిల్లని ముడేసారు. నేను ఎంత ఏడ్చినా నా మాటెవ్వరూ యినలేదు. కొన్నాళ్ళు సత్యం నాకు రహస్యంగా డబ్బు యిస్తూనే వుండేవాడు. నా తమ్ముళ్ళ చదువులయ్యేవరకూ నన్ను వుండనిచ్చారు. ఇక ఆళ్ళ పెళ్ళాలొచ్చాక నేను వుండటం ఎవరూ యిష్టపడలేదు. ఇక యిలా బయటకొచ్చేసాను. సత్యమే ఏదో నా మొహాన యింతని పడేస్తాడు - అడగ్గా అడగ్గా" అంటూ ఆపింది అమ్మాజీ.

మహా ఆ కథ విని చాలా బాధపడిపోయింది.

తనకీ కొంత బాధ తెలుసు.

అంత డబ్బున్న తననే కౌశిక్ మోసం చేసాడు.

ఎక్కడయినా లోకమింతే కాబోలు.

"మరి..మరి.. నిన్ను అతనికే యిచ్చి పెళ్ళి చెయ్యొచ్చుకదా!" అంతా విని అమాయకంగా అడిగింది మహా.

బదులుగా పకపకా నవ్వింది అమ్మాజీ. "అంతా యిని బలే మాట్లాడ్తన్నారు అమ్మాయిగారూ! మా కులం గొప్పది. ఆళ్ళది తక్కువని కదా యాళ్ళా పని చేసింది. మన కులప్పిల్ల తప్పుడిది - అని ముద్రేసి వదిలేసినా పర్వాలేదు కానీ దానికి తక్కువ కులపోడు కిచ్చి పెళ్ళిచేయకూడదు. డబ్బున్నోడిదే పెద్దకులమని ఈ సన్నాసులకి తెలిసేడిస్తే కదా!"

"అయ్యో" అంది మహా బాధగా.

"వదిలేయండి. ఈ మాటల్లో చాలా టైమయిపోయింది. కుక్కర్ పెట్టొస్తా" అని వంటగదిలోకెళ్ళి రైస్ కుక్కర్ పెట్టి ఒకసారెళ్ళి అమ్మాణీగార్ని చూసొస్తా" అని కిందకెళ్ళింది అమ్మాజీ.

అమ్మాజీ వెళ్ళిన వైపే జాలిగా చూస్తూ కూర్చుంది మహా ఆమె అల్లుతున్న లేసుని చేతిలోకి తీసుకుని.

పాపాయమ్మ అన్నం పెట్టుకుని తిని కంచం కడిగి దోసెలకి బియ్యం నాన బోద్దామని చూస్తుండగా సన్నగా బియ్యం కారిన చార కంటపడింది. ఆ చీకటి గదిలో కనపడక లైటేసి పట్టి చూసింది. బియ్యమే. రెండు గింజలు తీసుకుని చూసింది. అవి తన బియ్యం కాదు. లత తెచ్చినవి. మళ్ళీ దార వైపు బియ్యం వైపు మెల్లిగా నడుస్తూ వెళ్ళింది. వీధిదకా వుందా ధార. ఆ తర్వాత కనపడలేదు. అంతకుముందే రామక్రిష్ణ బయటకెళ్ళాడు. ఈ బియ్యానికి రామక్రిష్ణకీ సంబంధం ఏంటో అర్థం కావడంలేదు ఎంతాలోచించినా పాపాయమ్మకి.

వెనకాలే వెళ్ళడానికి కాళ్ళు సహకరించవు.

"ఎటెళ్ళాడో దొంగ సచ్చినోడు" అనుకుంటూ అటూ యిటూ చూసింది.

అప్పుడే ఎక్కడో పనిచేసి వస్తున్న ఉమ్మడి సీత కళ్ళలో పడింది. "ఏవే సీతా, యిలారా" అంది పాపాయమ్మ.

సీత గబగబా వూగిపోతూ దగ్గరకొచ్చింది.

పొద్దున్నే పాపాయమ్మ దోసెలేసే ప్రదేశమంతా శుభ్రంగా వూడ్చి నీళ్ళు జల్లి పెడుతుంది సీత. బదులుగా రెండు దోసెలు పెడుతుంది పాపాయమ్మ.

"ఏటండీ?" అంది సీత దగ్గరకొచ్చి.

"ఇటుకేసి మా రామకిష్టిగాడెల్లాడు. ఎటెల్లేడో సూసేవా?

"ఇంకెటెల్తారండీ, మీకు తెల్వదా! ఆ సందమ్మూల సెక్కే సచ్చోతి కొట్టుకాడ కూచుని సిగరెట్లు తాగుతా కబుర్లాడతుంటారండి. ఇప్పుడే ఆ కొట్టు సుబ్బరం సేసొస్తన్నా" అంది సీత.

"ఏంటి సచ్చవతితోనా.. దాని మొగుడులేడా అక్కడ"

"ఆయనగారు సెంటర్లో మిసిను కుడ్తాడు కదాండీ... పొద్దున్నే ఎల్లిపోతాడు. కొట్టు యీరే సూసుకుంటారు. మీ అబ్బాయిగారి మకావక్కడే ఎప్పుడూ" అంది సీత నవ్వుతూ.

"సర్లే.. నీ నవ్వు నా ఏడుపులా వుంది. ఇంకెల్లు" అంది పాపాయమ్మ చిరాగ్గా.

సీత వెళ్ళిపోయింది.

ఆ మర్నాడు పాపాయమ్మ లత పనికెళ్ళాక నిద్రపోతున్నట్లు నటిస్తూ రామక్రిష్ణనే గమనిస్తోంది.

లత వెళ్ళాక పూర్తి మగాడయిపోతాడు రామక్రిష్ణ.

స్నానం చేసొచ్చి పౌడరు బియ్యప్పిండిలా వంపుకుని వళ్ళంతా రాసేసుకుని పైజమా లాల్చీ వేసుకున్నాడు. తల దువ్వుకుని విజిలేసుకుంటూ అటూ యిటూ తిరిగాడు ఆ ఒక్క గదిలోనే.

"అమ్మా డబ్బులేటన్నా వున్నాయేంటే?" అడిగాడు పాపాయమ్మని దగ్గరగా వచ్చి.

పాపాయమ్మ వులకలేదు పలకలేదు.

"ఇదప్పుడే నిగడదీసుకుని పడుకుంది" అంటూ చిన్నగా లత తెచ్చి బియ్యం పోసిన డబ్బా దగ్గరకెళ్ళాడు.

పాపాయమ్మ ఊపిరి బిగబెట్టి చూస్తోంది కొద్దిగా కళ్ళు తెరచి.

లాల్చీ పైజమా జేబుల్లో పట్టినన్ని బియ్యం పోసాడు రామక్రిష్ణ. వెంటనే విజిలేసుకుంటూ బయటకెళ్ళిపోయాడు. పాపాయమ్మ వెంటనే లేచి మెల్లగా అడుగులేస్తూ రామక్రిష్ణకి తెలియకుండా గోడవారల్నుంచి నడుస్తూ కొట్టు పక్కకి చేరుకుంది.

రామక్రిష్ణని చూడగానే సత్యవతి పళ్ళికిలించి నవ్వింది.

వెంటనే కౌంటర్‌లో చేట పెట్టింది.

రామక్రిష్ణ నాలుగు జేబుల్లో బియ్యం చేటలో వంపేడు. రెండు కేజీలపైనే వుంటాయవి.

"ఎన్నాళ్ళిలా బియ్యమమ్ముకుంటావూ..? ఏదైనా పని చెయ్యచ్చుకదా?" అంటూ నాలుగు సిగరెట్లిచ్చింది సత్యవతి.

"ఏ పని సెయ్యమంటావే. నీ కొట్లోగాని పనిస్తావా?" అంటూ వెటకారమాడి హీరోలా సిగరెట్టు వెలిగించాడు రామక్రిష్ణ.

"ఇంకా నయం. నా కొట్టులో సరుకుంటదా?" అని నవ్వి చేటలో బియ్యం డబ్బాలో పొయ్యయిబోయింది సత్యవతి.

"ఆగుఁ!" ఆ కేకకి వులిక్కిపడి తలెత్తి చూసింది సత్యవతి.

ఎదురుగా మహాకాళిలా నిలబడింది పాపాయమ్మ వగరుస్తూ.

తల్లిని చూడగానే ఒక్క పరుగు తీసాడు రామక్రిష్ణ.

"ఎక్కడికిరా, ఆగక్కడ" అని అరిచింది పాపాయమ్మ.

అయినా నేరాలకి అలవాటుపడ్డ రామక్రిష్ణ ఆగలేదు.

"ఏవే.. ఎన్నాళ్ళనుండి సాగుతుందీ కద?" అంది పాపాయమ్మ.

"కదేంటండి మాటలు తిన్నగా రానియ్యండి" అంది చెక్కా సత్యవతి లోపల భయాన్ని దాచుకుని బయటకి గంభీరంగా.

"అబ్బో మీ ఆయన కలెట్టరూ. నేను జడిసిపోడానికి. అప్పనంగా బియ్యం కాజేసి ఆడి మొహాన సిగరెట్లడేస్తావా?" అంది పాపాయమ్మ.

"ఇది మరీ బాగుందండి. డబ్బుల్లేవు బియ్యమిస్తావన్నాడు. పోన్లే అని తెలిసినోడని యిస్తున్నా. లేకపోతే ఆ ముక్కుబియ్యం ఎవడిక్కావాలండీ" అంది సత్యవతి కోపంగా.

"రేపాడు దొంగ బంగారం తెస్తే అది కూడా తీసుకుంటావా... ఇదా నీ యాపారం. ఆడు సేసిన ఎదవ పనికి నా మీద దొంగతనవెట్టింది నా కోడలు" అంటూ ఎగిరింది పాపాయమ్మ.

అప్పటికే అక్కడ జనం పోగయ్యారు.

ఉమ్మడి సీత కూడా పరిగెత్తుకొచ్చింది అక్కడికి.

అప్పటికే తగదా ముదిరిపోయింది.

అమ్మాజీని చూసి బావురుమంది సత్యవతి.

"సూడండమ్మాజీగారు. ఈవిడ పొద్దున్నే నా బేరాలన్నీ చెడగొట్టేస్తున్నారు. ఇదంతా మా ఆయనకి తెలిసిందంటే మా ఆయన తాగొచ్చి నన్నిరగ్గొట్టేస్తాడు. నేను దొంగసామాను కొనేదాన్నా? ఎంతల్లరి చేసేస్తన్నారో" అంటూ ఏడ్చినంత పని చేసింది సత్యవతి.

అమ్మాజీ కోపంతో వగరుస్తున్న పాపాయమ్మని పట్టుకుని "ఏంటి మామ్మా ఇదంతా? ఇంటికి పద" అంది.

"ఏంటే.. ఇంటికి పదంటన్నావ్. ఈది ఈదంతా నాకోడలు నన్ను దొంగని జేస్తే లేదా. దొంగ సామాను కొనే దీనికా పరువు. రానీ.దీని మొగుడు లోవరాజుకి కదంతా చెప్తా" అంది పాపాయమ్మ.

"చాల్లే చెప్పావుగానీ ముందెంత ఆయాసపడ్తున్నావో చూసుకో. పద" అంటూ అమ్మాజీ, సీత చెరో రెక్కపట్టుకుని యింటికి లాక్కొచ్చారు.

అమ్మాజీ ఎంత చెప్పినా పాపాయమ్మ దారి పొడుగునా వాగుతూనే వుంది గుండెలు బాదుకుంటూ.

"అమ్మా.. రెక్కల కట్టం సేసుకునే నాకు దొంగతనం కడతారా రానియ్. దాని పని ఆడి పని చెప్తా" అంటూ అరుస్తూనే ఉంది.

"మామ్మా నీ పిచ్చిగాని జేబులో బియ్యం ఎన్ని పడతాయే?"అంది అమ్మాజీ నవ్వుతూ పాపాయమ్మని మంచమ్మీద కూర్చోబెట్టి.

పాపాయమ్మ మంచినీళ్ళు తాగుతూ ఆలోచనలో పడింది.

"జేబులో బియ్యం ఈడమ్మడం – ఆవిడ కొనడం..." అంటూ మళ్ళీ పకపకా నవ్వింది అమ్మాజీ.

"ఆపవే. వూరికే ఎదవనవ్వు నువ్వు. సెట్లో బియ్యం రెండు కేజీలుంటాయే! నా కళ్ళతో నేన్జూసేను." అంటూ మళ్ళీ ఆలోచించింది పాపాయమ్మ.

"చాల్లే మామ్మా.. జేబుల్లో రెండు కేజీల బియ్యవా... యిద్దూరంగా" అంది అమ్మాజీ.

"ఉండవే" అంటూ పాపాయమ్మ మంచమ్మీద నుండి లేచి దండెం మీదున్న రామ్కిష్ణ మరో లాల్చీ పైజమా తీసి తిప్పి చూసి తెల్లబోయింది.

"ఇటు చూడు" అందా బట్టలు అమ్మాజీ మీదకి గిరాటేసి.

అమ్మాజీ వాటినందుకుని "ఏవయ్యింది?" అంది ఆశ్చర్యంగా.

"ఆ జేబులు సూడవే ఎర్రి మొహమా?" అంది పాపాయమ్మ అసహనంగా.

అమ్మాజీ ఈసారి మరింత ఆశ్చర్యపోయింది.

వాటికి మరో గుడ్డతో అరకేజి బియ్యం పట్టే జేబులు కుట్టివున్నాయి. బట్ట రంగు అదేకానీ గుడ్డ వేరేది.

"అవునమ్మా. నిజమే. నీ కొడుకు దేవాంతకుడు. నీ తెలివి తేటలే వచ్చేసాయి" అని మళ్ళీ పడీ పడి నవ్వింది అమ్మాజీ.

"ఈసారి నవ్వావంటే పళ్ళూడపీకేస్తాను. ఈ ముదనష్టపు తెలివితేటల్లు నాయికావమ్మో. నేను రోజూ బట్టలుతుకుతూ వున్నాగాని యీ యివరం నేను కనిపెట్టలేదే తల్లీ! రానియ్ ఆణ్ణీ, దాన్ని. ఈరోజటో యిటో తేలిపోవాలి" అంటూ ఎగిరెగిరి పడింది పాపాయమ్మ.

"ఏంటి తేలిపోయేది. ఊరుకో. ఇప్పటికే అందరూ నవ్వుతున్నారు. అన్నం తిని ఆ మాత్రేసుకుని పడుకో" అంటూ హెచ్చరించి ఈ సంగతి చెప్పడానికి పరుగున మహా దగ్గర కెళ్ళింది అమ్మాజీ.

వెళ్ళడం వెళ్ళడం నేలమీద కూలబడి నేలమీద పొర్లినట్లు దొర్లుతూ నవ్వుతున్న అమ్మాజీని చూసి ఆశ్చర్యపోయింది మహా.

"ఏంటి, ఏం జరిగింది ఎందుకలా నవ్వుతున్నావ్?" అంటూ ఆశ్చర్యపడుతూ అడిగింది మహా.

అమ్మాజీ నవ్వాపుకుని జరిగింది చెబుతుంటే నిజంగానే తెల్లబోయింది మహా.

మహాకి రామక్రిష్ణ చేసిన దానికన్నా అమ్మాజీ నవ్వు చూసి చాలా ఆశ్చర్యమేసింది.

అమ్మాజీ కథ తెలియకపోతే ఆ సంగతి వేరుగా వుండేది. ఈ అమ్మాయి ఎలా నవ్వగలుగుతోంది - జీవితంలో యింత విషాదం పెట్టుకుని అని మరీ మరీ ఆశ్చర్యపోయింది మహా.

"రామక్రిష్ణ సంగతి వదిలేసి నువ్వు నువ్వింతలా ఎలా నవ్వగలుగుతున్నావ్?" అనడిగింది మహా.

అమ్మాజీ గోడకి జేరబడి కూర్చుని నవ్వడం వలన వచ్చిన కన్నీళ్ళు తుడుచుకుని "మాలాటోళ్ళకి యిలాటి వరాలేవో పడేస్తాడండి ఆ దేవుడు బతకడానికి" అంది.

**సుబ్బా వసూళ్ళ** కోసం గోకవరమెళ్ళి తిరిగి రాజమండ్రి వస్తుండగా ఫోను అదే పనిగా రింగవ్వడం మొదలయ్యింది. సుబ్బా డ్రైవింగులో వుండటం వలన చాలాసేపు ఫోను ముట్టుకోలేదు.

కానీ ఫోను పదే పదే గీ పెడుతూనే వుంది.

చివరకి చిరాకెత్తి బైక్ ఒక చెట్టునీడ ఆపి ఆన్ చేసాడు.

"నేను బాబూ... మాస్టారి భార్యని" ఆవిడ ఏడుపు ఆపుకుంటూ మాట్లాడుతున్నది అర్థమయి సుబ్బా కంగారు పడ్డాడు.

"ఏవయిందమ్మా, ఏంటింత అర్జెంటుగా ఫోను చేస్తున్నారు?"

"బాబూ.. ఆయన.. ఆయన అన్యాయం చేసి పోయారు బాబూ!" ఆవిడ దుఃఖం ఆపుకోలేక వెక్కివెక్కి ఏడుస్తున్నది.

సుబ్బా ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు.

"వస్తున్నా.. వస్తున్నా" అంటూ అతను బైక్ ఎక్కి స్పీడు పెంచాడు.

అతని మనసు మాత్రం మనసులో లేదు.

మొన్ననే కదా వైద్యం చేసి గట్టెక్కించింది. ఇంతలో ఏమయిపోయింది.

సుబ్బా గబగబా మాస్టరిగారి యిల్లు చేరాడు.

అక్కడ పెద్దగా జనం లేరు.

మేడమీద అద్దెకొంప. పైకి వెళ్ళేసరికి సుబ్బాని చూసి ఆవిడ భోరుమంది. మాస్టారు అన్ని బంధాలు వదిలించుకుని నిశ్చింతగా నిద్రపోతున్నారు.

ఆవిడ గోడకి జేరబడి మౌనంగా ఏడుస్తోంది.

ఇంతలో ఒకతను వచ్చి "మీరీయనకేమవుతారు?" అనడిగాడు. సుబ్బూ ఏదో చెప్పబోతున్నంతలో మా అబ్బాయే. మా అబ్బాయే" అందావిడ గాభరాగా.

"మరయితే తొందరగా కానిచ్చేయండి. మిగతా అద్దెల వాళ్ళు యిబ్బంది పడుతున్నారు. పోయిన నక్షత్రం తిథి మంచివి కావు. మధ్యలో మాకొచ్చిపడింది వెధవ గొడవ" అని విసుక్కుంటూ వెళ్ళిపోయాడతను.

సుబ్బూకి కోపం నషాళానికి అంటింది. కాలరు పట్టుకుని రెండు లాగేద్దామనుకున్నాడు కానీ అది సందర్భం కాదు కాబట్టి ఆవిడ వైపు తిరిగి "అదేంటమ్మా, అలా చెప్పారు. మీ అబ్బాయికి తెలియబరిచారా?" అనడిగాడు ఆశ్చర్యంగా.

ఆమె తలడ్డంగా తిప్పింది లేనట్లుగా.

"అతని ఫోను నెంబరు యివ్వండి. నేను ఫోను చేస్తాను" అన్నాడు సుబ్బూ.

"ఆయన వద్దన్నారు" అందామె ఏడుపు దిగమింగుతూ.

సుబ్బూకి అంతా తెలుసు కాబట్టి కాసేపు మౌనం వహించి "ఏదో కోపంలో అని వుంటారు లెండి. నాకివ్వండి నేను చెప్పి రమ్మంటాను" అన్నాడు.

"వద్దు. నాదీ అదేమాట. వాడికి మేము రుణం. అప్పుతీర్చుకున్నాం. ఇక వాడి మొహం మేము చూడాలనుకోవడం లేదు." అందామె వేదనగా.

"మరీ తతంగం?"

బదులుగా ఆమె అనుకోని రీతిలో సుబ్బూ కాళ్ళమీద పడింది.

అనుకోని ఆమె చర్యకి సుబ్బూ వులిక్కిపడి ఒక గంతు గెంతి "ఇదేమిటమ్మా తల్లిలాంటివారు. ఇదేం పని" అన్నాడు నొచ్చుకుంటూ.

ఆమె చేతులు జోడించింది.

"తల్లిలాంటిదానివన్నావు. తల్లికేం చేయాలో అది చెయ్యి"

"నేనా?" సుబ్బూ తెల్లబోతూ అడిగాడు.

"అవును. నువ్వే. ఎవరు కన్నబిడ్డవో నువ్వు. నేనిలా అడక్కూడదేమో? కానీ.. ఈ వూళ్ళో పుట్టినప్పటినుండి వున్నాం. ఎందరినో వున్న దాంట్లో ఆదుకున్నాం. అన్నం పెట్టి విద్యాబుద్దులు నేర్పించారెందరికో ఆయన. కానీ సమయానికి ఒక్కరు లేరు. చేతులు జోడించి అడుగుతున్నా. నువ్వే ఆ పని చేసి పుణ్యం కట్టుకో"

సుబ్బూ మరేం ఆలోచించలేదు.

వెంటనే ఫోను చేసాడు.

ఆ నలుగురూ మహా స్నేహితులొచ్చేసారు.

జరగాల్సిన ఏర్పాట్లు జరిగిపోయాయి.

సుబ్బూ ముందు నడవగా ఆ నలుగురూ ఆయన పార్థివ దేహాన్ని కడదాకా మోసారు.

సుబ్బూ తిరిగొచ్చి ఆమె ఎదుట కూర్చున్నాడు.

"అమ్మా, అంతా జరిగిపోయింది. ఇక ఏడవకండి. ఇప్పుడిక ఏం చేయాలనుకుంటున్నారు?"

ఆవిడ ఏదో చెప్పబోయేంతలో ఇంటి యజమాని మళ్ళీ తిరిగొచ్చాడు.

"ఇక్కడే తతంగాలు చెయ్యడానికి వీల్లేదు. వెంటనే ఇల్లు ఖాళీ చెయ్యండి. సున్నాలవీ వేయించి శుద్ధిచేయాలి. పాడు సంత, మాకొచ్చి పడింది అన్నాడు విసుక్కుంటూ.

సుబ్బా లేచి నిలబడ్డాడు.

"ఆవిడ పుట్టెడు దుఃఖంలో వున్నారు. అప్పుడే మీరిలా మాట్లాడటం" అన్నాడు ఎంతో ఓపిక కొని తెచ్చుకుని.

"అంత బాదుంటే తీసుకెళ్ళి మీ యింట్లో పెట్టుకోండి. అందరి ఏడుపులూ మా ఏడుపులు చేసుకోలేం"

సుబ్బా అతని చెంప ఛెళ్ళుమనిపించాడు.

ఆ చర్యకి మాస్టారిగారి భార్యతోపాటు అతనూ నిర్ఘాంతపోయాడు. వెంటనే ఓ పదిమంది పోగయ్యారు.

అతని భార్య వచ్చి రాగాలు మొదలు పెట్టింది.

"దేవుడా, వీడెవడో మా ఆయన్ని చంపేస్తున్నాడు. తలకొరివి పెట్టి స్నానం లేకుండా మా ఆయన్ని ముట్టేసాడు. ఖర్మరా భగవంతుడా మాకేం శని పట్టిందో" అంటూ నానా యాగీ మొదలెట్టేసిందావిడ.

సుబ్బా ఆవిడ దగ్గరగా వెళ్ళి "దయచేసి నోరు మూస్తారా. లేకపోతే మాస్టారికి తోడు పంపించెయ్యనా?" అన్నాడు చాలా నెమ్మదిగా స్వరం తగ్గించి.

ఆవిడ ఠక్కున నోరు మూసేసింది.

"సుబ్బా అన్న సంగతి మీకు తెలియదు. ఎక్కువగా ఎట్టుకోకండి డొక్కలు సినిగి పోతాయ్" అన్నారా నలుగురూ అక్కడి జనాన్ని హెచ్చరిస్తూ.

అక్కడ జనం మెల్లిగా తప్పుకున్నారు.

ఇంటి యజమాని నోరు మూసేసాడు.

"లేమ్మా" అన్నాడు సుబ్బా మాస్టారిగారి భార్య చేయి పట్టుకుని.

"ఎక్కడికి?" అన్నదామె తెల్లబోతూ. "మనింటికే"

"ఇలానా... ఇప్పుడా.. గడపదాటి.."

"అమ్మా ఈ సింగినాదాలు నాకు చెప్పొద్దు. మీరు గడపదాటనంటే నేను గడిపే తీయించేస్తాను. నాకి వెధవ నమ్మకాలేవీ లేవు. ఏ తిథి చూసుకుని సృష్టిలో ప్రాణులు పుడుతున్నాయమ్మా. ఒక కాకి ఛస్తే నాలుగు కాకులు వాలి గోలచేసి ఏడుస్తున్నాయే. కనీసం ఒకడొచ్చి సాయం చెయ్యకపోగా తిథులూ, నక్షత్రాలంటూ మానవత్వం లేకుండా మాట్లాడే ఈ మనుషుల మాటలు పట్టుకుని మీరు బాధపడొద్దు. నోరూ, బుర్ర దేవుడిచ్చింది ఇలాంటి వక్రశాస్త్రాలు చెప్పి బతకమని కాదు. మానవత్వం, దయలేని వీళ్ళ మధ్య ఒక క్షణం కూడా వుండొద్దు. పదండి"

"కాని నీకు మీ యింట్లో ఏమీ అనరా?"

"నాకెవరూ లేరు. వున్నా అనరు. పదండి"

ఆమె లేచి నిలబడింది.

"ఒరేయ్. అమ్మ సామాన్లు మీరు తీసుకురాండ్రా" అని ఆ నలుగురికీ చెప్పి జేబులో డబ్బు కొంత తీసి ఇంటి యజమాని మొహాన కొట్టి "ఎక్కడెక్కడ సున్నాలేయించుకుంటావో వేయించుకో. నువ్వు పోయిన రోజున వేయించాడనికి మీ ఆవిడకి కూడ కొంత యివ్వు" అని సుబ్బూ ఆవిడని తీసుకుని ముందుకి నడిచాడు.

"సుబ్బు రాలేదు. నువ్వొస్తావా?" అంటూ కిందకి దిగొచ్చి అమ్మాజీని పిలిచింది మహా.

అవునా..ఫోను కూడా చెయ్యలేదా?" అనడిగింది అమ్మాజీ బయటకొచ్చి.

మహా ఏదో చెప్పబోయేంతలో సుబ్బూ గుమ్మం ముందు బైక్ ఆపి ఆవిణ్ణి దిగమన్నాడు.

ఒక్క రోజులో ఆమె జీవితంలో జరుగుతున్నదేంటో ఆవిడకే తెలియని దిగ్భ్రమ. ఆవిడ బైక్ దిగి చుట్టూ చూసింది.

"రండి" ఆవిడ సుబ్బూ వెనక నడిచింది.

సుబ్బూ అమ్మాజీ ఖాళీ చేసిన పోర్షన్ తలుపు తాళం తెరచి "రండి" అంటూ లైటు వెలిగించాడు.

ఇంతలో ఆమె సామాను తీసుకుని ఆ నలుగురూ వచ్చారు.

"అమ్మాజీ"

"అన్నా" అంటూ ముందుకి వచ్చింది అమ్మాజీ.

ఆ నలుగురూ సామాను చకచకా సర్దేసారు.

"అమ్మ"

అమ్మాజీ అర్థంకానట్లుగా చూసింది కానీ అడగడానికి ధైర్యం చాల్లేదు.

"అమ్మగారు. మాస్టారి భార్య"

"సరే అన్నా"

"అన్నం పెట్టు"

అమ్మాజీ గబగబా తేవడానికి వెళ్ళింది.

"వద్దు. ఇప్పుడేం వద్దు" అందామె కన్నీళ్ళతో.

"లేదు. మీరు తినాలి. లేకపోతే మేమంతా పస్తుంటాం" అన్నాడు సుబ్బూ ఆమెని మంచం మీద కూర్చోబెట్టి తను కాళ్ళదగ్గర కూర్చుంటూ.

"అమ్మా మీరేంటో ఏ కులమో నాకు తెలియదు. నలుగురికి విద్యాదానం చేసిన మాస్టారిగారి భార్య మీరు. ఆ విధంగా వున్నతులే. ఇక్కడ వీళ్ళంతా మానవత్వమనే మడి, శుచితోనే వండుతారు. ఆప్యాయతనే సంస్కారంతో మీకు వడ్డిస్తారు. అతి తెలివితేటలతో మిమ్మల్ని కించపరచరు. అవమానించరు. అలా చేస్తే రేపే వాళ్ళ డొక్కలిక్కడ ఎండగడతాను." అన్నాడు సుబ్బూ ఆవేశంగా.

అక్కడే నిలబడ్డ మహా అతని మాటల్ని ఆశ్చర్యంగా వింటున్నది.

సుబ్బూ మహా వైపు చూసి "ఇలా రా!" అన్నాడు.

మహా బెరుకుగా లోనికొచ్చింది.

ఇంతలో అమ్మాజీ ఆవిడకి భోజనం తీసుకొచ్చింది.

వద్దుబాబూ నేను తినలేను" అంటూ సుబ్బూ భుజమ్మీద తల వాల్చి ఏడ్చింది.

సుబ్బూ ఆమె భుజం తడుతూ "కొద్దిగా తినాలి. బాధకి ఆకలికి సంబంధంలేదు. ఏడవడానికి కూడా బలం కావాలి. అమ్మకి అన్నం కలిపి తినిపించు" అన్నాడు సుబ్బూ మహాతో.

మహా ఆ మాటకి తెల్లబోయి చూసి "నేనా?" అంది అమితాశ్చర్యంతో.

"నువ్వే. ఏం, ముద్దలు ముద్దలు కలిపి మింగుతావుగా" అన్నాడు సుబ్బూ వెటకారంగా.

మహా ఇబ్బందిగా చూసింది సుబ్బూవైపు.

"వద్దు నాన్నా నేను తింటానులే" అందామె కంచంలో చెయ్యిపెడుతూ.

"ఏటయింది?" అంటూ వగరుస్తూ పాపాయమ్మ వచ్చిందక్కడికి.

"ఇదిగో ఏటయింది, ఎవరూ అని పిచ్చిప్రశ్నలెయ్యకుండా అమ్మకి ప్రొద్దుటే టిఫిను పంపించు. సరేనా?"

పాపాయమ్మ కళ్ళుమిటకరించి పక్కచూపులు చూసి "ఏటి యివరాలడిగితే కూడా తప్పయిపోయిందా మాయదారి గొడవ" అంది నసుగుతూ.

"అమ్మా మీ పేరు ఇంతవరకూ అడగలేదు. ఆ అవసరం రాలేదు. ఇక్కడ చాలామంది అమ్మలున్నారిప్పటికే" అన్నాడు సుబ్బూ.

"సరస్వతి" అందామె హీన స్వరాన.

అమ్మాజీ ఆవిడకి మంచినీళ్ళు తెచ్చిపెట్టింది.

"చూడండమ్మా. ఇక్కడందరూ మీకు కొత్తగా వింతగా కనిపించొచ్చు. కానీ అందరూ మిమ్మల్ని ప్రేమగానే చూసుకుంటారు. కష్టం వస్తే కాకుల్లా వాలతారు. మనుషుల్లా పారిపోరు. జరిగింది మంచి జ్ఞాపకంగా గుర్తు చేసుకోండి. నేను చేయాల్సినవి చాలా వున్నాయి. మీకు ఫేమిలీ పెన్షన్ వచ్చే ఏర్పాటు చేయాలి. డెత్ సర్టిఫికెట్ తీసుకోవాలి" అంటూ అందరి వైపూ తిరిగి "ఇక పదండి. అమ్మాజీ అమ్మని కనిపెట్టుండు" అంటూ రివ్వున మళ్ళీ బయటకెళ్ళిపోయాడు.

అమ్మాజీ వెళ్తూ వెళ్తూ సుబ్బూ యిచ్చిన నిద్రమాత్ర సరస్వతమ్మగారికి వేసి నిద్రపుచ్చి మహా దగ్గరకొచ్చింది.

"ఆవిడెవరు అమ్మాజీ?" అనడిగింది మహా కుతూహలంగా. ఏం కష్టమొచ్చిందో పాపం. ఇక్కడికి తీసుకొచ్చేసాడు అన్న" అంది జాలిగా అమ్మాజీ.

"అవును. ఏదో డెత్ సర్టిఫికెట్టంటున్నాడు కదా. ఆయన చనిపోయినట్లున్నారు కదా"

"కాబోసు"

"ఇలా అందరి బాధ్యత నెత్తిన పెట్టుకుంటున్నాడు. సుబ్బూకి అమ్మా నాన్న లేరా?"

"తెలియదండి"

"ఎప్పుడూ అడగలేదా?"

"అమ్మో అడగటమే. ఏదో మీరొచ్చాక నాతో ఎక్కువగా మాట్లాడతున్నాడుగాని అదివరకు అన్నొస్తున్నాడంటే అందరం గదుల్లోకి పరుగే. ఏదో పాపాయమ్మ మామ్మే ఎన్నన్నా ఏదో వాగుతుంటది" అంది అమ్మాజీ భయంగా గుండెల మీద చేతులు పెట్టుకుని.

"అంత భయంగా ఏంవుంటాడని అలా వణికిపోవడం. నాకసలు సుబ్బూని చూస్తే భయమే వెయ్యదు. తాగితే మాత్రం భయం. అంతే" అంది మహా నవ్వుతూ.

ఇంతలో సుబ్బూ వచ్చి తలుపుని ఒక తన్ను తన్నాడు. అమ్మాజీ వులిక్కిపడి లేచి నిలబడింది.

సుబ్బూ తాగి వచ్చాడని ఆమెకు అర్థమైపోయింది.

గభాల్న తలుపు గడియ తీసింది.

సుబ్బూ తూలుకుంటూ వచ్చి గోడకి ఆనుకుని కూర్చున్నాడు. అమ్మాజీ మెల్లిగా జారుకుంది.

మహా భయంగా సుబ్బూ వైపు చూసి "తాగొచ్చావా సుబ్బూ" అనడిగింది.

"ఔను. తాగాను. నీకేంటి?" అన్నాడు సుబ్బూ తీవ్రంగా.

"అదికాదు" అంటూ నసిగింది మహా.

"తాగావా ఏంటి ఎదవ ప్రశ్న. అంతకష్టమొస్తే తాగనా? ఏం జరిగిందో నీకేంటి తెలుసు. మాస్టారే. బంగారంలాంటి మాస్టారు చచ్చిపోయారే. అన్యాయంగా చంపేసాడే కొడుకే చంపేసాడు" అంటూ వెక్కెక్కి ఏడ్చాడు సుబ్బూ.

మహా జంకుతూ అతని వైపు చూస్తూ కూర్చుంది.

"ఆయన్ని ఆ దేవుణ్ణి నేను కూడా కొట్టానే ఆ చేతుల్తోనే. ఈ రోజు తల కొరివి పెట్టానే. ఛీ! నా చేతులు .. వుండు కాల్చేసుకుంటాను. అంటూ అతను ఆవేశంగా గాస్ స్టౌ దగ్గరకెళ్ళాడు.

జరగబోయేదేంటో గ్రహించిన మహా గబగబా అతన్ని గట్టిగా పట్టుకుని "వద్దు సుబ్బూ వద్దు ప్లీజ్" అంటూ ఏడ్చింది.

సుబ్బూ ఆమెని విదిలించి కొట్టాడు.

మహా ఆ దెబ్బకి వచ్చి దూరంగా పడింది.

"నేను.. నేను కాల్చుకుంటే నీకేంటి నేను తప్పుచేసాను. అందుకే కాల్చుకుంటా. నా యిష్టం. నువ్వెవరివి. చెప్పడానికి. మాట్లాడితే తాగావా అని అడుగుతావు. ఏం నీ బాబు తాగడా? పెద్ద పెద్ద స్టార్ హోటల్స్‌లో కాక్‌టెయిల్స్ తాగుతాడు. ఎవడికి తెలియదు. మీ డబ్బున్నోళ్ళ కథలు. వచ్చావ్ తిప్పుకుంటూ కూర్చుని తింటున్నావ్ ఎవడికయినా నీ వల్ల దమ్మిడీ సాయముందే నీ కేంటి తెలుసే ఇక్కడి బాధలు. ఛస్ నువ్వెళ్ళిపోవే నా కొంపలోంచి ఛీ! అన్నీ నీ మూలానే దరిద్రం దరిద్రం" అంటూ వాగి వాగి అతను నిద్రలోకి జారుకుని గోడమూలే పడుకున్నాడు.

మహా తన గదిలో కెళ్ళి తలుపు బిడాయించుకుని నడి మంచం మీద కూర్చుని వెక్కెక్కి ఏడ్చింది.

అసలు తనేం చేసిందని అన్ని తిట్లు తిట్టాడు. ఆ మాస్టారెవరో తెలియదు. తన మూలాన చచ్చిపోయాడట.

మహాకి మొదటిసారి సుబ్బూ అంటే చెప్పలేని ఏవగింపు కలిగింది.

వెంటనే సూట్ కేసులో తన సామాను సర్దుకుంది.

ఎప్పుడు తెల్లవారుతుందా అని కిటికీలోంచి చూస్తూ కూర్చుంది.

చీకటిలో వినీలమైన అఖండ గోదావరి చిన్నగా రూపురేఖలు సంతరించుకుంటోంది. విశాలమైన ఇసుక తిన్నెలు చీకటిలో కలిసిపోయిన కొబ్బరిచెట్ల గుంపులు రంగులద్దుకుంటున్నాయి. పక్షుల అరుపులు గోలగోలగా వినబడుతున్నాయి.

మహాకి వెలుగు చూసి కాస్తంత ధైర్యమొచ్చింది.

ఇంతలో తలుపు టకటకలాడింది.

గది తలుపు తెరచుకుని మెల్లిగా హాల్లోకి వచ్చింది.

సుబ్బూ గోడమూలనుండి జారినేలమీద పడుకుని ఆదమరచి నిద్రపోతున్నాడు.

శబ్దం లేకుండా సూట్‌కేస్ పట్టుకుని తలుపు తెరచింది.

అమ్మాజీ మహావైపు, సూట్‌కేసు వేపు చూసి "ఎక్కడికి?" అంది ఆశ్చర్యంగా.

"నే వెళ్ళిపోతున్నా అమ్మాజీ!" అంది మహా.

రాత్రంత నిద్రలేకుండా ఏడ్చిన ఆమె కళ్ళని గమనిస్తూ "అదే ఎక్కడికి? అని" అంది

"ఎక్కడికో అక్కడికి. ఇక్కడ వుండలేను"

"సరే అలాగే ఎల్దురుగాని. కాస్త కాఫీ తాగి సుబ్బూకి చెప్పి ఎల్దిరిగాని"

అతనికి చెప్పాల్సిన అవసరం నాకు లేదు."

"ఇదీ మరీ బాగుంది. ఆ రాత్రప్పుడు ఆ ఎదవలు మీకూడా బడితే ఎవరూ? ఏంటనడకుండా తీసుకొచ్చాడా లేదా? అలా చెప్పకుండా ఎల్తే మర్యాదగుంటదా?" అంది అమ్మాజీ చొరవగా సూట్‌కేసు లాక్కుంటూ.

"ఈ బోడి తాగుబోతుకి మర్యాదా ఒకటి" అంటూ మళ్ళీ సూట్‌కేసు లాక్కోబోయింది మహా.

అమ్మాజీ బదులుగా నవ్వి "ఏంటి, రాత్రి మా అన్న బాగా ఇసిగించేసినట్లున్నాడు మిమ్మల్ని. రండి టెర్రస్ మీద కూర్చుని కాఫీ తాగుతూ జరిగింది చెప్పండి. అన్నని నేను నిలేసేస్తాను" అంది అమ్మాజీ బలవంతంగా సూట్‌కేసు తిరిగి లాక్కుని మహాని టెర్రస్ మీద కుర్చీలో కూర్చోబెడుతూ.

అమ్మాజీ కాఫీ తెచ్చేలోపున మహా టెర్రస్ మీద తను వేసిన మొక్కల్ని గమనిస్తూ కూర్చుంది. అన్నీ విరగబూస్తున్నాయి. గులాబీ అయితే కొమ్మలు వూడల్లా దిగి అణువణువునా గుత్తులుగా పూసింది. డాలియాలు అందంగా హుందాగా విష్ణుచక్రాల్లా వున్నాయి. సన్నజాజులు, విరజాజులూ సరేసరి వాసనలు గుప్పిస్తున్నాయి. గోడమీద అలవాటు పడి రోజూ వస్తున్న బుల్‌బుల్ పిట్ట అటూ యిటూ గెంతుతూ, అమ్మాజీ వేసే గింజల కోసం ఆత్రపడుతూ పాటలు పాడుతోంది.

"దాని గొంతులో గజ్జెలున్నాయా అమ్మాయిగారూ. ఘల్లు ఘల్లుమంటుంది దానిగొంతు అంటూ నాలుగు గింజలు దానికి విసిరి మహాకి కాఫీ కప్పు అందించి తనో కప్పు తీసుకుని పక్కన కూర్చుంది అమ్మాజీ.

మహాతాత్కాలికంగా తన బాధని కోపాన్ని పక్కన పెట్టి "అవును, అమ్మాజీ నేనూ అదే అనుకుంటున్నా. దీని గొంతు వింటే మా యింట్లో పాత గ్రామ్‌ఫోను రికార్డులు వున్నాయి. మా డేడీకి ఓ ఫ్రెండు వున్నారు. ఆయనకి పాటల పిచ్చి. ఆయనతో మా డేడీ అప్పుడప్పుడూ లాన్‌లో కూర్చుని డ్రింక్ చేస్తూ ఆ పాటల గురించి, సాహిత్యం గురించి కబుర్లు చెప్పుకుంటూ ఆనందిస్తుంటారు. అందుకని అవన్నీ నాకు తెలుసు ఆవిడ పేరు షంషాద్‌బేగం. అచ్చు యిలానే ఘల్లుమంటుందావిడ కంఠం. నాకూ అదే గుర్తొస్తుంది" అంది అన్నీ గుర్తుతెచ్చుకుంటూ.

"మీ డేడీ మంచివారన్నమాట. మరెందుకిలా వచ్చేసారు?"

మహా విచారంగా మొహం దించుకుంది.

"మంచివారే. అది తనమాట వినేవరకు. మా మమ్మీదే ఇంట్లో రాజ్యం. ఆవిడకి నన్ను తన అన్నకొడుకుకిచ్చి పెళ్ళి చేయాలని"

"మరి చేసుకోలేకపోయారా?"

మహా అమ్మాజీ వైపు ఎర్రబడి చూసింది.

"ఛీ! వాణ్ణా! వాడు ఆడదానిలా నడుస్తాడు. బుర్రనిండ బంక మట్టి. ఒక పుస్తకం చదవడు. ఆడాళ్ళ మధ్య కూర్చుని ఆడంగి మాటలు మాట్లాడతాడు. ఆడదానిలా తీర్చిదిద్దుకుని మేకప్ చేసుకుంటాడు" అంది కసిగా.

"మరెందుకలాంటివాడికి మిమ్మల్నిచ్చి చేయడం?"

"డబ్బు. వాడి బాబుకి పుచ్చి చచ్చినంత వుంది. మాకు అంతలేకపోయినా బాగానే వుంది. చూశావా అమ్మాజీ, వీళ్ళు డబ్బుకి డబ్బునిచ్చి పెళ్ళిచేస్తారన్నమాట. వీళ్ళకి భార్యాభర్తల మధ్య ప్రేమ అనురాగాలూ అవసరం లేదు. ఆస్తి బయటికి పోకూడదు."

"మరామాట చెప్పలేకపోయారా?"

"చెప్పాను. వింటేనా? లీగల్‌గా ఆస్తికి వారసురాలవ్వు. ఆ తర్వాత నీ సరదాలు నీవి. వాడి ఏడుపు వాడిది" అంది.

ఆ మాట విని అమ్మాజీ తెల్లబోయింది.

"అవునమ్మాజీ, మా డబ్బున్న వాళ్ళ కొంపల్లో తతంగాలింతే. అంగరంగ వైభవంగా పెళ్ళి చేస్తారు. డైమండ్ నగలు, జరీతో అల్లిన బట్టలు, విందులు, అసలు స్వర్గంలో ఇంద్రుడు కూడా అలా చేసి వుండడు. కానీ రెండు మనసులు కలవని శవాలకి"

"ఏంటి శవాలంటున్నారు పొద్దుటే" అంటూ సుబ్బూ వచ్చి కూర్చున్నాడక్కడ.

అమ్మాజీ వెళ్ళింది కాఫీ తేవడానికి.

మహా అతనితో మాట్లాడకుండా లేచి నిలబడింది సూట్‌కేసు తీసుకుని.

"సూట్‌కేసేంటి?" అర్థంకానట్లుగా చూశాడు సుబ్బూ.

"మహాగారు ఎల్లిపోతారంట అన్నా"

"ఎక్కడికి?"

"ఏట్లోకి" కసిగా అంది మహా.

"మరి దానికి సూట్ కేసెందుకు దండగ" అన్నాడు సుబ్బూ కాఫీ తాగుతూ.

అన్నా అడిగానని అనుకోకు. రాత్రి నువ్వేంటి చేసావోగానీ మహాగారు ఏడ్చారు. ఎల్లిపోతానని ఒకటే గొడవ. నేనే బలవంతంగా ఆపాను.

సుబ్బూ కాసేపు మాట్లాడలేదు.

"అవును. తప్పేచేసేసా. రాత్రిబాధలాంటిది. ఒక కన్నకొడుకు అప్పూసొప్పూ చేసి చదివించి అమెరికాకి పంపిస్తే అతని అప్పులు తీర్చకపోగా ఆఖరికి తండ్రికి తలకొరివి పెట్టడానిక్కూడా రాలేదు. చివరికి నా చేతులమీద బూడిదయిపోయారు. నేను ఆ బాధని తట్టుకోలేక చిత్తుగా తాగాను" అన్నాడు బాధగా.

మహా తలదించుకుని విన్నదా మాటలు.

"కాని.. ఆ కాల్చుకోబోవడమేంటి నాకెంత భయమేసిందో తెలుసా? మధ్యలో నన్నెందుకు తిట్టడం?" ఉక్రోషంగా అడిగింది మహా.

"తప్పే ఎక్కువగా తాగాను సారీ"

"సారీ కాదు. మళ్ళీ ఇంకెప్పుడూ తాగనంటేనే వుంటాను" అంది మొండిగా.

"అదెలా?"

"సరే నేను వెళ్తాను" లేచి నిలబడింది మహా.

" నా డిక్షనరీలో యిలాంటి బెదరింపులకి లొంగిపోవడమంటూ లేనేలేదు. సరే తాగిన రోజు ఇంటికి రాను. ఇష్టమయితే వుండు" అంటూ సుబ్బూ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయాడు.

మహా అమ్మాజీ వైపు చూసింది.

"అమ్మాయిగారూ వుండిపోండి. తాగిన రోజు రానంటున్నాడుగా. మెల్లిగా మానేస్తాడు లెండి. ఎంతయినా మగాడు కదాండీ. కొద్దిగా బడాయుంటది అంది అమ్మాజీ బ్రతిమలాడుతున్న ధోరణిలో

మహా తల పంకించింది సరేనన్నట్లుగా.

**వారం రోజులుగా** సుబ్బా, మహా మధ్యన పెద్దగా మాటలు లేవనే చెప్పాలి. సుబ్బా ఎక్కువగా బయటనే గడుపుతున్నాడు. వచ్చినా ఏ అర్ధరాత్రికో ఇల్లు చేరి పడుకుంటున్నాడు. తాగిన దాఖలాలు కూడా ఏమీ లేవు.

తను అన్నమాటను చాలా సీరియస్‌గా తీసుకున్నాడని బాధపడింది మహా.

ఆ మాటే అమ్మాజీతో కూడా అంది.

"పర్లేదు లెండి మీరు మాత్రం ఏంకాని మాటన్నారూ! తాగొద్దన్నారు. తాగుబోతుకు ఇంటా బయటా కూడా గౌరవముండదండి. వల్లు గుల్లజేసుకుని కొంపలార్పడం తప్ప ఏటుందండి అందులో" అంది అమ్మాజీ మహాని ఊరడిస్తున్నట్లుగా.

మహా మౌనంగా విన్నది.

"అయినా పగలూ రాత్రి ఏవో పనులండి. మొన్నటివరకూ సరస్వతమ్మగోరి పనులు జూస్తున్నాడు. ఆవిడకి పెన్షన్ వచ్చే ఏర్పాట్లు చేసాడంట. రెండుసార్లు ఆవిణ్ణి ఆ ఆఫీసుకి తీసుకెళ్ళడం కూడా చూశాను. ఆవిడ కళ్ళనీళ్ళతో చెప్పుకున్నారు. మంచోడేనండి సుబ్బు" అంది అమ్మాజీ.

"మంచోడే అమ్మాజీ! లేకపోతే నన్నిలా ఇంట్లో వుండనిస్తాడా? మాట మాత్రం చాలా పెళుసు. అందుకే తగాదా పడుతుంటాను" అంది మహా.

ఆ రోజు సుబ్బా చాలా రోజుల తర్వాత కాళిదాసుగారింటికి బయలుదేరాడు.

సుబ్బాని చూస్తూనే కాళిదాసు కొంచెం అసహనంగా కదిలి "ఏరా, కొంపసలు గుర్తున్నట్లే లేదు" అన్నాడు.

సుబ్బా నవ్వి అరుగుమీద కూర్చుంటూ "అవునండి. కష్టమే అయ్యింది. ఆళ్ళనీ ఈళ్ళనీ అడుగుతూ వచ్చేసరికి ఇన్నాళ్ళు పట్టింది" అన్నాడు అంతకంటే వెటకారంగా.

"ఏరా, గోదారి నీళ్ళు వంటబట్టినట్టున్నాయి. ఎటకారాలెక్కువయ్యాయి" అన్నాడు కాళిదాసు కోపంగా.

"మరి పట్టవాండీ! ఎవడి దగ్గరకెళ్ళినా తిన్నగా మాటాడే వాడెవడయినా వున్నాడాండీ? 'బాగున్నారాండీ' అనడిగితే లేదు 'మాయరోగం సచ్చి బతికాను' అని జవాబు చెబుతాడొకడు. 'భోంచేసారా' అంటే 'లేదు నువ్వుగాని పెడతావా' అంటాడింకొకడు. అసలు తిన్నగా ఒక జవాబుండదు. ఎదవగోల" అన్నాడు సుబ్బా చిరాగ్గా.

"సరి సర్లే. డబ్బులేవన్నా వసూలయ్యాయా?" అని మాట మార్చాడు కాళిదాసు.

ఆ మాట విననట్లుగా "అమ్మగారేరీ?" అంటూ సత్యవతి కోసం లోపలికి చూస్తూ అడిగాడు సుబ్బా.

"పుట్టింటి కెళ్ళింది - సారె తెచ్చుకోటానికి."

బదులుగా పకపకా నవ్వాడు సుబ్బా.

"ఏటా నవ్వు?" అంటూ కసిరాడు కాళిదాసు.

"ఇంత వయసొచ్చినా పిల్లాజెల్లా లేకపోయినా ఇంకా అత్తగారి సొమ్ము తినాలని ఎంతాశండీ మీకు. ఇంకా అల్లుడి గీర దిగలేదండీ మీలోంచి" అన్నాడు సుబ్బూ నవ్వుతూనే.

"ఏం? ఇన్నేళ్ళనుండి పోషించడం లేదా నేనూ?" అన్నాడు ఉక్రోషంగా కాళిదాసు.

"ఆ! భలే పోషిస్తున్నారులెండి. ఆవిడ పొలం ఆవిడకిచ్చేయండి. ఆవిడే పోషిస్తారు మిమ్మల్నీ మీ యింట్లో కుక్కల్నీ" అన్నాడు సుబ్బూ మరీ మరీ నవ్వుతూ.

"ఉరేయ్ మాటలు మీరతన్నావ్. ముందు వసూలయిన డబ్బుల సంగతి చెప్పు."

సుబ్బూ జేబులోంచి డబ్బు తీసి "పంతులుగారిచ్చారండి ఇది. ఇందులో ఒక పదివేలు వాడేసాను. మీకు ఒక వారంలో సర్దేస్తాను" అన్నాడు.

అసలే కోపంగా వున్న కాళిదాసుకి ఆ మాట యింకా కోపాన్ని తెప్పించింది.

"చెప్పకుండా తీసేసుకోటాలు కూడా మొదలెట్టావా?"

"లేదండి. మాస్టారుగారు అకస్మాత్తుగా చచ్చిపోయారు. ఆవిడ దగ్గర పైసా కూడా లేదు శవాన్నెత్తడానిక్కూడా. అందుకే ఖర్చు పెట్టాల్సొచ్చింది."

"ఓహో! సొమ్మొకడిది సోకొకడిది. అక్కడికి నువ్వేదో ఈరేశలింగం పంతులయినట్లు. ఆడు సస్తే నీకేటి - నువ్వెల్లేది వడ్డీ వసూళ్ళకి. ఆ పని జూసుకు రావాల. మజ్జెలో దానకర్ణుడి ఏషాలెయ్యకు."

కాళిదాసు మాటలకి సుబ్బూకి చెప్పలేని కోపం వచ్చేసిందిగానీ బలవంతంగా అణచుకుని "నిజమే తప్పే చేసాను. పెళ్ళానికి అన్నం పెట్టడం కూడా చాలా ధర్మమనుకునే మీ డబ్బు చెప్పకుండా తీసుకోవటం తప్పే. మూడ్రోజుల్లో తెచ్చిస్తాను. మీకూ నాకూ రాం రాం" అంటూ కాళిదాసు మాట వినిపించుకోకుండా సుబ్బూ బైకెక్కి రయ్యిన బయల్దేరిపోయాడు.

బైక్ నడుపుతున్నాడేగానీ వంట్లో రక్తమంతా మరిగిపోతోంది. మనుషులెంత స్వార్ధపరులు. అన్ని బంధాల్ని డబ్బుతోనే ముడివేస్తారు. ఇన్నాళ్ళనుండి తనెంత నిజాయితీగా పైసా పైసా వసూలు చేసి యిస్తున్నాడు. తనొక వడ్డీ వసూలు చేసే వాడిలా మాత్రమే కనిపిస్తున్నాడా? వాళ్ళ కుటుంబంతో ఎంత అనుబంధం పెంచుకున్నాడు. ఎంత ఆత్మీయంగా మసులుతున్నాడు? ఛీ! ఛీ. ఈ డబ్బు పిచ్చిగాళ్ళంతా యింతే.

సుబ్బూకి యింటికెళ్ళాలనిపించలేదు.

అలా అగమ్యంగా ధవళేశ్వరం బారేజ్ దాకా వచ్చేసాడు.

ఎదురుగా కాటన్ దొర బొమ్మ కనిపించింది దుమ్ము కొట్టుకుని కాకిరెట్టలతో. ఉసూరుమనిపించింది. అసలెక్కడినుండో స్టీమర్లలో వచ్చి ఆ మహానుభావుడు జీవితమంతా ఈ గోదారొడ్డున పడివుండి దండకారణ్యాలలో గుర్రాల మీద స్వారీ చేసి సర్వే చేసి ఉభయ గోదావరి జిల్లాల్ని సస్యశ్యామలం చేస్తే ముప్పొద్దులా తింటూ ఒక్కడైనా ఆయన్ని కాని ఆయన విగ్రహాన్ని కానీ పట్టించుకుంటున్నారా?

సుబ్బూ చిరాకుగా బైక్ ఒక పక్కకి పార్కు చేసి సర్పలెస్‌వియర్ దగ్గర పిట్టగోడ కానుకుని నీటిలోకి తొంగి చూసాడు. సర్పలెస్‌వియర్‌లోని నీళ్ళు ఉక్కిరిబిక్కిరవుతున్నట్లు, ఊపిరాడనట్లు సుడులు తిరుగుతోంది అనంతమైన శక్తితో యుద్ధం చేస్తున్న ఆ నీటిని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు ఎంతోసేపు.

ఎందుకో ఒక్కసారిగా అమ్మానాన్నా గుర్తొచ్చి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. దుఃఖం తన్నుకొచ్చింది. ఇంటికెళ్ళిపోవాలనిపించిందో క్షణం. వెంటనే ఆ ముసిల్ది గుర్తొచ్చి మనసు నిగ్రహించుకున్నాడు.

'ఛీ' అదున్నంతవరకూ వెళ్ళకూడదు. అది ఆడదా! రాక్షసి. పిశాచి' అని తల విదిలించుకున్నాడు.

పదే పదే కాళిదాసుగారి మాటలు చెవిలో మార్మ్రోగుతున్నాయి. మనుషులకింత జాలిలేదేం? డబ్బు శాశ్వతమా? దాని కోసం అనుబంధాల్ని తెంచేసుకుని హృదయాల్ని అంత కఠినంగా చేసుకోవాలా? మానవత్వాన్ని మరచిపోవాలా? ఇన్ని రోజులుగా చూస్తున్నాడు. తనేంటో తెలియదా?

పిచ్చిగా తాగేయాలనిపిస్తోంది సుబ్బూకి.

వెంటనే మహా గుర్తొచ్చింది.

'ఈ మహాతల్లొకటి కొంపలో చేరింది. చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు. తనని తాగొద్దనడానికి ఈవిడెవరూ? తన మంచి చెడ్డలు తాగుడులోనే చూసిందా? తాగుడు ఒక వ్యసనం. అది హృదయం కాదే. తను మంచివాడు కాకపోతే అసలు తనింట్లో తిష్ఠవేయగలిగేదా? ఏంటో ఈ లోకానికి అవన్నీ అక్కర్లేదు. ఎవరో ఏదో చెబుతారు. వాటినే నమ్ముతారు.' సుబ్బూ చీకటి పడేవరకూ అటూ యిటూ తిరిగి ఇంటిదారి పట్టాడు.

దారిలో బార్‌లు కనిపించినపుడల్లా ఆగి తాగాలని పిస్తోంది. కానీ మహా గుర్తొచ్చి తనని తాను నిగ్రహించుకుని ఇల్లు చేరాడు సుబ్బూ.

పాపాయమ్మ యధావిధిగా దోసెలేస్తూ కూర్చుంది.

అమ్మాజీ సాయం చేస్తోంది తన ధోరణిలో.

చుట్టూ ఎవరెవరో వచ్చి తింటున్నారు.

పాపాయమ్మ కోడల్ని చిన్నగా తిట్టుకుంటూనే పనికానిస్తోంది. 'ష్! ఏవో అనొద్దన్నానా మామ్మా! కోతిపుండు బ్రహ్మరాక్షసని తగాదా పెంచేవరకూ నిద్రపోవు" అంది అమ్మాజీ చెవిలో చేరి నెమ్మదిగా.

"నువ్వు మరీనే. నా మీద అంతోటి దొంగతనాలెట్టాకా నోరు మూస్కుని సావాలా? నాలుగూ కడిగేద్దావంటే నువ్వొక్కద్దానివి నోరు యిప్పనియ్యవు" అంది పాపాయమ్మ కోపంగా.

"ఏవనంటావు - సిగ్గుండాల."

పాపాయమ్మ అమ్మాజీవైపు గుర్రుగా చూసింది.

"అవును మామ్మా తప్పంతా నీ కొడుకుది. పనికిమాలినోడికిచ్చి పెళ్ళి చేసేవ్. లతేదో కష్టపడి పనిచేసుకొస్తుంది. అసలు నీ కొడుకుతో కాపరమెవరు చేస్తారు? విసుగులో ఏదో అనేసింది. తప్పు తెలుసుకుని మెదలకుండా వుంది కదా! ఇక అంతటితో ఆపు."

"ఏంటే అదేవన్నా సెమాపన చెప్పిందా నాకు" అంటూ రెచ్చిపోయింది పాపాయమ్మ.

"ఆ, సెమాపన లొక్కటే తక్కువ. ఇదేవన్నా సినిమానా? నీకాళ్ల మీద పడిపోటానికి వూరుకుందూ" అంది అమ్మాజీ.

అంతలోనే లత పర్సు తగిలించుకుని బయటకొచ్చింది.

లతని చూసి అమ్మాజీ పాపాయమ్మలతో పాటు అక్కడున్నవాళ్ళందరూ తెల్లబోయి చూశారు.

కారణం మొదటిసారి లత ఘుడీదారు వేసుకుంది.

లత చిరునవ్వుతో అత్తగారి వైపు చూస్తూ "ఎలా వుందత్తా? కొత్తవి నిన్న కొనుక్కున్నా" అంది.

పాపాయమ్మకి లతని ఆ డ్రెస్‌లో చూసి అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఆ!ఆ! చాలా బాగుంది తల్లీ అరబస్తా బియ్యం పావుకేజి సంచిలో కూరినట్లు" అంది వెటకారంగా.

ఆ మాటకి అక్కడ దోసెలు తింటున్న మగాళ్ళంతా ఫక్కున నవ్వారు.

లత చిన్నబుచ్చుకుని "మిమ్మల్ని అడగటం నాదే తప్పు" అంటు వెళ్ళిపోయింది కోపంగా.

"ఏంటి మామ్మా నోటికేదొస్తే అదే పేల్తావు. ఏదో వుజ్జోగం చేస్తుంది. ఏసుకుంది. ఈ రోజుల్లో అందరూ అయ్యేగా తొడుక్కుంటున్నారు" అంది అమ్మాజీ.

"ఏటీ, వుజ్జోగవా?" అన్నాడొకడు దోసెలు తింటూ వెటకారంగా.

"కాదా?" అంది అమ్మాజీ అమాయకంగా మొహం పెట్టి.

"ఇంకా నయం. ఈ జిల్లాకి కలకటేరన్లేదు. దానవాయి పేటలో వెంకటరత్నం పచారీ సాపులో పప్పులూ వుప్పులూ ఏరతది నీ కోడలు" అంటూ గాలి తీసేసాడు అతను.

ఆ మాటకి పాపాయమ్మ మొహం వంట్లో నెత్తురు తీసేసినట్లుగా పాలిపోయింది.

"ఏంటి, ఏం మాట్లాడతన్నావ్" అంది కోపంగా.

"ఊరికే కసురుకోకు మామ్మా. నేను నిజవే చెబుతున్నా. ఆ కొట్టుకాడ నీ కోడల్ని శానాసార్లు సూసా" అన్నాడతను డబ్బులిచ్చి వెళ్ళిపోతూ.

పాపాయమ్మ ఆ షాక్ నుండి తేరుకోకుండానే లోవరాజు వచ్చి నిలబడి "లోన రామకిష్టుడున్నాడా? ఒకసారి కేకెయ్" అన్నాడు పాపాయమ్మకేసి చూస్తు.

పాపాయమ్మ కోపం, అసహనం లోవరాజు మీదకి మళ్ళాయి.

"గోదాట్లో కెల్లాడు. ఆడితో పనేంటి నీకు" అంది.

"చొక్కాలకి జేబులు కుట్టిచ్చుకుని రెండు నెల్లయింది. డబ్బులివ్వలేదు"

"ఇదంతా నీ యవ్వారవా? నువ్వు జేబులు కుడతావు. నీ పెళ్ళాం బియ్యం కొంటది. ఎదవ దొంగతొత్తుకొడుకుల సంసారం. ఛీ" అంది పాపాయమ్మ.

"ఇదిగో మామ్మా మాటలు తిన్నగా రానియ్. ఆడందులో దొంగబియ్యవే తెస్తాడో - దొరబియ్యవే తెస్తాడో ఎవడిక్కావాలి? కుట్టమంటే కుట్టా" అన్నాడు లోవరాజు అసలే పెళ్ళాం మాటలు విని తగాదా కొచ్చిన కాకతో.

"సర్లే లోవరాజుగారూ రామకిష్టొస్తే నే చెబుతా. కొంచెం నా లేసు డబ్బులిస్తారా? చాలా అవసరంగా వుంది" అంది అమ్మాజీ చాలా వినయంగా.

"ఉండవమ్మా రామాయణంలో పిడకల వేటలా నీ గొడవొకటి. ఆ లేసులేం బాగాలేదు. కావాలంటే వచ్చి పట్టుకుపో" అంటూ విసుగ్గా వెళ్ళిపోయాడు లోవరాజు.

లోవరాజు జవాబుకి అమ్మాజీ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"సూడవే ఎంతమాటనేసి ఎల్లేడో" అంటున్న పాపాయమ్మ మాటలు వినిపించుకోకుండా స్వరున మహా దగ్గరకి వెళ్ళింది అమ్మాజీ.

అమ్మాజీ కళ్ళలో నీళ్ళు చూసి కంగారు పడింది మహా

"ఏం జరిగింది?" అనడిగింది గాభరాగా.

అమ్మాజీ జవాబు చెప్పలేదు.

గోడకి జేరబడి ఏడుస్తూనే వుంది.

ఎప్పుడూ గలగలా నవ్వే అమ్మాజీ అలా ఏడవడం చూసి మహా నివ్వెరపోయింది.

"అమ్మాజీ! అమ్మాజీ ఏం జరిగింది? ఎవరేవన్నారూ?" అడిగింది అమ్మాజీని కుదుపుతు.

అమ్మాజీ తేరుకుని కళ్ళు తుడుచుకుంది.

"ఎవరేవీ అనలేదమ్మాయిగారు. నా దరిద్రవే నన్నేడిపిస్తంది. రెండచ్చరాలు చదువుకోనందుకేగా యిన్ని కట్టాలూ. ఎంత కష్టపడి ఎంత మందిని అడుక్కుని చదివించాను తమ్ముళ్ళని. ఆళ్ళిప్పుడు మంచి వుజ్జోగాలు చేసుకుంటూ నా వంక కన్నెత్తి చూడరు. పదిరూపాయలివ్వరు. నా బతుకు సెడగొట్టి నన్నిలా పనికిమాలిన దాన్ని చేసి వదిలేసి నోళ్ళు నేనెలా వున్నానో అసలు సచ్చానో బతికానో సూడరు. అందుకే ఏడుపొచ్చేసింది" అంది అమ్మాజీ నవ్వాలని ప్రయత్నిస్తూ.

"అది పాత కథే ఇప్పుడు సడెన్‌గా ఎందుకేడ్చేవు. ఆ సంగతి చెప్పు."

"ఏం లేదండి ఆ లోవరాజుగాడు లేసుల డబ్బులడిగితే 'రేపూ - మాపూ' అంటూ తప్పించుకు తిరుగుతున్నాడు.

ఈ రోజు అయ్యి పనికిమాలిన లేసులని ఛీత్కరించి పట్టుకుపొమ్మని పురుగులా యిదిలించేసాడు" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది అమ్మాజీ.

"ఏడ్చాడు. ఇకనుండి నీకు వాడికమ్మాల్సిన ఖర్మలేదు. ఎవడి కాళ్ళూ పట్టుకోవాల్సిన ఖర్మ అంతకన్నా లేదు" అంది మహా.

అమ్మాజీ మహావైపు ఆశ్చర్యంగా చూసింది. "నాలుగు రోజులోపిక పట్టు. బేరాలు నీ దగ్గరకే తన్నుకొసాయి" అంది మహా అమ్మాజీని వూరడిస్తూ.

"ఏం జరిగింది?" అప్పుడే లోనికొస్తూ అడిగాడు సుబ్బా.

"ఏం లేదన్నా ఏం లేదు" అంది అమ్మాజీ గాభరాగా.

"అదేం కాదు' అంటూ జరిగిందంతా చెప్పేసింది మహా.

సుబ్బా తలూపి మళ్ళీ బయటకెళ్ళిపోయాడు.

"అయ్యో - అసలే అన్నకి కోపమెక్కువ. ఏంటిజేస్తాడో" అంది అమ్మాజీ ఆందోళనగా.

"సుబ్బాకి కోపమెక్కువేకానీ అంత తొందరపాటు మనిషి కాదు ఏ పనిమీద వెళ్ళాడో లే" అంది మహా ఊరడింపుగా.

సుబ్బా అస్థిమితంగా బైక్ నడుపుతున్నాడు. అమ్మాజీ మనసులో మెదులుతోంది.

అందరికీ డబ్బు కావాలి.

అందరి కష్టాలూ మూడొంతులు డబ్బు లేకనే.

ఆకలికి డబ్బు కావాలి - జబ్బులకి డబ్బుకావాలి.

ఆఖరికి శవన్నెత్తడానికిక్కూడా డబ్బేకావాలి.

ఉన్నవాడికి ఇంకా ఇంకా చాలక కావాలి.

స్విస్ బాంక్‌లో నోట్లు చివికిపోతున్నా ఇంకా యింకా దాయడానికి డబ్బుకావాలి.

దయ్యాల కొంపల్లా ఒకరిద్దరూ వుండేవాళ్ళకి కూడా పెద్ద పెద్ద పేలస్‌లు కట్టుకోడానికి డబ్బుకావాలి.

ఈ ఆశలకి అంతులేదు.

పక్కవాడి దారుణ జీవితాల పట్ల జాలి లేదు.

సుబ్బా మనసులో వెల్లువలా పొంగుతున్న ఆలోచనలతో బైక్ నడుపుతూ "అన్నా అన్నా" అన్న పిలుపు విని ఆగిపోయి చూశాడు.

"అన్నా నేనే అన్నా"

సుబ్బా వెంకటరత్నం పచారీ షాపు వేపు చూశాడు.

అక్కడ ఏడుస్తూ లత నిలబడి వుంది. కొట్టుదగ్గర జనం కొంతమంది మూగి వున్నారు.

సుబ్బా గబగబా బైక్ దిగి షాపులోకి వెళ్ళాడు.

"అన్నా నేనిక్కడ పనిచేస్తన్నా అన్నా. నేను దొంగనని, బియ్యం పప్పులూ కాజేసేనని ఈ షాపతను తిడతన్నాడన్నా. నేనలాంటిదాన్ని కానన్నా! నువ్వన్నా చెప్పన్నా!" లత గుక్కలు పెట్టి ఏడుస్తోంది.

ఆ యింట్లో యిన్నాళ్ళనుండి వుంటున్నా ఎన్నడు లత తనతో మాట్లాడలేదు.

సుబ్బా జనం వైపు చూశాడు.

అందులో లోవరాజు నిలబడి వున్నాడు - పళ్ళికిలిస్తూ. విషయం అర్థమైంది.

"ఆవిడలాంటిది కాదు వదిలేయండి"

"నువ్వెవరివి చెప్పడానికి. ఈవిడ బియ్యం తీసుకెళ్ళడం ఈవిడగారి మొగుడు అమ్మేయడం" అన్నాడు షాపతను వెటకారంగా.

"లేదన్నా ఏరగా పనికి మాలినవి మాకిస్తారు. అయ్యే యింటికి తెస్తాను. నా మాట నమ్మన్నా" అంది లత ఏడుస్తూనే.

"మీకు ఆవిడ పట్టుకెళ్ళినట్లు సాక్ష్యాలున్నాయా?"

"ఏంటి మీ లా కొచ్చెన్సూ - చూసినోళ్ళు చెప్పారు"

"ఎవరా చూసినోళ్ళు?"

షాపతను జనంలోకి చూశాడు.

లోవరాజు అప్పటికే అక్కడినుండి జారుకున్నాడు.

"మీ షాపులో ఎవరి చేతనయినా చెప్పించండి" అన్నాడు సుబ్బా అందరివైపు చూస్తూ.

షాపులో మిగతావారి వైపు చూస్తూ "చెప్పండి. ఈవిడ నా చెల్లెలు. దొంగతనం చేసిందని చెబితే ఈవిడ్ని యిక్కడే పాతేస్తాను" అన్నాడు సుబ్బా కటువుగా.

"లేదు. లత అలాంటిది కాదు. యిచ్చిన బియ్యవే తీసుకెళతది. మేవందరమూ అంతే. ఎల్లేటప్పుడు మమ్మల్ని చెక్ చేసే అంపిస్తారు" అన్నారు మిగతావాళ్ళు.

ఆ మాట విని తలదించుకున్నాడు షాపతను.

"సారీ అతనెవరో వచ్చి చెబితే.." అంటూ గొణిగాడు.

"చెబుతారండీ వినే వాళ్ళుంటే. నిజానిజాలు తెలుసుకోకుండా చెప్పుడు మాటలు వినే వాళ్ళుంటే చెప్పేవాళ్ళు చాలామంది వుంటారు. అసూయతో కొందరు, వాళ్ళే ముందు తప్పుచేసి వుక్రోషంగా నిందలు వేసే వాళ్ళు కొందరు ఎప్పుడూ వుండనే వుంటారు. ఒక మెట్టు పైన కూర్చున్న వాళ్ళు నిజానిజాలు గ్రహించాలి. ఇంతమందిలో నిందవేసి అవమానించారు ఒక ఆడపిల్లని. ఇప్పుడేమిచ్చి మీ మాటలు వెనక్కు తీసుకుంటారు?"

"సారీ అండి, ఆ అమ్మాయి మా షాపులోనే పని చేసుకోవచ్చు" అన్నాడు షాపు యజమాని.

"ఇక ఎంతమాత్రం యిక్కడ పని చెయ్యదు. ఆమెకు రావాల్సిన జీతం లెక్కకట్టి యివ్వండి."

షాపతను లత జీతం యిచ్చేసాడు.

షాపు మెట్లు దిగుతూ "అన్నా నీ రుణం తీర్చుకోలేనన్నా అని మళ్ళీ ఏడవబోయింది లత.

"బైకెక్కు"

ఆశ్చర్యపోతూనే సుబ్బూ వెనక కూర్చుంది లత.

బైకు తిన్నగా భజన్‌లాల్ షాపు ముందాగింది.

బైక్ దిగి 'రా' అన్నాడు సుబ్బూ.

సుబ్బూ వెనక భయంగా నడిచింది లత.

"ఓ, సుబ్బూగారా? ఏంటిటు వచ్చారు? ఏం కావాలి?" అనడిగాడు భజన్‌లాల్ నవ్వుతూ.

'చిన్న సహాయం' అంటూ జరిగిందంతా చెప్పాడు సుబ్బూ.

అంతా విన్నాడు భజన్‌లాల్.

"మీరు రికమండ్ చేస్తే వాళ్ళు తప్పక నిజాయితీ పరులే అయి వుంటారు" అంటూ లతవైపు చూసి "ఏమ్మా, తమ్ముడు బంగారం షాపులో సేల్స్ అమ్మాయి ఒకామె మానేసింది. అక్కడ చేస్తావా?" అనడిగాడు.

లత బుద్ధిగా తలూపింది.

భజన్‌లాల్ చెప్పిన జీతం చూసి కళ్ళు తిరిగాయి లతకి.

సంతోషంతో అతనికి నమస్కరించింది.

భజన్‌లాల్ ఆమెని తీసుకెళ్ళి ఎదురు బంగారం షాపులో తమ్ముడికి మరదలికి పరిచయం చేసాడు.

క్షణాల్లో లత రెండింతలు ఎక్కువ జీతంతో షాపులో పనికి కుదురుకుంది.

అప్పుడే సరిగ్గా మహా అమ్మాజీని తీసుకుని భజన్‌లాల్ షాపులోకి వెళ్ళటం చూసి ఆశ్చర్యపోయాడు సుబ్బూ.

ఎందుకో, ఏమిటో అప్పుడే తెలుసుకోవడం సభ్యతకాదని లతని తీసుకుని ఇంటి మొహం పట్టాడు సుబ్బూ.

లతని బైక్ మీద ఎక్కించుకుని వెళ్తున్న సుబ్బూని వెనక్కు తిరిగి చూసి మరింత ఆశ్చర్యపోయింది మహా.

**షాపులోకి** వస్తున్న మహాని, అమ్మాజీని చూసి చిరునవ్వుతో ఆహ్వానించాడు భజన్‌లాల్.

"రండి, రండి.ఇప్పుడే సుబ్బూ వచ్చి వెళ్ళారు" అన్నాడు పలకరింపుగా.

బదులుగా ఔనన్నట్లు తల పంకించింది మహా.

ఇద్దరూ వచ్చి కూర్చున్నాక "ఏం కావాలి?" అనడిగాడు భజన్‌లాల్.

"అమ్మాజీ లేసులు చాలా బాగా అల్లుతుంది. అందుకోసం మంచి త్రెడ్స్ కావాలి. ఆన్‌లైన్ మార్కెట్ కోసం" అంది మహా.

ఆన్‌లైన్ మార్కెట్ అంటే అర్థంకాని అమ్మాజీ మహావైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఆన్‌లైనా?" అన్నాడు భజన్‌లాల్ ఆశ్చర్యంగా.

"అవునండి. ఇక్కడ లోకల్ టైలర్స్ ఆమెని మోసం చేస్తున్నారు. ఆమె అల్లిన లేసులు చాలా బాగుంటాయి. ఎటొచ్చీ ఆమె అల్లే దారం ఖరీదయింది కాదు." అంది మహా.

"అల్లినవేమయినా తెచ్చారా?"

మహా వెంటనే అమ్మాజీ బాగ్‌లో వున్న లేసుల్ని తీసి చూపించింది.

భజన్‌లాల్ వాటిని చేతిలోకి తీసుకుని అటూ యిటూ తిప్పి పరీక్షించి "మీరు చెప్పింది నిజమే. ఈమెకు మంచి స్కిల్ వుంది. ఈమె ఒక్కరే అల్లేటప్పుడు ఆన్‌లైన్ దాకా అవసరంలేదు. నేనే వాటిని తీసుకుంటాను. ఇంకా ఎక్కువ అల్లగలితే వాటిని నా కజిన్‌కి ముంబయి పంపుతాను. అతనికి అక్కడ రెడీమేడ్ షాపుంది" అన్నాడు.

ఆ మాట విని అమ్మాజీ మొహం వికసించింది.

మహా కూడా అంగీకారంగా తలూపింది.

వెంటనే భజన్‌లాల్ దారాలు, సూదులు తెప్పించి వాళ్ళిద్దరికీ చూపించాడు.

"ఇవి లేటెస్టుగా వచ్చిన సిల్క్ త్రెడ్స్. చేతి పనికి మన మార్కెట్‌లో గిరాకీ లేదు. మెషిన్ మీద తయారయిన లేసులే వాడేస్తాం మేము. వాటిని ఇష్టపడే వర్గం వేరే వుంటుంది. ఆ వర్గానికి మా కజిన్ మార్కెట్ చేస్తాడు. ఫారిన్ కూడా పంపుతుంటాడు. మీకు కావాల్సిన దారాలు, సూదులు తీసుకోండి. ఇదే నా భజానా అనుకోండి" అన్నాడు.

మహా కూడా అమ్మాజీతోపాటు ఆ మాటలు విని సంతోషించింది. అతను కొత్త డిజైన్స్ అల్లే లేసు పుస్తకాలు కూడా కొన్ని ఇచ్చాడు.

"మరింకేమన్నా కావాలా?" అన్నాడు భజన్‌లాల్ చిరునవ్వుతో.

"నాలుగు కేజీలు పిండి రుబ్బగల గ్రైండర్ కావాలి" అంది మహా.

అమ్మాజీ మహా వైపు ఆశ్చర్యంగా చూసింది.

భజన్ సేల్స్‌బాయ్‌ని పిలిచి మహాని, అమ్మాజీని ఆ వింగ్‌కి పంపించాడు.

"వీటి గురించి నాకంతగా తెలియదు. నువ్వు చూడు" అంది మహా అమ్మాజీ వైపు తిరిగి.

"దేనికండీ యిది" అమాయకంగా అడిగింది అమ్మాజీ.

"పాపాయమ్మ మామ్మకి. నువ్వు పప్పు రుబ్బుతూ కూర్చుంటే ఇక లేసులెప్పుడల్లుతావు?" అంది మహా.

మహా ఆలోచనకి అమ్మాజీ తెల్లబోయింది.

"ఒక నాలుగు కేజీలయితే చాలండి" అంది.

మహా ఒకటి తీసుకుని భజన్‌లాల్‌కి బిల్ పే చేసి అమ్మాజీతో బయటకి వచ్చింది.

జీవితంలో ఎన్నడు కలగని ఆనందమేదో ఆమె మ నస్సుని నింపేసింది మొదటిసారిగా.

ఇవ్వడంలో ఇంత తృప్తి, సంతోషముంటాయన్న నిజం మొదటిసారిగా ఆమెకు అర్థమయ్యింది.

"ఇక్కడాపన్నయ్యా" అంది లత సుబ్బూతో.

సుబ్బూ బైక్‌ని ఆపి "ఎందుకు, నేనూ ఇంటికే వస్తున్నా కదా!" అన్నాడు సుబ్బూ.

"ఏమనుకోకన్నయ్యా. మా అత్త మంచిది కాదు. ఏదన్నా అంటే బాగోదు. నేను నడిచెళ్ళిపోతాను" అంది లత బైక్ దిగి.

సుబ్బూ ఏమీ అనలేదు. ఆ లొకాలిటీ మనుషుల సంగతి తెలుసుకాబట్టి అతను బైక్ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే అక్కడ కొంచెం దూరంలో వున్నా చెక్కా సత్యవతి కొట్టువద్ద కూర్చుని బీడీ కాల్చుకుంటున్న రామక్రిష్ణ కంట్లో పడింది.

అయినా కోపాన్నణచుకుని ఎక్కడ సత్యవతి చూసిందోనని ఓరకంట సత్యవతివైపు చూశాడు.

తనని తాను తప్ప వెయ్యికళ్ళతో అందర్నీ శల్యపరీక్ష చేసే సత్యవతి రాంక్రిష్ణ వైపు చూసి వంకరగా నవ్వింది.

"నువువ్ కొంపకెల్లకపోతే ఏం జేస్తదిలే" అంది అతన్ని రెచ్చగొట్టే వుద్దేశ్యంతో.

"ఓ వందిటు పడెయ్యి" అన్నాడు రామక్రిష్ణ కోపంగా.

"చాల్లే సంబడం. ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు. అప్పుడు ముక్కుబట్టిన బియ్యవన్నా పోసేటేడివి. ఇప్పుడేవుంది యివ్వడానికి నీదగ్గర. అసలే నా మొగుడు కుట్టు కూలీ యివ్వలేదని అగ్గిమీద గుగ్గిలమయిపోతున్నాడు. ఎల్లెల్లు" అంది చిరాగ్గా సత్యవతి.

రామక్రిష్ణ లేచి నిలబడ్డాడు.

"ఇయ్యేల రత్తం ఏరులై పారుద్ది. ఆణ్ణి నిలువునా నరుకుతాను. నువ్వివ్వకపోతే నీ బాబిస్తాడు" అంటూ అప్పుడే కౌంటర్‌లో ఏదో కావాలని ఎవరో పెట్టిన వందరూపాయిల నోటు లాక్కుని రివ్వున వెళ్ళిపోయాడు రామక్రిష్ణ.

ఇంకోసారయితే సత్యవతి కేకలు పెట్టి గగ్గోలు చేసేదే

కానీ ఇప్పుడామెకు పాపాయమ్మ మీద కక్షతీరాలంటే ఆ మాత్రం త్యాగం చెయ్యాలి.

అందుకే ఆమె చూస్తూ వుండిపోయింది - ఒక రకమైన పైశాచికానందంతో.

లత గబగబా యింట్లోకి వెళ్ళి 'అత్తయ్యా' అని పిలిచింది పాపాయమ్మని.

ఆ పిలుపులో పూర్వపు నిర్లక్ష్యం కాని పొగరుగానీ లేకపోవడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది.

అయినా ఒక రకమైన అపనమ్మకంతోనే లోపలికెళ్ళింది పాపాయమ్మ.

లత గబుక్కున పాపాయమ్మ కాళ్ళమీద పడి "నన్ను క్షమించత్తా" అంది ఏడుస్తూ.

ఏమాత్రం ఊహించని ఆ చర్యకి పాపాయమ్మ నివ్వెరపోయి చూసింది.

"అవునత్తా" అంటూ లత ఆ రోజు జరిగిన సంఘటన మొత్తం చెబుతుంటే తెల్లబోయింది పాపాయమ్మ.

"సుబ్బు దేవుడత్తా. ఈ రోజు నా పరువు కాపాడాడు. నాకొక అన్న వున్నా నాకింత సాయం చేసేవాడు కాదు" అని చెబుతుండగానే బయట రామక్రిష్ణ పెడుతున్న గావుకేకలు వినిపించాయి.

ఆ రోజు బియ్యం దొంగతనం బయటపడ్డాక రామక్రిష్ణ యింటికి రావడం అదే ప్రధమం.

"ఇక్కడేం జరుగుతుందే నన్ను బయటకంపేసి మీ ఆడంగులిద్దరూ కంపెనీ నడుపుతున్నారే. నేనిక్కడ పౌరుసం, మానం, మరియాదా సచ్చి తిరుగుతున్నాననుకున్నారే. కతలు నడిపేస్తున్నారు కతలు. ఈ రోజు ఆడి రత్తం కల్ల జూస్తాను. నిన్ను నరికి పోగులెడతాను" అంటూ అనేక రకాలుగా రామక్రిష్ణ తుపానులో సముద్రం ఒడ్డునున్న సరుగుడు చెట్టులా వూగి పోతున్నాడు.

తాగి మొద్దు బారిన నాలుకతో ముద్దముద్దగా మాటలు తూలుతున్నాడు.

అతని అరుపులు విని ఆ బిల్డింగ్‌లో వాళ్ళంతా ఆ మధ్యలో వున్న కారిడార్‌లో కొచ్చి ఆశక్తిగా వింటున్నారు.

లత బిక్కచచ్చిపోయింది.

పాపాయమ్మ బయటకొచ్చి "ఏం జరిగిందిరా?" అంది సహనంగా.

"ఏం జరిగిందా.. ఏం జరగాలా. ఇది ఆడి బండెక్కి సికార్లు జేస్తంది. పట్టపగలే నడి బజార్లో పైలాపచ్చీసుగా వుసారెక్కిపోయి వూరంతా బలాదూరు తిరుగుతున్నారు." అన్నాడు రామక్రిష్ణ రెచ్చిపోతూ.

ఆ అరుపులు విని సుబ్బూ మెట్లపైన నిలబడి చూసాడు.

రామక్రిష్ణ చూపు అతనిమీద పడింది.

"అడిగో వచ్చాడుగా యిరో! ఆణ్ణడుగు. ఏరా వూళ్ళో ఏ ఆడదాన్నీ మరియాదగా బతకనియ్యవురా! థూ నీ బతుకుసెడ!" అన్నాడు అక్కడున్న కఱ్ఱ తీసుకుని.

అతని మాటలకి సుబ్బూ కళ్ళెఱ్ఱబడ్డాయి.

అవతల సరస్వతమ్మగారు, అమ్మాణీగారు తదితరులంతా గుమ్మాల్లోకొచ్చి నిలబడ్డారు.

అప్పుడే ఆటో దిగిన మహా, అమ్మాజీ బిక్కచచ్చిపోయి గుమ్మలోనే నిలబడిపోయారు స్థాణువుల్లా.

సుబ్బూ ఆవేశంగా నాలుగుమెట్లు చరచరా దిగాడు.

పాపాయమ్మ సుబ్బూ వైపు చూసి "ఆగక్కడ" అంది ఆవేశంగా. ఆ మాటకి సుబ్బూతోపాటు అక్కడున్న అందరూ నివ్వెరపోయి చూశారు.

"ఇది మా యింటి యవ్వారం. మేం తేల్చుకుంటాం. నువ్విందులోకి రావొద్దు" అంది పాపాయమ్మ సుబ్బూకేసి చూస్తూ.

"కానీ.. వాడు నన్నంటున్నాడు" అన్నాడు సుబ్బూ కోపంగా.

"అంటే అంటాడు. నువ్వు మగోడివి నీకేం బోతుంది" అంటూ పాపాయమ్మ లోపలికెళ్ళి ఒక పెట్టెతో బయటకొచ్చింది.

ఆ వ్యవహారాన్ని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

రామక్రిష్ణ కూడా తాగిన మందు దిగి తల్లివంక పెట్టెవంక మార్చి మార్చి చూశాడు.

"పద!" అంది పాపాయమ్మ రామక్రిష్ణ రెక్కపట్టుకుని.

"ఎక్కడికే?" అన్నాడు రామక్రిష్ణ పూర్తిగా నిషా దిగి తెల్లబోతూ.

"అదింత పని చేసాక మనకేం సీమూ నెత్తురూ లేదా. పోయి ఏరే వుందాం. దాన్నే కులకనియ్యి. పద" అంది పాపాయమ్మ ఆవేశంగా.

"నాతో ఎక్కడకొస్తావ్? నాకేం యిల్లా వాకిలా? నిన్నెవరు పోసిస్తారే బాబూ! నా వల్ల కాదు" అన్నాడు రామక్రిష్ణ.

అయినా సరే వీధి వాకిలి దాకా రామక్రిష్ణని లాక్కొచ్చి పెట్టె అతని చేతిలో పెట్టింది.

"థూ! నీతో రమ్మన్నా వస్తానా? ఆ పిల్లా, నేనూ కట్టపడి పనిజేస్తా దున్నపోతులా వున్న నిన్ను ముప్పొద్దులా కూడు పడేసి పోసిస్తుంటే పనికి మాలిన మాటలాడి పరువుదీస్తావా? సీ! నీ మొకం సంతకెల్ల. ఆ గోదాట్లో దూకి సావరాదూ" అంది పాపాయమ్మ ఆవేశంగా.

అందరూ ఆశ్చర్యపోయి చూసారు పాపాయమ్మ కేసి.

పాపాయమ్మ ఆ మూలనున్న కఱ్ఱదీసుకుని "ఆ పిల్లోడు ఎవరుకన్న బిడ్డో నీ పెల్లాన్ని సెల్లెల్లా కాపాడి, వుజ్జోగమేయిస్తే వల్లు బలిసి తాగి ఎదవ పేలాపన పేల్తావా?" ఇదిగో యిప్పుడే సెబుతున్నా. ఈ గుమ్మం మల్లీ తొక్కావంటే నీ పేనాలు తీసి యములోడికి నేనే అప్పసెబుతా. ఎప్పుడో సేసిన పాపానికి నిన్ను కన్నాను. ఏ పాపం సేసిందో నీకు పెళ్ళావై అది అగసాట్లు పడింది. ఇకసాలు మాకీ సొర్గం.

మళ్లీ ఈసారి ఏ దారికాసన్నా దాన్నేడిపించావో నేను కాదు సుబ్బా నీ వంటో ఎముకలు సున్నం జేస్తాడు. కదులింక" అంటూ గదమాయించింది పాపాయమ్మ రొప్పుతు.

పాపాయమ్మ పరిస్థితి గ్రహించి అమ్మాజీ పరుగున వచ్చి పట్టుకుంది. సరస్వతమ్మగారు గబగబా వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిచ్చారు.

అంతవరకూ సందేహంగా చూస్తున్న లత లోనికెళ్ళి బి.పి టాబ్లెట్ తెచ్చి వేసి స్టూలు మీద కూర్చోబెట్టింది.

ఇక అక్కడ తనకేమాత్రం పరపతి లేదని అర్థమయిన రామక్రిష్ణ పెట్టె తీసుకుని బయల్దేరుతుంటే పాపాయమ్మ కొంగున కట్టుకున్న రెండొందలు తీసి విసిరి "ఇయ్యిగో బస్సు సార్జీలు. ఈ వూరొదిలేసి ఎక్కడన్నా అడుక్కు తిను" అంది.

ఏ మాత్రం సిగ్గూ బిడియం లేని రామక్రిష్ణ ఆ నోట్లేరుకుని వెళ్ళిపోయాడు.

సుబ్బా అస్థిమితంగా పడుకుని దొర్లుతున్నాడు.

కాళిదాసుకిచ్చిన గడువులో ఒక్క రోజయిపోయింది. ఇప్పటివరకూ ఎక్కడా రూపాయి పుట్టలేదు. అసలెక్కడా ప్రయత్నించలేనేలేదు.

భజన్‌లాల్‌గారిని అడుగుదామనే అనుకున్నాడు. కానీ అర్థాంతరంగా లతకోసం ఉద్యోగం అడగాల్సి వచ్చింది. తిరిగి తనూ అడిగితే తన మీద సదభిప్రాయం పోతుందని వచ్చేసాడు.

సరస్వతమ్మగారికి మొన్నేవో డబ్బులొచ్చాయి. అడిగితే ఆవిడ తప్పక యిస్తారు కానీ మాస్టారిగారికి తలకొరివి పెట్టి కూలి అడిగినట్లుంటుందని ఆ ప్రయత్నం ఆలోచనలోనే విరమించుకున్నాడు.

మహా దగ్గర డబ్బుందని తెలుసుకానీ తన డబ్బు ముట్టుకోవాలంటే అభిమానం అడ్డొస్తుంది.

ఒక్కసారి అతనికో ఆలోచన ఫ్లాషయింది.

గబగబా వెళ్ళి తన సూట్‌కేసు తెరిచి హడావుడిగా పేపర్ క్రింద వెదికాడు. మూడు తులాల పులిగోరు గొలుసది. చిన్నతనం నుండీ అది అతని మెడలో వుంది. ఎప్పుడు తీస్తానన్నా అతని తల్లి ఒప్పుకునేది కాదు. "చచ్చి బ్రతికావురా! అది తియ్యకు" అనేది బ్రతిమాలుతూ.

తల్లిమాట తీసెయ్యలేక వుంచుకున్నాడేగానీ నిజంగా చాలా చిరాకుగా వుండేది సుబ్బాకి.

ఆడవాళ్ళంటే అలంకారాలు కావాలిగానీ మగవాడికేంటీ షోకులు అనే అభిప్రాయమతనిది. పైగా యిప్పుడది మెడలో వేసుకు తిరిగితే తనకి పనికూడా యివ్వరెవరూ.

వెంటనే అది జేబులో వేసుకుని "అమ్మాజీ! అమ్మాజీ" అని పిలిచాడు.

మహా అతన్నే క్రీగంట గమనిస్తోంది.

పులిగోరు పతకమున్న గొలుసు తీయడం కనబడలేదుగానీ అతనేదో అస్థిమితంగా వున్నాడన్న విషయం అర్థమవుతోంది.

అమ్మాజీ పరుగున వచ్చింది 'అన్నా' అంటూ.

"ఇలారా" అంటూ గదిలోకి నడిచాడు సుబ్బా.

అమ్మాజీ సందేహంగానూ, భయంగానూ అతని వెంట గదిలోకి నడిచింది ఒకవైపు మహా వైపు చూస్తూ.

అతనలా ప్రత్యేకంగా ఎన్నడూ పిలిచి విడిగా మాట్లాడలేదు.

అదే భయం అమ్మాజీకి "తనేమన్నా తప్పు చేసిందా?"

"ఇద్దరు నిన్న ఎక్కడికెళ్ళారు?" అన్నాడు సుబ్బూ.

"భజన్‌లాల్ షాపుకన్నా. మహాగారు రమ్మంటే ఎళ్లాను."

"ఎందుకు?"

"ఎందుకంటే... మరి లేసులకి దారాలు, సూదులూ కొన్నారమ్మాయిగారు."

"ఓహో, ఆవిడకీ విద్య వచ్చునా?" కొంత వెటకారం మిళితం చేసి అన్నాడు సుబ్బూ.

"తనక్కాదన్నా నాకని. ఆడు లోవరాజుగాడు మోసం చేసాకా పాపగారు చాలా బాధపడిపోయారు. ఎలాగైనా మంచి దారాలతో అల్లించి అమ్మాలని. కానీ భజన్‌లాల్ గారే తీసుకుంటానన్నారన్నా. ఈ దారాలు కూడా వూరికే యిచ్చారు" అంటూ సంబరంగా చెప్పింది అమ్మాజీ.

ఆ మాట విని సుబ్బూ మొహం కొంచెం ప్రసన్నంగా మారింది.

"సరే! మంచిదే అద్సరే. ఇది చూడు"

సుబ్బూ జేబులోంచి పులిగోరు పతకంతో వున్న గొలుసుని తీసి చూపించాడు.

అమ్మాజీ దానివైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఇది బంగారందే నాదే దొంగసొమ్ముకాదు" అన్నాడు సుబ్బూ నవ్వుతు.

"ఛీఛ అలా అంటానా అన్నా?"

"నేనూ సరదాగానే అంటున్నా. ఇదెవరైనా తాకట్టు పెట్టుకుని పదివేలిస్తారేమో అడుగు."

"నేనా?"

"ఎవరో అంటే కాదు. సరస్వతమ్మగారి దగ్గర డబ్బులున్నాయి. కానీ నాకు అడగడానికిష్టం లేదు. ఇంకెవరన్నా తెలుసా?" అన్నాడు సుబ్బూ.

"మహా దగ్గర డబ్బులున్నాయి కదా అన్నా! తాకట్టు లెందుకు? అడిగితే యిస్తది" అంది అమ్మాజీ.

"ష్! తన దగ్గర తీసుకోవడం యిష్టంలేకనే"

"పాపం.. తనేం చేసిందన్నా?"

"అందుక్కాదు. తనిక్కడ వుంటుందని డబ్బులున్నాయని మనం తనని వాడుకుంటామన్న అభిప్రాయం రాకూడదని"

"సరే అన్నా. నేను కనుక్కుంటా" అంది అమ్మాజీ.

"సరే నేను అలా బయటకెళ్ళొస్తాను. నేను దీన్ని అమ్మేయొచ్చు కానీ మా అమ్మ దీన్ని మెడలోంచి తీయడానికే ఇష్టపడేది కాదు అందుకని" అంటూ వెళ్ళిపోయాడు సుబ్బూ.

సుబ్బూ అటెళ్ళగానే గబగబా తలుపు గడియవేసి అమ్మాజీ దగ్గరికి పరిగెత్తుకొచ్చింది మహా.

"ఏంటి ఏంటంటున్నాడు సుబ్బూ" అంటూ

అమ్మాజీ భయంగా కనురెప్పలాడించింది.

"ఏంటి? నాకు చెప్పొద్దన్నాడా?"

ఔనన్నట్లుగా తలపంకించింది అమ్మాజీ.

మహా కోపంగా చూసింది అమ్మాజీవైపు.

"ఎన్నాళ్ళున్నా ఎంతమంచిగా వున్నా నేను పరాయిదాన్నే కదూ" అంటూ రుసరుసలాడుతూ వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

అమ్మాజీ కంగారు పడుతు మహా దగ్గరకెళ్ళి గడ్డం పట్టుకుని "అదికాదండీ సుబ్బూకి డబ్బు కావాలంట. ఒక పదివేలకి ఈ నగ ఎక్కడన్నా తాకట్టు పెట్టమన్నాడు" అంటూ పులిగోరు గొలుసు చూపించింది అమ్మాజీ.

మహా దానివైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఏంటంత అర్జెంటు?"

"ఏమో నాకు తెల్దండి."

"ఏ నన్నడగకూడదా? అంత బడాయా?" అంది మహా కోపంగా.

"బడాయి కాదండి. ఇంట్లో వుంచుకున్నందుకు డబ్బులడిగేస్తామని లోకువ జేస్తదన్నాడండి"

మహా కాసేపాలోచించి "సరే ఆ గొలుసిలా ఇవ్వు" అంది మహా.

అమ్మాజీ గొలుసిచ్చింది.

"మహా పర్సులోంచి పదివేలిచ్చి "ఎక్కడో తెచ్చానని చెప్పు సరేనా!" అంది.

అమ్మాజీ మొహం వికసించింది.

"మీరు భలే మంచోరు" అంది ఆనందంగా.

మహా ఆ గొలుసుని పర్స్‌లో జాగ్రత్తగా భద్రపరిచింది.

గుమ్మం ముందు ఆగిన ఆటోని గుర్రుగా చూశాడు కాళిదాసు. అందులోంచి దిగిన సత్యవతిని బామ్మరిది సత్తిరాజుని ఎగాదిగా చూశాడు.

ఆటో అతను ఆటోలోంచి చక్రకేళి అరటిపళ్ళ గెలను, ఒక పనసకాయని, తేగలకట్టని, డజను కొబ్బరి బోండాలని ఒక యిత్తడి బిందెను దించి అరుగుమీద పెట్టాడు.

ఆటోకి డబ్బులిచ్చి మెట్లెక్కి "బావగారు, బాగున్నారా?"

అనడిగాడు సత్తిరాజు నవ్వుతూ.

"ఇదిగో యిలా ఏలాడతన్నాను అటు ఆకాశానికి ఇటు భూమికీ" అన్నాడు కాళిదాసు వెటకారంగా.

సత్తిరాజు ఠక్కున నోరు మూసుకుని అరటి గెల పనసకాయ చెరో చేత్తో పట్టుకుని లోపలికెళ్ళాడు.

"ఆయనెప్పుడు సరిగ్గా మాట్లాడారు లే. రారా తమ్ముడూ కాఫీ తాగు అంటూ ఒక స్టీలు గ్లాసు తమ్ముడికందించి ఇంకో గ్లాసు అరుగుమీద కూర్చున్న కాళిదాసుకిచ్చింది.

"ఎందుకా సరుకులు ఇక్కడెవడున్నాడని తినడానికి" అన్నాడు కాళిదాసు గ్లాసందుకుని వెటకారంగా.

"ఎవరుండాలంట. అన్నీ మనవే గేదెల్లా నవిలేయాలా? ఏదో పెరట్లో పనసచెట్టు, కొబ్బరి చెట్లూనూ. ఎల్లకెల్లకాడ పిల్ల ఎల్తే ఆ మాత్రం యిచ్చుకోరా? నలుగురికీ పెట్టుకుంటాం" అంది తనూ ఒక గ్లాసు కాఫీ తెచ్చుకుని అరుగుమీద చతికిలబడుతూ.

అదే సందుగా సత్తిరాజు కూడా వచ్చి అక్కగారి పక్కన కూర్చున్నాడు.

"అదేటి బావా, పనసతొనలంటే నీకు ప్రాణవని సందు చివర సాయిబాబా గుడిదగ్గర కొనుక్కుని తింటున్నావని అక్క చెబితే నాన్న ప్రాణం వుసూరుమని కాయ పంపించాడు" అన్నాడు నవ్వుతూ.

సత్యవతి అన్నీ చెప్పి పరువు తీసిందని లోపల్లోపల పళ్ళు కొరుక్కున్నాడు.

"అద్సరే ఆ కాయెవడు కొయ్యాలి?" అన్నాడు కాళిదాసు చిరాగ్గా.

"నేనున్నాను కదా బావా!" అని సత్తిరాజు పనసకాయ అడ్డంగా బద్దలు కొట్టి తొనలు వలవడం మొదలెట్టాడు.

"బాగానే నేర్చావు యీ యిద్య. సదువా సంజా?" అన్నాడు కాళిదాసు తనమాటే పై చెయ్యిగా వుండాలని.

"సంకరం సదువులు సదివి అరుగెక్కి వడ్డీ యాపారాలు చేసేకన్నా ఎవడి పొలం ఆడు జేసుకోవడం రైటు. అద్సరేగానీ ఆడేవన్నా వసూళ్ళు తెచ్చిచ్చాడా? వస్తే బాగుండు. నాలుగు తొనలు ఆడికీ ఎట్టేదాన్ని" అంది సత్యవతి.

"ఎవడాడు?"

"ఎవడాడేంటి, మన సుబ్బీగాడు"

"ఆడింకరాడు"

ఆ మాటకి తెల్లబోయి చూసింది సత్యవతి.

"ఆడు నాకు సెప్పకుండా పదేలు వాడుకున్నాడు. తిట్టానని రోసంగా ఎల్లాడు. మూడురోజుల్లో డబ్బులు నా మొహాన్నడేసి ఎల్లిపోతాడంట" అన్నాడు కాళిదాసు కోపంగా.

అతని మాటకి తెల్లబోయి చూసింది సత్యవతి.

❦❦❦

"**ఏంటీ,** ఆడింక రాడా.. ఏం చెబుతున్నారు?" అంది సత్యవతి రెట్టిస్తున్నట్లుగా.

"ఏటాకాశం యిరిగి మీదడిపోయినట్లరుస్తున్నావ్. రాడు. నేనే పొమ్మన్నాను" అన్నాడు కాళిదాసు మీసాలు సవరించుకుంటూ కూర్చున్న ఈజీ ఛెయిర్‌లో కాళ్ళు మడిచి పెట్టుకోవడానికి వృథాప్రయత్నం చేస్తూ.

సత్యవతి కళ్ళెర్రజేసి చూసింది.

"ఏదో అవసరం పడితేగానీ ఆడు ఎవరి డబ్బులూ ముట్టడు. అంతమాత్రాన గొడవపడతారా! అసలాడు లేకపోతే మీకో పైసా తిరిగొచ్చేదా? సిన్న మెదడు లేని యవ్వారాలెన్నో సేసి బంగారంలాంటి పొలవంతా తగలెట్టేసారు. ఏదో ఆడు కంపమీద గుడ్డ సిన్నగా సిరక్కుండా తీస్తుంటే మళ్ళీ ఆణ్ణి కూడా తోలేసారా?" అంది సత్యవతి కోపంతో రెచ్చిపోతూ.

కాళిదాసు తెలివి తక్కువ పనులు చెయ్యడం - సత్యవతి విరుచుకుపడటం కొత్త సంగతేమీకాదు.

కాకపోతే ఆ కథంతా అరుగు మీద అక్క పక్కన కూర్చున్న సత్తిరాజు నోరావలించి హరికథలా వినడం కాళిదాసుకి మరీ మంటెక్కించేసింది.

"ఆఁ! ఆఁ బోడి పొలం. దాంతోనే బతికేసాం. అదడ్డం పెట్టే నీ బాబు సింపాంజీలాంటి నీకు పెళ్ళిసేసి తోలేసాడు. ఎక్కువ మాట్లాడితే సొప్పిచ్చుక్కొట్టి వచ్చిన సోటికే తోలేస్తాను" అంటూ హుంకరించాడు కాళిదాసు. దానితో అతనికి చెప్పలేని ఆయాసం వచ్చేసింది.

అది చూసి సత్తిరాజు కంగారు పడ్డాడు.

"అక్కా! అక్కా! ఆగాగు. ఎవరో దారినపోయేవాడి కోసం మీరిద్దరూ గొడవపడటమేంటి? బావగారన్నది కరక్టే. చెప్పకుండా డబ్బు వాడటం తప్పు కాదేటి? నువ్వెళ్ళి మంచినీళ్ళట్టుకురా" అని చనువుగా కాళిదాసు గుండెలు నిమురుతూ "ఏటి బావా ఇది సిన్న పిల్లోడిలా?

'మాటకి మాట తెగులు - నీటికి నాసు తెగులూ' అన్నారు. మీకే పిల్లాజెల్లా లేరు. ఈ ఎదవ వడ్డీయాపారాలెందుకు? ఈ ఎదవ టెన్సన్లెందుకు? వచ్చి మనూళ్ళో వున్నా కాలం బంగారంలా గడిసిపోద్ది" అన్నాడు ఊరడింపుగా.

కాళిదాసు ఏదో అందామనుకున్నాడుగానీ అప్పటికే బి.పి పెరిగి మాట పెగల్లేదు.

సత్యవతి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చిచ్చి -"ఏదో ఆడు మన పిల్లోడిలా ఇంట్లో మసిలేటోడు. అదే బెమ. అయినా ఈయన మాట పెళుసు సత్తీ. ఎత్తుకోరా మగడా అంటే ఎత్తి కుదేసే రకం" అంది సత్యవతి.

"సరి సర్లే. అయినా ఆడీరోజు డబ్బు తీసుకొచ్చి నామొహాన కొడ్తానన్నాడు. రానీయ్. ఇంతలోనే కొంపలంటుకున్నట్లు నీ గావుకేకలేంటి?" అన్నాడు కాళిదాసు నిదానిస్తూ.

"మరింకేంటి గోల?" అని కనుసైగ చేసాడు సత్తిరాజు ఊరుకోమన్నట్లుగా అక్కగారికి.

అంతటితో ఆ గొడవ సద్దుమణిగినట్లయింది.

అమ్మాజీ చాలా ఉత్సాహంగా తన లేసుల దారాల డబ్బా, సూదులూ ఇంకా కేటలాగ్సు అమ్మాణమ్మగారికి చూపించింది.

ఈ మధ్య అమ్మాణమ్మగారు పూర్వమంత స్తబ్ధంగా కాకుండా కాస్తంత పెదవి విప్పుతున్నారు.

అప్పుడప్పుడూ చిరునవ్వు నవ్వుతున్నారు.

ఆమె అవన్నీ చూస్తూ "నాకూ వచ్చు అమ్మాజీ అల్లడం" అన్నారు.

అమ్మాజీ కళ్ళు పెద్దవి చేసి ఆవిడవైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఏంటి పెద్దమ్మా, మీరు అల్లుతారా?" అంది విస్మయంగా.

"అవునమ్మా. ఊలుతో కూడా అల్లుతాను. టీపాయ్ మీద, సోఫా చేతులమీద, డైనింగ్ టేబుల్ మీద కూడా వేసుకోవచ్చు" అంది అమ్మాణమ్మ.

"మరింకేంటి, మీరు సాయం చెయ్యండి పెద్దమ్మా. మనమెన్ని యిస్తే అన్నీ తీసుకుంటాడంట భజన్‌లాల్" అంది అమ్మాజీ ఉత్సాహంగా.

అమ్మాణమ్మ సరేనని తలూపుతుండగా సరస్వతమ్మగారు తలుపు మీద చిన్నగా శబ్ధం చేస్తూ "నేను రావొచ్చా...?" అనడిగారు.

"రండి రండి పిన్నిగోరూ" అంది అమ్మాజీ లేచి నిలబడుతూ.

అమ్మాణమ్మగారికి, సరస్వతమ్మగారికి కాస్త స్నేహం కుదిరిందీ మధ్య.

కారణం రోజూ పూజ చేస్తూ సరస్వతమ్మగారు పాడే కీర్తనలు. ఆమె కంఠం శ్రావ్యంగా గంభీరంగా ఉంటుంది. ఆమె త్యాగరాయ కీర్తనలు పాడుతుంటే అక్కడి వాతావరణంలో ఏదో మార్పు కనిపిస్తుంది. ఆవిడక్కడ చిన్న తులసికోట పెట్టి రోజూ వాటికి పసుపు కుంకుమలు పెట్టి చిన్న ముగ్గు వేసేటప్పటికి అక్కడొక పవిత్రత అలముకుంటుంది.

వాటిని వినడానికి చూడటానికి అమ్మాణమ్మగారు కొద్దిగా గుమ్మంలోకి రావడం మొదలు పెట్టారిప్పుడు.

అలా వారిద్దరికీ కొద్దిగా సాన్నిహిత్యం ఏర్పడింది.

అలా వాళ్ళు మంచీ చెడ్డా మాట్లాడుకోవడం మొదలయ్యింది.

సరస్వతమ్మగారు భగవద్గీతలోని శ్లోకాలు చదివి వాటి అర్థాలు విడమరచి చెబుతుంటే అమ్మాజీకి కూడా బాగా అనిపిస్తుంది.

"ఎన్నివేల పద్యాల్లో చెప్పినా ఎన్ని గ్రంధాలు చదివినా అంతా ఒక్కమాటలోనే ఇమిడివుందమ్మా. మంచిగా బ్రతుకు. నీ సుఖం కోసం యితరులకి హాని చెయ్యకు. వీలయినంత ఇతరులకి సాయపడు" అని అనేది ఆవిడ. త్వరలోనే సరస్వతమ్మగారు ఆ బిల్డింగులో అందరికీ ఆప్తురాలయ్యింది.

సరస్వతమ్మగారు వస్తూనే అమ్మాజీ చేతిలోని లేసులు చూసి "ఏంటి, దేనికివి?" అనడిగింది.

అమ్మాజీ అంతా చెప్పుకొచ్చింది.

"అయితే నేనూ సాయం చేస్తా కాసేపు. నాకూ వచ్చు" అన్నారావిడ.

ఆ మాటతో ఉబ్బితబ్బిబ్బయింది అమ్మాజీ.

"ఇంకేంటి మరి! నాకు పండగే" అంది సంబరంగా.

పప్పు రుబ్బే టైమయింది. అమ్మాజీ కనపడక చిర్రెత్తుకొచ్చిన పాపాయమ్మ అమ్మాణమ్మగారి గదిలో నవ్వులు విని తలుపు తోసుకుని లోపలికొచ్చి "ఏటే యిక్కడ 'పలకరింపులూ - పరాసికాలూనూ..' అవతల పప్పు నానబోసుక్కూర్చున్నా. పప్పు రుబ్బవా?" అంది అమ్మాజీ వైపు కాస్త కోపంగా చూస్తూ.

"రుబ్బను" అంది అమ్మాజీ ఠక్కున.

అలాంటి జవాబు ఏ మాత్రం ఊహించని పాపాయమ్మతో పాటూ, అమ్మాణమ్మ, సరస్వతమ్మలు కూడా తెల్లబోయి చూసారు అమ్మాజీ వైపు.

"ఏటే, ఏం మాట్లాడతన్నావూ" అంది పాపాయమమ అసహనంగా.

"అవును మామ్మా. నేనీరోజునుంచి లేసులల్లుకోవాలి. నాకు బేరాలొచ్చాయి. నీ పప్పు రుబ్బితే రెండు దోసెలెడతావు. ఇంటద్దెవరు కట్టాలా? మాయరోగమొస్తే మందులకెవర్నడుక్కోవాలా?" అంది అమ్మాజీ నిష్ఠూరంగా.

పాపాయమ్మకి దిక్కుతోచలేదు.

ఒక్కసారే హతాశురాలయినట్లుగా చూసింది.

వెంటనే ఆమె కోపం మహా మీదకి మళ్ళింది.

"అవునే. ఇప్పుడు నీకు కొత్త కొత్త సేహాలూ, తినమరిగిన కోడి యిల్లెక్కి అరిసిందట. ఆవిణ్ణి సూసుకునేగా నీ టెంపరితనం" అంది అక్కసుగా.

"ఎవరో ఒకరు. కరెంటు దీపాలొచ్చాక కూడా కిర్సనాయిలు లాంతరు దగ్గర కూసుంటారా ఎవరయినా" అంది అమ్మాజీ నవ్వు దాచుకుంటూ.

"సర్లే. ఈ బాగోతవెన్నాళ్ళో సూస్తా. పప్పు తీసుకుని దిబ్బలో పోసేస్తా. ఈ పాపాయమ్మ కూడా బాగా బతికిందే అంత పౌరుసం సచ్చిలేను" అంది ఉక్రోషంగా.

అప్పుడే మహా మేడ దిగొచ్చి "అమ్మాజీ" అని పిలిచింది.

"రామ్మా తల్లీ రా, తవరొచ్చేకా బిల్డింగు తగలడిపోయింది" అంది పాపాయమ్మ మహావైపు కోపంగా చూస్తూ.

మహాకి పాపాయమ్మ మాటలు అర్థం కాలేదు.

లోపలికి వస్తూనే "ఓ అందరూ ఇక్కడే వున్నారా. ఇంకేంటి. ఓపెన్ చేద్దామా?" అంది నవ్వుతూ.

అమ్మాజీ నవ్వుతూ తల పంకించింది.

వాళ్ళ సంభాషణ చూసి చిర్రెత్తుకొచ్చింది పాపాయమ్మకి.

గిర్రున తిరిగి వెళ్ళిపోబోతుంటే మహా చేతులు పట్టుకుని గట్టిగా ఆపి "నువ్వెళ్ళిపోతే ఎలా మామ్మా?" అంటూ బలవంతంగా మంచమ్మీద కూర్చోబెట్టింది.

పాపాయమ్మ చాలా అసహనంగా అమ్మాణమ్మగారి పక్కన కూర్చుంది.

అమ్మాజీ మంచం క్రింద పెట్టిన అట్టపెట్టె బయటకి లాగి బాక్స్ విడదీసింది. అందులోని పప్పురుబ్బే మిషను ఏమిటో అర్థంకాలేదు పాపాయమ్మకి. వింతగా దానివైపు చూస్తోంది.

అర్థమయిన అమ్మాణమ్మ, సరస్వతమ్మలు చిన్నగా నవ్వుతున్నారు.

అమ్మాజీ అందులో గిన్నెకడిగి దానికి పసుపు, కుంకుమ బొట్లు పెట్టింది.

గబగబా వెళ్ళి పాపాయమ్మ నానబోసిన పప్పు తెచ్చి కడిగి అందులో వేసింది.

జరుగుతున్నదేంటో అర్థంకాని పాపాయమ్మ తెల్లబోతూ చూస్తుందాతతంగాన్ని.

మహా సరస్వతమ్మగారి వైపు చూసి "ఆన్ చేయండి పెద్దమ్మగారూ" అంది.

"నేనా?" తెల్లబోయి చూసింది సరస్వతమ్మ.

"అవును మీరే. రండి" అంది మహా.

"అవును మీరే ఆన్ చేయాలి" అమ్మాణమ్మగారు కూడా. సరస్వతమ్మగారు కాదనలేక స్విచ్ ఆన్ చేసింది.

మిషను గిరగిరా తిరిగింది.

పప్పు నిమిషాలమీద ఏ చేతుల నొప్పి లేకుండా నలిగిపోతుంటే పాపాయమ్మ ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోయింది.

"ఏటే.. యిది? ఇదెక్కడిది?" అంది ఎలాగోలా నోరు పెగల్చుకుని.

"పాపగారు నీకోసం కొన్నారు. ముందూ ఎనకా లేకుండా ఏదేదో మాటాడేస్తావు. నాకు లేసుల బేరం యిప్పించి నీ పని సులువుకావాలని యిది కొన్నారు" అంది అమ్మాజీ.

పాపాయమ్మ కన్నీళ్ళతో మహావైపు చూసింది.

"ఉత్తనోటి తుత్తర మడిసిని నేను. తిన్న దెబ్బలు, పడిన కట్టాలు నా మాటనలా సేసేసెయ్. ఏ తల్లి కన్నదో నిన్ను. మా సెడ్డ దొడ్డ తల్లివి నువ్వు" అంటూ మహా బుగ్గలు పుణికింది.

మహా సిగ్గుగా నవ్వింది.

"అవునమ్మా.. ఎంత బాగా ఆలోచించావూ!? డబ్బులో పెరిగిన పిల్లలు అహంకారంగా వుంటారంటారు. నువ్వు దానికి విరుద్ధంగా వున్నావు" అంది సరస్వతమ్మగారు మహాని అభినందిస్తూ.

అలా ఆ రోజు పాపాయమ్మ సమస్య అందంగా ఆనందంగా ముగియటం అందరికీ సంతోషంగా అనిపించింది. అప్పుడే బయటనుండి వచ్చి యింట్లోకి వెళ్ళబోతున్న సుబ్బూని గబగబా "అన్నా అన్నా ఇటురా" అంటూ గట్టిగా పిలిచింది అమ్మాజీ.

సుబ్బూ ఆ పిలుపు విని గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు.

"సూడ్రా. ఆ పిల్ల నాకోసం యిది కొని తెచ్చింది. బుజాలు వూపుకుని గంటలు గంటలు రుబ్బినా నలగని పప్పు యిది నిముసాల్లో పిండి గుండా సేసేసింది. పిల్ల బంగారవనుకో. కట్టసుకాల సూసింది కాకపోయినా కట్టసుకాలు ఆనవాలు గట్టేసి గట్టెక్కిచ్చేస్తాది" అంది పాపాయమ్మ మరోసారి మహా బుగ్గలు పుణికి.

సుబ్బూ క్రీగంట మహా వైపు చూశాడు.

అప్పుడే మహా కూడా అతని వైపు అప్రయత్నంగా చూసింది.

ఆ చూపులో చెప్పడానికి వీలుకాని ఏ భాషకీ అందని ప్రేమ భావనొకటి సుతిమెత్తని బాణంలా ఆమె హృదయాన్ని తాకి గిలిగింతలు పెట్టి ఆమె చూపుల్ని కిందకి వాల్చింది.

"బాగుంది బాగుంది" అన్నాడు సుబ్బూ కూడా చూపు మార్చుకుని.

అప్పుడే సరిగ్గా "సుబ్బూ.. అరే సుబ్బూ" అంటూ గట్టిగా పిలుపొకటి వినిపించి అటు చూశాడు సుబ్బూ.

బయటనుండి సత్యవతి, అంజి వస్తూ కనిపించారతనికి.

వెంటనే సుబ్బూ కంగారుపడుతూ "అమ్మా.. మీరా! మీరేంటిలా? అంజి చేత కబురు చేస్తే రానా?" అన్నాడు.

"ఏరా నేను రాకూడదా? మీరిద్దరూ ఏంటో పెళ్ళిజ్జులు సేసుకున్నారంట. ఆ యవ్వారం తేల్చుకుందావనే వచ్చా" అంది సత్యవతి అక్కడున్న వాళ్ళందరి వైపూ చూస్తూ.

ఆ కొత్త శాల్తీ ఎవరో తెలియని అందరూ ఆమెనే ఆశ్చర్యంగా గమనిస్తుంటే సుబ్బూ ఆమె చేతిని పట్టుకుని పైకి తీసుకెళ్ళాడు.

"ఇల్లంతా కలయజూస్తూ బాగానే వుందిరా నీ కొంప. ఏంటో అనుకున్నా. గోదారొడ్డున సిత్రాంగి మేడలా వుంది" అంది సత్యవతి నవ్వుతూ.

సుబ్బూ ఆవిడ కాళ్ళ దగ్గర చతికిలబడుతూ "ఇది నాది కాదమ్మా ఒకమ్మాయిది. నేను పేయింగ్ గెస్టుగా వుంటున్నా" అన్నాడు సిగ్గుగా.

"అంటే?" అంది సత్యవతి అర్థంకాక.

"అంటే పూటకూళ్ళన్నమాట" నవ్వుతూ చెప్పాడు సుబ్బూ.

"ఏరా.. నీకు కలిసుండటానికి ఆడాళ్ళు తప్పా మగాళ్ళు దొరకలేదా?" అనడిగింది సత్యవతి.

సుబ్బూ ఏదో చెప్పేంతలో "వుత్తిదే అమ్మగోరూ! ఆవిడే ఈరితో వుంటుంది. సారు ఎప్పట్నుంచో యిక్కడే వుంటున్నారు" అన్నాడు కూడా వచ్చిన అంజి.

"ఒరేయ్.. నోర్మూయ్" అంటూ క్లుప్తంగా జరిగింది చెప్పాడు సుబ్బూ సత్యవతికి.

"సరి సర్లే! జాగ్రత్త ఆడాళ్ళతో యవ్వారం. అవసరం తీరాక బోడిమల్లన్నంటారు. ఇదిగో యీ డబ్బు తీసుకుని ఆయనకిచ్చేయ్. యింక జరిగింది చాలుగాని యింటికి నడు" అంది సత్యవతి.

"ఏంటిదమ్మా?" అన్నాడు సుబ్బూ కొంచెం అసహనంగా.

"అదేరా.. నువ్వు వాడుకున్న పదేలు. ముందా డబ్బు మడిసికిచ్చేయ్ తర్వాత చూసుకుందాం" అంది సత్యవతి డబ్బు సుబ్బూ చేతిలో పెట్టడానికి ప్రయత్నిస్తూ.

సుబ్బూ సున్నితంగా ఆమెని వారిస్తూ "వద్దమ్మా నాకు సమకూరాయి. భార్య దగ్గర తీసుకుని భర్తకివ్వడం కన్నా ఆత్మవంచనున్నదా!" అన్నాడు.

సత్యవతి నిస్పృహగా చూసి "సరి సరే రా మరి నాతో" అంటూ లేచి నిలబడింది.

"మీరెళ్ళండి. మీ వెంట వస్తే సార్ మళ్ళీ నేను యిచ్చే డబ్బు మీరిచ్చిందే అనుకుంటారు" అన్నాడు.

సత్యవతి తలపంకించి అంజితో తిరిగి బయల్దేరింది ఇంటికి.

ఇంట్లోకి తిరిగి వస్తున్న సత్యవతి వంక వంకరగా చూశాడు కాళిదాసు.

"ఎక్కడకెళ్లొచ్చేవేంటి ఇంతర్జంటుగా?" అన్నాడు ఎగాదిగా చూస్తూ.

"ఆడి దగ్గరకే. ఇంటికి రమ్మాన్నా" అంది సత్యవతి అబద్ధం చెప్పే అలవాటు లేక.

"ఏ మరి? రాలేదే?"

"వస్తాడు లెండి. రమ్మనగానే రాడానికేం ఆడు మనం పెంచిన కుక్కపిల్లగాదు" అంటూ సత్యవతి వంటగదిలో కెళ్ళిబోయింది.

"ఏంటీ ఎల్లి డబ్బిచ్చొచేవా?"

ఆ మాటకి బాణంలా వెనక్కు తిరిగింది సత్యవతి.

"అవును ఇద్దామనే ఎళ్ళాను. ఆడు నీతీ జాతున్నోడు. ఇదిగో ఇలా తిరిగ్గొట్టాడు" అంటూ పర్సులోని పదివేల కట్టా తీసి కాళిదాసు వళ్ళోకిసిరి వెళ్ళిపోయింది సత్యవతి.

కాళిదాసు షాక్ తిన్నవాడిలా చూశాడా డబ్బువైపు.

"ఆవిడెవరూ సుబ్బూ?" అనడిగింది మహా సుబ్బుని ఆసక్తిగా.

"నేను పనిచేస్తాను కదా. కాళిదాసుగారని ఆయన భార్య."

"అవునా ఎందుకొచ్చారు?" అని మళ్ళీ ప్రశ్నించింది మహా.

"అదేదో మా మధ్య వ్యవహారం. అద్సరేగానీ నువ్వు పాటలు పాడతావా?"

"లేదు"

"ఇష్టముండదా?"

"ఇష్టముందని అందరూ పాడెయ్యటమేనా? నువ్వు పాడతావా?" అని తిరిగి ప్రశ్నించింది మహా.

తల అడ్డంగా వూపాడు సుబ్బు.

"నువ్వీరోజున చేసిన పని నాకు చాలా సంతోషం కలిగించింది మహా. అందుకే నువ్వు పర్మిషనిస్తే కాస్త తాగొస్తాను" అన్నాడు మహా వైపు చిలిపిగా చూస్తూ.

వెంటనే తన వడిలో వున్న తలగడ. అతని మీదకి  విసిరేసింది మహా.

సుబ్బూ దాన్ని ఒడుపుగా పట్టుకున్నాడు.

"మనిద్దరికీ తగాదా ఇక్కడే మొదలవుతుంది. నువ్వు నన్ను సరిగ్గా వుండనివ్వవా?" అంది చిరుకోపంగా.

"అందుక్కాదు. తాగి నిన్ను పొగిడి పాటలు పాడదామని"

అందుగ్గాను పకపకా నవ్వింది మహా.

"ఏం పాడతావు?"

సుబ్బూ చాపమీద పడుకుని "ఎంతమంచిదానివో" అంటూ పిచ్చిపిచ్చిగా పాడాడు నవ్వుతూ

నిజానికి అతని మనస్సు దానికతీతంగా ఇదిమిద్ధం కాని ఆలోచనతో ఉయ్యాలలూగుతోంది. కాని.. చెప్పలేని చెప్పడానికి వీలులేని భావనలతో అతని మనసు వుద్రేకపడుతోంది.

అందుకే అతనికి పిచ్చిపిచ్చిగా వుంది.

దాన్ని తప్పిస్తూ ఏదేదో మాట్లాడి నిద్రపోయాడతను

మహాకి కూడా ఏదో అర్థమవుతున్నట్లూ కానట్లుగా వుందామెకు. ఆమె కూడా అస్తవ్యస్తమైన ఆలోచనలతో నిద్రలోకి జారుకుంది.

"కొంచెం నన్ను బాంక్ వరకూ తీసుకెళ్తావా?"

తయారయి కాళిదాసుగారింటికి వెళ్దామనుకున్న సుబ్బు ఠక్కున ఆగి "ఏ బాంక్? అమ్మాజీ రాదా?" అనడిగాడు.

"ఏం?"

"అమ్మాజీకి రోజు వంట్లో బాగోలేదట"

"రేపు వెళ్ళొచ్చుకదా" అన్నాడు సుబ్బూ తల దువ్వుకుంటూ.

"కాదు అర్జెంటుగా కావాలి" "ఏమిటో అంతర్జంటు సేవా కార్యక్రమం"

"వుందిలే. వస్తావా రావా చెప్పు?"

"సరే పద ఏం చేస్తాం?" అంటూ భుజాలెగరేసాడు సుబ్బు. నిజానికి సుబ్బూకి కూడా మహాని తీసుకెళ్ళాలనే ఉంది.

మహా కోరిక కూడా అదే

తమ పరిచయం ఎటు తీసుకెళ్తుందో ఈ గాలి ఎటు వీస్తుందో తెలియని వయసు.

ఏదో బలీయమైన ఆకర్షణ గతరాత్రినుండి వారిద్దరిని వాస్తవాల్ని మరపింపజేస్తున్నది.

ఇద్దరూ ఇంటికి తాళం వేసి వచ్చి బైక్ ఎక్కుతుంటే అక్కడే దోసెలేస్తున్న పాపాయమ్మ దోసె మాడిపోతున్న వాసనని కూడ పసిగట్టకుండా తెల్లబోయి చూసింది.

అక్కడ సాయం చేస్తున్న అమ్మాజీ పనీ అంతే అయ్యింది. మహా వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ అమ్మాజీ వైపు చూసి కన్నుగీటింది.

ఏదో అర్థమైన దానిలా అమ్మాజీ ముసిముసిగా నవ్వింది.

"ఏటే ఆళ్ళిద్దరూ ఈరోఈరోయిన్లా అలా ఎల్లిపోతున్నారు. నిన్ను పిలవలేదేంటే పాపగారూ" అంది పాపాయమ్మ మాడిన దోసె పక్కకి పడేసి పెనం శుభ్రం చేస్తూ.

అమ్మాజీ సందేహం కూడా అదే అయినా పైకేమాత్రం తొణక్కుండా "ఏటయినా అర్జెంటు పనేమోలేమామ్మా" అంది పైకి.

"అవునవును సదూకున్నోల్లు కదా" అంది పాపాయమ్మ. ఇదేం పట్టని బైక్ మాత్రం రయ్యిమంటూ రైలు కమ్ రోడ్డు బ్రిడ్జి మీద సాగిపోతోంది.

గోదావరి నిండుగా నిశ్చలంగా కదలనట్లు భ్రమింపజేస్తోంది.

మత్స్యకారుల పడవలు చిన్న చిన్న కాగితపు పడవల్లా సాగుతున్నాయి.

"బాగుంది కదూ!"

"ఊ" అన్నాడు సుబ్బూ వేస్తున్న విజిల్ ఆపి.

"ఏంటి బాగుందో కూడా అడగవా?" అంటూ వీపు మీద పొడిచింది మహా.

"నువ్వే చెప్పు" అన్నాడు సుబ్బూ నవ్వుతు.

"ఫో! నువ్వెప్పుడూ అంతే! నీకంతా వెటకారం" అంది మహా

బదులుగా పకపకా నవ్వాడు సుబ్బూ.

"నీకు తెలుసా? మన మనసుని బట్టే చుట్టూ పరిసరాలు అందంగా వుంటాయి. నాకు మనసు బాగోనప్పుడు ఈ గోదావరి నన్ను మింగేసే మహమ్మారిలా - ఈ ఊరిని చుట్టుకుని మింగేసే కాలునాగులా కనిపించింది ఎన్నోసార్లు. మరెన్నోసార్లు చల్లని పిల్లగాలులతో, ఊగే రెల్లుపొదలతో ఎంతో అందంగా కనిపించింది" అన్నాడు.

"అవును. అది నిజమే" అంది మహా నవ్వుతు.

అలా తేలిపోతున్న మనసులతో వాళ్ళిద్దరూ బాంక్ చేరుకున్నారు.

"వెళ్ళిత్వరగా రా! నాకు పనుంది మళ్ళీ" అన్నాడు సుబ్బూ.

మహా బాంక్‌లో పనిచూసుకుని తిరిగి వచ్చి బైక్ ఎక్కబోతుండగా జరిగిందా సంఘటన.

"బేబీ"

ఉలిక్కిపడి చూసింది మహా. అక్కడ ఖరీదైన కారుకి చేరబడి నిలబడి వున్న వ్యక్తిని చూసి ఆమె సర్వద్రష్టే అయ్యింది. కొయ్యబారిపోయినట్లు నిలబడిపోయింది.

"ఇలారా!" సుబ్బూ అర్థంకానట్లుగా అతనివైపు చూసి "ఎవరతను?" అన్నాడు అయోమయంగా.

"డే..డీ... మా డే..డీ"

ఈసారి కొయ్యబారి పోవడం సుబ్బూ వంతయింది.

**"నిన్నే ఇలా రా"** అన్నాడతను గొంతులోకి ఎక్కడలేని సౌమ్యత అరువు తెచ్చుకుంటూ.

ఈసారి చప్పున వచ్చి తన చేతిని సుబ్బూ చేతికి చుట్టి గట్టిగా పట్టుకుని "ఉహూ. నేను రాను. నువ్వు నన్ను తీసుకెళ్ళిపోతావు" అంది మహా భయంగా.

అతను పరిహాసంగా నవ్వాడు.

"బేబీ.. ఆ పని చేసేవాడినయితే ఎప్పుడో చేసేవాణ్ణి. నీ ఆచూకీ తెలుసుకోలేనంత వెర్రివాణ్ణా. ఒకసారి నీతో మాట్లాడాలని. అంతే" అన్నాడతను.

"అయితే నేనూ సుబ్బూ కలిసి వస్తాం" అంది మహా ఇంకాస్త సుబ్బూ చెయ్యి గట్టిగా పట్టుకుంటూ.

"అదేంటి మహా..! పిలుస్తున్నది మీ నాన్నగారే కదా వెళ్ళు. మధ్యలో నేను దేనికి?" అన్నాడు సుబ్బూ ఆమె చేతిని విడిపించుకునే ప్రయత్నం చేస్తూ.

"ఉహూ. నేన్నమ్మను. మా మమ్మీ ఏం చెబితే అదే చేస్తాడు మా డాడీ" అంది మొండిగా మహా.

అతను భుజాలెగరేసి నిట్టూరుస్తూ "సరే రండిద్దరూ" అన్నాడు.

"ఎక్కడికి తీసుకెళ్తావ్?" అనడిగింది మహా అనుమానంగా.

"ఇక్కడే ఎక్కడయినా కూర్చుని మాట్లాడుకుందాం"

"అయితే బారేజ్ మీదకి తీసుకెళ్ళు"

సుబ్బూ మహావైపు నిస్సహాయంగా చూసాడు. ఆమె చూపుల్లో వేడుకోలుంది.

"రండి. ఇన్నాళ్ళూ పెంచిన నాకన్నా మిమ్మల్నే ఎక్కువగా నమ్ముతుంది. లవ్ యీజ్ బ్లయిండ్" అన్నాడతను. అతని మాటల్లో నిస్పృహని గమనించాడు సుబ్బూ.

అయిష్టంగానే మహాతోపాటు కారెక్కాడు సుబ్బు.

కారు ధవళేశ్వరం బారేజ్ మీదకి సాగుతుంటే చెప్పాడతను "నా పేరు ధనుంజయరావు. నా కూతురు నా గురించి చెప్పేవుంటుంది."

"లేదు. ఈ విషయాలు మా మధ్య దొర్లలేదు."

ఈసారి ధనుంజయరావు వ్యూ మిర్రర్‌లోంచి సుబ్బువైపు మరింత ఆశ్చర్యపోయి చూశాడు.

"అంటే స్వీట్ నథింగ్స్ తప్ప మరేమీ లేదంటారు" అన్నాడు కొంచెం వ్యంగ్యంగా.

సుబ్బు ఏదో చెప్పబోయేంతలో మహా అతని తొడగిల్లింది మాట్లాడొద్దంటూ.

"నిజమే ప్రేమలో పడిన వారికి లోకంలో మరేదీ కనిపించదు. తర్వాత తర్వాత తెలుస్తుంది తమెంత ఊబిలో పడింది. బేబీ చాలా గారాంగా అపురూపంగా పెరిగింది. నాకు ఒక్కగానొక్క కూతురు. దానిమీద ఎన్నో ఆశలు పెట్టుకుని పెంచాం. దాన్ని ఒక మహారాణిలా చూడాలనుకున్నాం. తెలివుండి చదువుని కూడా గేమ్‌గా ఆడి పాడు చేసుకున్నా ఊరుకున్నాం. నిజానికి మాకు ఇంజనీరింగ్ డిగ్రీలతో పనిలేదు. వాళ్ళ మమ్మీ కొంచెం స్ట్రిక్టే. కాదనను. అది ఆవిడ స్వభావం. కానీ నేను చాలా ప్రేమగా పెంచాను. ఏది కావాలంటే అదిచ్చాను. నాకయినా చెప్పకుండా ఇలా వచ్చేయడం... మీరు తల్లిదండ్రులయితేగానీ ఆ బాధ అర్ధంకాదు."

సుబ్బు చిరాగ్గా చూశాడు మహా వైపు.

కారు బారేజ్ మీద ఆగింది.

ముగ్గురూ కారు దిగారు.

వరదకాలం కావడంతో గోదావరి తన ఉధృతాన్ని ఉవ్వెత్తున లేచి చూపిస్తోంది.

అడ్డుకట్టని చూసి ఆగ్రహంతో సుడులు తిరుగుతోంది.

దరిదాపు అన్ని గేట్లూ తెరిచేసారు. నది జైలునుండి విడుదలయిన ఒక వీరవనితలా పొగలు కక్కుతూ డౌన్ స్ట్రీమ్ వైపు పరుగులు పెడుతోంది.

అక్కడ రెయిలింగ్‌కి జేరబడి నిలబడ్డాడు ధనుంజయరావు.

"ఇప్పుడు చెప్పండి. మీరిద్దరూ పెళ్ళి చేసేసుకున్నారా?"

సుబ్బు మహా చేతిని విదిలించుకుని "మీరు మమ్మల్ని అపార్ధం చేసుకుంటున్నారు. మా యిద్దరికీ ఎలాంటి సంబంధం లేదు. మీరనుకున్న మాటలేవీ మా మధ్య జరగలేదు. అసలు తనెవరో ఎందుకు బయటకొచ్చిందో నాకు తెలియదు. కొన్ని రోజులుంటానంది. షెల్టర్ యిచ్చానంతే" అన్నాడు సుబ్బు కాస్త కోపంగా మరికాస్త అసహనంగానూ.

సుబ్బు మాటలకి తెల్లబోయి చూశాడు ధనుంజయరావు.

మహా తలదించుకుంది.

"బేబీ ఎందుకిలా?" అని మాత్రం అనగలిగాడు ధనుంజయరావు.

మహా రోషంగా తలెత్తి చూసింది.

"నీకు తెలియదా? ఏం జరగనట్టు మాట్లాడుతున్నావేంటి? అన్నీ యిచ్చారట అన్నీ. అదేదో మీరే ఘనకార్యం చేసినట్లుగా. ఇక్కడకొచ్చి చూడు వీళ్ళంతా ఒకరికొకరు ఎంత ఆప్యాయతల్ని పంచుకుని జీవిస్తున్నారో. వీళ్ళకి డబ్బు మాత్రమే లేదు. ప్రేమ వుంది.

మనుషుల్లా బ్రతుకుతున్నారు. నువ్వేం చేసావ్? ఆ జిడ్డుగాడికి, బుర్రలేనివాడికి కేవలం డబ్బుందని మాత్రం పెళ్ళి చేద్దామనుకున్నారు. డబ్బంతా మూటగట్టుకుని ఏం చేసుకుంటారు నేను చచ్చాక?"

ధనుంజయరావు నిరుత్తరడయినట్లుగా చూస్తున్నాడు.

సుబ్బూ కూడా మహా ఉక్రోషాన్ని, కోపాన్ని హృదయంలో జరుగుతున్న అంతర్యుద్ధాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు.

"సరే ఆ పెళ్ళి చేయం. ఇంటికి రా"

"రాను. మిమ్మల్ని నమ్మను"

"మరేం చేస్తావ్? నా మంచితనాన్ని పరీక్షిస్తున్నావ్. నిన్ను బలవంతంగా తీసుకెళ్ళడం నాకు చిటికెలో పని" ధనుంజయరావు కళ్ళు ఎర్రబడ్డాయి.

మహా బారేజ్ రెయిలింగ్ దగ్గరకి రివ్వున వెళ్ళింది. "ఆ పని చేస్తే నేను ఇప్పుడే యిక్కడ దూకి చచ్చిపోతాను" అంది కోపంతో బుసలు కొడుతూ.

సుబ్బూ మహాని రెక్కపట్టుకుని ఇవతలికి లాగాడు.

"ఏం మాటలవి. మీ డాడీకే కాదు. నాక్కూడా సందేహమే. ఇప్పుడు యిక్కడుండి ఏం చేయాలని. ఆ పెళ్ళి చేయనంటున్నారుకదా! వెళ్ళు మరి" అన్నాడు.

"లేదు సుబ్బూ నాకో పని వుంది. అదయ్యాకనే వెళ్తాను. నాకో సంవత్సరం టైం కావాలి. అప్పుడు వెళ్తాను. అంతవరకు నా జోలికొస్తే నా శవాన్నే చూస్తారు."

సుబ్బూ ధనుంజయరావు వైపు చూశాడు.

ధనుంజయరావు జేబులో చేతులు పెట్టుకుని నిస్సహాయంగా ఆకాశం కేసి చూస్తూ "సరే ఆ పనేంటో కానిచ్చి నువ్వు నా కూతురిగా తిరిగి యింటికి రావాలి. నేను నీకిష్టమైన పెళ్ళే చేస్తాను. కానీ అది నా చేతుల మీదుగా మాత్రమే జరగాలి" అన్నాడు.

మహా తల పంకించింది.

సుబ్బూ ఇక వెళ్తామన్నట్లుగా చూశాడు.

"నా కూతురు బాధ్యత మీ చేతుల్లో పెడుతున్నాను. ఆమె ఏమనుకుంటుందో అది సక్సెస్ కావడానికి మీరు సాయపడండి. సరిగ్గా సంవత్సరం తర్వాత ఇదే రోజు తన కోసం నేను వస్తాను. మాట తప్పరని ఆశిస్తున్నాను" అన్నాడు ధనుంజయరావు.

తను అనుకున్నది సాధించకుండా వెళ్ళాల్సిరావడం వలన అతని కళ్ళలో అవమానం, బాధ ఎర్రటి జీరల్లా అలుముకున్నాయి.

సుబ్బూకి చాలా బాధనిపించింది.

వెంటనే తన తల్లిదండ్రులు గుర్తుకొచ్చారు.

బాధగా తలదించుకున్నాడు.

అందరూ కారెక్కారు.

కారు తాము ఎక్కిన చోటుకొచ్చి ఆగింది. మహా సుబ్బూ కారు దిగారు.

కారు ముందుకి సాగిపోయింది.

మహా, సుబ్బూ బైకెక్కింది మౌనంగా.

సుబ్బూ మౌనంగానే ఆమెని ఇంటిదగ్గర దింపి అదే బైక్ మీద తిరిగెళ్ళిపోయాడు.

దూరంగా బైక్ మీద వస్తున్న సుబ్బూని చూసి కాళిదాసు మొహం వికసించింది గాని అది కనబడనివ్వకుండా బుగ్గలు పూరించి, మూతి బిగించి బింకంగా కూర్చున్నాడు.

అక్కడే సత్యవతి, సత్తిరాజు ఊరినుండి తెచ్చిన చిక్కుడు కాయల్లో ముదురివి తీసి గింజలు ఒలిచి ఓ గిన్నెలో పోస్తున్నారు.

"వీటితో ఎజిటబుల్లు పులావు జేస్తే వూరువూరంతా గుమ్మెత్తి పొద్దనుకో అక్కా" అన్నాడు సత్తిరాజు సంబరంగా గిన్నెలోని ముదురు గింజలవేపు మురిపెంగా చూస్తూ.

"అవునవును. కాళీగా కూసుని తినేవాడికి రుసులకేం లోటు? ఆడొస్తున్నాడు జూడు" అన్నాడు కాళిదాసు సత్యవతి కేసి చూస్తూ. సత్యవతి వీధికేసి చూసింది.

సరిగ్గా అప్పుడే సుబ్బూ బైక్ అరుగు దగ్గర బ్రేకేసి ఆపి జేబులో నోట్ల కట్ట తీసి చేతిలోని గన్నేరు పూలు దానిమీద పెట్టి కాళిదాసు చేతికిచ్చి నమస్కారం పెట్టాడు.

కాళిదాసు శరీరాన్ని కదిలించి "సరిసర్లే. మజ్జిలో ఈ పూలేటి?" అన్నాడు చిరాగ్గా.

"ఆలస్యమైంది కదండీ" అన్నాడు నవ్వుతూ సత్యవతి వైపు చూసి చిలిపిగా.

" ఏటి రోడ్డు మీన పూలే. కడియంలంక దగ్గరెట్టుకుని నాలుగ్గులాపూవ్వులు కూడా కొన్లేక పోయావా?" అంటూ నోట్ల కట్టు సత్యవతి మీదకి గిరాటెట్టి 'సూస్కో లెక్క' అన్నాడు.

"ఆడు తేవడం - నేను లెక్కెట్టడం ఎప్పుడయినా జరిగిందా రారా లోనకి. ఏవన్నా తిన్నావో లేదో" అంది సత్యవతి ప్రేమగా. సత్తిరాజు మాత్రం చాలా చిత్రంగా సుబ్బూనే గమనిస్తున్నాడు.

"కుర్రాడు చాకులా ఒడ్డూ, పొడవుతో ఈ మజ్జనే వచ్చిన సినిమాలో అర్జున రెడ్డిలా అదిరిపోతున్నాడు. ఈ పిల్లోడు వడ్డీలొసూళ్ళు జేయడమేంటి. వడ్డీలొసూళ్ళోడంటే ఏదో కాలవొడ్డున కిల్లీకొట్టుకాడ కూసునే ఆవారాగాడులా వుంటాడనుకున్నాడు తను. బాగా మంచి కుటుంబం నుండొచ్చినట్లున్నాడే" అనుకుని తెల్లబోయాడు సత్తితాజు.

"అక్కా.. ఈ పిల్లాడా సుబ్బు అంటే?" అనడిగాడు గుసగుసగా.

సుబ్బూ అరుగెక్కి కూర్చుని "తిన్నానండి. ఇస్తే గిస్తే కాస్త ఫిల్టర్ కాఫీ యివ్వండి" అన్నాడు నవ్వుతూ.

సత్యవతి చిక్కుడుకాయలగింజలు తీసుకుని లేచిలోనికెళ్ళింది. కూడా వెళ్ళాడు సత్తిరాజు.

"అక్కా సుబ్బూ అంటే ఏదో అనుకున్నా ఈ పిల్లాడా! సూడ్డానికి సాకులా వున్నాడు. మనింట్లో ఆడపిల్లలు లేరుగాని వుంటే ముడెట్టేసి మనల్నో కలిపేసుకునేవాళ్ళం" అన్నాడు తెగ ఆనందపడిపోతూ.

సత్యవతి బదులుగా నవ్వింది.

"అవునా ఆణ్ణి జూస్తుంటే నాకూ అలానే అనిపిస్తుంటది. ఏటో ఈ బెమలు. ఎవరికి ఎవర్రా. తీరా తాళిగట్టే టైముకి కులాలు, డబ్బులే లెక్కకి మిగుల్తాయిరా. పద ఈ గ్లాసు మీ బావకివ్వు" అంటూ సత్యవతి మరో గ్లాసు తెచ్చి సుబ్బూకిచ్చి ప్రక్కన కూలబడింది.

"నేను మీకు చెప్పకుండా డబ్బు వాడటం తప్పే. కానీ పరిస్థితి అలా వచ్చింది" అంటూ చెప్పాడు సుబ్బూ కాళిదాసుకి.

"సర్లే. అయిపోయిందిగా. ఏదో పెద్దాణ్ణి కోప్పడ్డాను. మీ నాన్నయితే అనడా?" అన్నాడు కాళిదాసు.

"ఆయనకి ముక్కూ మూతికి తేడా తెలియదు. నువ్వు లేకపోతే ఆ కాసిని డబ్బులు కూడా వచ్చేయికావు" అంది సత్యవతి.

"లేదండి చెప్పాల్సిన బాధ్యత నాకుంది. మాస్టరుగారు అకస్మాత్తుగా చచ్చిపోయారు. ఆవిడ ఏడుస్తూ ఫోను చేసారు. తీరా వెళితే అద్దింటివాళ్ళు ఇల్లు ఖాళీ చేయమని ఇల్లుగలవాళ్ళు వత్తిడి చేసారు. ఆవిడ చేతిలో చిల్లుగవ్వలేదు. ఇక దారిలేక నేను కర్మకాండలు చేసి ఆవిణ్ణి మా బిల్డింగ్‌లోకి షిఫ్ట్ చేసాను. వెంటనే మీకు డబ్బు సర్దలేకపోయాను" అన్నాడు సుబ్బూ క్లుప్తంగా వివరిస్తూ.

కాళిదాసులో అపరాధభావం తొంగి చూసింది.

వెంటనే మాట్లాడటం రాక అటూ యిటూ దిక్కులు చూశాడు.

"అయ్యో అంతపని జరిగిందా? నేను అంటూనే ఉన్నానా. ఒకడి రూపాయి ముట్టుకునే రకం కాదు నువ్వని. ఇదంతా మావల్లే. చేతగాని యాపారాలు చేసి ఇతరుల కొంపలకి చేటు తెచ్చాం ఆఖరికి. ఈ డబ్బు తిరిగి తీసుకెళ్ళి ఆవిడకి సాయం చెయ్యరా" అంది సత్యవతి బాధగా.

"అక్కర్లేదండి ఆవిడకి పెన్షన్ వచ్చింది. అమ్మగారిప్పుడు ప్రశాంతంగానే వున్నారు" అన్నాడు సుబ్బు.

సత్యవతి, కాళిదాసు మరేం మాట్లాడలేకపోయారు.

సుబ్బూ లేచి నిలబడ్డాడు.

"అదేంట్రా వంట చేస్తా తినెళ్ళు" అంది సత్యవతి.

"లేదండి. పనుంది. ఒకటి మాత్రం నేనెప్పుడూ గుర్తుపెట్టుకుంటాను. మీరు నాకు ఆశ్రయం యిచ్చారు. అన్నం పెట్టారు. మీరెప్పుడూ బాగుండాలి. మీరీ పనినుండి తీసేసినా నేను మిమ్మల్ని మరచిపోను. వస్తా" అంటూ సుబ్బూ వెళ్ళిపోతుంటే మొదటిసారి కాళిదాసు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

పిల్లలు లేని సత్యవతి మనసు ఆర్ద్రమైపోయింది.

ఆ రోజు పనేం లేదు సుబ్బూకి నిజానికి. కానీ ఇంటికి వెళ్ళాలంటే ఏదో తటపటాయింపు.

అసలు మహా ఉద్దేశ్యమేమిటి? ఎందుకు తండ్రిని ఒక సంవత్సరకాలం టైమడిగింది.

తన చేతిని చుట్టుకున్న ఆమె చేతి స్పర్శ తననింకా వెంటాడుతూనే వుంది. మనసు కలవరపడుతూనే వుంది.

ఇంతదాకా వచ్చాక మహాతో తన ఉద్దేశ్యమేమిటో తెలుసుకోకుండా కాలం గడపడం భావ్యం కాదు.

తన మనసుతో తను ఆటలాడుకోలేడు.

అతను అటు తిరిగి ఇటు తిరిగి కాస్త ఆలస్యంగానే ఇల్లు చేరాడు. మహా ఏదో పాటలు వింటూ కూర్చుంది. సుబ్బూని చూడగానే మహా కూడా కలవరపడింది.

"వచ్చావా?" అంది పొడిగా.

"ఊ" అన్నాడు సుబ్బూ పొడిగా.

ఇదివరకయితే "నా యింటికి నేను రానా మహాతల్లీ" అని ఏదో ఒకటి గీరగా జవాబిచ్చేవాడు.

"భోంచేసావా?"

"ఊ"

మహాకి మరేం మాట్లాడాలో తోచడం లేదు.

"ఈ రోజు సుబ్బూతో మాట్లాడాలి. అవును పూర్తిగా మాట్లాడాలి."

కానీ ఎలా మొదలు పెట్టాలో తెలియడం లేదు మహాకి.

ఈ రోజు మహాని అంతా అడగాలి అనుకుంటున్న సుబ్బూకి కూడా ఎలా కదిలించాలో తెలియడంలేదు.

చివరికి సుబ్బూనే ధైర్యం చేసి "ఒక సంవత్సరం టైము మీ డాడీని ఎందుకడిగావ్? సంవత్సరంలో ఏం చేయాలని? అసలెందుకింట్లోంచి వచ్చేసావ్? మీ బావని చేసుకోవడం యిష్టంలేకనేనా?" అన్నాడు చిన్నగా.

మహా కాసేపు మౌనం వహించింది.

"నీకు సరిగ్గా చెప్పలేదు. నన్ను కౌశిక్ మోసం చేసాడు."

ఆ మాట వినగానే సుబ్బూకి నవనాడులూ కృంగినట్లయింది.

అయినా పూర్తిగా మహా కథ వినాలనే నిర్ణయించుకున్నాడతను.

"కౌశిక్ ఎవరు? నీ క్లాస్‌మేటా?"

"కాదు అతను మెడిసన్ చేస్తున్నాడు. రాణికి ఫ్రెండ్"

"రాణి ఎవరు?"

"అది నా క్లాస్‌మేటు. నాతో బాగా క్లోజ్‌గా వుండేది. నేను ఎక్కడికెళ్ళినా నాతో వచ్చేది. అలా ఇద్దరం ఒకసారి ఒక రెస్టారెంటు కెళ్ళాం. అక్కడికి రాణి పిలిస్తే వచ్చాడతను. అలా పరిచయమైంది. పాటలు చాలా బాగా పాడతాడతను. అలా తరచూ కలుస్తూ వచ్చాం. అతను నన్ను ప్రపోజ్ చేసాడు. నాకూ యిష్టం ఏర్పడింది. చదువయ్యాక పెళ్ళిచేసుకోవాలనుకున్నాం. రాణీ కూడా మాతో వస్తూనే వుండేది. అప్పుడే ఎవరికీ చెప్పొద్దని కౌశిక్ అనడంతో నేను రాణీతో కూడా ఆ విషయం చెప్పలేదు. నేను డిబార్ అయ్యాక మమ్మీ నా మేరేజ్ మా బావతో నిశ్చయం చేసేసింది. నేను కౌశిక్‌కి చెప్పాను. కౌశిక్ కొన్నాళ్ళు ఆగాలన్నాడు. కానీ ఇక్కడ ఆగే వీలు లేదు. నేను ఇంట్లోంచి పారిపోయి కౌశిక్ రూమ్‌కి వెళ్ళాను. అక్కడ.. అక్కడ.." మహా చెప్పడం ఆపి ఏడ్చింది.

సుబ్బూ వారించాలని చూడలేదు.

ఆమె కథ అంతా వున్నదున్నట్లు బయటకి రావాలంటే తనేం మాట్లాడకూడదని మౌనంగానే వుండిపోయాడు.

"అక్కడ ఆ డర్టీగూస్.. రాణి వుంది. ఇద్దరూ.. " అంటూ మళ్ళీ ఏడ్చింది మహా.

"నన్నిద్దరూ ఛీట్ చేసారు. కౌశిక్ ప్రేమంతా అబద్ధం. నేను ఏడ్చాను. అన్నీ విసిరికొట్టాను. వాళ్ళిద్దరూ నా బాధని తేలిగ్గా తీసుకుని నవ్వారు. ఒక బేవకూఫ్‌లా చూశారు. నేను ఏడుస్తూ యింటికెళ్ళలేక ఇలా వచ్చేస్తుంటే ఆ రౌడీలు వెంటబడటం నువ్వు కలవడం జరిగింది" అంది మహా మళ్ళీ ఏడుస్తూ.

సుబ్బూ కాసేపు మౌనంగా కూర్చున్నాడు.

మహా కూడా సన్నగా వెక్కుతూ అలానే కూర్చుంది.

"మరిప్పుడేం చేయాలని? కౌశిక్‌ని నువ్వింకా ప్రేమిస్తూనే వున్నావా?" అడగలేక అడిగాడు సుబ్బూ.

"ఛీ! లేదు."

"మరింక ఇంటికెళ్ళిపోవచ్చుగా!"

మహా కళ్ళెత్తి సుబ్బూ వైపు చూసింది.

"కౌశిక్ నన్నవమానించాడు. నేను నిజంగా అతన్ని చూసి ఏమీ ఫస్టుసైటులోనే ప్రేమించేయలేదు. అతనే చాలా కల్లబొల్లి కవిత్వాలు చెప్పాడు. ప్రతిసారీ నా హృదయపు లోతుల్లో వున్నావని - నువ్వు లేకపోతే నేను లేనని కవిత్వాలు చెప్పి పాటలు పాడి ఇంప్రెస్

చేసాడు. రాణీ కూడా నాతో స్నేహంగా వుంటూ ద్రోహం చేసింది. నీకు తెలియదు సుబ్బూ నేను ఎంత ఏడ్చానో తెలుసా! అలా యింటినుండి వచ్చేసాను. ఇలా ప్రేమలో నిలువునా మోసపోయాను. చచ్చిపోవాలనుకున్నాను. అందుకే గోదావరిలో దూకేద్దామని రాజమండ్రి వచ్చాను. కానీ అంత ధైర్యంలేకపోయింది. నువ్వు.. నువ్వు కనపడకపోతే చచ్చిపోయేదాన్నేమో'' అంది మహా మళ్ళీ ఏడుస్తూ.

సుబ్బూకి నిజంగా చాలా జాలేసింది.

దగ్గరకి తీసుకోవాలని - ఊరడించాలనీ అనిపించింది. కానీ తను అవకాశం తీసుకుంటున్నాననుకుంటుందేమో అని అలానే చూస్తూ కూర్చున్నాడు.

''అంతా జరిగిపోయిందిగా. ఇక ఏడవకు'' అన్నాడు ఊరడింపుగా.

''నీకు నీకు తెలియదు సుబ్బూ! ఆ రోజు వాళ్ళు నన్నెంత హేళన చేసారో. నన్నొక వాంప్‌లా వాళ్ళిద్దరి ప్రేమని సహించలేని డెవిల్లా చాలా అన్నారు. అవన్నీ మరచిపోలేకపోతున్నా. నిజానికి వాడు నా కాలిగోటికి పోలడు. కానీ నేను ప్రేమలో అలా అతన్ని తక్కువగా ఆలోచించలేదు. చాలా నమ్మాను. నేను ఈ రోజుల్లో అమ్మాయినయినా డబ్బూ, పలుకుబడీ వున్నదాన్నయినా ప్రేమలో చాలా నిజాయితీగానే వున్నాను.''

''సరే బాధగానే వుంటుంది. అదే తలచుకుంటే ఎలా? వదిలేయ్. జీవితం ముందుకెళ్ళాలి కదా! నీకేం లోటుంది? మీ డాడీ కూడా అంత కఠినంగా లేరు కదా! ఇంటికెళ్ళి నీకిష్టమైన వ్యక్తిని పెళ్ళిచేసుకో. పడిపోయి లేవకుండా వుంటామా? ఇవన్నీ నడుస్తున్నప్పుడు గుచ్చుకునే ముళ్ళలాంటివి. నువ్వెళ్తానంటే నేను తీసుకెళ్ళి మీ డాడీకి అప్పచెపుతాను''

''వద్దొద్దు'' మహా అమాంతం సుబ్బూ చేతులు పట్టుకుంది.

''మరి?''

''నేను.. నేను వాళ్ళమీద కక్ష తీర్చుకోకుండా వదలను''

సుబ్బూ ఆశ్చర్యంగా చూశాడు మహా వైపు.

''ఎలా?''

''అదే ఎలా?''

''అదే తెలియడంలేదు సుబ్బూ'' అమాయకంగా సుబ్బూ వైపు జరిగి అడిగింది మహా.

''వాళ్ళని చంపేద్దామా?'' వాతావరణం తేలిక చెయ్యడానికి నవ్వుతూ అడిగాడు సుబ్బూ.

''అమ్మో వద్దు. బ్రతికుండగానే చావాలి''

''అదెలా?''

''తెలియకేగా అడుగుతున్నా''

ఆమె చిన్నపిల్ల మనస్తత్వానికి సుబ్బూకి నవ్వొచ్చింది.

ప్రతిమనిషికి అంతరాత్మ వుంటుంది. అది ఎంత నొక్కిపట్టినా తిరగబడి లేచి ప్రశ్నించే రోజు వచ్చి తీరుతుంది. బయటకి ఎన్ని కబుర్లు చెప్పినా ఎంత కప్పిపుచ్చుకుని నటించినా అది ఏదో ఒకనాడు కృంగదీయక మానదు. అదంతా మహాకి అర్థం కాదు.

అందుకే సుబ్బూ నవ్వుతూ ''పడుకో! రాత్రిపూట మన బాధలూ, కష్టాలు రెట్టింపయి ఏడిపిస్తుంటాయి. రేపు నేను ఏం చేయాలో చెబుతా'' అన్నాడు.

''నిజంగా చెబుతవా?''

"ప్రామిస్"

"ప్రామిస్"

మహా అతని చేతిని పట్టుకుని ముద్దుపెట్టుకుని గదిలోకెళ్ళిపోతుంటే ఆశ్చర్యంగానూ, ఒకలాంటి సంతోషంతోనూ ఆమెనే చూస్తుండిపోయాడు సుబ్బూ

**మహా ఒంటరిగా** చాలాసేపు ఆలోచిస్తూ పడుకుంది. బిల్డింగ్ ఇదివరకులా కాకుండా చాలా నిశ్శబ్దంగా వుంటోంది.

అదివరకు పాపాయమ్మ కేకలు, రామక్రిష్ణ అల్లర్లు, ఉమ్మడి సీత రాకపోకలు - ఏదో గందరగోళంతో కొంత చిరాకనిపించినా వారి బాధలు, తమాషా మాటలు, అంతలోనే ఒకరికొకరు సహాయపడటాలు - గమ్మత్తుగా వుండేవి.

ఇప్పుడంతా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా వుంటున్నారు. రామక్రిష్ణ వెళ్ళాక తాగుబోతు గోల లేదు.

లత తనపనిలో తనుంటున్నది.

పాపాయమ్మ పిండి రుబ్బే మిషను దొరికాక అమ్మాజీని కేకలెయ్యడం మానేసింది.

సరస్వతమ్మగారొచ్చాక ఒక రకం క్రమశిక్షణ అలుముకుంది. ఆవిడ పూజులూ, పునస్కారాలూ, పాటలూ అక్కడంతా ఒక పవిత్రమైన వాతావరణాన్ని, ఆహ్లాదాన్ని కలగజేస్తున్నాయి.

ఇక అమ్మాజీ సరేసరి. లేసుల గోలలో పడిపోయింది.

గబగబా పనులు ముగించుకుని, స్నానాలు చేసి అంతా అమ్మాణమ్మగారి దగ్గర జేరుతున్నారు. ఒకరికొకరు పోటీపడి రకరకాల లేసులల్లుతున్నారు. రెండుసార్లు భజన్‌లాల్ వాటిని తీసుకుని పేమెంటు చేసాడని అమ్మాజీ చెప్పింది. ఇప్పుడేపనీ లేకుండా ఒంటరయిపోయింది తనే. మహాకి దిగులుగా వుంది.

అప్పుడే ఆమె దృష్టి సుబ్బూ సూట్‌కేసు మీద పడింది. అల్మరాలున్నా ఎన్ని సార్లు చెప్పినా బట్టలందులో సర్దుకోడు. ఆ పెట్టె యింట్లో దిష్టిపిడతలా కనిపిస్తోంది.

తనే సర్దితే..? అమ్మో సూట్‌కేసు ముట్టుకున్నందుకు తిడతాడేమో! ఎందుకో ఏమోగాని ఆమెకు పెట్టె తెరిచి అతని వస్తువులు అల్మరాలో సర్దాలనిపించింది. అందులో ఏమిన్నాయో ఏమో?

మెల్లిగా లేచి సూట్‌కేసు తెరిచి చూసింది. ఏదో తెలియని క్యూరియాసిటీ. అతని గురించి తెలుసుకోవాలని. పైన బట్టలు చిందరవందరగా వున్నాయి. వాటిని తనకొచ్చిన రీతిలో మడిచింది. వాటిని తీసి బయటపెట్టగానే రెండు ఇంగ్లీషు నవలలు కనిపించాయి. వాటినటూ యిటూ తిరగేసి 'ఫర్వాలేదే! చదువుకున్నట్టున్నాడు' అనుకుంది మురిపెంగా నవ్వుకుంటూ.

ఆ తర్వాత లోపలి పేపర్ తీస్తుండగా అడుగున ఒక ఫొటో కనిపించింది. అందులో తల్లిదండ్రుల మధ్య వున్న సుబ్బూ. ఆమె ఆ ఫోటోని చాలా ఆశ్చర్యంగా చూసింది. అతని తల్లిదండ్రుల్ని చూస్తే చదువుకున్న వారిలానే వున్నారు. సంస్కారమున్న మధ్య తరగతి కుటింబీకుల్లా అనిపించారు.

అప్పుడే సరిగ్గా తలుపు టకటకా శబ్దం చేసింది.

మహా గబగబా ఆ వస్తువుల్ని అందులో పడేసి సూట్‌కేసు మూసి తలుపు తీసింది.

ఎదురుగా అమ్మాజీ నవ్వుతూ.

''నువ్వా! భయపడిపోయాననుకో'' అంది మహా ఊపిరి పీల్చుకుంటు.

''దేనికండీ బయమెందుకూ?'' అంది అమ్మాజీ  చుట్టూ చూస్తూ.

ఆ మాటకి బదులివ్వకుండా ''సుబ్బా ఎవరో తెలుసా. నీకు?'' అంది.

ఆ మాటకి ఆశ్చర్యపోవడం అమ్మాజీ వంతయింది.

''ఏంటండీ - కొత్తగా అడుగుతున్నారు?'' అంది తిరిగి తను కూడా ప్రశ్నిస్తూ.

''అంటే అసలెవరో ఎక్కణ్ణుంచొచ్చాడో? ఏం చదువుకున్నాడో ఎప్పుడయినా చెప్పాడా?''

మహా ప్రశ్నకి అమ్మాజీ కూలబడి నవ్వింది.

''బలేటోరండి మీరు. వుండీ వుండీ కొండని తవ్వి ఎలకని పట్టినట్లు బలేటి పెశ్నలేస్తాను మీరు. అయ్యన్నీ మీకెంత తెలుసో మాకు అంతే తెలుసు. సుబ్బాని ఎవరన్నా అడగటమే. డొక్క చింపి డోలు కట్టేయడా! నిజం చెప్పాలంటే మీరొచ్చాకనే కాస్త మడిసి మెత్తబడి తాగుడదీ మానేసి నెమ్మదిగా వుంటున్నాడండి. అది వరకు అతనొస్తన్నాడంటే బిల్డింగంతా వణికి సచ్చేది'' అంది అమ్మాజీ.

మహా తల పంకించింది.

''అయినా ఎందుకు ఈ రోజు ఇలా అడుగుతున్నారు?''

బదులుగా మహా అతని సూట్‌కేసులోని ఫోటో తీసి అమ్మాజీకి చూపించింది.

''సుబ్బు బాగా చదువుకున్నాడు. మంచి కుటుంబం నుంచే వచ్చాడు. వీళ్ళే అతని మమ్మి డేడీలు'' అంది మహా.

అమ్మాజీ ఆ ఫోటోని కళ్ళు పెద్దవి చేసి చూసింది.

''ఆపైన బాగున్నారు కదాండీ! మరెందుకిలా వుంటున్నాడో. ఆళ్ళున్నారో లేదో అసలు?'' అంది ఆశ్చర్యంగా.

''అవును. ఆ సంగతి తెలియదు'' అంటూ తన పర్సులోని పులిగోరు పతకం తీసి ఫొటోలో సుబ్బా మెడలో వున్న పులిగోరు పతకంతో పోల్చి చూసింది. ఇదే అతని మెడలో వున్నది. ఖరీదయిందే ''దీంట్లో కాస్టలీ స్టోన్స్ వున్నాయి'' అంది మహా.

మెట్లమీద చప్పుడు విని ''అన్నొస్తన్నట్లున్నాడు. సూట్‌కేసులో ఎట్టేయండి'' అంది అమ్మాజీ కంగారుగా.

మహా అన్నీ అందులో వేసి సూట్‌కేస్‌ని వెనక్కి తోసేసింది.

సుబ్బా లోపలికి రాగానే అమ్మాజీ లేచి నిలబడింది.

''ఈ మధ్య రావడం తగ్గించేసావ్‌లా వుంది'' అన్నాడు సుబ్బా వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

''అమ్మాజీ గాభరా పడుతున్నట్లుగా నవ్వి ''అదికాదన్నా ఈ లేసుల పని పెట్టుకున్నాగా. నేనూ అమ్మాణమ్మగారు, సరస్వతమ్మగారు అల్లుతూ కూర్చుంటున్నాం'' అంది.

''బాగానే వుంది. భజన్‌లాల్ డబ్బులు సరిగ్గా యిస్తున్నాడా?''

''ఇస్తున్నాడన్నా. ఇప్పుడేదో జూట్ దారాలొచ్చాయంట. ఆటెల్తోకూడా ఏవన్నా చెయ్యమని దారాలిచ్చాడు'' అని చెప్పింది అమ్మాజీ.

''నువ్వుకూడా వాళ్ళతోపాటు ఏదన్నా చెయ్యొచ్చుకదా!'' అన్నాడు సుబ్బా మహావైపు చూస్తూ.

మహా గుటకలు మింగుతూ గుర్రుగా చూసింది.

''సరే అన్నా కింద పనుంది'' అంటూ అమ్మాజీ చిన్నగా జారుకుంది.

''సుబ్బా భోంచేసావా?'' అనడిగింది మహా.

''ఏం వంట చేసావా?'' సుబ్బా నవ్వుతు అడిగాడు.

''అవును'' అంది మహా.

సుబ్బూ కళ్ళు పెద్దవి చేసి ''ఈజిట్?'' అన్నాడు.

''ఏం నాకేమాత్రం రాదా!'' అమ్మాజీ చేస్తుంటే చూశాను.

''ఇప్పుడన్నీ సోషల్ మీడియాలో వుంటున్నాయి కదా'' అంది మహా చాలా సిన్సియర్‌గా.

''అయితే పెట్టు పెట్టు'' అని భుజాలెగరేసి బాత్రూంలోకెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కుని వచ్చాడు సుబ్బూ.

మహా చాలా కష్టపడి అతనికి వడ్డించింది. సుబ్బూ కంచంలోకి చూశాడు.

అన్నం ఫర్వాలేదు. కరెంటు రైస్ కుక్కర్ కాబట్టి దాని పని అది చేసింది. పెరుగు తోడుకుంది. పప్పే తన సహజ రూపాన్ని అలాగే అట్టిపెట్టుకుని టమోటో ముక్కలతో కలవలేక బింకంగా కూర్చుంది. పక్కన ఆమ్లెట్. కొద్దిగా అటూ యిటూగా వున్నా మహా ప్రయత్నం బాగానే అనిపించింది. ముఖ్యంగా వంట చేయాలనుకున్న ఆమె ఆలోచన.

''నువ్వు తిన్నావా?''

''నువ్వడిగావా?''

''సారీ! రా తెచ్చుకో''

మహా గెంతుకుంటూ వెళ్ళి తన ప్లేట్ తెచ్చుకుని ఒక ముద్ద తిని వెగటుగా మొహం పెట్టుకుని ''ఏం బాగాలేదు కదూ!?'' అంది.

''నాకు బాగానే వుంది''

''నువ్వు అబద్ధం చెబుతున్నావ్.''

''లేదు మహా! వంట చేయాలనే నీ ఆలోచన నీ వంటకి రుచిని తెప్పించింది. రోజు రోజుకి పర్‌ఫెక్షన్ వస్తుంది. నాకు నిజంగానే నచ్చింది'' అన్నాడు.

''థాంక్యూ సో మచ్'' అంది మహా.

ఆమె కళ్ళు సంతోషంగా మెరిసాయి.

రెండు కంచాలు సుబ్బూనే సింక్‌లో పెట్టి వచ్చాడు.

''సుబ్బూ!''

''ఊఁ''

''మరి.. సుబ్బూ!''

''ఏంటా నస?'' సుబ్బూ చాపమీద పడుకుంటూ అడిగాడు.

''నేనొకటి అడిగితే నువ్వు నిజం చెప్పాలి''

''అడుగు. నేను చెప్పింది నువ్వు నమ్మాలిగా!''

''నువ్వు.. నువ్వెవరివి?''

మహా ప్రశ్నకి ఉలిక్కిపడ్డాడు సుబ్బూ.

''అదేం ప్రశ్న. ఇన్నాళ్ళుగా నా రూంలో వుంటూ''

''అంటే.. అదికాదు. నీ వూరెక్కడ? ఏం చదువుకున్నావు? మీ పేరెంట్స్ ఎక్కడున్నారూ?'' ఆ సంగతులు.

''ఎందుకిప్పుడవన్నీ. నాకెవరూ లేరు.''

"అబద్ధం"

సుబ్బూ ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. హడావుడిలో సూట్‌కేసులో ఆమె సర్దని ఇంగ్లీషు నవలలు అతని దృష్టిలో పడ్డాయి.

అతని భ్రుకుటి ముడిపడింది.

"నా సూట్‌కేస్ తెరచి చూశావా?"

మహా కొంచెం భయపడింది కాని.. మళ్ళీ ధైర్యం తెచ్చుకుని "అంటే కావాలని కాదు. నీ వస్తువులు అల్మారాలో సర్దుదామని" అంది నసుగుతూ. సుబ్బూ శాంతంగానే ఆమెవైపు చూశాడు.

మరోసారయితే అతనామె మీద ఇంతెత్తున ఎగిరేవాడే కానీ ఎక్కడో అతని హృదయంలో ఒక సన్నపాటి ప్రేమ భావన వద్దన్నా తీగలల్లుకుంటోంది. అందుకే అతను చాలా మెత్తగా "అలా చూడకూడదని తెలియదా నీకు?" అన్నాడు.

మహా తలదించుకుని "నీ గురించి తెలుసుకోవాలనుకోవడం తప్పు కాదు కదా!" అంది మెల్లిగా.

"నా గురించి చెప్పుకునేంత ఏమీలేదు. మామూలు జీవితం అంతే."

"నీకు చెప్పడానికిష్టంలేదు కదా! నాకు తెలుసు నువ్వు చదువుకున్నావని కూడా. మీ మమ్మీ డేడీ బాగున్నారు"

ఈసారి అతను తన పెద్ద పెద్ద కళ్ళని మరింత పెద్దవి చేసి మహాని ఆశ్చర్యంగా చూశాడు.

అతని కళ్ళలో లీలగా మెరుస్తున్న పల్చని పాదరసం లాంటి కన్నీటిని మహా గమనించి 'సారీ' అన్నది చిన్నగా.

"ఇట్స్ ఓకె. పడుకో" అన్నాడు సుబ్బూ తను అటు తిరిగి పడుకుంటూ.

మహా ఇంకేం రెట్టించలేకపోయింది.

వెంటనే తన గదిలోకెళ్ళి మంచం మీద వాలిపోయింది.

సుబ్బూకి మాత్రం నిద్రపట్టలేదు. అతని ఆలోచనలు అతనింటి చుట్టూ పరిభ్రమింపసాగాయి. ఆ యింటిలోంచి ఆవిడ మాటలు గట్టిగా వినిపిస్తున్నాయి.

"సుజీ మైడియర్ స్వీట్ సుజీ.. కమాన్ అయిసే! కొంచెం ఈ బాక్ బటన్స్ పెట్టిపో"

సుజీ గబగ్గబా చేతిలోని గిన్నెని డైనింగ్ టేబుల్ మీద పెట్టి బెడ్‌రూములోకి పరిగెత్తింది.

"చూశావా ఈ బ్లవుజ్ కొత్త మోడల్‌లో కుట్టించాను. బాగుందా?"

"బాగుంది మమ్మీ" అంది సుజీ సంతోషంగా.

"ఎక్కడనుకున్నావ్? ఏబిడ్స్‌లో సంతోష్ థియేటర్ సందులో వున్నాడు. చూడ్డానికి పురాతనమైన షాపు. కానీ ఎంత మోడ్రన్‌గా కుడతాడనుకున్నావ్? పెద్ద పెద్ద ముస్లిం ఫామిలీస్ అందరూ అక్కడే స్టిచ్ చేయించుకుంటారు" అంది మీనూ అని పిలిపించుకునే మీనాక్షమ్మ.

సుజీ అని పిలవబడే సుజాత కొంగుకి చేతులు తుడుచుకుని గబగబా తల్లి బ్లవుజ్ హుక్స్ పెట్టింది.

"ఈ షాపు గురించి ఎవరు చెప్పారు మమ్మీ" అనడిగింది అమాయకంగా.

"ఆ.. ఫేస్‌బుక్ ఫ్రెండ్ రాణీ చెప్పిందిలే."

"అవునా!"

"అవునే. నువ్వుకూడా ఇలా తయారవ్వమంటే వినవు. ముసలమ్మలా ముతకచీరలు కట్టుకుని నాసిరకంగా తయారవుతావు. ఛీ!ఛీ అ యామ్ ఎషేమ్డ్ ఆఫ్ యూ" అంది మీనాక్షమ్మ చెవులకి పెద్ద పెద్ద హాంగింగ్స్ పెట్టుకుంటూ.

సుజీకి తల్లంటే చెప్పలేని ఆరాధన. ప్రేమ.

ఆమె ధైర్యానికి, తెగింపుకి తనకి నచ్చినట్లు వుండే ఆత్మస్థయిర్యానికి అబ్బురపడి నీరాజనాలిస్తుంది.

"కానీ ఆయనకి ఇష్టం వుండదు మమ్మీ" అంది చిన్నగా.

"ఏడ్చాడు. పనీపాటా లేకుండా ఇంట్లో పడున్నాడు. మళ్ళీ పెద్ద పెత్తనం. నువ్వు వింటున్నావు కాబట్టి ఆర్డర్లు వేస్తున్నాడు. అసలెందుకే భయం. ఆ జీన్స్ టీ షర్టు తెచ్చి ఎన్నాళ్ళయింది. వేసుకోకుండా మూలపెట్టావ్. ఏంటంత భయం?" అని విసుక్కుంటూ హైహీల్స్ షూ వేసుకుని పర్సు తీసుకుని బయటకి వస్తూ లోపలికొస్తున్న సుబ్బూకి ఎదురొచ్చింది మీనాక్షమ్మ.

ఆమెని చూస్తూనే వెగటుగా మొహం పెట్టాడు సుబ్బూ.

"వచ్చావా.. పిచ్చి తిరుగుళ్ళు తిరిగి ఇప్పటికి కొంపకి" అంది మీనాక్షమ్మ వెటకారంగా.

"నాదయింది. నువ్వు మొదలుపెడుతున్నావుగా వెళ్ళిరా తల్లీ" అని చేతులు జోడించి లోపలికొచ్చాడు సుబ్బూ.

మీనాక్షమ్మ భుజాలెగరేసి వెళ్ళిపోయింది. సుబ్బూ ఇంట్లోకి వస్తూనే అక్కడున్న టీపాయ్‌ని గట్టిగా తన్నాడు.

ఆ చప్పుడుకి అక్కడే పేపర్ చదువుకుంటున్న ప్రభాకర్రావు ఉలిక్కిపడి చూసి "ఏంట్రా అది?" అన్నాడు.

సుబ్బూ తండ్రికి జవాబు చెప్పకుండా తన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

సుజాత గబగబా కొడుకు గదిలోకెళ్ళి "ఏం జరిగింది నాన్నా? ఎందుకంత కోపం? కాలేజీలో ఏదన్నా గొడవా?" అనడిగింది.

సుబ్బూ తలదించుకుని మంచమ్మీద కూర్చున్నాడు.

సుజాత ప్రేమగా కొడుకు గడ్డం పట్టుకుని తనవైపు తిప్పుకుంది. "ఎందుకు నాన్నా? ఏం జరిగిందో నాకు చెప్పవా?" అంది ముద్దుగా.

"నాకు ఇంటికి రాబుద్ధికావడంలేదు. హాస్టల్లో చేరిపోతాను" అన్నాడు సుబ్బూ తల్లి భుజమ్మీద తలపెట్టి.

"ఎందుకు నాన్నా? ఉన్న ఊళ్ళో కాలేజి. ఇంట్లో ఎవరున్నారని డిస్టర్బ్ చెయ్యడానికి. నీ రూమ్ నీకుంది కదా!" అంది.

"ఉంది కదా. గ్రేట్ మీనూ" అన్నాడు కసిగా సుబ్బూ.

బదులుగా పకపకా నవ్వింది సుజాత.

"అమ్మ గురించా? అదుత్త పిచ్చిది. అమ్మమ్మేం చేసిందిరా? తాతయ్య అంత అన్యాయం చేసినా తనలోకంలో తను బతుకుతుంది. ఇంత ఆస్తి అమ్మమ్మదే కదా! మనల్నెంత ప్రేమగా చూసుకుంటున్నది" అంది సుజాత లాలనగా.

"అవును పిచ్చిదే పిచ్చిదాన్ని రోడ్లమీదకొదిలేస్తే ఏం జరుగుతుంది? చూడు బయటెలా నవ్వుతున్నారో. నాకు నా ఫ్రెండ్స్ ముందు ఎంత సిగ్గేస్తున్నదో తెలుసా?"

ఆ మాటకి సుజాతకి చాలా కోపం వచ్చేసింది.

"ఏంట్రా ఏం మాట్లాడుతున్నావ్? ఎవరన్నా ఎందుకు నవ్వుతారు. కాస్త మోడ్రన్‌గా వుంటుంది. వాళ్ళకి వుండటం చేతకాక ఏడుపు"

"అవును ఏడుపే. ఆవిడకా ముసలి వయసులో ఆ మేకప్పులూ, తిరుగుళ్ళూ.. అసలెక్కడికి వెళ్తుందో ఎవరికీ తెలియదు. మొన్న ఆ చెప్పులతో పడి కాలిరిగితే మూణ్ణెల్లు మంచంలో తీసుకుంది. అయినా బుద్ధిరాలేదావిడకి" అంటూ రంగప్రవేశం చేసాడు ప్రభాకరరావు.

తండ్రీ కొడుకులు ఏకం కావడం చూసి కోపం తారాస్థాయికందుకుంది సుజాతకి.

"చాలా బాగా చెప్పారులెండి. మీరేదయినా చేసి సంపాదించరు. ఆవిడ ఇంటిని పోషిస్తుంటే హేళన."

"అవునవును. ఇద్దరూ కలిసి చీరల బేరం పెట్టారు. ఇన్‌స్టాల్ మెంటులో యిచ్చిన చీరలకి ఒకరూ ఒక్క రూపాయి యివ్వలేదు. వాడింటి మీదకొస్తే పది పర్సెంటుకి అప్పు తెచ్చి వాడికి రెండులక్షల అప్పు తీర్చారు. ఇదే మీరు పోషించడం" అంటూ విసురుగా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు ప్రభాకరరావు.

బదులుగా సుజాత మంచమెక్కి ఏడవడం మొదలుపెట్టింది. సుబ్బూకి ఏం చేయాలో తోచలేదు. ఈ కథ రోజూ ఇంతే. ఆవిడకి నచ్చచెప్పడం సుజాతకి ఇష్టముండదు.

తల్లంటే ప్రేమ. తల్లి ఏం చేయమంటే అదే కాసేపట్లో క్రింద వాచ్‌మన్ చేత పట్టించుకుని పళ్ళు, పూలు, ఇక యితర సామాగ్రితో వచ్చింది మీనాక్షమ్మ.

"ఏంటి మమ్మీ ఇది"

"రేపు నా బర్త్‌డే పార్టీ ఇస్తున్నాను"

"రేపా? నువ్వు పుట్టింది నవంబరులో కదు మమ్మీ"

బదులుగా పకపకా నవ్వింది మీనాక్షమ్మ.

"అంటే అందరూ నిజంగా పుట్టినరోజే బర్త్‌డేలు చేసుకుంటున్నారనా నీ ఉద్దేశ్యం?"

సుజాత అర్థంకానట్లుగా చూసింది.

"రేపు చాలా మంది వస్తారు. ఎరేంజ్‌మెంట్సు చూడు. కాస్త రేపు మీ ఆయన్ని బయటెక్కడన్నా తగలబడమను"

ఆ మాట వింటూనే ప్రభాకరరావు చెప్పులేసుకుని బయటకెళ్ళిపోయాడు.

సుబ్బూ కూడా కోపంగా బయటకి వెళ్ళిపోయాడు

"దేనికమ్మా ఈ పార్టీ?" అంది సుజాత మెల్లగా.

"పార్టీ యిచ్చి అందరి చేతా 5000/-కి తక్కువ కాకుండా చిట్ వేయిస్తున్నా. అలా మన చేతిలోకి కొంత డబ్బొచ్చి పడుతుంది" అంది గర్వంగా మీనాక్షమ్మ.

"అద్సరే అంతేసే వారెవరున్నారూ?"

"ఇంకెవరు నా ఫేస్‌బుక్ ఫ్రెండ్స్, పేకాట ఫ్రెండ్స్. లోపల ఎంత ఏడుపున్నా బడాయి కోసం వేస్తారు. సరి సర్లే. ఇల్లు డెకరేట్ చెయ్యి. నేను కేటరింగుకి ఆర్డర్ ఇచ్చాను" అంది మీనాక్షమ్మ తన రూములోకి వెళ్ళిపోతు.

తల్లి తెలివి తేటలకి చాలా అబ్బురపడి ఇల్లు సర్దడం మొదలుపెట్టింది సుజాత.

'ఈయనకి, సుబ్బూకి అంత కోపమేమిటో. అర్థంకాదు. మమ్మీ ఇంటి కోసం ఎంత కష్టపడుతోంది?' అని నిట్టూర్చింది.

బైక్ మీద విసురుగా వెళ్తున్న సుబ్బూకి రోడ్డువారన గమ్యం లేనట్లుగా నడుస్తున్న తండ్రి కనిపించాడు.

"డేడీ!" అన్నాడు బైక్ పక్కన ఆపి.

ప్రభాకరరావు కొడుకు వైపు చూసి "నువ్వు రా!" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఎక్కడికి నాన్నా? నేను దింపుతాను" అన్నాడు సుబ్బూ.

"వద్దులేరా దోమలగూడాలో నా ఫ్రెండ్ ఆఫీసొకటి వుంది. ఈ రెండురోజులు అక్కడ వుందామని" అన్నాడాయన.

సుబ్బూ మనస్సు చివుక్కుమంది. వద్దని చెప్పడానికి తనకేం ఉద్యోగం లేదు.

"రండి. ఇక్కడ కాఫీ తాగి వెళ్దురుగాని" అంటూ ఆయన్నెక్కించుకుని ఒక రెస్టారెంటులోకి దారి తీసాడు.

ఇద్దరూ మౌనంగా కాఫీ తాగుతుంటే ప్రభాకర్రావే మౌనం చీలుస్తూ "నేనే పనీ చెయ్యకుండా ఏమీ లేనురా. మీ అమ్మకి హార్టు ట్రబులుందని బ్రతిమలాడి ఈ పెళ్ళిచేసారు. నేనేం ఇల్లరికం కాదు. కానీ వాళ్ళు నా చేత ఉద్యోగానికి రిజైన్ చేయించి బలవంతంగా ఫైనాన్స్ వ్యాపారం పెట్టించారు. నేను ఏదన్నా కాదంటే మీ అమ్మ గుండెనొప్పని విరుచుకు పడిపోతుంది. ఆమెకేమన్నా అవుతుందనే భయంతో నేను ఒప్పుకున్నాను. అందులో కూడా నాకు ఫుల్ ఫ్రీడమ్ లేదు. అంతా మీ అమ్మమ్మ పెత్తనమే. ఆవిడ గోల పడలేకనే మీ తాత యిల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఎప్పుడో నాకూ అదే గతి పడుతుంది."

తండ్రి మాటలకి విలవిలలాడింది సుబ్బూ హృదయం.

'వద్దు నాన్నా' అని సినిమాటిక్‌గా అనలేకపోయాడు.

"సరేలే నువ్వు చిన్నవాడివి. నీకెందుకులే ఇవన్నీ. బాగా చదువుకో. నీకు ఉద్యోగం వచ్చాక అన్నీ చక్కబడతాయి. సరేనా?" అంటూ భుజం తట్టాడు ప్రభాకరరావు.

సుబ్బూ సరేనన్నట్లు తలూపి తండ్రిని బైక్‌మీద దోమల్‌గూడాలోని ఆయన చెప్పిన ఎడ్రస్‌కి తీసుకెళ్ళి వదిలాడు. ఆయన మెట్లు ఎక్కి వెళ్తుంటే మొదటిసారిగా కళ్ళనీళ్ళొచ్చాయి సుబ్బూకి. భారమైన హృదయంతో వెనుతిరిగాడు.

**ఆ రోజు** ప్రొద్దుట పదకొండు గంటల నుండే సందడి ప్రారంభమయ్యింది. ఒక్కొక్క కారు గుమ్మం ముందు నిలబడటం ప్రారంభమయ్యింది. మీనాక్షమ్మ అంతకు ముందే తయారవ్వడానికి బ్యూటీ పార్లర్‌కి వెళ్ళింది. సుజాత ఆ పాటికే ఒక షిఫాన్ చీరకట్టుకుని తయారయి వుంది. ఆమె హడావుడి పడుతూ వచ్చినవారిని రిసీవ్ చేసుకుంటున్నది.

సుబ్బూ తన గదిలో మంచం మీద కూర్చుని వళ్ళో పుస్తకం పెట్టుకుని చదవాలని ప్రయత్నిస్తున్నాడేగానీ మనసుకి ఏకాగ్రత కుదరడంలేదు. మరోసారి అయితే బయటకి వెళ్ళిపోయేవాడేకానీ అసలు ఈ స్నేహాలేమిటో కథేమిటో తెలుసుకోవాలనే మొండిగా కూర్చున్నాడు.

'తొందరపడకు ముందు చదువు పూర్తి చేసుకో' అన్న తండ్రిమాట పదేపదే గుర్తొస్తున్నది.

తల్లి నిజానికి చాలా సౌమ్యురాలు. కానీ ఆమె తన తల్లిమాట జవదాటలేదు ఆమె చేతిలో కీలుబొమ్మ. ఆస్తి చేతిలో పెట్టుకుని అమ్మమ్మ చేస్తున్న ఆగడాలు భరించలేకపోతున్నాడతను.

అంతలో సుడిగాలిలా రానే వచ్చింది మీనాక్షమ్మ.

సుబ్బూ ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు.

ఆమె తన అమ్మమ్మేనా అని తెల్లబోయాడు.

అలా తీర్చిదిద్దింది బ్యూటీ పార్లర్.

అత్యాధినకమైన హెయిర్ స్టయిల్లో కొప్పు, దరిదాపు బాక్‌లెస్‌గా వున్న బ్లవుజు, బంగారు రంగులో మెరిసిపోతున్న లినెన్ సారీ, లోలాకులు, చీర కట్టుకున్న తీరు - అందరూ 'మీనూ, మీనూ' అంటుంటే అయితే ఈవిడే తన అమ్మమ్మనే భావన కొచ్చి రూఢి చేసుకున్నాడు సుబ్బూ.

మీనూ రాగానే స్నేహితులు లేచి కెవ్వున అరుస్తూ ఆమెని కౌగిలించుకుని రకరకాలుగా అభినందిస్తున్నారు.

ముద్దులు పెడుతున్నారు.

"రియల్లీ మీనూ నువ్వు ఫోటోలో కన్నా సూపర్బ్. అసలు నీకింత కూతురా!? సిల్లీ" అంటూ కామెంటు చేస్తున్నారు.

"నిన్ను ఎన్నాళ్ళకి చూశాం? హౌ లక్కీ అయామ్" అని మురిసిపోతున్నారు. అప్పుడే ఒకర్నొకరికి పరిచయం చేస్తున్నది మీనూ.

సుజీ చెప్పిన ప్రకారం కేటరింగ్ వాళ్ళు వచ్చిన వారందరికీ కూల్‌డ్రింక్స్ సప్లయ్ చేస్తున్నారు.

హాలంతా అరుపులతో, కేరింతలతో తుళ్ళి తుళ్ళి పడుతున్నది. నవ్వులతో దద్దరిల్లుతున్నది.

దాదాపు అందరూ తమ అమ్మమ్మలానే తయారయ్యారు.

పోయిన వయస్సుని రాబట్టుకోవాలనే వారి తాపత్రయం, జీవితంలో గతంలో దొరకని ఆనందాన్నిప్పుడు పొందాలన్న ఆశ వారిలో మెండుగా కనిపించి ఒక విధమైన జాలి కూడా కలిగింది సుబ్బూకి.

ఏవేవో సర్వింగ్ చేస్తూనే వుంది సుజీ.

వాటిని మెచ్చుకుంటూ లొట్టలేస్తూ కొందరు, అవి నచ్చనట్లు అపురూపంగా భుజాలెగరేసి మరొకటి ఆర్డర్ చేస్తూ తమ లిప్‌స్టిక్ పెదవులకి అంటకుండా సుతారంగా తింటూ మెచ్చుకుంటూ తింటున్నారు మరికొందరు.

పలకరింపులు, పరిచయాలు అయ్యాక పాటలు మొదలయ్యాయి.

"హాయ్ విన్నూ నువ్వు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన అన్నమయ్య పాట సూపర్బ్.. పాడవూ" అని అడిగిందొకావిడ.

విన్నూ కాసేపు బ్రతిమాలించుకుంది.

"అవును. హౌ మెలోడియస్ యువర్ వాయిస్! ప్లీజ్ మాకోసం పాడవూ!?" అని అందరూ గోల చేసేసరికి సదరు విన్నూ పాడటం మొదలెట్టింది.

సుబ్బూ ఆశ్చర్యంగా ఆ పాట వింటున్నాడు.

"అది పాటా.. మాటా!" అర్థం కాలేదతనికి.

పాడుతున్నది ఆడా. మగా నిర్ధారించుకోలేకపోతున్నాడు. ఆమె దాదాపు ఏ రాగం, శ్రుతి లేకుండా పాటని మాట్లాడేసింది. ఆమె పాట పూర్తయ్యేసరికి చప్పట్లు హోరు.

ఆమె గర్వంతో కూడిన సిగ్గు అభినయించింది.

వెంటనే మరొకామె ఎవరూ అడగకుండానే తన పాట ప్రారంభించింది.

అనేక అద్భుతమైన పాటలు వారి కంఠాల్లో దూరి ఖూనీ అయి బయటకి వస్తున్నాయి.

సుబ్బూకి చిర్రెత్తుకొస్తున్నది.

అసలు వీళ్ళెందుకు ఆ అద్భుతమైన పాటల్నిలా ఖూనీ చేస్తున్నారో అర్థంకావడంలేదు.

లతా, ఆశా, జానకి, వాణీజయరాంలాంటి అద్భుతమైన సింగర్స్ పాటల్ని నేరుగా విని ఆనందించొచ్చుకదా! తను చిన్నప్పటినుండి ప్రొద్దుట సుప్రభాత వేళల్లో ఎమ్మెస్, శోభారాజ్‌లాంటి డెడికేటెడ్ సింగర్స్ పాటలు విన్నాడు.

ఆ సదరు కార్యక్రమం ముగిసి లంచ్ ఏర్పాట్లు జరిగాయి.

సుజాత ఒక ప్లేట్లో సుబ్బూకి కొన్ని అయిటమ్స్ వడ్డించి గదిలోకొచ్చి కొడుకుని చూసి నవ్వింది.

''నువ్వు యిక్కడే తిను. ఏవన్నా కావాలంటే చెప్పు'' అంది.

సుబ్బూ ఏమీ అనలేదు. సుజీ కొడుకు తల నిమిరి వెళ్ళిపోయింది. సుబ్బూ ఆ అయిటమ్స్‌వైపు చూశాడు. అతనికి కళ్ళు తిరిగాయి.

పాయసం, బిరియాని, పన్నీర్‌తో చేసిన అయిటమ్స్, రెండు మూడు రకాల స్వీట్స్, పులిహోర - ఇంకా చాలా అయిటమ్స్, రెండు మూడు రకాల స్వీట్స్, పులిహోర ఇంకా చాలా అయిటమ్స్ పెట్టారు. కొన్ని పుల్లారెడ్డి నుండి, ఆగ్రా నుండి తెచ్చారు. పాయసం, బిరియాని, పులిహోర అన్నీ బాస్మతి రైస్‌తోనే చేశారు.

చూస్తుంటేనే వెగటేసింది సుబ్బూకి.

అంతలోనే కెవ్వున అరుపులూ, చప్పట్లూ వినిపించి అటు చూశాడు.

మీనాక్షమ్మ అందరి మధ్యా కేక్ కట్ చేసింది. దీపాలు ఆర్పింది. హాలంతా లైట్లు బ్లింకవుతున్నాయి.

అందరూ మీనాక్షమ్మకి హాపీ బర్త్‌డే చెబుతూ పాట పాడారు. కేక్ అందరికీ తినిపించింది మీనాక్షమ్మ.

ఆ హడావుడి ముగిసాక భోజనాలు సాగాయి.

టీ, స్నాక్స్ ముగిసాక అందరికీ మీనాక్షమ్మ తన చిట్ పథకం వివరించింది. ఆమె కొంత సందేహంగానే అయిదువేలంటూ తన ప్రపోజల్ బయట పెట్టింది.

''మనకంటూ మన డబ్బు వుండాలి. ఇన్నాళ్ళూ సంసారాలకోసం కష్టపడ్డాం. ఎన్నో త్యాగాలు చేసాం. ఏదయినా చిన్నపాటి నగ కొనుక్కోవాలన్నా ఈ రోజుల్లో లక్షల ఖరీదుంది. అందుకే యీ చిట్ ప్రపోజ్ చేస్తున్నా'' అని చెప్పింది మీనాక్షమ్మ.

అందరూ వెంటనే 'ఓకే' చేసారు.

కొందరు మాత్రం ''ఇరవైమంది వేస్తే ఆఫ్టాల్ ఒక లక్షవుతుంది. దాంతో ఏమొస్తుంది? పదివేలు పెట్టు'' అన్నారు.

''అవునవును. ఇప్పుడెవరు గోల్డ్ పెడుతున్నారు, డైమండ్స్ లేకపోతే సిగ్గుచేటు'' అన్నారు.

వెంటనే మీనాక్షమ్మ పదివేలు చేసేసింది.

అందరూ పర్సుల్లోంచి డబ్బులు తీస్తుంటే వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి ఆశ్చర్యపోయాడు సుబ్బూ.

సుజీ అందరి ఎమౌంట్స్ పేర్లు ఒక పుస్తకంలో రాసింది. లాటరీ వేసారు. మొదటి చిట్ తీసుకుని అందరికీ ధన్యవాదాలు చెప్పి వీడ్కోలిచ్చింది మీనాక్షమ్మ.

అందరూ వెళ్ళాక తీరుబడిగా సోఫాలో కూలబడి ''చూశావా నా తెలివి.. మన చేతిలో మూడు లక్షలు వచ్చిపడ్డాయి'' అని నవ్వింది గర్వంగా.

తల్లి తెలివికి ఎంతగానో అబ్బురపడింది సుజీ.

ఆ వెంటనే సుబ్బూ కోపంగా బయటకొచ్చి ''ఇప్పుడయిన ఖర్చు ఎంతో అదీ లెక్కేయి. అయినా ఇదేంటి? ఇల్లు సత్రవ చేసేస్తున్నారు'' అని ఎగిరాడు కోపంగా.

సుజీ భయంగా చూసింది కొడుకు వైపు.

"వాడింతేలే. వాడు మగాడు కదా! ఆ బుద్ధి ఎక్కడికి పోతుంది. అలాగే వాగుతాడు. పట్టించుకోకు" అంది మీనాక్షమ్మ తనని తాను నాలుగయిదు సెల్ఫీలో బిగించుకుంటూ నిర్లక్ష్యంగా.

సుబ్బూ కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ పళ్ళు కొరుక్కున్నాడు.

"ఓహో మీరంతా బాధిత స్త్రీలకి ప్రతినిధులన్నమాట"

"ఏవన్నా అనుకో!"

"బయట వచ్చి చూడు, అసలెవరు నిజంగా సమస్యలతో అలమటిస్తున్నారో. ఎవరు ఆర్థిక బాధలతో కృంగిపోతున్నారో!" అన్నాడు సుబ్బూ ఆవేశంగా.

మీనాక్షమ్మ నిర్లక్ష్యంగా నవ్వింది.

"ఎవరైనా పైకి చూడాలనుకుంటారు. క్రిందకి కాదు" కోపంగా అంది.

సుజాత కొడుకు వైపు చూసి వూరుకోమన్నట్లుగా సైగ చేసింది.

సుబ్బూ అసహనంగా కుర్చీ తన్ని బయటకి వెళ్ళిపోయాడు.

వెళ్తున్న సుబ్బూ వైపు చూసి "నీ కొడుక్కి తక్కువలేదు. అన్నీ తండ్రి బుద్ధులే వచ్చాయి. ఒక్కనెల టెర్మ్ ఫీజు కట్టకపోతే తెలిసొస్తుందయ్యగారికి" అంది వెటకారంగా.

ఆ మాట విని విలవిలలాడింది సుజాత.

"చిన్నాడమ్మా తెలియదు" అంది బ్రతిమిలాడుతున్న ధోరణితో.

ప్రొద్దుటే ఫోను చేసింది వేదవతి.

"ఏంటి ప్రొద్దుటే, ఏంటి విశేషం?" అంది మీనాక్షమ్మ నవ్వుతూ.

"విశేషమే. పదిగంటలకొకసారి నువ్వు రెడీగా వుండు. నేను నిన్నొక చోటికి తీసుకెళ్తాను" వేదవతి.

"ఎక్కడికి?"

"అది సర్ప్రయిజ్. చూడాలి నువ్వు" అంది వేదవతి.

"సరే!"

"ఏం చేస్తున్నావ్?"

"కాఫీలయ్యాయి. సుజీ టిఫిన్ తయారు చేస్తోంది"

"సరే. టిఫిన్ తిని రెడీగా వుండు. నేను నిన్ను పికప్ చేసుకుంటాను. లంచ్ బయట చేద్దాం" అంది వేద.

"ఎవరమ్మా?" అంది సుజీ టిఫిన్ తెచ్చి తల్లికిస్తూ.

"వేద. ఎక్కడికో తీసుకెళ్తుందట. రెడీగా వుండమంది."

"వేదా? ఎవరూ?"

"అదే నల్లగా, పొడవుగా రేవులో తాడిలా వుంటుంది. ఆ గాడీ మేకప్పూ వేషం, మా వూర్లో చొల్లంగి తిర్నాలకి ఆడవేషం వేసుకున్న మగాడిలా వుంటుంది" అని కిసుక్కున నవ్వింది మీనాక్షమ్మ.

తల్లి జోక్‌కి పకపకలాడింది సుజాత కూడా. గదిలోంచి వాళ్ళ మాటలు వింటున్న సుబ్బూకి వళ్ళు మండిపోతోంది.

"అమ్మా!" అంటూ అరిచాడు గట్టిగా.

"వెళ్ళు వెళ్ళు.. మగధిక్కారం వినిపిస్తోంది" అంది మీనాక్షమ్మ భుజాలెగరేసి నవ్వుతూ.

"అమ్మా యితరుల గురించి మీరెలా మాట్లాడుతున్నారో అర్థమవుతుందా? స్నేహం పేరుతో ఎంత చౌకబారుతనంతో ప్రవర్తిస్తున్నారో తెలుసా?" అన్నాడు కోపంగా.

జవాబు చెప్పలేక నీళ్ళు నమిలింది సుజాత.

"అబ్బో చెప్పొచ్చావ్. వెనుక అందరూ ఇలానే మాట్లాడుకుంటారు. ఈ శ్రీరంగ నీతులకేం లే" అంది మీనాక్షమ్మ.

సుబ్బూ ఆవిడ మాటల్ని పట్టించుకోకుండా తల్లి భుజాల చుట్టూ చేతులేసి తన పక్కన కూర్చోబెట్టుకుని "నాన్న ఇంటికొచ్చి రెండ్రోజులయ్యింది. నీకా విషయమన్నా గుర్తుందా?" అనడిగాడు.

సుజాత అపరాధిలా తలదించుకుంది.

"నాన్న చాలా మంచివాడమ్మా"

బదులుగా స్రరున తలెత్తి చూసింది సుజాత.

"మంచివాడు కాదు. చేతకానివాడు"

సుబ్బూ తల్లి వైపు నిస్సహాయంగా చూసి "ఎందుకని?" అన్నాడు.

"ఒక్క రూపాయి సంపాదించలేకపోయాడు. ఏ పని చేసినా నష్టమే. మా అమ్మలేకపోతే నేను ఏమయిపోయేదాన్ని? చివరికి నీ చదువుకూడా అమ్మమ్మే చెప్పిస్తున్నది. అది గుర్తుంచుకో" అని వెనుతిరిగి వెళ్ళిపోయింది సుజాత.

సుబ్బూ వెళ్తున్న తల్లివైపు నిస్పృహగా చూశాడు.

ఆమెని బయటకి తేవడం చాలా కష్టమైన పనని గ్రహించాడు సుబ్బూ. తండ్రి చేతిలో డబ్బులేదు. ఎవరో స్నేహితుడి ఆఫీసులో వున్నాడు రెండ్రోజులుగా. ఇద్దామంటే తన దగ్గర కూడా ఏమీ లేదు. సుబ్బూ బాధని మనసులోనే అదిమి పట్టి కాలేజీకి బయల్దేరాడు.

పదిగంటలకి వేదవతి వచ్చింది సుడిగాలిలా.

అప్పటికే తయారయివున్న మీనాక్షమ్మ కూతురికి చెప్పి వేదతో బయల్దేరింది.

దారిలో వేద చెప్పింది "అక్కడంతా సైలెంట్‌గా ప్రతిదీ గమనించు. ఆ తర్వాత నువ్వేం చెయ్యాలో చెబుతాను" అంది.

మీనాక్షమ్మకి చాలా కుతూహలంగా వుంది, తనేం చూడబోతున్నానో అని.

కారు ఒక అధునాతనమైన ఎపార్టుమెంట్స్ ముందు ఆగింది. లిఫ్ట్‌లో ఇద్దరూ పైకెళ్ళారు. ఒక ఫ్లాట్ ముందు చాలా చెప్పుల జతలు వున్నాయి. అక్కడ కాలింగ్ బెల్ మోగించింది వేద. తలుపు తెరచుకుంది.

ఒక స్త్రీ నిలబడి వీళ్ళిద్దర్నీ చుసి చిరునవ్వులు చిందిస్తూ" రండి. రండి" అంది.

"మీట్ మై ఫ్రెండ్ మీనూ! బై ద బై షియీజ్ రమా!" అంటూ పరిచయాలు చేసింది వేద.

ఇద్దరూ కరచాలనం చేసుకున్నాక లోపలి వాతావరణం చూసి విస్తుపోయింది మీనా.

అది విశాలమైన హాలు.

హాల్లో ఒక పది పైనే రవుండ్ టేబుల్స్ వేసి వున్నాయి. టేబుల్‌కి ఆరు కుర్చీలు వేసి వున్నాయి. అక్కడ అప్పటికే వచ్చిన స్త్రీలు తీవ్రమైన ఏకాగ్రతతో పేకాడుతున్నారు. కాఫీలు, టీలు, స్నాక్స్ ఒక పనమ్మాయి సర్వ్ చేస్తున్నది.

"మీరు కూర్చుంటారా. ఆ టేబుల్ ఖాళీ వుంది" అనడిగింది రమ నవ్వుతూ.

"నో! నో! నాకు రాదు" అంది మీనాక్షమ్మ కంగారుగా.

"అయ్యో ఇందులో రాకపోవడానికేముంది. రెండాటలాడితే అదే వస్తుంది" అంది నవ్వుతూ.

"లేడీస్ పేకాడతారా?" అంటూ తన ఆశ్చర్యాన్ని ప్రకటించింది మీనక్షమ్మ.

"యూ సిల్లీ! ఏం ఆడటానికి మగాడికే దేవుడు చేతులిచ్చాడా?"

"అంటే... ఇది గాంబ్లింగ్ కదా" అంటూ నసిగింది మీనాక్షమ్మ.

ఆ మాటకి పేకాడుతున్న ఒకావిడ సీరియస్‌గా మీనాక్షమ్మ వైపు చూసింది.

"మా ఆయన పోయాడు. నా చేతికి బల్క్ పెన్షన్ వస్తుంది. ఏ లోకంలో వున్నాడో.. థాంక్ యూ డియర్. నా పిల్లలు ఎబ్రాడ్‌లో వున్నారు. ఆ టి.వి ప్రోగ్రామ్స్ బోర్. రోజంతా ఏం చేయను. ఇక్కడ కొస్తే టైమే తెలియదు. మహా థ్రిల్లింగ్‌గా వుంటుంది. రెండాటలు ఆడి చూడండి. రేపణ్ణుంచి మీరే పరిగెత్తుకొస్తారు. ఇట్సాల్ టైం కిల్లింగ్" అంది.

ఆ థ్రిల్ ఏమిటో మీనాక్షమ్మకి అర్థంకాలేదు కానీ అక్కడందరి మొహాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రమాదేవే వాళ్ళందరికీ లంచ్ ఏర్పాట్లు చేసింది.

కొందరు మధ్యలో డ్రాపయి వెళ్తున్నారు.

మరికొందరు మధ్యాహ్నంగా వచ్చి జాయినవుతున్నారు. కొందరు అప్పుడే తీవ్రంగా దెబ్బలాడేసుకుంటున్నారు. మరికొందరు తిట్టుకుంటూ తరతరాల్ని ఎత్తి ఆడిపోసుకుంటున్నారు.

మీనాక్షికి అది చూసి భయంవేసింది.

"అయ్యో.. వాళ్ళు అంతలా దెబ్బలాడేసుకుంటున్నారు" అంది కంగారుగా.

బదులుగా వేదవతి నవ్వి "అదేం లేదు. ఈ కాసేపే. రేపు యిద్దరూ భుజాల మీద చేతులేసుకుని ఒకే కారులో వస్తారు."

"అవునండి ఆటలో తీవ్రంగా ఇమ్మర్సయి అలా చేస్తారంతే. వాళ్ళు బెస్ట్‌ఫ్రెండ్సే" అంది రమాదేవి.

తిరిగి కారులో ఇంటికొస్తుంటే "ఇంతకీ నన్నెందుకక్కడికి తీసుకెళ్ళావ్?" అనడిగింది మీనాక్షమ్మ.

"ఆ క్లబ్ నీ చేత కూడా పెట్టిద్దామని" డ్రైవ్ చేస్తూ చెప్పింది వేదవతి.

"అమ్మో.. నా వల్ల కాదు. అయినా మా లొకాలిటీలో అది కుదరదు"

"అందుకే నా పక్కనే ఒక ఎపార్టుమెంటుకూడా చూశాను. అందులోకి షిఫ్టవ్వు"

"నేనంత ఎఫర్ట్ చెయ్యలేను వేదా. అయినా ఇంత హైఫై నాకు కుదరదు. వీళ్ళంతా అప్పర్ క్లాస్ లేడీస్"

"వాళ్ళ బొంద. ఈ జూబ్లీ హిల్స్‌లో వున్నంత చిల్లర జనం మరెక్కడా వుండరు. ఊరినుండి సంచులు పట్టుకుని వచ్చి ఎదిగిపోయిన జనమే ఎక్కువ. నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు. నువ్వు డబ్బు యిబ్బందిలో వున్నావని మాత్రమే యీ సలహా యిస్తున్నాను. చిట్స్ వలన ఏం బాగుపడతావు? ఆ మనీ ఎప్పటికయినా తిరిగి యిచ్చేసేదే కదా! ఆలోచించు"

మీనాక్షమ్మ ఆలోచనలో పడింది.

వేదవతి మీనాక్షమ్మని డ్రాప్ చేస్తూ "ఏ సంగతీ ఫోన్ చెయ్యి. లేకపోతే ఆ అపార్టుమెంట్‌లోకి ఎవరన్నా వచ్చేస్తారు. బెస్ట్ ప్లేస్" అంటూ హెచ్చరించింది.

ఆ రాత్రి మీనాక్షమ్మకి నిద్రపట్టలేదు. టేబుల్‌కి ఇంతని వసూలు చేస్తుందట రమాదేవి.

"పోలీసుల బెడద వుండదా?" అని రాత్రి ఫోను చేసి మరీ తన సందేహాల్ని వెలిబుచ్చింది మీనాక్షమ్మ.

"సింగినాదం. డబ్బుకు లొంగని పోలీసెవడు?" అంది వేదవతి.

రమాదేవి ఆ డబ్బుతో మరో ఎపార్టుమెంటు కొన్నదని తెలిసి నిద్రపట్టలేదు మీనాక్షమ్మకి.

ఆ మర్నాడే తన దగ్గర వున్న చిట్ డబ్బులో కొంత ఎడ్వాన్సు ఇచ్చి అపార్టుమెంటు తీసుకుంది. ఫర్నీచర్ కొంది మిగతా సొమ్ముతో.

సుజాతకి తల్లిచేస్తున్నదేవిటో అర్థం కావడంలేదు. ఎన్నిసార్లడిగినా నవ్వుతుంది కానీ చెప్పడంలేదు.

ఆ రోజు సుబ్బూ కాలేజికి వెళ్తూ "రాత్రికి రాను. నాన్న దగ్గరకి వెళ్తా" అనడంతో మీనాక్షమ్మ ఎగిరి గంతేసింది.

ఆ రోజే పేకింగ్ ఎండ్ మూవర్స్‌కి చెప్పి సామాను పేక్ చేసి కొత్తింటికి మకాం మార్చేసింది.

అప్పటికే వేదవతి ఆ యింటికి కావాల్సిన హంగులేర్పరిచి ఈ కొత్త పేకాట క్లబ్బు గురించి మౌత్ పబ్లిసిటీ యిచ్చేసింది.

సుజాత తల్లి నేర్పరితనానికి అబ్బురపడుతూనే సుబ్బూని గురించి భయపడుతూనే వుంది. "ఈ తతంగాన్ని పేకాటని వాడసలు యిష్టపడడు. చాలా గొడవయి పోతుందేమో?" అదేమాట తల్లితో అంటే తీసిపారేసింది మీనాక్షమ్మ. "దెబ్బకి దెయ్యం లొంగుతుంది. అమ్మ పెట్టదూ అడుక్కుతిననివ్వదని. వీడి బాబుకి సంపాదన లేదు. వీడి చదువు పూర్తికాలేదు. ఏం చేస్తాడు? చచ్చినట్లు వాడే వస్తాడింటికి" అంది.

సుబ్బూ ఆ రాత్రి కాలేజి నుండి తిన్నగా తండ్రి దగ్గర కెళ్ళాడు. తను వెళ్ళేటప్పటికి ఆయన పెద్ద పెద్ద ఎకౌంట్ బుక్స్‌లో ఏవో లెక్కలన్నీ కంప్యూటర్‌లోకి ఫీడ్ చేస్తూ వున్నాడు.

సుబ్బూని చూసి నవ్వుతూ "రా నాన్నా, ఎలా వున్నావ్?" అన్నాడు.

సుబ్బూ మౌనంగా తండ్రి ఎదుట కూర్చుని "నిన్న ఇంటికి రాలేదేం నాన్నా?" అనడిగాడు. తన ప్రశ్న తనకే ఎబ్బెట్టుగా అనిపించింది.

బదులుగా ఆయన నవ్వి "ఇదిగో ఈ లెక్కలన్నీ చూస్తున్నా. నా ఫ్రెండ్ ఎకౌంటెంట్ మానేసాడట. ఊరికే సహాయం తీసుకోకూడదు కదా!" అన్నాడు. "నువ్వు బాగా చదువుకో. మిగతా వేటి మీదా దృష్టి పెట్టకు. కొన్నాళ్ళు ఓపిక పట్టు. అన్నీ చక్కబడతాయి."

ఆయన మాటలు మౌనంగా విన్నాడు సుబ్బూ.

ఆయన డ్రాయర్ లాక్ చేసి "పద, అలా ఏదైనా రెస్టారెంట్‌కి వెళ్ళి భోంచేద్దాం" అన్నారు లేచి నిలబడుతూ.

ఇద్దరూ దగ్గర్లో వున్న రెస్టారెంటుకెళ్ళి భోంచేసారు.

బిల్ సుబ్బూ పే చెయ్యబోతే వద్దని వారించి ఆయనే ఇచ్చి "నిన్న నా ఫ్రెండ్ కొంత ఎడ్వాన్స్ యిచ్చాడులే" అన్నారు నవ్వుతూ.

సుబ్బూకి అర్థమయ్యింది తండ్రి అక్కడ పనికి కుదురుకున్నారని.

ఇంతలో తల్లినుండి ఫోన్ వచ్చింది.

"సుబ్బూ, నువ్వా యింటికి వెళ్ళకు. మనం యిల్లు మారిపోయాం. జూబ్లీ హిల్స్, రోడ్ నెంబర్ 23. ఖజురహో ఎపార్టుమెంట్స్" అంటూ ఎడ్రస్ చెప్పింది సుజాత.

సుబ్బూ తెల్లబోయి విన్నాడు.

"ఏవిటట?"

"ఇల్లు మారారట. ఇప్పటికిప్పుడు" ఆశ్చర్యంగా తండ్రికి చెప్పాడు.

"సరే గొడవ పడకు. సర్దుకో"

తండ్రి సలహా పాటించేవాడే సుబ్బూ - ఆ మర్నాడు ఆ సంఘటన జరిగి వుండకపోతే.

**సుబ్బూ** బైక్ దిగి ఆ ఎపార్టుమెంట్సు కేసి అనుమానంగా చూశాడు. తల్లి చెప్పిన ఎడ్రస్ కరెక్టే. ఎపార్టుమెంట్సు పేరు కూడా అదే నిజానికి సుబ్బూకి ఆ ప్రదేశం తెలియనిదేమీకాదు.

ఎన్నోసార్లు స్నేహితుల కోసం ఆ ప్రాంతానికి వచ్చినవాడే కానీ తమలాంటి మధ్యతరగతి మనుషులుండే ప్రాంతం కాదది.

ఉల్లిపాయకి, పచ్చిమిరపకాయకి కార్లు వేసుకుని జూబ్లీ హిల్స్ కూడలికి పరిగెత్తాలి.

రోడ్డుమీద కార్లు తప్ప నడిచే మనుషులు కనపడరు.

తన స్నేహితుడు వరుణ్ తల్లి ఎప్పుడూ అదే వాపోతుండేది. "మీకేం మీరందరూ కార్లేసుకుని, బైక్ లేసుకుని బయటపడిపోతారు. మేం ప్రొద్దుట్నుండి రాత్రివరకు ఇక్కడ దిక్కులేకుండా బిక్కుబిక్కుమంటూ ఒక్కళ్ళం పడుండాలి. బడాయికి లంకంత కొంపకట్టి ఇక్కడ తెచ్చి పడేసారు. ఇక్కడ పనిమనుషులు దొరకరు. ఇంట్లో వాచ్‌మన్‌ని పెట్టుకుంటే వుండలేమని వెళ్ళిపోతున్నారు" అనేదావిడ.

సుబ్బూని చూసి వాచ్‌మన్ దగ్గరగా వచ్చాడు.

సుబ్బూ చెప్పింది విని కొత్తగా నిన్ననే వచ్చారు. అంటూ లిఫ్ట్‌లో తీసుకెళ్ళాడు.

సుబ్బూ లోపలికెళ్ళి ఆ యిల్లు తమది కాదేమోనని బయటకి రాబోతుంటే సుజాత కొడుకుని చూసి "సుబ్బూ!" అంది సంతోషంగా.

సుబ్బూ తల్లివైపు చూసి "ఇదంతా ఏంటమ్మా, ఈ టేబుల్స్ కుర్చీలు? ఇది మన యిల్లేనామ్మా?" అనడిగాడు సంశయంగా.

"మనదేరా!" అంటూ నవ్వి చెయ్యిపట్టుకుని తనగదిలోకి తీసుకెళ్ళింది లాలనగా.

సుబ్బూ అయిష్టంగానే ఆమెతో నడిచాడు.

ఆ గది కూడా తమగదిలా లేదు.

ఫర్నీచర్ అంతా మారిపోయింది.

"ఎందుకిక్కడ కొచ్చారు? ఫర్నీచర్ కూడా మార్చేసారు. ఇంత డబ్బెక్కడిది?" అనడిగాడు అసహనంగా.

"ష్! అమ్మమ్మ వింటుంది. ఇదంతా అమ్మమ్మదే లేకపోతే ఎవరిస్తారు. అమ్మమ్మ పెద్ద ప్లాన్‌తో వచ్చింది. వేదవతిగారని... మన పక్క ఎపార్టుమెంటే. ఆవిడ చాలా హెల్ప్ చేసారు" అంది గర్వంగా.

సుబ్బూ అర్థంకానట్లుగా చూశాడు.

"అసలిదంతా ఎందుకు? ఇక్కడ రెండు కార్లు లేకపోతే బ్రతకలేరు. ఏవీ దొరకవిక్కడ"

"రేపో ఎల్లుండో మన కారూ వస్తుంది" అంది సుజాత నవ్వుతూ.

"మరి. హాలంతా ఆ టేబుల్స్, కుర్చీలు ఏంటి?"

"ముందు టిఫిన్ తిను. తర్వాత అన్నీ అర్థమవుతాయి" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకి తీసుకెళ్ళింది చెయ్యిపట్టుకుని సుజాత.

నిజానికి సుజాతకి లోలోపల భయంగానే వుంది. సుబ్బూ ఎక్కడ కోపంతో తిరిగి వెళ్ళిపోతాడోనని.

సుబ్బూ అయిష్టంగానే టిఫిన్ తింటూ చుట్టూ పరిశీలిస్తున్నాడు. డైనింగ్ టేబుల్ కొత్తది. గోడలకి తంజావూర్ పెయింటింగ్, షో కేసులో ఖరీదయిన క్రోకరి. హాల్లో ఖరీదయిన బొమ్మలు. చాలా వుక్కిరి బిక్కిరిగా వూపిరాడనట్లుందతనికి.

ఇంతలో నైటీతో "హలో హీరోగారూ.. ఇల్లు కనిపించిందా?" అంటూ వచ్చి ఎదురు కుర్చీలో కూర్చుంది మీనాక్షి.

ఆమెను చూస్తూనే వెగటుగా వుంటుంది సుబ్బూకి.

పెద్ద వయసు, వరుసకి అమ్మమ్మ - అందుకే ఏమీ అనలేక తన కోపాన్ని తనలో వీలయినంతగా దాచుకుని భరిస్తుంటాడు.

సుబ్బూ జవాబు చెప్పకుండా చెయ్యికడుక్కుని తల్లివైపు చూస్తూ "నాకేమన్నా ఒక గది వుందా?" అనడిగాడు.

"అయ్యో, నీకు రూమ్ లేకపోవడమేంటిరా..రా" అంటూ అతని గదిలోకి తీసుకెళ్ళింది.

సుబ్బూ స్నానం చేసి డ్రెస్ మార్చుకుని కాలేజీకి వెళ్ళిపోయాడు.

"ఏమీ అడగలేదా నీ కొడుకు?" అంది మీనాక్షి టీ తాగుతూ.

"అడిగాడు. ఏదో చెప్పాను" అంది సుజాత.

"చూసి థ్రిల్ అయిపోయుంటాడు. ఇలాంటి చోట వుండడం స్టేటస్ సింబల్ కదా!" అంది మీనాక్షి గర్వంగా.

"అదేం లేదమమ్మీ. వాడి మొహంలో సంతోషం ఏమీ కనపడలేదు. ఇంకా మనం కార్డ్స్ క్లబ్బు పెట్టామని తెలిస్తే ఎంత హంగామా చేస్తాడోనని భయంగా వుంది. "

"సింగినాదం. చేసి వాడేం చేస్తాడు. కాదూ కూడదంటే బాబు దగ్గరకిపోతాడు" అంది మీనాక్షి నిర్లక్ష్యంగా.

తల్లంటే ఎంత యిష్టం, భయం వున్నా ఒక్కోసారి సుజాతకి ఆవిణ్ణి చూస్తే భయంగానే వుంటుంది. ఈమెలో స్త్రీ తాలూకు ప్రేమ, దయ, జాలి, తన పిల్లల పట్ల ప్రత్యేక అభిమానంలాంటి జీవపదార్థాలేవీ లేవా? అని భయం కూడా వేస్తుంది.

"అదేంటి మమ్మీ. వాడు లేకపోతే నేను బ్రతగ్గలనా?" అంది బాధగా.

"ఆ గొప్పగా కనిపెంచావులే" అంటూ కుర్చీని ఒక తన్ను తన్ని లేచెళ్ళింది మీనాక్షి.

ఆ మాటకే సుజాత కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగి చెంపలమీదుగా కారిపోయాయి.

మరో గంటలో యింట్లో సందడి ప్రారంభమైంది. పేకాట రాణులు రావడం మొదలయ్యింది.

మీనాక్షి మొదటిరోజే అంతమంది వస్తారనుకోలేదు.

వేదవతి వచ్చి నేనంటే "ఏమనుకున్నావ్? నిన్నంతా ఫోనులో అందరికీ పబ్లిసిటీ ఇస్తూనే వున్నాను" అంది గర్వంగా.

మీనూ ఆమె చేతులూపి హగ్ చేసుకుంది.

"సరి సర్లే. ముందు వాళ్ళందరి సంగతీ చూడు. రమాకన్నా నీ ఏర్పాట్లు బాగుండాలి" అంది.

మీనాక్షి తలూపి ఆ సందట్లో పడింది.

సుబ్బు కాలేజీ అయిపోయాక అటూ యిటూ గమ్యం లేనట్లుగా తిరిగి మళ్ళీ తండ్రి దగ్గరకెళ్ళాడు.

"రా నాన్నా! ఏంటి సంగతులు? ఇల్లెందుకు మారారు?" అనడిగాడు ఆప్యాయంగా.

మొదటిసారిగా తండ్రిమీద కొంత కోపం వచ్చింది సుబ్బూకి. ఆయన తన బాధ్యతలు వదిలేసి దూరంగా కూర్చుంటే తను వార్తలు మోసే వార్తాహరుడా! కష్టమైనా, నష్టమైనా కట్టుకున్నందుకు యింట్లో వుండి ఇల్లు చక్కబెట్టుకోవాలి కదా!

"ఏంటాలోచిస్తున్నావ్?"

సుబ్బు తల విదిలించుకుని "ఏంలేదు. ఏం లేదు" అన్నాడు.

"లేదురా ఏదో ఆలోచిస్తున్నావు. ఎవరో చుట్టంలా ఇలా అడుగుతున్నాడేంటీ అనుకుంటున్నావు కదూ" అన్నారాయన సూటిగా కొడుకు వైపు చూస్తూ.

సుబ్బూ జవాబు చెప్పకుండా తలదించుకున్నాడు.

కాసేపు యిద్దరి మధ్యా కొంతసేపు మౌనం రాజ్యమేలింది.

ఏదో చెప్పబోతున్నట్లుగా ఆయన చిన్నగా దగ్గి "నువ్వు పెద్దవాడివయ్యావు. నీకన్నీ తెలియడం మంచిదే కానీ ఎవరైనా చెప్పడం వేరు. తండ్రే చెప్పాల్సిరావడం వేరు. మీ అమ్మ ఆరోగ్యం మంచిదికాదు. హార్టు పేషెంటు. ఆపరేషన్ జరిగింది కానీ డాక్టర్లు ఆమె గుండె చాలా బలహీనమని ఆమెకు వివాహం చెయ్యొద్దని చెప్పారట. కానీ మీ అమ్మమ్మ తన తర్వాత ఆమెని ఎవరు చూస్తారనే బెంగతో సంబంధాల కోసం వెదకడం మొదలెట్టింది. నేను తరచు రామక్రిష్ణా మఠానికి వెళ్ళి అక్కడ ప్రసంగాలు వినేవాణ్ణి. అక్కడ మీ తాతగారు పరిచయమయ్యారు. అక్కడ ప్రసంగాలనంతరం నేను చాలాసేపు కదలకుండా అక్కడే కూర్చునేవాడిని. నాకు తల్లిదండ్రులు లేరు. ఆస్తిలేదు. ఎవరో బంధువుల దయతో, కొంత పనులు చేస్తూ చదువుకున్నాను. ఉద్యోగం వచ్చాక నేను నా వయసువారిలా సరదాలతో, వినోదాలతో కాలక్షేపం చేయలేదు. తల్లిదండ్రులు లేకపోతే దేవుడు కూడా లేనట్లే. ఆ ప్రేమ, ఆదరణ, త్యాగం మరెవ్వరూ చెయ్యలేరు. చెయ్యరు. పేగుబంధం అలాంటిది. అందుకే నేను నా తోటి వయసు వారితో కలవలేకపోయేవాడిని. వాళ్ళ ఆనందం, నాకు చాలా కృతకంగా కనిపించేది. అందుకే ఎక్కువ ప్రకృతితో మమేకమవుతూ ఒంటరిగా కాలక్షేపం చేసేవాడిని.

మీ తాతగారు ఒకరోజు నా దగ్గరగా వచ్చి కూర్చుని మాట కలిపి నా వివరాలడిగారు. నేను అన్నీ నిజాలే చెప్పాను. ఆయన కొన్ని రోజులు నాతో స్నేహం చేసాక తన మనసులో మాట బయట పెట్టారు.

"అమ్మాయి పరిస్థితి ఇది. చిన్న పనికే అలిసిపోతుంది. మానసికంగా శారీరకంగా ఏ మాత్రం శ్రమపెట్టకూడదు. నిజానికి పెళ్ళి చేయకూడదు. కానీ మా తర్వాత ఎవరామెను చూస్తారు అనే బెంగ మాది. ఏ ఫలితమూ ఆశించకుండా ఆమెకు తోడుగా వుండేవారుంటారా?" అని ఆయన తన దిగులుని ప్రదర్శించారు.

నేను మౌనంగా విని ఇంటికొచ్చేసాను.

ఆ రాత్రి మాత్రం ఆయన మాటలు, అన్యాపదేశంగా చేసిన వేడుకోలు నా మనసు మీద చాలా ప్రభావాన్ని చూపాయి.

అందరూ ఆదర్శాలు చెబుతారు. ఎవరైనా ఆచరిస్తే 'గ్రేట్, వావ్' అంటూ అభినందిస్తారు. కానీ తాము చిన్న త్యాగం చెయ్యడానికి ముందుకురారు. చేసిన వారిలోని లోపాల్ని వెదకడానికి ప్రయత్నిస్తారు. మనుషుల్ని ఎవరూ తృప్తిపరచలేరు. అది లోక రీతి. ఆ అమ్మాయికి ఒక తోడు, ఇవ్వగల్గాలి. ఒక మంచి సహచరుడిగా నిలబడాలి. అదీ భర్త పేరుతో ఇక్కడ హక్కులుండవు - కేవలం బాధ్యతలు మాత్రమే. ఒక వారం నేను మఠానికి వెళ్ళలేదు. బాగా ఆలోచించాను. ఏదో ఆవేశంగా నిర్ణయం తీసుకోవడం కాదు. చివరిదాకా నిలబడాలి. దేవుడు నాకేమిచ్చాడు? తల్లిదండ్రుల్ని లాగేసుకున్నాడు. ఏ మురిపెమూ ముద్దూ తెలియకుండా ఎవరెవరో పంచన ఛీత్కారాలు పొందుతూ బ్రతికాను. నేను యింటికి రాలేదని ఎదురు చూసేవారు గాని తిన్నానో లేదో అడిగేవారు గానీ లేరు. ఇప్పుడు నేనే ఒకరికి ఆ ఆప్యాయతని, అనురాగాన్ని పంచితే ఎంత బాగుంటుంది? అలా అనుకోగానే ఒక నిశ్చింత వచ్చేసింది. చాలా సంతోషం కూడా వేసింది. మర్నాడు రెట్టింపు సంతోషంతో మఠానికి వెళ్ళాను. మీ తాతగారు కనపడ్డారు. ఇద్దరం స్వామిజీ ప్రసంగమయ్యాక మేము ఎప్పుడూ కూర్చునే చోటికి వెళ్ళి కూర్చున్నాం.

ఆయన నా మొహంలోకి చూస్తూ కూర్చున్నారు.

నాకు కూడా ఒక సందేహం.

ఆయనగాని యధాలాపంగ చెప్పివుంటే నా పరిస్థితి ఏమిటి? నా ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ ఆయన అడిగారు.

"ఏంటి బాబూ ఆలోచిస్తున్నావ్? ఏదైనా సమస్యా?"

"ఏం లేదు. మీరు చెప్పిన విషయాలు నాకు చాలా బాధ కలిగించాయి. మీ అమ్మాయికి ఎలాంటి వరుడు కావలనుకుంటున్నారు?" అనడిగాను చిన్నగా.

వెంటనే ఆయన మొహంలో ఉత్సాహం చోటు చేసుకుంది.

"ఒక మంచివాడు త్యాగబుద్ధి ఓర్పుకలవాడు కావాలి. అసలలాంటి వాడుంటాడా? నాది ఆత్యాశ బాబూ!" అన్నారాయన విచారంగా.

"ఉంటే..?"

నా ప్రశ్నకి ఆయన చాలా ఆశ్చర్యంగా నా వైపు చూశారు.

"ఉంటే కళ్ళకద్దుకుని కన్యాదానం చేస్తాను" అన్నారాయన తడుముకోకుండా.

"నేనే మీ అమ్మాయిని చేసుకుందామనుకుంటున్నాను. కానీ నాకు 'నా' అన్నవారెవరూ లేరు. ఆస్తికూడా లేదు. వున్న చిన్నపాటి చిరువుద్యోగమే. ఆలోచించుకోండి" అన్నాను మెల్లిగా.

ఆయన మొహం కళకళలాడింది. వెంటనే నా చేతులు పట్టుకున్నారు.

"అంతకన్నానా బాబూ. మాకేం డబ్బూ దస్కాలు వద్దు. అమ్మాయిని స్నేహితురాలిగా చూసుకుంటే చాలు. రేపొకసారి యింటికి రా. అమ్మాయిని చూడొచ్చు" అన్నారు.

"అలాంటి ఫార్మాలిటీస్ నాకేం లేవు. మీ అమ్మాయిని చూడాలనుకుంటే మాత్రం వస్తాను" అన్నాను నవ్వుతూ.

"అయ్యో రామ! దానికంత కూడానా. మా ఆడదుంది చూశారా! అది కొంచెం గడుసు. అతి తెలివి. దానికోసం మాత్రమే" అన్నారాయన.

ఆ మర్నాడు సాయంత్రం వెళ్ళాను.

"మీ అమ్మ చాలా అమాయకం. రూపురేఖలూ బాగానే వున్నాయి. కానీ మీ అమ్మమ్మ మాత్రం యక్షప్రశ్నలు వేసింది. మీ తాతగారు ముందే చెప్పారు కాబట్టి నేను సాధ్యమైనంత ఓపికగా జవాబులు చెప్పాను."

పెళ్ళి జరిగిపోయింది.

కొన్నిరోజులు నేను మీ అమ్మా విడిగా హాయిగానే వున్నాం. పిల్లని వదిలి వుండలేనని మీ అమ్మమ్మ ముందు వచ్చేసింది. ఆ తర్వాత మీ తాతగారు. వాళ్ళు వచ్చినందుకు నాకేం బాధలేదు. కానీ మీ అమ్మమ్మ పెత్తనం భరించలేకపోయాను. ఇక మీ అమ్మ సరేసరి. తల్లిమాట జవదాటదు. ఆమె ప్రపంచమంతా అమ్మే. అందుకు నేనేం తప్పుపట్టను. మీ అమ్మమ్మ విపరీత ధోరణులతో ఏదో వ్యాపారం పెట్టించి, నన్ను ఉద్యోగం మాన్పించింది. అన్నీ నష్టాలే. ఆమెకి సిటీ లైఫ్ మీద మోజు. చివరికి మీ తాతగారు విసిగి, పేచీపడి ఎక్కడికో వెళ్ళిపోయారు. నేను ఇచ్చిన మాటకి కట్టుబడి అలా వుండిపోయాను. కానీ ఇప్పుడు మీ అమ్మ స్వభావం చూసి నాకు విరక్తి వచ్చేసింది" అంటూ ఆగి సుబ్బూ వైపు చూశారు.

మౌనంగా తండ్రి వైపు చూస్తు వింటున్నాడు సుబ్బూ. అకస్మాత్తుగా ఆయన కళ్ళెర్రబడ్డాయి. అందులో వేడి కన్నీరు లీలగా మెరిసి ఆవిరయ్యింది.

"నిజానికి నా సాహచర్యపు విలువేముంది? ఆమెకూ నాకూ ఏ సంబంధమున్నది గనుక"

సుబ్బూ ఒకసారి తెల్లబోయినట్లుగా చూశాడు తండ్రివైపు. ఆయన సుబ్బూ మనసు గ్రహించినట్లుగా సర్దుకున్నారు.

"నువ్వొక్కడివే మా మధ్య వారధి. అంతకుమించేం లేదు. నీవు ప్రయోజకుడయితే చాలు. అందుకే ఓపిక పట్టమంటున్నా సుబ్బూ! అంతే" అన్నారాయన ముగింపుగా.

ఏమిటో అర్థమయీ అర్థంకానట్లుగా వున్నాయి అతని మాటలు సుబ్బూకి.

"సరే రా, భోం చేద్దాం. నువ్వింటికి వెళ్ళి ఎలాగూ తినవ్" అంటూ సుబ్బూని భోజనానికి తీసుకెళ్ళారు ఆయన.

సుబ్బూ ఆయనతో భోంచేసి తిరిగి వస్తుండగా చిక్కడిపల్లి కల్వర్టు మీద ఒంటరిగా కూర్చున్న సూర్య కనిపించాడు.

సూర్య సుబ్బు క్లాస్‌మేట్ మంచి స్నేహితుడు.

సుబ్బూ అతన్ని చూసి బైక్‌కి బ్రేక్ వేసి ఆగి "ఏంరా ఇక్కడ కూర్చున్నావ్?" అనడిగాడు.

బదులుగా సూర్య కళ్ళెత్తి సుబ్బూవైపు చూశాడు.

అతని కళ్ళు బాగా ఏడ్చినట్లు ఎర్రబడివున్నాయి. మొహం వాచివుంది. షర్టు చిరిగివుంది.

సుబ్బూ సూర్యని అలా చూసి తల్లడిల్లిపోయాడు.

చప్పున బైక్ దిగి "ఏమయింది? అలావున్నావ్?" అనడిగాడు సూర్య భుజమ్మీద చెయ్యేసి.

బదులుగా సూర్య వెక్కెక్కి ఏడ్చేసాడు.

సుబ్బూ అతన్ని వూరుకోబెట్టి పక్కనే వున్న షాపులో కోక్ తీసుకుని తాగించి "ఏంరా, ఏమయింది? నాతో చెప్పకూడదా" అన్నాడు.

కాసేపయ్యాక కళ్ళు తుడుచుకుని చెప్పాడు సూర్య" నిన్న ఇంట్లో చెప్పకుండా సినిమాకి వెళ్ళాను. తీరా ఇంటికెళ్ళాక మా నాన్న ఉగ్రరూపం దాల్చి ఇష్టం వచ్చినట్లు కొట్టి ఇంట్లోంచి బయటకి తోసేసాడు" అన్నాడు సూర్య దుఃఖాన్ని దిగమింగుతూ.

సుబ్బూ తెల్లబోయాడామాట విని.

"ఏంటీ సినిమాకి వెళ్ళినందుకు కొట్టడమా? చాలా వింతగా వుందే?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

సూర్య తలదించుకున్నాడు.

"అందుకే చెప్పను. మా నాన్నొక రాక్షసుడు. క్రమశిక్షణ పేరుతో పిల్లల్ని హింసిస్తాడు. ఒకసారి మా అక్క సరదాగా హెయిర్‌స్టయిల్ చేసుకుంటే జుట్టు కత్తిరించేసాడు. ఇంట్లో వున్నాడంటే నరకమే. తరచూ కేంప్‌లు వుంటాయి. అందుకే బతికిపోతాం. నిన్న కేంప్‌లో వున్నాడని వెళ్ళాను. సడెన్‌గా వచ్చేసాడు" అన్నాడు.

"సరే.. మా యింటికిరా. తర్వాత కొంచెం ఆయన శాంతించాక యింటికి వెళ్ళొచ్చు."

"వద్దురా"

"మరిక్కడే పేవ్‌మెంటు మీద గతిలేనట్లుగా కూర్చుంటావా? ఇంకెందుకురా స్నేహితులు. పద పద" అంటూ బలవంతంగా సూర్యని లేపి తీసుకెళ్ళాడు సుబ్బూ.

తలుపు తీసి సుజాత "ఇప్పుడా ఇంటికి రావడం?" అంటూ సూర్యవైపు చూసింది.

"నా ఫ్రెండ్" అన్నాడు సుబ్బూ ముక్తసరిగా.

సూర్య సుబ్బూ బలవంతం మీద స్నానం చేసి సుబ్బూ యిచ్చిన బట్టలు వేసుకున్నాడు. సుజాత ఇద్దరికీ వడ్డించింది. సూర్య సుబ్బూ దగ్గరే పడుకున్నాడు.

అతనసలు నిద్రపోలేదని గమనిస్తూనే వున్నాడు సుబ్బూ.

సుబ్బూ ఏదో ఒకటి మాట్లాడి ధైర్యం చెబుతునే వున్నాడు.

"ఇంకెన్నాళ్ళురా! రెండేళ్ళు ఓపిక పడితే చదువయిపోతుంది. నువ్వు బాగా చదువుతావు. కేంపస్ సెలక్షన్ వస్తే ఈ ఊబిలోంచి బయటపడిపోతావు. అందరి యిళ్ళలోను ఏదో ఒక బాధ వుంటుందిరా"

ఇద్దరూ అలా ఏదో ఒకటి మాట్లాడుకుంటూ నిద్రలోకి జారుకున్నారు. తెల్లవారి టిఫిన్ తినడానికి డైనింగ్ టేబుల్ దగ్గిర కొచ్చిన యిద్దర్నీ మార్చి మార్చి చూసింది మీనాక్షి.

"ఈ అబ్బాయెవరు?"

"నా క్లాస్‌మేట్"

"ఓహో! తా దూర కంత లేదుగానీ మెడకో డోలు. ఇలా అడ్డమైన వాళ్ళని యిళ్ళకి తేవడం ఎప్పుడు మొదలెట్టావు. ఇదేం సత్రం కాదు. ఎవరంటే వాళ్ళు రావడానికి"

అంతే.

సూర్య గబుక్కున చెయ్యి కడుక్కుని సుబ్బూ పిలుస్తున్న వినిపించుకోకుండా స్రరున వెళ్ళిపోయాడు. సుబ్బూ గబగబా లిఫ్టులో క్రిందకి వెళ్ళిచూశాడు కానీ సూర్య ఎక్కడా కనిపించలేదు.

"ఆ అబ్బాయిప్పుడే ఆటోలో వెళ్ళిపోయాడు సార్" అంటూ వాచ్‌మన్ చెప్పడంతో సుబ్బూ కోపంతో పైకెళ్ళి డైనింగ్ టేబుల్ మీద క్లాత్ స్రరున లాగేసాడు.

వెంటనే దానిమీద క్రోకరీ అంతా పెద్ద శబ్దం చేస్తూ క్రిందపడి పగిలిపోయాయి. ఆ శబ్దానికి గబగబా గదుల్లోంచి సుజాత, మీనాక్షి బయటకి పరిగెత్తుకొచ్చారు.

"సుబ్బూ, సుబ్బూ! ఆగాగు. ఏంటా దౌర్జన్యం" అని తల్లి మొత్తుకుంటున్నా సుబ్బూ ఆగలేదు. వరసగా షోకేస్‌లోని గాజు సామానంతా క్రిందపడేసి విరగ్గొట్టేసాడు. కుర్చీలు పడదోసాడు."

ఆ వెంటనే బైక్ వేసుకుని అగమ్యంగా సూర్యని వెదుక్కుంటూ రోడ్లమీద తిరుగుతూ టాంక్ బండ్ మీదకొచ్చాడు. అక్కడ గుమికూడి సాగర్‌లోకి తొంగిచూస్తున్న జనాన్ని చూసి అతని మనసు కీడుని శంకించింది.

"దేవుడా, అలా జరగకూడదు" అనుకుంటూ తొంగిచూశాడు. "ఎవరో పాపం చిన్నకుర్రాడే నీటిలోకి దూకేసాడు" అంటూ చెప్పుకుంటున్న జనాన్ని చూసి వణికిపోతోంది అతని మనసు.

ఈతగాళ్ళు అతని శరీరాన్ని ఒడ్డున వేసారు. అందరితోపాటు అతనూ తొంగి చూశాడు.

"సూర్య!"

నాడి చూశాడు ఎవరో జనంలోంచి వచ్చి.

"పోయాడు పాపం"

అంతే!

సుబ్బూ భోరున ఏడ్చాడు తలని రెయిలింగ్ రాడ్స్‌కి కొట్టుకుంటూ. "నేను.. నేను నిన్ను పోగొట్టుకున్నారా! నా వల్లే! నా వల్లే"

అందరూ వింతగా చూస్తుండగా పోలీసులు అతను రాసిన ఉత్తరం చూసి తండ్రిని పిలిపించారు. అతను పరుగున వచ్చి సూర్యమీద పడి ఏడవడం ప్రారంభించాడు.

"నాయనా! నేనేరా. నేనే నిన్ను చంపుకున్నాను. కానీ ఇంత శిక్షవేస్తావనుకోలేదురా. నాకే శని నెత్తినెక్కిందో? అయ్యో దేవుడా నా కొడుకుని బ్రతికించు" ఇంకా ఏదేదో అంటూ దొర్లుతున్నాడతను.

సుబ్బూ మ్రాన్పడిన మనసుతో బైక్ ఎక్కి స్టేషన్‌కి చేరుకున్నాడు. అలా చాలాసేపు ప్లాట్‌ఫామ్ మీద కూర్చుని కూర్చుని చివరకి దొరికిన రైలెక్కేసాడు అగమ్యంగా.

**కొంత** ప్రయాణం సాగేవరకు అతని మనసు చిందరవందరగానే వుంది.

సూర్య కళ్ళల్లో కనిపిస్తున్నాడు. దుఃఖం ముంచు కొస్తున్నది. తను ఇంటికి తీసుకురాకపోతే బ్రతికేవాడా?

అతని మరణంలో తన వంతు పాపం కూడా వున్నదా? తాతయ్య అమ్మమ్మ నెందుకు కంట్రోల్ చెయ్యలేకపోయాడు? అమ్మని నాన్నెందుకు శాసించలేకపోయాడు?

తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది సుబ్బూకి.

ఒక మనిషిని మరొకరు శాసించడమేమిటి? దేవుడు అందరికీ బుర్ర, బుద్దీ యిస్తాడు. వయసు పెరిగే కొలదీ ఆలోచనల పరిణితి కూడా పెరుగుతుంది. తాము చేస్తున్న పనులమీద, మాట్లాడుతున్న మాటల మీద అందరికీ స్పృహ వుంటుంది. అయితే దాని పీక నొక్కేసి పైపైకి పెద్ద మనుషుల్లా నీతులు వల్లిస్తుంటారు. తమ బాధ్యతలనుండి తాము తప్పించుకుని కేవలం తమ స్వార్థం కోసం, సుఖం కోసం మెత్తగా వున్నవారి మిద స్వారీ చేస్తుంటారు. అమ్మమ్మ, సూర్య తండ్రి అలాంటివారు.

ఇక తన తల్లి బలహీనురాలు, తల్లి గొడుగుక్రింద తీగెలా పాకుతుంటుంది. అది కూడా ఒక రకమైన స్వార్థమే. ఆమెకు తల్లి యిస్తున్న సౌకర్యాలూ, డబ్బూ అవసరం. భర్త అవన్నీ అమర్చలేని అసమర్థుడని ఆమె భావం. అందుకే తల్లిని వదులుకోడానికి ఆమె సిద్ధంగా లేదు. ఇలాంటి మనుషులు పెళ్ళి చేసుకుని తమ సహచరుల్ని, కన్నబిడ్డల్ని హింసించడం దేనికో అర్థంకాదు.

ఎడతెగని ఆలోచనలతో రైలు విజయవాడ వచ్చేసింది. ప్లాట్‌ఫారమ్ కోలాహలంగా, హడావుడిగా వుంది. సుబ్బూ తన ఆలోచనలనుండి తాత్కాలికంగా బయటపడి అటూ యిటూ చూశాడు.

ఇప్పుడెక్కడికి వెళ్ళాలి తను?

రైలంటే ఎక్కేసాడు.

జేబులో అంతగా డబ్బులేదు.

టిక్కెట్టు కూడా కొనలేదు. సరిగ్గా అప్పుడే ప్లాట్‌ఫామ్ మీద పెద్దగా కేకలు వినిపించి అటు తిరిగి చూశాడు. తన కిటికీకి ఎదురుగా కూర్చున్న వ్యక్తి లెదర్‌బాగ్ తీసుకుని ఒకడు పరిగెత్తుతున్నాడు.

ఆయన ఉద్రేకంగా "దొంగ! దొంగ! పట్టుకోండి" అని అరుస్తున్నాడు రొప్పుతూ. సుబ్బూ పరిగెత్తుతున్న దొంగ వైపు చూశాడు.

వాడు తూనీగలా ఫ్లయ్ ఓవరెక్కేసి అవతల ప్లాట్‌ఫామ్ వైపు పరిగెత్తుతున్నాడు.

అంతే!

సుబ్బా మరేం ఆలోచించకుండా అటువైపుగా రైలు దూకి అడ్డంగా వున్న మరో ట్రైను ఎక్కి అతను దిగిన ప్లాట్‌ఫామ్ వైపు దిగి వాణ్ణి అమాంతం గట్టిగా కౌగలించుకుని, పెనుగులాడి ఆ బాగ్ లాక్కున్నాడు. అంతా నిముషాల్లో జరిగిపోయింది.

సుబ్బా అదే వేగంతో మళ్ళీ రెండు రైళ్ళు దాటి ప్లాట్‌ఫామ్ మీద కూర్చుని రొప్పుతున్న ఆ వ్యక్తికి యిచ్చి "ఇదిగోనండి మీ బాగ్. వాడేం తీసినట్లు లేదు. అయినా లెక్కచూసుకోండి" అన్నాడు.

కానీ అతని పరిస్థితి లెక్క చూసుకునేట్లుగా లేదు.

విపరీతమైన బి.పితో అతను రొప్పుతున్నాడు.

కళ్ళెర్రబారి బుగ్గలు కదిలిపోతున్నాయి.

అతను జేబులోని బి.పి మాత్ర చూపించి నీళ్ళిమ్మన్నట్లుగా సుబ్బాకి సైగ చేసాడు. సుబ్బా పరిస్థితి గ్రహించి గబగబా ఎదురుగా వున్న షాపులో మంచినీళ్ళ బాటిల్ కొని తెచ్చి అతనికి మాత్ర వేసి నీళ్ళు తాగించాడు.

పది నిముషాల తర్వాత అతను కొంచెం సర్దుకున్నాడు.

ఆయాసం తగ్గాక "చా..లా థాంక్స్ బాబూ!" అన్నాడు మెల్లిగా సుబ్బా ఏమనలేదు.

సుబ్బా వచ్చిన రైలు సాగిపోయింది.

"అయ్యో బాబూ, నీ ట్రయిన్ వెళ్ళిపోతున్నది" అన్నాడతను.

"సుబ్బా నవ్వి అదేం నా ట్రైను కాదు. సెంట్రల్ గవర్నమెంటుది" అన్నాడు.

అతను కూడా నవ్వి "మరందులో నీ లగేజ్ లేదా?" అని అడిగాడు.

"లేదు"

సుబ్బా జవాబు విని అతను ఆశ్చర్యంగా సుబ్బాని ఎగాదిగా చూసి "అదేంటి?" అని నసిగాడు.

సుబ్బా జవాబు చెప్పలేదు.

"నేను రాజమండ్రి వెళ్తున్నా. నాతో వస్తావా?" అనడిగాడతను.

"ఎందుకు?"

సుబ్బా ఎదురు ప్రశ్నకి అతను నవ్వి "ఊరికే. నాకు బాగాలేదుగా తోడుగా వుంటావని. చేతిలో డబ్బుంది. అక్కడ మా ఆడదొక్కతే ఎదురు చూస్తుంటది. పిల్లల్లేరు నాకు."

ఆ చివరిమాట అతన్ని కదిలించింది.

ఉన్న పిల్లలు తల్లిదండ్రుల్ని ఎంతబాగా చూస్తున్నారో తెలియదు కానీ లేని వారి మానసిక స్థితి అర్ధమయి తలపంకించాడు.

"నా పేరు కాళిదాసు. వడ్డీవ్యాపారం చేస్తుంటా. ఇక్కడొక జిడ్డుకేసుంటే వచ్చి వసూలు చేసుకుని వెళ్తున్నా" అన్నాడు కాళిదాసు.

"పిల్లల్లేని నీకు వడ్డీ వ్యాపారమెందుకు?" అని అడగాలనిపించినా సుబ్బా కొత్త కావడం వలన మౌనంగా అతని మాటలు వింటున్నాడు.

ఇంతలో రాజమండ్రి మీదుగా వెళ్ళే రైలొకటి ప్లాట్‌ఫామ్ మీద కొచ్చి ఆగింది. సుబ్బు తను కూడా వెళ్ళి టిక్కెట్ తీసుకుని కాళిదాసుగారితో రైలెక్కేసాడు. ఏ గమ్యం ఎక్కడికి తీసుకెళ్తుందో. ఏ నెలవు ఎంతకాలమో ఎవరికి తెలుసు?

ఆటో దిగిన భర్తని చూసి పాతకాలపు బొగ్గు ఇంజన్‌లా గయ్‌మంది సత్యవతి.

కూడా ఒక కొత్త కుర్రాడున్నాడన్న స్పృహ కూడా లేకుండా. "ఏవయ్యోయ్ ఎక్కడున్నావో ఒక ఫోను కొట్టకూడదూ? అసలే బి.పి మడిసివి. డబ్బుతో యవ్వారం. నీ బి.పి సంగతి దేవుడెరుగు. నా పేణాలు గాల్లో కలిపేసేటట్టున్నావ్. మాయదారి సంత" అంటూ రంకెలేసింది.

"ష్! కూడా ఓ కుర్రాడున్నాడన్న స్పృహకూడా వుండదే నీకు. ఊరికే కుక్కనోట్లో కర్రపెట్టినట్లు అరవక. ముందా బాగ్ లోనెట్టిరా" అన్నాడు కాళిదాసు వాలు కుర్చీలో కూర్చుని.

సుబ్బూకి ఏం చేయాలో తెలియక వరండా స్తంభానికి జేరబడి నిలబడ్డాడు.

"రా..కూర్చో" అన్నాడు కాళిదాసు సుబ్బూ ముందుకి మరో కర్ర కుర్చీ తోస్తూ.

సుబ్బూ మాత్రం ఎత్తరుగుల వరండాలో క్రిందకి కాళ్ళు పెట్టి ఒక ఓరగా కూర్చున్నాడు.

"నీ పేరేంట్రా అబ్బాయీ?" అనడిగాడు కాళిదాసు.

"సుబ్బూ"

బదులుగా పకపకా నవ్వి "అదేం పేర్రా.. పూర్తిపేరు లేదా?" అన్నాడాయన.

"ఏదో ఒకటి పిలవడానికే కదా!"

సుబ్బూ జవాబు విని పకపకా నవ్వి "అంతేలే. నాకూ పెట్టారు మావోల్లు. కాలిదాసని. నేనేవన్నా కయిత్యాలు రాస్తున్నానా ఏంటి?" అన్నాడు.

అప్పుడే రెండుగ్లాసులతో కాఫీ తెచ్చి ఒకటి కాళిదాసుగారికి మరొకటి సుబ్బూకిచ్చి "అదొకటే తక్కువ కాయితాల దండక్కి" అంటూ సుబ్బూ వైపు చూసి ఈ పిల్లాడెవరూ?" అంది ఆరాగ చూస్తూ సత్యవతి.

కాళిదాసు జరిగిందంతా సత్యవతికి వివరించి ఈ పిల్లాడు లేకపోతే "రెండు లచ్చలూ దొంగోడి పాలయ్యేయి" అన్నాడు.

"నేనప్పుడే అనుకున్నా. నీ తెలివితేటలకి వసూల్లేంటని. ఇంతకీ ఈ పిల్లాడికి అమ్మాబాబూ లేరా?" అంది సుబ్బూని ఎగాదిగా చూస్తూ.

"నేను వెళ్తానండి" అంటూ పైకి లేచాడు సుబ్బూ.

"ఎక్కడెకెల్తావ్?"

"ఎక్కడికో అక్కడికి. మీరు తొడుగా రమ్మంటే వచ్చానంతే!"

"ఇదిగో సుబ్బూ.. నేను నీ అంత సదూకోలేదు. కానీ వయసొకటి ఏడ్చింది కదా! ఇలాంటియి సాలా సూసాను. ఏదో కోపవెట్టుకుని ఇంటికాడనుండి వచ్చేసావు. నాల్రోజులిక్కడేవుండి. ఆనక అన్నీ సర్దుకుంటే ఇంటికికెల్లి పోదువుగాని. నా మాటిను. పెద్దోణ్ణి" అన్నాడు కాళిదాసు.

"ఏటీ యిక్కడుండమంటున్నావు. ఊరెల్లావంటే సాలు ఒకణ్ణేసుకొస్తావ్. ఒకడప్పుడే జిడ్డల్లే ఏలాడ్తన్నాడు కొంపలో. మళ్ళీ యీ అబ్బాయా? సాల్లే.. నేనేం వంట మడిసిననుకుంటున్నావా? లంక మేత గోదారీతన్నట్లు నీ వడ్డీ డబ్బులు ఆళ్ళనీ యీళ్ళనీ మేపడానికే సరిపోతున్నాయ్. సేసేవ్లే... మా సెడ్డ యాపారం. తెలివి మాలిన పెళ్ళికి తెల్లవార్లూ బాజాలని" అంటూ సత్యవతి వాళ్ళ కాఫీ తాగిన గ్లాసులు రెండూ పట్టుకుని లోపలికి నడిచింది.

సుబ్బూ లేచి నిలబడ్డాడు.

"ఉండవయ్యా బాబూ! మాటిమాటికి పోలీసోడిలా లేచి నిలబడతావేంటి? దాని మాటింతే. సర్వీపేడిరిసి పొయ్యిలో పెట్టినట్టుమాట్లాడతది. మడిసి మంచిదే నా మాటిను" అన్నాడు కాళిదాసు.

"ఇదిగో అబ్బాయ్ నాకు నీమీదేం అనుమానం లేదు. అనుమానమంతా యీ మడిసి తెలివితేటల మీదే ఇంతన్నం పెట్టకుండా ఎవర్నీ అంపను. నిన్నే మా తమ్ముడు, పనసకాయ, జీడిపిక్కలు తెచ్చాడు. కమ్మగా వండుతా వుండు" అంటూ లేచింది సత్యవతి.

"ఏటీ, నీ తమ్ముడొచ్చాడా?" అంటూ సాగతీసాడు కాళిదాసు.

"ఏం, ఆడొస్తే ఏదో ఒకటి అట్టుకునే వస్తాడు. నీ సొమ్మేం తినడు. నిన్ననే ఎల్లిపోయాడు" అంటూ వంటగదిలోకి నడిచింది సత్యవతి.

ఆ కాసేపట్లో ఆ భార్యాభర్తల వ్యవహారం అర్థమైపోయింది. భోజనాలయ్యాక సుబ్బూ బయల్దేరదామనుకుంటుండగా ఒక వ్యక్తి యింట్లోకొచ్చాడు. అతన్ని చూడగానే కాళిదాసు మొహం అప్రసన్నంగా మారింది.

"ఏం చిట్టిబాబూ, డబ్బులేమైనా వసూలయ్యాయా?" అన్నాడు కాళిదాసు.

చిట్టిబాబు అరుగుమీద కూర్చుని మెడ కాలర్‌లో పెట్టిన జేబురుమాలు తీసి మొహం తుడుచుకుంటూ "ఎక్కడ సార్! ఎక్కడ కెళ్ళినా తొంటి చెయ్యి చూపిస్తున్నారు. మీరే నా ఖర్చులకి కాస్త సర్దాల" అన్నాడు.

కాళిదాసు మొహం అప్రసన్నంగా మారింది.

"అంతేలే ఒక్కో మొహం చూస్తే యివ్వబుద్ధికాదు" అన్నాడు విసుగ్గా.

చిట్టిబాబు ఆ మాట వినిపించుకోనట్లుగా అక్కడే వున్న సుబ్బూ వైపు ఎగాదిగా చూసి "ఈ కుర్రాడెవరూ?" అన్నాడు.

"మావోడే దూరం సుట్టం. అందాక నీ రూంలో కొన్నాళ్ళుంచుకో ఏదో పనిమీద వచ్చాడు. మా కొంపలో వుండటానికి మొగమాట పడ్తున్నాడు" అన్నాడు.

"ఎక్కడసార్? ఇప్పటికే నాతోపాటు ఇద్దరున్నారు" అన్నాడు చిట్టిబాబు.

"ఏం కాదులే. పనయిపోగానే ఎల్లిపోతాడు. నాల్రోజుల యవ్వారం" అన్నాడు కాళిదాసు.

"సర్లెండి. నాకేదన్న కొట్టండి" అన్నాడు చిట్టిబాబు.

కాళిదాసు అయిష్టంగా కొంత పైకం తీసి చిట్టిబాబుకిచ్చాడు మొహం చిట్లించుకుని.

సుబ్బూ అతనితో కలిసి వెళ్ళబోతుండగా 'నువ్వాగరా అబ్బాయి' అంటూ సత్యవతి "ఒకసారి ఇటొస్తావా?" అంది కాళిదాసు వైపు చూసి.

"ఎందుకేటిప్పుడు?" అంటూనే తన భారీకాయాన్ని అతికష్టం మీద వాలు కుర్చీలోంచి లేపి లోపలికివెళ్ళాడు కాళిదాసు.

సత్యవతి అతను లోపలికి రాగానే "నీ తెలివి సంతకెల్లినట్టే వుంది. ఆ కుర్రాడు వంటిమీద బట్టల్తో వచ్చేసినట్లున్నాడు మెడలో పులిగోరు పతకం సూస్తే బాగానే బతికిన బాపతనిపిస్తున్నది. అంత సొమ్ము పేనాలకి తెగించి తెచ్చిస్తే వట్టి చేతుల్తో సాగనంపుతున్నావేంటి. ఆ సిట్టిబాబు సచ్చినోడు కూడన్నా ఎడతాడా? ఎంతో కొంత పైకవిచ్చి పంపు" అంది విసుగ్గా.

కాళిదాసు ఆవిడ మాటలకి నిజంగానే సిగ్గుపడ్డాడు.

"అవునే. ఏటో తోచి సావదు" అంటూ సుబ్బూని లోనికి పిలిచి "సుబ్బూ.. ఏటో మాటల్లో పడి మరిసేపోయాను. మా ఆడది గుర్తుచేసింది. ఇదుంచు కర్సులకి" అంటూ ఒక పదివేలు సుబ్బూ చేతిలో పెట్టాడు.

"ఎందుకండీ ఇదంతా. నేనెళ్ళిపోతాను" అన్నాడు మొగమాటంగా.

"మరదే మండుద్ది నాకు. ఎక్కడికెల్తావిప్పుడంత అర్జెంటుగా. ఎల్డువుగానిలే. ముందయితే బట్టలు కొనుక్కో" అన్నాడు కాళిదాసు కాస్త మందలిస్తున్న ధోరణిలో.

సుబ్బూ డబ్బు తీసుకుని "వస్తానండి" అంటూ చిట్టిబాబుతో బయల్దేరాడు.

చిట్టిబాబుని అతనితో వస్తున్న కొత్త వ్యక్తిని తేరపార జూసి చిరాగ్గా మొహం పెట్టిందావిడ.

"ఏటే ముసిల్దానా? ఏటీ మొహం ఆముదం తాగినట్టు. దోసెలేవన్నా వున్నాయా?" అన్నాడు చిట్టిబాబు రూమ్ తాళం తీస్తూ.

"అవును వుంటాయి. ఏలాపాలా లేదు. మొన్నటికి డబ్బులిచ్చి మూణ్ణెల్లవుతున్నది. అడిగినప్పుడల్లా ఇదిగో అదిగో అంటున్నావ్. దోసెల్లేవు గీసెల్లేవు" అంటూ కసిరిందావిడ ముక్కాలి పీటమీద కూర్చుని వాచిన పాదాలకు నూనె రాసుకుంటూ.

"ఇదిగో పాపాయమ్మా నాతో ఎట్టుకోకు. ఒక్కసురు ఇసిరేనంటే గోదాట్లో తేల్తావు. ఇచ్చినప్పుడు తీసుకో" అంటూ తన గదిలోకి వెళ్ళాడు.

అతని వెంట సుబ్బూ లోపలికి ప్రవేశించాడు. గదంతా అదోలాంటి గుప్పున వాసన. సుబ్బూ వెగటుగా మొహం తిప్పుకుని నిలబడ్డాడు.

ఆ గదిలో అప్పటికే తాగుతున్న ఇద్దరూ సుబ్బూ వైపు ఎవరా అన్నట్లుగా చూశారు.

"ఇతను మనలాంటోడే కాళిదాసుగాడు మన కొంపలో ఎట్టుకోమని పంపాడు. కేస్ కూడా కొట్టినట్లున్నాడు. ఇంతకీ ఎంతిచ్చాడు బాసూ" అన్నాడు చిట్టిబాబు ఎగాదిగా చూసి నవ్వుతూ.

"ఎంతయినా మాకొద్దులేగానీ రేపు పార్టీ ఇవ్వు" అన్నాడు.

ఆ రోజుకి దుర్భరమైన ఆ గదిలో ఓ మూల సర్దుకుని పడుకున్నాడు సుబ్బూ.

తల్లిదండ్రుల్ని వదిలేసి బయటకి వస్తే ఆ జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో తెలుస్తున్నకొద్దీ దుఃఖం తన్నుకొస్తుంది.

కాసేపటికి దుఃఖాన్ని నిలవరించుకుని "ఏదయినా అలవాటయ్యేదాకానే. తను సర్దుకోవాలి. భయపడి వెను తిరగనే కూడదు. వీళ్ళంతా తనలాంటివాళ్ళేకదా! ఇలానే సర్దుకుని జీవించడం లేదా! ఉండాలి. తనిలానే వుండాలి. అన్నిటినీ ఎదుర్కోవాలి. గతాన్ని మరచిపోవాలి" అని తనకి తనే సర్ది చెప్పుకున్నాడు సుబ్బూ.

ఆ రాత్రి అతనికి నిద్రలేదు

పొద్దున్నే మొహాలు కడుక్కున్నాక బయట పాపాయమ్మ దగ్గర వరసగా కూర్చున్నారు. సుబ్బూ కూడా వాళ్ళతో వెళ్ళాడు.

పాపాయమ్మ చురచురా చూసింది అందర్నీ.

"డబ్బులివ్వకపోతే దోసెలెయ్యనని చెప్పానుగా" అంది పాపాయమ్మ కోపంగా.

"ఇలా నిక్కేవంటే నిన్నూ నీ పొయ్యిని కట్టకట్టీ యిసిరేస్తాను. మర్యాదగా ఎయ్యి" అన్నాడు చిట్టిబాబు.

"పోనీ డబ్బులిద్దాం" అంటూ జేబులో చెయ్యిపెట్టాడు సుబ్బూ.

"ఏయ్ ఆగు! అక్కడికి నువ్వు మంచోడివయిపోదామనా. అదేం కుదరదు" అన్నాడు.

"పోనీ యివ్వు మామ్మా. గొడవలెందుకు?" అన్నది అక్కడే నిలబడ్డ అమ్మాయి పాపాయమ్మని వూరడిస్తూ.

"అలా చెప్పవే పొట్టిదానా" అన్నాడు చిట్టిబాబు నవ్వుతూ.

"మాటలు మర్యాదగా రానివ్వండి. నా పేరు అమ్మాజీ" అంటూ ఆ అమ్మాయి గిర్రున తిరిగి లోపలికెళ్ళిపోయింది.

టిఫిన్స్ తిన్నాక చిట్టిబాబు బాత్రూంకేసి వెళ్ళడం చూసి సుబ్బూ గబగబా పాపాయమ్మ వడిలో అయిదొందల నోటు పడేసి ఏం ఎరగనట్లుగా రూంలోకి నడిచాడు. మొదట ఆశ్చర్యపోయినా తర్వాత కొంత అర్థమయినట్లుగా తల పంకించి నోటు బొడ్లో దోపుకుంది 'సల్లగా వుండు నాయనా' అని మనసులోనే దీవిస్తూ.

"కొద్దిగా బట్టలు కొనుక్కోవాలి. ఈ ఊరు నాకు తెలియదు" అనడిగాడు సుబ్బూ చిట్టిబాబుని.

"పదపద. అంతకన్నానా!" అన్నాడు చిట్టిబాబు వాళ్ళతోపాటూ ఆ యిద్దరూనూ.

అందరూ ఒక రెడీమేడ్ షాపు కెళ్ళారు. సుబ్బూ అవసరానికి సరిపడా తక్కువ రేటులోనే డ్రెస్సులు, టవల్స్ తదితర వస్తువులు కొనుక్కున్నాడు.

"ఇప్పుడు నువ్వు మాకు పార్టీ కూడా ఇవ్వాలి" అన్నారు వాళ్ళు. సుబ్బూకి అవుననక తప్పలేదు.

అక్కడ వాళ్ళందరూ చిత్తుగా తాగి తిన్నారు. సుబ్బూని కూడా తాగాల్సిందేనని బలవంతం చేసారు. సుబ్బూ ఇష్టంలేకపోయినా కొద్దిగా తీసుకున్నాడు. రూంకొచ్చి వాంతి చేసుకున్న సుబ్బూని చూసి వాళ్ళు చేతకాని వాడిలా చూసి నవ్వారు.

"ఇప్పుడు మనమా పొట్టిదాన్ని రూమ్‌లోకి లాగేస్తే ఎలా వుంటది?" అంటూ కుళ్ళు జోకువేసాడొకడు అందులో.

"హహ్హహా. దానికి మొగుడు లేడంట్రా" అన్నాడు చిట్టీబాబు.

"మరింకేంటి?"

"ఎవరిగురించి?" అడిగాడు ఇంకొకడు మత్తులో తూగుతూ.

"అదే.....జీ...జీ...అమ్మాజీ" అంటూ పాటలా పాడాడు చిట్టిబాబు.

అందరూ పకపకా నవ్వుతుంటే చాలా జుగుప్సగా చూశాడు సుబ్బూ. తను వుండదగని స్థలం అదని అర్థమవుతోందతనికి.

"ఆడవాళ్ళ గురించి అలా మాట్లాడకూడదు" అన్నాడు ఓపిక పట్టి.

బదులుగా అందరూ పకపకా నవ్వారు.

"అబ్బో, వచ్చాడండి గాంధీమహాత్ముడు. మేం సెవిలో పూలెట్టుకుని యినేత్తాం" అంటూ నవ్వాడొకడు.

"ఆడోల్లంతా అంత గొప్పోల్లయితే మేం అనాదలెందుకవుతాం." అన్నాడింకొకడు.

సుబ్బూ ఇంకేం మాట్లాడలేదు.

అందరూ కాసేపటికి తాగిన మత్తులో వళ్ళు మరచి పడుకున్నారు.

ఈ సమస్యకి పరిష్కారం ఎలా అనుకుంటున్న అతనికి త్వరలోనే దైవం చూపించినట్లు ఒక మార్గం దొరికింది.

ఆ సాయంత్రం అందరూ కలిసి గోదావరొడ్డున వున్న మార్కండేయ స్వామి గుడి ఎదురుగా వున్న మెట్లమీద కూర్చున్నారు.

చల్లటిగాలి వీస్తోంది. నది నడుంకి బిగించినట్లున్న రైలు కమ్ రోడ్డు బ్రిడ్జి అప్పుడే వెలిగించిన దీపాలతో మువ్వల వడ్డాణంలా మెరిసిపోతున్నది. అప్పుడే గుడిలోంచి వచ్చిన ఒకమ్మాయి మెట్లమీదుగా నది దగ్గరగా వస్తుండగా చిట్టిబాబు దృష్టి ఆమె మీద పడింది.

సడెన్‌గా లేచి వంగి నీళ్ళలో చేతులు పెట్టిన ఆ అమ్మాయి మెడలో ఛెయిన్ లాగేసాడు. ఆ అకస్మాత్తు పరిణామానికి నివ్వెరపోయిన ఆ అమ్మాయి గాభరాలో నదిలో పడిపోయింది. సుబ్బూ మరేం ఆలోచించకుండా నదిలో పడిన ఆ అమ్మాయిని ఒక్క

దూకు దూకి రక్షించి వడ్డుకు తెచ్చాడు. అప్పటికే అయిదారుగురు కానిస్టేబుల్స్ గబగబా వచ్చేసి చిట్టిబాబుని పట్టుకుని చితక తన్నారు. వెంటనే వేన్‌లో వేసుకుని పట్టుకెళ్ళిపోయారు.

ఆ అమ్మాయి సుబ్బూకి థాంక్స్ చెప్పింది.

తర్వాత తెలిసిందేంటంటే ఆ అమ్మాయి ఆ జిల్లా పోలీస్ సూపర్నెంటు కూతురని - కాకినాడ నుండి పోలీసుల సహాయంతో ఏదో మొక్కు తీర్చుకోవడానికి గుడికి వచ్చిందని. ఆ మర్నాడు రాజమండ్రి డి.ఎస్.పి సుబ్బూని పిలిచి అభినందించాడు. అంతే! ఆ రోజునుండి చిట్టిబాబు ఎడ్రస్ గల్లంతయింది. ఇక మిగిలిన ఇద్దరూ పరారి. దాంతో ఆ రూం సుబ్బూ వశమయ్యింది. కాళిదాసుగారి కథ విని సుబ్బూ వాళ్ళకి సహాయపడాలని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజునుండి అతని జీవన విధానం మారిపోయింది. ఎక్కడ కనపడ్డా పోలీసులు అతన్ని గౌరవిస్తున్నారు. నవ్వుతూ పలకరిస్తున్నారు. చిన్నచిన్నగా డబ్బు వసూలు చేయడం అలవాటు చేసుకున్నాడు. భజన్‌లాల్ బిల్డింగులో అతను మకుటం లేని మహరాజయిపోయాడు. అందరికీ అతని పట్ల భయభక్తులు పెరిగిపోయాయి. ఇప్పుడు సుబ్బూ రూపం, స్వరూపం మారిపోయాయి. అతనిలో మంచితనం ఇప్పుడు కొంత రాగి కలిపిన మేలిమిలా తయారయ్యింది. అతను చేస్తున్న పనిని బట్టి అతనప్పుడప్పుడూ తాగుతున్నాడు. అమ్మాజీ అతనికి దేవుడిచ్చిన చెల్లిలయిపోయింది. అలలు ఢీకొని ఢీకొని రాటు దేలిన రాయిలా మారిందతని స్వభావం.

సుబ్బూ ఆలోచనల నుండీ బయటపడి విదిలించుకుని మహా గదివైపు చూశాడు. మహా కూడా నిద్రపోలేనట్లుంది. గదిలోంచి చిన్నగా ఏవో పాటలు వినిపిస్తున్నాయి. అతనికి మహా చెప్పిన పని చెయ్యడానికి నిర్ణయించుకుని పక్కకి తిరిగి పడుకున్నాడు.

**సుబ్బూకి** ఇక నిద్రపట్టలేదు.

తిన్నగా వంట గదిలోకి వెళ్ళాడు.

ఫిల్టర్ తెరచి చూశాడు. కొద్దిగా డికాషన్ వుంది.

ఫ్రిజ్‌లో వున్న పాలపాకెట్ తీసి స్టౌ ముట్టించి పాలు కాసి కాఫీ కలిపాడు. డికాషన్ ఎక్కువయిందేమో కాస్త చిరు చేదుగా వుంది కాఫీ.

'అయినా ఫర్వాలేదులే' అన్నట్లుగా తలపంకించి పంచదార కలిపి రెండు కప్పుల్లో పోసాడు. వాటిని తీసుకుని మహా పడుకున్న గదివైపు చుశాడు. లోపల పాటలు సన్నగా వినిపిస్తున్నాయి. మెల్లిగా మోచేత్తో తలుపుమీద శబ్ధం చేసాడు.

వెంటనే తలుపు తెరుచుకుంది.

"ఓహ్, నువ్వు నిద్రపోలేదా? గుడ్‌మార్నింగ్" అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

మహా మాత్రం నవ్వకుండా అతన్ని ఎగాదిగా చూసింది.

"ఏంటి? అప్పుడే లేచావ్. అబ్బో కాఫీ కూడా కలిపేసావా? ఏంటి సంగతి?" అంది మహా.

"ఏమో కోయిల కూత వినపడింది. రారా! బయట కూర్చుని కాఫీ తాగుదాం" అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

"అబ్బా ..నీకు కాకి అరుపుకి కోయిల పాటకి తేడా కూడా తెలుసునా?" అంది మహా వెటకారంగా.

"అవును అది తెలిస్తే కౌశిక్‌గాడిలాంటి వాడిని ప్రేమించి ఇక్కడిదాకా ఎందుకొస్తావ్? అద్సరేగానీ కాఫీ చల్లారిపోతుంది వస్తేరా లేకపోతే మానెయ్ నేను నీ డీల్ వప్పుకుందామని మాట్లడదామని పిలిచాను" అంటూ ఓపెన్ టెర్రస్ మీదకి వెళ్ళిపోయాడు సుబ్బూ.

కౌశిక్ పేరు వినగానే ఎలర్టయింది మహా.

సుబ్బూ మూడ్ ఎప్పుడెలా మారిపోతుందో తెలియదు. వెంటనే టాయిలెట్‌లోకి వెళ్ళి మొహం కడుక్కుని పరుగెత్తుకొచ్చి సుబ్బూ పక్కన కూర్చుని కప్పు అందుకుంది.

''ఆహా! ఎంత బాగుంది కాఫీ. కాఫీ అంటే ఇలా వుండాలి'' అంటూ చప్పరిస్తూ తాగుతున్నాడు సుబ్బూ.

మహా కొంచెం సిప్ చేసి ''అబ్బా ఎంత చేదుగా వుందో'' అంది మొహం వెగటుగా పెట్టి.

''కాఫీ ఇలానే వుండాలి బేబీ. పాయసంలానో, పరవాణంలానో కాదు. అసలు వంట చేస్తే మగవాడే చెయ్యాలి. ఏదో బయటపనుల వల్ల గరిట ఆడదాని మొహాన పడేసాడు. ఆ మాత్రానికే పె...ద్ద బిల్డప్. చరిత్రలో నలుణ్ణి, భీముణ్ణి గొప్ప వంటవాళ్ళని చెప్పుకున్నారు గానీ దమయంతి పాకం, ద్రౌపది పాకం అని ఎవరూ అనలేదు'' అన్నాడు కళ్ళు అరమోడ్పుగా మూసి చల్లగాలిని ఆస్వాదిస్తూ.

నిజానికి ఇంకా తెలవారలేదు.

గోదావరి మీదనుండి గాలి తెరలు తెరలుగా వస్తున్నది. పక్షులు గోల ప్రారంభమైంది.

పగలు అలసిపోయిన నగరం ఆ సుఖం నుండి మేల్కోవడానికి ఇష్టంలేనట్లుగా నిశ్శబ్దంగానే వుంది.

మహా సుబ్బూ ఓవర్ ఏక్షన్ చూసి వస్తున్న నవ్వు ఆపుకుని వాళ్ళంతా ఎవరూ?'' అనడిగింది అమాయకంగా.

''అంటే ... తల్లీ.. మనకి నలుడు, భీముడూ కూడా తెలియదా?''

''భీముడు పేరు విన్నాను గానీ ... హూ యీజ్ నలుడూ?'' అంది.

''అమ్మో అవన్నీ యిప్పుడు చెప్పలేను గానీ నాకు కౌశిక్, రాణీల గురించి చెప్పు'' అన్నాడు సుబ్బూ కాళ్ళు పైకెత్తి కుర్చీలో కూర్చుంటూ.

''ఇప్పుడెందుకు. ప్రొద్దుటే వాళ్ళ సంగతి?'' అంది మహా చిరాగ్గా.

''మరయితే నేను వాళ్ళని గుర్తుపట్టేదెలా? నువ్వు రివెంజ్ తీర్చుకునేదెలా? డీల్ వదిలేద్దామా?'' అన్నాడు సుబ్బూ చిలిపిగా నవ్వుతూ.

''అమ్మో వద్దు'' అంటూ గాభరాగా సుబ్బూ చెయ్యిపట్టుకుంది.

వాళ్ళప్పుడు సోమాజీగూడాలో వుండేవారు. అతను యశోదాలో చేరాడని విన్నాను. డాక్టరు కదా. నువ్వు ఓపికగా ఎంక్వయిరీ చేస్తే తెలిసిపోతుంది సుబ్బూ'' అంది మహా.

''ఓ.కే. అవునూ రాణీ అందంగా వుంటుందా?''

మహా అతనివైపు కోపంగా చూసింది.

''దాని అందం సగతి నీకెందుకు?''

ఏం లేదు. డీల్ కష్టమైంది. అందంగా వుంటే పనిచేసిన కష్టం నాకు తెలియకుండా హాయిగా వుంటుందన్నమాట. అంటే అయి మీన్ కంఫర్టబుల్‌గా, శ్రమ తెలియకుండా అనుకున్నది సాధించేయొచ్చు'' అంటూ నవ్వాడు సుబ్బూ.

మహాకి వళ్ళు మండిపోయిందతని మాటలకి.

''ఆఁ వుంటుంది వెళ్ళు. మొప్పకళ్ళు, షెల్స్‌లాంటి చీక్స్ లెప్పర్స్ నోస్. పో వెళ్ళి చూసి తరించు'' అంది కోపంగా. మహా ఉడుక్కుంటుంటే సుబ్బూకి తెగ నవ్వొస్తున్నది.

"అంతేలే ఆడవాళ్ళు తోటి స్త్రీ అందగత్తె అని ఎప్పుడు ఒప్పుకున్నారు గనక. సరే ఆవిడ అందం సంగతి నాకెందుగ్గాని. ఇప్పుడు చెప్పు ఈ డీల్ ఖరీదయింది. పనికూడా పనికిమాలింది. ఇద్దరు అన్యోన్యమైన దంపతుల కాపురం ముక్కలు చెక్కలు చేసి మూసీనదిలో కలపాలి. దేవుడా! ఎంతటి పాపిష్టిపనికి నన్ను పుట్టించావయ్యా" అంటూ రాగం తీసాడు సుబ్బా నాటకీయంగా.

మహా వెంటనే అతని బుర్రమీద కప్పుతో కొట్టింది.

వెంటనే షాకయినట్లు సుబ్బా లేచి నిలబడి "ఒసే రాక్షసీ నన్నుగాని చంపేస్తావా?" అన్నాడు.

"అవును చంపుతాను. పిచ్చిగా వాగావంటే. ఎంతకావాలో చెప్పు పడేస్తా. అంతేగానీ వెధవ మెలోడ్రామా లెయ్యకు. వాళ్ళ పేరులెత్తితేనే నాకు మంట" అంది కోపంగా.

సుబ్బా నేలమీద మహా కాళ్ళ దగ్గర చతికిలబడ్డాడు.

"అద్సరే మహా. వూరికే సరదాగా అన్నాను. నిజంగానే ఖర్చవుతుంది. నా దగ్గర డబ్బులేదని నీకూ తెలుసు. ఏదో కొద్దిగా అయితే నేనూ నిన్నడగను. అందుకే అడిగాను. నీకేం డబ్బున్న మా తల్లివి" అన్నాడు

మహా కోపం తగ్గి "అవును నాకు తెలుసు. ఎంతకావాలో చెప్పు?" అంది.

"ముందో రెండు లక్షలయితే నా ఎకౌంట్‌లో వెయ్యి. ఫర్‌అదర్ పనిని బట్టి. అవసరమైతేనే. నీకు తెలుసు. నేనెవరి సొమ్మూ తిననని.

మహా తలూపింది. అప్పుడే ఆకాశం చిన్నగా వెలిసిపోతున్నది.

ఆకాశంలో బారులు తీరిన రకరకాల పక్షులు ఎంతో క్రమశిక్షణగా గుంపులుగా నీటివాలు మీదకి వంగి ఎగురుతున్నాయి.

రాత్రంతా తమ ఉనికిని పోగొట్టుకుని నలుపురంగులోకి మారిన యావత్ ప్రకృతి సూర్యకాంతితో దేహాన్ని కడుక్కుని ప్రస్ఫుటమవుతూ దర్శనమిస్తోంది.

డాబామీద పూలచెట్లు పచ్చదనంతో విరుస్తున్న మొగ్గలతో సుందరంగా మెరుస్తున్నాయి.

"సుబ్బా.." మెత్తగా పిలిచింది మహా.

"ఊ"

"గట్టిగా కొట్టానా...?"

"లేదమ్మా. చచ్చేట్లు మాత్రమే కొట్టావ్. అక్కడ మా అమ్మ నాకోసం ఎన్ని పూజలు చేస్తున్నదో! బుర్ర చిదికి కుట్లు పడలేదు" అన్నాడు మళ్ళీ తల తుడ్డుకుంటూ.

"సారీ సుబ్బా. ఏంటో దాని పేరెత్తితే నాకు చెప్పలేని కోపం వచ్చేస్తుంది. షి యీజే ఛీట్!"

"సరే. ఇప్పుడు నేను సీరియస్‌గా మాట్లాడుతున్నా వాళ్ళని కలవాలంటే నేను కొంత స్టేటస్ మెయింటెయిన్ చెయ్యాలి. అందుకే అంత డబ్బు అడిగాను. నీకు తర్వాత అంతా లెక్కలు చూపిస్తాను. నువ్వు జాగ్రత్తగా వుండాలి. మీరంతా ఆడవాళ్ళే మిగిలారు. ఒకరికొకరు తోడుగా వుండి హెల్ప్ చేసుకోండి. నేను మధ్య మధ్య వస్తూంటానులే. అమ్మాజీకి కూడా చిన్నపని మీద వెళ్తున్నానని చెబుతాను. నేను లేనని అందరికీ చెప్పేయకండి" అని కొన్ని జాగ్రత్తలు చెప్పాడు సుబ్బా.

అతని మాటలకి కన్నీళ్ళొచ్చాయి మహాకి.

"త్వరగా వచ్చేయ్" అంది అతని భుజం పట్టుకుని మహా దిగులుగా.

సుబ్బా ఈసారి నవ్వలేదు.

జోక్ చేయలేదు.

ఆ మనోహర ప్రాతఃకాలంలో అతని హృదయం ఆమె స్పర్శతో పరవశించి మోహనరాగమాలపించింది.

ప్రొద్దుటే వచ్చిన సుబ్బాని చూసి కాళిదాసు "ఏంరా పొద్దు పొద్దుటే వచ్చావు డబ్బులేవన్నా కావాలా?" అనడిగాడు.

"ఎప్పుడు డబ్బుల రందేనండి మీకు. మిమ్మల్ని చూడాలనిపించిందండి. వచ్చేసా" అన్నాడు సుబ్బా యథాప్రకారం అరుగుమీద చతికిలబడుతూ.

"ఏరా ఏళాకోళం.. నీలాంటి కుర్రగాడికి పొద్దున్నే నన్ను సూడాలనిపించిందా?"

ఇంతలో కాళిదాసుకని కాఫీ తెచ్చిన సత్యవతి సుబ్బాని చూసి "ఏంటి సుబ్బా ఇలా వచ్చావ్? అంటూ ఆ కాఫీ సుబ్బా చేతిలో పెట్టింది.

"ఏటే నా కాఫీ ఆడికిచ్చేస్తన్నావ్. వొళ్ళు తెలీటంలేదేంటి?" అన్నాడు కాళిదాసు అక్కసుగా.

"మీరుండండి. ఎదవ కుళ్ళుబోత్తనం మీరూను" అంటూ మరో గ్లాసు తెచ్చి కాళిదాసుకిచ్చి సుబ్బా పక్కన చతికిలబడింది సత్యవతి.

"ఊరెళ్తన్నానండి. అది చెప్పడానికే వచ్చాను"

"ఏ వూర్రా. మీ యింటికా?" అనడిగాడు కాళిదాసు ఆరాగా.

సుబ్బా తలదించుకున్నాడు. "వూరేగాని. వాళ్ళని చూడటానికి కాదండి" అన్నాడు నెమ్మదిగా.

సత్యవతి అతని మొహంలోకి ఎగాదిగా చూసింది.

సుబ్బా మొహం కళాహీనం కావడం గమనించి అతని గడ్డం పట్టుకుని మొహమెత్తి "అదేంట్రా పిచ్చి సన్నాసీ? అంతదూరవెల్లి ఆళ్ళని చూడవా? నా మాట యిని ఎల్లి చూడు. ఆళ్ళెలా వున్నారో ఇవరమన్నా కనుక్కో" అంది లాలనగా.

సత్యవతి ప్రేమకి సుబ్బాకి దుఃఖమొచ్చిందిగానీ దాన్ని అదుపులో పెట్టుకుని "అలాగేనండి" అన్నాడు.

"ఇంతకీ దేనికిరా ఎళ్ళేది?" అన్నాడు కాళిదాసు.

"చిన్న డీల్ దొరికిందండి. ఆ పనిమీద"

"ఎవరిదేంటి? వడ్డీల కేసేనా? జాగ్రత్తరా బాబూ! అక్కడ గూండాలెక్కువ" అన్నాడు హెచ్చరిస్తున్నట్లుగా.

"ఎక్కడ లేరండి? అక్కడ బే, బే అంటూ మీద కొస్తే ఇక్కడ "అండీ, అండీ" అంటూనే కొంపలార్పేస్తారు. మొత్తం మీద అందరూ పక్కోడి కొంపార్పి అప్పనంగా తినేయాలనుకునేవాడే"

సుబ్బా మాటలకి సత్యవతి నవ్వింది.

"అద్సరేగాని.. జాగ్రత్త. మళ్ళీ వస్తావుగా"

సుబ్బా బాధగా ఆమెవైపు చూశాడు.

నాల్రోజులకే తనపట్ల ఆమె మనసులో అల్లుకున్న ప్రేమ ఆమె తడికళ్ళలో అద్దంలా మెరుస్తూ కనిపించి అతని కళ్ళు చెమర్చాయి.

"అయ్యో అక్కడే వుండిపోనండి. ఒకసారి మిమ్మల్ని చూసి చెప్పిపోవాలని వచ్చాను. ఈయన్ని ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళనీయకండి. బి.పి వుంది. ఆయాసపడుతున్నారు. మీకున్న డబ్బు చాలు. కీచులాడుకోకుండా నవ్వుతూ వుండండి. మీరు మరీ ఆ జీడిపప్పులూ, నెయ్యీ వేసి పెట్టకండి. కాస్త నడవమనండి" అంటూ జాగ్రత్తలు చెబుతుంటే మొదటిసారి ఆ భార్యాభర్తలు కన్నీళ్ళు పెట్టుకున్నారు.

సుబ్బూ సూట్ కేసు సర్దుకుని బయల్దేరుతుంటే అమ్మాజీ, మహా ఒకలాంటి దిగులుతో అతన్ని నిలబడి చూస్తున్నారు.

''అన్నా అడక్కూడదుగానీ మళ్ళీ ఎప్పుడొస్తావో?'' అంది అమ్మాజీ దిగులుగా.

''నేనేం ఏ ఫారిన్ వెళ్ళిపోవటం లేదు. చిన్నపని వడ్డీల వసూళ్ళకి రోజులు రోజులు వెళ్ళలేదా? కాళిదాసుగారి వసూళ్ళన్ని దాదాపు అయిపోయాయి. మరో బ్రతుకు తెరువు చూసుకోవాలి కదా!'' అన్నాడు విసుగ్గా.

అమ్మాజీ మరేం మాట్లాడలేదు.

''మీరే జాగ్రత్తగా వుండండి. సరస్వతమ్మగారు, అమ్మాజీగారు, పాపాయమ్మ అందరూ పెద్ద వయసువాళ్ళు. ఏ క్షణం ఎలా వుంటుందో తెలియదు. కనిపెట్టి వుండండి. అవసరమైతే ఫోను చెయ్యండి. వెంటనే వస్తాను'' అన్నాడు.

అమ్మాజీ బుద్ధిగా తలూపింది.

సుబ్బూ మహా వైపు చూశాడు.

మహా అతనివైపు ఏదో చెప్పాలన్నట్లుగా చూసింది.

అమ్మాజీ ఏదో అర్థమైనదానిలా ''ఇప్పుడే వస్తానన్నా'' అంటూ బయటికి వెళ్ళింది.

''తమరేమన్నా చెప్పాలా?'' అన్నాడు సుబ్బూ మహావైపు చూసి నవ్వుతూ.

మహా తడబాటుగా కనురెప్పలాడించి ''ఏంలేదు.. ఏం లేదు డబ్బు నిన్ననే ఎకౌంట్‌లో వేసాను సుబ్బూ. చూసుకున్నావా?'' అంది.

ఆ వెంటనే అతని సూట్‌కేసు తెరచి ఒక పేకెట్ అందులో పెట్టి మూసేసింది.

''ఏంటది?''

''ఏం లేదు నీకు డ్రెస్సులు కొన్నాను.''

''నువ్వు రాయల్‌గా కనిపించాలి కౌశిక్‌కి. అందుకని''

సుబ్బూ నవ్వి ''తల్లీ కొలతలు?'' అన్నాడు సందేహంగా.

''నీ బట్టలు చూసే తెచ్చానులే'' అంది మహా.

''థాంక్స్. వస్తా మరి'' అన్నాడు సుబ్బూ.

మహా అలానే నిలబడింది.

''కొందరికి ఏ ఫీలింగ్స్ వుండవు మరి. వస్తా'' అంటూ గడపదాటుతున్న సుబ్బూ చేతిని లాగి అప్రయత్నంగా ముద్దు పెట్టుకుని ''మిస్ యూ'' అంది మహా.

సుబ్బూ ఆమె వైపు చూశాడు. ఆమె చూపుల్లో అతన్ని ఎంతమాత్రమూ వదులుకోలేని నిస్సహాయత, ఆరాటం అతన్ని ఓ క్షణం కుదిపేసాయి. అయినా అతను మగవాడు. దేన్నయినా భరించగలవాడు. దేన్నయినా సహించగలవాడు.

సుబ్బూ తనని తాను అదుపు చేసుకుని వెనక్కి చూడకుండా ముందుకి సాగిపోయాడు.

''అత్తా''

''ఏంటి?'' అంటూ కోడలివైపు చూసింది పాపాయమ్మ.

"నువ్వా దోసెల పని మానెయ్యమంటే వినవు. కాళ్ళు చూడు ఎలా వాచిపోతున్నాయో" అంది లత అత్త పక్కన వచ్చి మంచం మీద కూర్చుంటూ.

ఆ మాటకే పాపాయమ్మకి బోల్డంత సంతోషమేసింది.

కష్టాలకి కన్నీళ్ళు కార్చి, కార్చిన కళ్ళు ఆమె భావాన్ని వ్యక్తీకరించలేకపోయినా ఆమె చెయ్యి కోడలి వడిలో పెట్టి "ఏదో ఒకటి చెయ్యనివ్వవే. ఖాళీగా ఏం చేయను?" అంది

"ఉన్నది ఇద్దరం లింగూలిటుకుమని. నా సంపాదన వుంది. తాగి పాడు చేసేవాడు లేడు. ఈ వయసులో ఇంత కష్టమక్కరలేదు. నా మాట విను. ఆరోగ్యం పాడుచేసుకోకత్తా. నీకేమన్నా అయితే నా కెవరున్నారు చెప్పు?" అంది లత బాధగా.

లత ఆఖరి మాటకి కదిలిపోయింది పాపాయమ్మ.

నిజమే ఆడపిల్లలు ఏమాశించి అన్నీ వదులుకుని భర్త వెంట వస్తారు. నేనున్నానని ఇంత భరోసా యివ్వలేని మొగుడు దేనికి? పైగా తాగుడు, దొంగతనాలూ.. తను కూడా అర్థం చేసుకోకుండా గయ్యిమని మీదపడి కొడుకుని వెనకేసుకొచ్చి బాధలు పెట్టింది. ఏంటో వాడు మారతాడని ఆశపడింది తన తల్లి మనసు.

"ఏంటత్తా ఆలోచిస్తున్నావ్?"

"అది కాదే ఇయ్యేవన్నా గవర్నమెంటు నౌకరీలా? ఎప్పుడు తీసేస్తారో ఎప్పుడు వుంచుతారో? కాస్త నాలుగు రూపాయిలు కూడబెట్టుకుంటే పనికొస్తాయి గదా" అంటూ సణిగింది పాపాయమ్మ.

"ఫర్వాలేదులే. నేను కొంత ఫిక్స్‌డ్‌చేస్తున్నా. రేపు జబ్బు చేస్తే ఆస్పత్రులకి ఉన్నదంతా ఊడ్చాలి. ఇప్పుడు మనలాంటోళ్ళు ఆస్పత్రులకెళ్ళేకంటే ఆత్మహత్య చేసుకోడం మంచిది అత్తా!" అంది లత.

పాపాయమ్మ బదులు చెప్పలేదు.

లతలో వచ్చిన మార్పు ఆమెను ఆశ్చర్యచకితురాల్ని చేస్తోంది. దీనికంతటికీ ఆ సుబ్బూనే కారణం.

ఏ తల్లి కన్న బిడ్డో. ఎందుకొచ్చాడో తెలియదు. తమ కొంపల్లో ఆరిపోతున్న దీపాలెలిగించాడు అనుకుంది మనసులో.

"సాయంత్రం రెడీగా వుండు. నిన్నోచోటకి తీసుకెళ్తా" అంది లత మురిపెంగా అత్తగారి భుజాల చుట్టూ చేతులు చుట్టి.

"ఏటే బాబు రోయినీ కార్తెలో కురిసిన వానలా నీ మాటల్తో నన్ను సంపేత్తన్నావు. ఏటి కతా?" అంది పాపాయమ్మ కోడలివైపు అయోమయంగా చూస్తూ.

బదులుగా లత నవ్వి "అప్పుడే చెప్పను" అంది లేచి పర్సు తీసుకుని షాపుకెళ్తూ.

"సాల్లేవే, ఏదన్నా సినిమాకి తీసుకెల్తావో - నేరానా ఎదవ సినిమాలకి" అంది.

"అదేం కాదు" అంది లత వెళ్ళిపోతూ అక్కడే నిలబడి నవ్వుతున్న అమ్మాజీవైపు చూసి నవ్వుతూ.

లత వెళ్ళగానే అమ్మాజీ పాపాయమ్మ దగ్గరకొచ్చి "ఏంటి మామ్మా కథ! పొద్దున్నే ఇద్దరూ సరసాలాడేసుకుంటున్నారు?" అనడిగింది.

"ఏంటోనే పాపం, సాయంత్రం నన్ను ఎక్కడికో అట్టుకెల్తదంట" అంది పాపాయమ్మ.

"ఎల్లు మరి" అంది అమ్మాజీ నవ్వుతూ.

"ఈ కాల్లు సూసేవా అరిటి బోదెల్లా ఎలా వాసిపోయాయో. ఈటితో సికార్లేంటే... పైగా దోసెల యాపారం మానెయ్యమంటన్నాది. మానేస్తే ఆడికి.. సరి సర్లే" అంది పాపాయమ్మ నాలిక్కరచుకుని.

"ఆడికి...ఆడెవరూ? చెప్పు మామ్మా" అంది అమ్మాజీ పాపాయమ్మని కుదుపుతూ.

"ఊరుకోవే నోరు జారితే అదే అట్టుకుని ఏలాడిపోతావూ. మాయదారి సంత నీతో" అంది విసుక్కుంటూ.

"నా కర్థమయిందిలే. రామక్రిష్ణ వస్తున్నాడు కదూ! అతనికి పైసలిచ్చి మేపుతున్నావు కదూ! ఉండు అన్నొచ్చాక అంతా చెబుతాను" అంది కోపంగా అమ్మాజీ.

పాపాయమ్మ అమ్మాజీ కాళ్ళు పట్టుకున్నంత పని చేసింది.

"తల్లి తల్లీ అంత పని సెయ్యకే. ఎంతయినా తిండి లేకుండా దిక్కుమాలి ఏడుస్తుంటే కుక్కకి పడేసినట్టు పడేస్తున్నానే. ఎంతయినా తల్లిని కదా! కడుపు సించుకుని కన్న నేరానికి తప్పట్లేదే ఈ సంగతి దానికి తెలిసిందంటే అన్నవెట్టదు. ఈ వయసులో నా కొంప ముంచకే అమ్మాజీ" అంటూ ఏడ్చింది పాపాయమ్మ.

పాపాయమ్మని ఆ స్థితిలో చూసి జాలేసింది.

"చాల్లే ఏసాలు నువ్వలా మేపుతూవుంటే నీ కొడుకెందుకు కష్టపడి పనిచేస్తాడు. ఇప్పుడనిపిస్తున్నది నువ్వే గారాలెట్టి అలా తయారు చేసావ్" అంది అసహనంగా.

పాపాయమ్మ అపరాధిలా తలదించుకుంది.

"నీకు తెలియదే తల్లిబాధ. ఆడ్ని కనేటప్పుడూ ఏడవాలి. కనిపెంచేటప్పుడూ ఏడవాలి. సెడితే ఏడవాలి. ఆణ్ణందరూ సీ కొడితేనూ ఏడవాలి. అసలు తల్లికావడమే ఒక ఏడుపే" అంటూ భోరుమంది పాపాయమం.

అమ్మాజీ మనసు చివుక్కుమంది.

పాపాయమం గడ్డం పుచ్చుకుని తన కొంగుతో కళ్ళు తుడిచింది.

"మామ్మా ఏడవకు. నాకో బిడ్డవుంటే ఎంత బాగుండేది. అని రోజూ రాత్రులు ఏడుస్తుంటాను. ఇప్పుడనిపిస్తోంది నాకు పిల్లల్లేకుండా దేవుడెంత మేలు చేసాడొ అని. అయితే ఒకటి రామక్రిష్ణకి పైసలు మప్పకు. ఎల్లకాలం నువ్వుంటావా? చెట్టంత అయ్యాడు ఏ చెట్టో కొట్టుకుని పుల్లలమ్ముకుని బతుకుతాడు. ఈసారి పైసలిక్చేవని తెలిస్తే నేను నీతో మాట్లాడనంతే. రాత్రి రెండుగంటలకి ఎవరో ఈల వేసిన చప్పుడిపిస్తున్నది. ఇది మీ యిద్దరి బాగోతమా?" అంది అమ్మాజీ.

పాపాయమ్మ సరేనని తలూపింది.

ట్రెయిన్ మౌలాలి వచ్చేటప్పటికే నెర్వస్ అయ్యాడు సుబ్బూ. రైలు చిన్నగా ఆగి ఆగి మెల్లిగా ప్లాట్‌ఫామ్ చేరింది. ప్రయాణీకులందరూ రైలు ఆగకుండానే గాభరా పడుతూ లగేజ్‌లు తీసుకుని నిలబడుతున్నారు. సుబ్బూకి ఎప్పుడూ నవ్వొస్తుంటుంది. ఇన్ని గంటలు ప్రయాణం ఓపిగ్గా చేస్తారు కానీ ప్లాట్‌ఫామ్ దగ్గర కాసేపు వెయిట్ చేయలేరేంటా అని.

అందరూ దిగుతున్నా సుబ్బూ అలానే కూర్చున్నాడు. చివరికి కంపార్టుమెంటు ఖాళీ అయ్యాక సూట్ కేసు తీసుకుని మెల్లిగా అగమ్యంగా ప్లాట్‌ఫామ్ మీద నడకసాగించాడు. ఇప్పుడెక్కడికి వెళ్ళాలి? దిగగానే తల్లీ తండ్రీ గుర్తొచ్చారు. వెంటనే చూడాలనిపిస్తోంది. కానీ... కుదరదు. తల్లి తనని చుట్టేస్తుంది. తిరిగి వెళ్ళనివ్వదు. మళ్ళీ మామూలే కథే అక్కడే - అందులోనే కూరుకుపోవాలి. ఆ ముసల్ది వుండగా అది అసాధ్యం. అసలు తన తండ్రి ఇంటికి వెళ్ళాడో లేదో!? అన్నీ తెలుసుకోవాలనుంది. కాని.. తను కనబడితే వాళ్ళు వదలరు.

అలా ఆలోచిస్తూ అతను బయటకి వచ్చాడు.

తల్లీ తండ్రీ వుండే ప్రాంతాలు కాకుండా సోమాజీగుడా యశోదాకి దగ్గరగా వుండే ఒక హోటల్‌కి కేబ్‌లో బయల్దేరాడు.

రాజ్‌భవన్ రోడ్డులో వున్న ఆ హోటల్‌లో దిగి కాలకృత్యలు తీర్చుకుని తను ఎలా ప్రొసీడ్ కావాలో ఆలోచించుకున్నాడు సుబ్బూ.

ఇంతలో ఫోన్ రింగయింది.

మహా!

"హలో!" అన్నాడు.

"ఎలా చేరావో తెలుసుకుందామని చేసాను సుబ్బూ! అంతా ఓ.కే కదా" అనడిగింది మహా.

"అంతా ఓ.కేనే. మీరందరూ జాగ్రత్తగా వుండండి. నాకేం? ఇది నేను పుట్టి పెరిగిన ఊరే. అమ్మాజీ వస్తున్నదా?" అనడిగాడు సుబ్బూ.

"నా దగ్గరే ఉంటున్నది. నాకేం ఫర్వాలేదు. నువ్వు జాగ్రత్త" అంటూ హెచ్చరించింది మహా.

"అంతా ఓ.కేనే. ఇప్పుడే యశోదాకి వెళ్ళబోతున్నాను"

"ఆల్ ద బెస్ట్. టేక్ కేర్"

"థాంక్యూ" అని స్విచాఫ్ చేసి టిఫిన్ ముగించి దగ్గర్లో వున్న యశోదా హాస్పిటల్‌కి కాలినడకన బయల్దేరాడు సుబ్బూ.

రిసెప్షన్‌లో డాక్టర్ కౌశిక్ ఏ ఫ్లోర్‌లో వున్నదీ తెలుసుకుని వెనక్కు తిరిగిన సుబ్బూ ఒక్కసారిగా షాక్ తగిలినట్లుగా నిరుత్తరుడయ్యాడు.

లిఫ్ట్‌లోంచి వీల్ ఛెయిర్‌లో వున్న మీనాక్షమ్మని తీసుకుని తల్లీతండ్రీ రావడం అతని కళ్ళపడింది.

వెంటనే తను పెట్టుకున్న కేప్ కొంచెం క్రిదకి దించి వెనక్కి తిరిగి నిలబడ్డాడు.

వాళ్ళు బయటకి వెళ్ళేవరకూ ఊపిరి బిగబట్టి అలానే నిలబడి తండ్రీ తల్లీ తనని చూడలేదని నమ్మకం ఏర్పడ్డాక చిన్నగా లిఫ్ట్‌వైపు వెళ్ళబోతుండగా తన భుజం మీద చెయ్యిపడి ఉలిక్కిపడ్డాడు సుబ్బూ.

సుబ్బూ వెనుతిరిగి చూడగానే ప్రభాకర్రావు చిరునవ్వు నవ్వుతూ "నాన్నా, బాగున్నావా?" అనడిగాడు.

సుబ్బూ స్థాణువులా బిగుసుకుపోయి యాంత్రికంగా తలూపుతూ "బాగున్నాను అమ్మమ్మకేమయ్యింది?" అనడిగాడు.

"హిప్ బోన్ ఫ్రాక్చర్. ఆమె హైహీల్స్ మానదు కదా" అన్నారాయన.

"సరే పద. ఎక్కడన్నా కూర్చుని మాట్లాడుకుందాం. నీకేం అర్జంటు పని లేదు కదా!" అన్నారాయన తిరిగి.

"ఏం లేదు నాన్నా వాళ్ళేరి?" అన్నాడు సుబ్బూ మెల్లిగా.

"డ్రైవర్‌తో పంపించాను."

"అమ్మ చూడలేదుగా?"

లేదన్నట్లుగా తలూపి సుబ్బూని తీసుకుని దగ్గరగా వున్న రెస్టారెంటుకి దారి తీసాడు ప్రభాకర్రావు.

"మీరు ఎప్పుడింటికొచ్చేసారు?" అనడిగాడు సుబ్బూ ఆశ్చర్యంగా.

బదులుగా ప్రభాకర్రావు నిట్టూర్చి "నువ్వెళ్ళాక పెద్ద కథే జరిగింది. మీ అమ్మమ్మని ప్రోత్సహించి తీసుకెళ్ళి పేకాట క్లబ్ పెట్టించిన వేదవతి పెద్ద జాకాల్. ఇద్దరి మధ్య తగాదా పెట్టి వాళ్ళని నాశనం చేయడం ఆమె హాబీ. అదే ఆమెకి ఆహారం. రమాదేవి ఆమె ఫ్రెండ్ భర్తలేడు. ఆమెని ఈ క్లబ్బు నడపమన్నది ఈవిడే తిరిగి బాగుపడుతుంటే చూడలేనిదికూడా ఈమే. ఆడవాళ్ళ అసూయ ముందు ఏ కత్తి పదునూ చాలదు. అందులో వేదవతిలాంటి దారుణమైన స్త్రీలు ఎంతకైనా తెగిస్తారు. రమాదేవిని దెబ్బకొట్టడానికి మీ అమ్మమ్మని వాడింది.

సహజంగా దురాశాపరురాలు క్రేజీ అయిన మీ అమ్మమ్మ ఆమె మాటలు నమ్మి ఊబిలో చిక్కుకుంది. శక్తికి మించి ఇల్లు, ఫర్నీచర్ తీసుకుని క్లబ్బు మొదలుపెట్టింది. డబ్బు బాగానే వస్తున్నది. రమాదేవి బేరాలు, కస్టమర్స్‌ని తెలివి తేటలుగా ఇటు మళ్ళించింది. వేదవతి సాయంత్రమయ్యేసరికి డబ్బులో వాటాకి మీ అమ్మని, అమ్మమ్మని వేధించి పట్టుకుపోవడం మొదలుపెట్టింది. వీళ్ళు కొన్నాళ్ళు ఆమె సతాయింపుని భరించారు. చివరకి మీ అమ్మమ్మ ఎదురు తిరిగిందట. అంతే! కథ అడ్డం తిరిగింది ఆవిడే వీళ్ళ మీద పోలీసు రిపోర్ట్ ఇచ్చింది.

ఇంకేముంది? పోలీసుల్ని చూసి మీ అమ్మ ఒణికిపోతూ నాకు ఫోన్ చేసింది. ఆ పరిస్థితుల్లో ఆడవాళ్ళని దిక్కుమాలిన వాళ్ళం చెయ్యలేం కదా! నేను, నా ఫ్రెండ్ జోక్యం చేసుకుని ఆ చిక్కు విడదీసి చిక్కడపల్లిలో ఇల్లు తీసుకుని వుంటున్నాం. నాక్కూడా నా ఫ్రెండ్ జీతం దానితో పాటు బాధ్యతలు పెంచాడు'' అన్నాడాయన క్లుప్తంగా.

సుబ్బూకి అదంతా విని చాలా గిల్టీగా అనిపించింది.

ఎదిగిన కొడుకుగా తనేం సహాయం చేయకుండా ఇల్లు వదిలేసి తిరగటం చాలా బాధ కలిగించింది.

''నాన్నా!''

''ఊ''

''నేను వచ్చేయనా?''

ఆయన నవ్వి ''వద్దు. కొన్నాళ్ళిలా జరగనీ. నీ చదువు అర్ధాంతరంగా ఆగిపోవడం నాకు చాలా బాధ కలిగించిన మాట వాస్తవమే. మనిషి ఔన్నత్యం ఎకడమిక్ డిగ్రీలలోనే వుందని నేను నమ్మను. నువ్వెక్కడున్నా చెడిపోవనే నమ్మకం నాకుంది. అలా అయితే నువ్విక్కడే వుండేవాడివి. అందుకే నీవు ఇప్పుడేం చేస్తున్నావో అని నేనడగను నువ్వెప్పుడు రావాలనుకుంటావో అప్పుడే రా'' అన్నాడు.

సుబ్బూ జవాబు చెప్పలేదు.

తలదించుకుని చేతిలో గీతలు గీసుకుంటూ కూర్చున్నాడు. తనమీద తండ్రికున్న నమ్మకానికి అతని కళ్ళు చెమర్చాయి.

ప్రభాకర్రావు లేచి అతని భుజం తట్టి ''కేరీ ఆన్ నాన్నా! నీ క్షేమం తెలిసింది. అది చాలు'' అన్నాడు.

తండ్రిని సాగనంపి సుబ్బూ తిరిగి హాస్పిటల్లోకొచ్చి కౌశిక్ రూమ్ దగ్గరకెళ్ళాడు.

సుబ్బూ అక్కడే విజిటర్స్ లాంజ్‌లో కూర్చుని కౌశిక్ వివరాలు వీలయినంత రాబట్టాడు. అతను రూమ్‌లోంచి బయటకొచ్చినప్పుడు గమనించాడు. మిగతా వివరాలు, గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకున్నాడు.

ఆ సాయంత్రం అతనొక ఫ్లవర్ బొకె, ఒక స్వీట్ పేకెట్టు తీసుకుని కౌశిక్ యింటికి వెళ్ళి డోర్ బెల్ నాక్ చేసాడు.

పనమ్మాయి వచ్చి తలుపు తెరచి ''ఎవరు కావాలి?'' అనడిగింది.

''రాణీ వున్నారా?'' అనడిగాడు సుబ్బూ.

ఆమె వున్నారన్నట్లుగా తల పంకించి రాణీకి చెప్పింది. రాణీ 'ఎవరా' అన్నట్లుగా వచ్చి చూసింది.

''హాయ్ రాణీ! గుర్తున్నానా?'' అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

రాణి అయోమయంగా చూసిందతనివైపు.

''మరచిపోయినట్లున్నావ్. నువ్వూ, నేనూ మహా అందరం క్లాస్‌మేట్స్‌మి కదా! అన్నాడు సుబ్బూ ఫ్లవర్ బొకె అందిస్తూ.

రాణి గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అతనందించిన పూలగుచ్చం, స్వీట్స్ అందుకుంది.

''కూర్చోండి'' అంది మెల్లిగా.

"ఓహో. అండీలో కొచ్చేసావా? ఎంతయినా డాక్టరుగారి భార్యవి కదా!" అంటూ కూర్చున్నాడు సుబ్బూ.

రాణీ ఆలోచిస్తున్నది.

ఆమెకు సుబ్బూ ఎంతకీ గుర్తురావడంలేదు.

అతను మహా గురించి మాట్లాడుతుంటే ఆమెకు గిల్టీగా వుంది. అతని కొన్ని సంఘటనలు చెబుతుంటే అతను ఖచ్చితంగా తన క్లాస్‌మేటే అనిపిస్తున్నది.

సుబ్బూ ఎక్కడా తొణక్కుండా చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. కొద్దిగా తొట్రుపడినా తన అబద్ధాలు బయటపడిపోతాయన్న కంగారు అతనికుంది. చాలా సాదాసీదాగా అతను చెబుతున్నవన్నీ నిజంగా జరిగినవే.

సుబ్బూ జేబులోంచి తీసి టేబుల్ మీద పెట్టిన ఖరీదైన వాచ్ చూసి ఆమె కళ్ళు మెరిసాయి.

నిజానికి ఆమె బాగా సంపాదిస్తున్న ఒక డాక్టరు భార్య. కానీ ఆమెలో వున్న దురాశ ఆమెని ఆత్మగౌరవంగా ఎన్నడూ వుంచలేదు. ఒక కొమ్మ పట్టుకుని మరో కొమ్మకి ఎగబాకే వానర మనస్తత్వం ఆమెది. అందుకే ఆమెకూడా సుబ్బూ చెప్పేమాటల్ని కన్వీనియంట్‌గా నమ్మడం ప్రారంభించింది.

ఇంతలో కౌశిక్ డ్యూటీ నుండి వచ్చాడు. అతన్ని చూసి సుబ్బూ లేచి నిలబడ్డాడు.

"మీట్ మై కాలేజ్‌మేట్ సుబ్బూ" అంటూ భర్తకి పరిచయం చేసింది రాణి.

కౌశిక్ అతనికి కరచాలనం చేసి కూర్చున్నాడు.

"ఇతని గురించి నువ్వెప్పుడూ చెప్పలేదే?" అన్నాడు పనమ్మాయి తెచ్చిన మంచినీళ్ళు తాగుతూ.

"మీరొచ్చారుగా. నా గురించేం గుర్తుంటుంది లెండి. అదీగాక నేను బిజినెస్ టూర్స్‌మీద విదేశాలు తిరుగుతున్నాను. చాలా గేప్ మా యిద్దరి మధ్యా" అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

కౌశిక్‌కి అతని మాటలు కొంచెం సందేహాన్ని కలిగిస్తున్నాయి. సుబ్బూ అతనికి ఒక ఖరీదైన పెర్‌ఫ్యూమ్ బాటిల్ అందించాడు. కౌశిక్ దాన్ని తీసుకుని థాంక్స్ చెప్పాడు. ఆ రాత్రి డిన్నర్‌కి వుండమని కోరింది రాణి.

సుబ్బూ తన బిజినెస్ వివరాలు, టూర్స్ గురించి చాకచక్యంగా చెప్పీచెప్పనట్లుగా చెబుతున్నాడు. అదివరకు తను ఒక ఇంగ్లీషు నవలలో చదివిన కొన్ని విషయాల్ని అతను చాకచక్యంగా అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

భోజనాల దగ్గర అతను చాలా చనువుగా రాణీతో మాట్లాడటం రాణీ చాలా హుషారుగా జవాబులివ్వటం అతను అయిష్టంగానే గమనిస్తున్నాడు.

తిరిగి వచ్చేస్తున్నప్పుడు కౌశిక్‌తో "ఎనీవే యూ ఆర్ లక్కీ గై. మీ యిద్దరి జంటా బాగుంది. అప్పుడప్పుడూ వస్తుంటాను. మీకేం అభ్యంతరం లేదుగా" అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

కౌశిక్ లేదన్నట్లుగా తలూపాడు.

రాణి చొరవగా అతని సెల్‌నంబర్ అడిగింది.

సుబ్బూ బై చెప్పి రూమ్‌కి వచ్చేసాడు.

రూమ్‌లో పడుకుని అతను రాణి గురించి ఆలోచించాడు. రాణీ పెద్ద అందగత్తెకాదు. ఆమెకు డబ్బూ, హోదామీద ఆశ ఎక్కువని తెలిసిపోతున్నది. కౌశిక్ నుండి ఆమెను విడగొట్టడం పెద్ద సమస్యేం కాదు. కానీ అదంత అవసరమా! దానివలన మహా సాధించేదేమిటి? తిరిగి కౌశిక్‌ని పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం లోలోపల వుందా? మరి తనమీద చూపిన అభిమానానికి అర్థం ఏమిటి?

కాసేపు అతని ఆలోచనలు అలా సాగి తల్లిదండ్రుల వైపు మళ్ళాయి. తన తండ్రి ఎంత మంచివాడు. తనని ఎంతగా నమ్ముతున్నాడోకదా! సుబ్బూకి కళ్ళు చెమర్చాయి.

తనిప్పుడు అటూ వెళ్ళలేడు - ఇటూ రాలేడు.

తన గమ్యమేమిటో తనకే తెలియని అయోమయం.

అలానే ఇతిమిద్ధం లేని ఆలోచనలతో నిద్రలోకి జారుకున్నాడు.

తెల్లవారగానే స్నానం చేసి టిఫిన్ తింటుండగా ఫోను రింగయింది.

రాణి..!

సుబ్బూ ఏమీ ఆశ్చర్యపడలేదు.

రాణి నెంబర్ అడిగినప్పుడే అతనికి అర్ధమైంది ఆమె నుండి ఫోను వస్తుందని.

సుబ్బూ హలో అనగానే ఆమె గలగలా మాట్లాడటం మొదలు పెట్టింది.

"హలో సుబ్బూ, ఏం చేస్తున్నావ్?" అందామె చనువుగా.

సుబ్బూ ఆశ్చర్యపోతూనే "ఏంటి సంగతి?" అన్నాడు నవ్వుతు.

"నిన్న రాత్రంతా నీ గురించి ఆలోచిస్తూనే వున్నాను. చాలా సేపటికి గుర్తొచ్చావు. నీ రూపం చాలా మారిపోయింది. అందుకే గుర్తుపట్టలేకపోయాను సారీ" అంది నొచ్చుకున్నట్లుగా.

సుబ్బూకి నవ్వొచ్చింది. దాన్ని అదుపులో పెట్టుకుంటూ "హమ్మయ్య ఇప్పటికన్నా గుర్తుపట్టావ్. సంతోషం. నేనసలు నీ పెళ్ళి ఇతనితో జరుగుతుందని ఊహించనేలేదు. మా డాడీ ఈ బోడి చదువులెందుకు పనికొస్తాయి నా వ్యాపారంలోకి వచ్చేయమంటే ఆయనతో ఫారిన్ టూర్స్‌కి వెళ్ళిపోయాను. అందువలన అప్పుడప్పుడూ ఇండియా వచ్చినా నిన్ను కలవలేకపోయాను. నువ్వు అర్థం చేసుకోలేదో - లేక నేను నా ప్రేమని సరిగ్గా ఎక్స్‌ప్రెస్ చేయలేకపోయానో.. బట్ ఎనీ వే నువ్వు హాపీగా వున్నందుకు సంతోషం" అన్నాడు.

అలా నటించటం అతనికి కష్టంగానే వుంది.

కాసేపు రాణీ మౌనంగా ఉంది.

"సారీ! నిన్నేమన్నా నొప్పించానా?"" అన్నాడు సుబ్బూ నొచ్చుకున్నట్లుగా.

"అబ్బెబ్బే అదేం లేదు. ఇప్పుడేం చేస్తున్నావ్. రాకూడదూ. అతను హాస్పిటల్‌కి వెళ్ళిపోయాడు. మళ్ళీ ఎప్పుడు తేలతాడో తెలియదు. మనం కబుర్లు చెప్పుకుందాం. నీకేం ఇష్టమో చెపితే వంట చేయిస్తాను" అంది రాణి కొద్దిగా కంఠంలో హొయలూ, వగలూ కలుపుతూ.

సుబ్బూకి పరిస్థితి అర్థమయ్యింది.

ఆమెనలా క్రేజ్‌లో వుంచాలంటే తను వెళ్ళకూడదు. వెళ్తే మాటల్లో చాలా నిజాలు దొర్లిపోవడం ఖాయం.

"సారీ రాణీ! నాకర్జెంటుగా ఒక మీటింగ్ వుంది. వెళ్ళి తీరాలి. అదయ్యాక వీలుంటే చూస్తాను" అన్నాడు సుబ్బూ.

"ఓ! సరే ఏం చేస్తాను. అన్నట్లు నువ్విచ్చిన వాచీ బాగుంది లవ్ యూ" అంది రాణి గోముగా.

"ఇట్సాల్ రైట్ నాకు టైమయింది. సీ యూ" అంటూ స్విచాఫ్ చేసాడు సుబ్బూ.

రాణి గాడిలో పడింది. ఇక యిక్కడ కూర్చుని చేసేదేమీ లేదనిపించిందతనికి.

పదే పదే ఇక వాళ్ళ కళ్ళబడి అసలు గుట్టు బయట పెట్టుకోవడం యిష్టంలేక తిరుగు టికెట్ తీసుకుని బయల్దేరాడు సుబ్బూ.

మహా సుబ్బూ దగ్గర వున్న ఒక ఇంగ్లీషు నవల తీసుకుని చదువుతుంటే అమ్మాజీ గబగబా పరిగెత్తుకొచ్చి "అమ్మాయిగారూ, సుశీలకి బాగోలేదంటండీ" అని చెప్పింది కంగారుగా.

"ఏ సుశీల?" అంది మహా పరధ్యానంగా.

"అదేనండి ఉమ్మడి సుశీల. ఈ మజ్జెన కనబడకపోతే ఏటో అనుకున్నాను. ఇప్పుడే కింద ఎవరో అంటే యిన్నాను."

"అయ్యో ఏమయింది?" అనడిగింది మహా కూడా గాభరా పడుతూ.

"ఏమోనండి ఆ దోసెల కాడ ఎదవలందరూ ఎయిడ్సని ఎటకారాలు చేసి నవ్వుతున్నారండి. నాకు చాలా బాదేసింది" అంది అమ్మాజీ విచారంగా.

ఆ మాట విని మహా మొహం బాధగా మారిపోయింది.

"సుశీల ఇల్లెక్కడ?" అనడిగింది మహా

"ఇక్కడ మూడో సందులోనేనండి"

"పద, వెళ్ళి చూసొద్దాం"

"ఏటి మీరక్కడికి వస్తారా? ఆ సందులో అడుగెట్టలేరుమీరు" అంది అమ్మాజీ ఆశ్చర్యంగా.

"ఫర్వాలేదు పద" అని చెప్పులేసుకుంది మహా.

ఇద్దరూ క్రిందకి దిగుతుంటే విషయం తెలిసిన పాపాయమ్మ "ఏంటీ దానికసలే ఎయిడ్సంట. అక్కడికెల్తారా? ఇంకా నయం" అంది కోపంగా.

"మామ్మా ఎవరో ఏదో వాగితే అది నమ్మేయడమేనా? పైగా అదే అంటు వ్యాధికాదు" అని మహా ముందుకి నడిచింది.

అమ్మాజీ దారి చూపిస్తుంటే ఎంతో రోతగా వున్న ఆవీధిలోకి అడుగుపెట్టింది మహా.

సరిగ్గా అప్పుడే ఆవీధిలో వాళ్ళు సుశీల పడుకున్న మంచం బయటకి లాగి ఇల్లు ఖాళీ చేయిస్తున్నారు.

మహా సుశీల వైపు చూసింది.

సుశీలకి మాటలేదు. మంచానికి అంటుకుపోయింది.

"ఉండండి. తొందరపడకండి. ఆమెకు ఎయిడ్సని నిర్ధారణయ్యిందా? రిపోర్ట్సు వచ్చాయా?" అనడిగింది మహా.

"ఇంకా ఏం నిర్ధారణవ్వాలమ్మా? దాని రూపు చూస్తే తెలియడంలే? అదుత్త తిరుగుబోతు ముండ. ఎక్కడో అంటుకునే వుంటది" అన్నారు వాళ్ళు నిర్దయగా.

మహా వాళ్ళతో వాదించి లాభం లేదని నిర్ధారణ చేసుకుంది. వెంటనే అంబులెన్స్ కోసం ఫోన్ చేసింది.

అంబులెన్స్ వచ్చే లోపునే అక్కడికొచ్చి నిలబడ్డ సుబ్బూని చూసి ఆశ్చర్యపోయింది మహా.

"ఏంటి సుబ్బూ, అప్పుడే వచ్చేసావా?" అంది ఆశ్చర్యంగా.

"అవునుగానీ ఏంటి సుశీలకేమయ్యింది?" అనడిగాడు సుబ్బూ కంగారుగా.

అమ్మాజీ అంతా చెప్పింది.

సుశీలని ముగ్గురూ కలిసి హాస్పిటల్లో జాయిన్ చేసారు.

"మీ ఇద్దరూ ఇంటికెళ్ళండి" అని వాళ్ళని పంపించేసి అన్ని టెస్టులూ చేయించాడు సుబ్బూ. అక్కడ సెలైన్ పెట్టి కొన్ని ఇంజక్షన్ ఇచ్చాక సుశీలలో కొంచెం చలనం వచ్చింది.

ఆ రాత్రి సుబ్బూ అక్కడే వుండిపోయాడు.

సుశీలపట్ల అతనికి చాలా సానుభూతి వుంది. బీదరికం, పరిస్థితులూ ఆమె జీవితాన్ని ఎంతగా ఛిన్నాభిన్నం చేసాయో గ్రహించి అతను సుశీలని ఎప్పుడూ బాగానే చూసేవాడు. ఆ మర్నాడు రిపోర్ట్స్ వచ్చాయి. సుశీలకి అందరూ అన్నట్లుగా ఎయిడ్స్ సోకనేలేదు. విపరీతమైన ఆహార లోపం వలన ఆమె దారుణంగా శుష్కించిపోయింది.

ఈ విషయం తెలిసాక అందరి నోర్లూ మూసుకున్నాయి. సుబ్బూ ఇంటికొచ్చాక కూడా మహా హైదరాబాదులో ఏం జరిగిందో అడగడానికి ధైర్యం చాలలేదు.

సుశీలని డిశ్చార్జ్ చేసేవరకూ మహా ఏమీ అడగలేదు.

ఈలోపునే ఒక స్త్రీ సదన్‌లో సుబ్బూ మాట్లాడివచ్చాడు. మహా, అమ్మాజీ, సుబ్బూ కలిసి సుశీలని తీసుకుని అక్కడికెళ్ళారు. కూడా వచ్చిన వారిని బట్టి సుశీలకి మర్యాద పెరిగింది. సుశీలకి ఒక గది ప్రత్యేకంగా తీసుకుని డబ్బు కట్టింది మహా.

కావల్సిన మందులు, హార్లిక్ తదితర వస్తువులన్నీ ఏర్పాటు చేసాడు సుబ్బూ.

సుశీల వాళ్ళకి చేతులు జోడించింది.

'నా జీవితంలో మొదటిసారి దేవుళ్ళని చూశాను' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"వీలయినప్పుడల్లా మేం వస్తుంటాం. సుశీల నా అక్క. మీకు అప్పచెపుతున్నా" అని సుబ్బూ చెబుతుంటే వలవలా ఏడ్చేసింది సుశీల.

ఆ రాత్రి మహా సుబ్బూని వెళ్ళిన పని గురించి అడుగుదామనుకుంటుండగా సుబ్బూ ఫోన్ రింగయింది.

సుబ్బూ మహాని పిలిచి స్పీకర్ ఆన్ చేసాడు.

"హాయ్ సుబ్బూ, ఏమయిపోయావ్, మళ్ళీ రానేలేదూ?" అంది రాణీ.

రాణీ గొంతు విని మహా భ్రుకుటి ముడిపడింది.

కోపంగా సుబ్బూ వైపు చూసింది.

'ష్!' అన్నట్లు మహాకి సైగ చేసి "హాయ్ రాణీ అర్జెంటుగా కలకటా వెళ్ళాల్సి వచ్చింది. ఇప్పుడక్కడే బిజినెస్ డీల్ మీద వున్నాను అన్నాడు ముద్దుముద్దుగా.

"ఏంటలా చెప్పకుండా. నీకోసం ఎంతగా ఎదురుచూశానో తెలుసా?"

"సారీ డార్లింగ్ నా వ్యవహారాలలాంటివి"

"నాకు చెబితే నేనూ వచ్చేదాన్నికదా! కలకటా చూడాలని నాకెప్పటినుండో కోరిక"

"నిజమా! నాకేం తెలుసు? నువ్వలారాగలవని. ఈ సారి స్విట్జర్లాండ్ వెళ్ళినప్పుడు తీసుకెళ్తాను. ఇక్కడ బిజీగా వున్నాను తర్వాత కాల్ చేస్తాను" అంటూ ఫోన్ ఆఫ్ చేసి మహా వైపు చూసి కొంటెగా నవ్వాడు సుబ్బూ.

మహా కోపంగా అతని చేతిలో ఫోన్ లాక్కుని విసిరేయబోయింది. సుబ్బూ లాఘవంగా దాన్ని పట్టుకుని ఎందుకు తమకంత కోపం మాడం" అన్నాడు నవ్వుతు.

"నువ్వు చేస్తున్న పనేంటి ? నేనెందుకు పంపాను? నువ్వేం చేస్తున్నావ్?" అంది.

బదులుగా పకపకా నవ్వాడు సుబ్బూ.

"నీకు వాళ్ళిద్దరు విడిపోవడమే కదా కావాలి. ఆ పని ఎలా జరిగితే నీకేంటి?"

వెంటనే బదులు చెప్పలేకపోయింది మహా.

కానీ ఆమె కళ్ళలో లీలగా నీళ్ళు కదలడం చూసి విచిత్రులయ్యాడు సుబ్బూ.

మహా స్వరున తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది. సుబ్బూ ఆమె ప్రవర్తనకి కొద్దిగా నివ్వెరపోయాడు.

కొంచెం అర్థమయినా అందుకు ఆనందం కలిగినా వెళ్ళిపోతూ మహా తండ్రి చెప్పిన మాటలు గుర్తొచ్చి ఒకలాంటి నిర్లిప్తత ఆవరించి మహాతో మాట్లాడాలనుకుని కూడా మౌనం వహించి అటు తిరిగి పడుకున్నాడు.

**సుబ్బూకి** ఆలోచనలతో ఏ తెల్లవారుఝామునో నిద్రపట్టేసింది. అతను కలతగానే నిద్రపోయాడు. మెలుకువ వచ్చి చూసేసరికి తూర్పులో చీకటి వెలుస్తోంది. పక్షులు గోలగోలగా అరుస్తున్న ధ్వని.

లేచి టెర్రస్ మీదకి వచ్చాడు.

అక్కడ కుర్చీలో ఒక్కతే కూర్చుని శూన్యంలోకి చూస్తున్న మహాని చూడగానే అతనికి ఆశ్చర్యంతో కనుబొమ్మలు పైకి లేచాయి.

కానీ వెంటనే పలుకరించలేకపోయాడు.

మెల్లిగా శబ్దం కాకుండా లోపలికి వచ్చి మొహం కడుక్కున్నాడు. వంటగదిలోకి వెళ్ళి కాఫీ కలిపి ఇద్దరికి మగ్స్‌లో పోసి టెర్రస్ మీదకొచ్చి "హలో మహా! గుడ్‌మార్నింగ్" అంటూ ఒక మగ్ మహాకి అందించాడు.

మహా అతనివైపు ఆశ్చర్యంగా చూసి "అప్పుడే నిద్రలేచావా?" అంది.

సుబ్బూ చిరునవ్వు నవ్వి "నేనూ నిన్ను ఆ ప్రశ్నే వేద్దామనుకున్నాను" అన్నాడు.

మహా అదివరలా పెంకిగానో, చిలిపిగానో అతనికి జవాబు చెప్పలేదు.

మగ్ అందుకుని కాఫీ సిప్ చేస్తూ "నీకు బాగానే వచ్చేసింది కాఫీ పెట్టడం" అంది నవ్వుతూ.

"థాంక్స్! ఫిల్టర్‌లో ఆల్ రెడీ డికాషన్ వుంది. పాలు వేడి చేసి కలిపాను. అంతే" అన్నాడు సుబ్బు తిరిగి తనూ నవ్వుతూ.

కాసేపు ఇద్దరి మధ్యా మౌనమే చోటు చేసుకుంది.

సూర్యుని తొలికిరణాలు పడి గోదావరి ఎర్రగా మెరుస్తోంది. దూరంగా జాలరి పడవలు సాగుతున్నాయి. ఆకాశంలో వెలుగు ఎరుపుని మింగే ప్రయత్నం చేస్తోంది.

ఎన్నిసార్లు చూసినా కన్నుల పండుగే ఆ దృశ్యాలు.

"సుబ్బూ!"

మహా మెత్తగా పిలిచింది.

"ఊ" అన్నాడతను.

మనుషుల మనసుల మీద వాతావరణం ఎంతో ప్రభావితమవుతుంటుంది.

చల్లగాలి వాళ్ళ శరీరాలకి తగిలి మనసుని ఆహ్లాదపరుస్తోంది.

"ఇక నువ్వు కౌశిక్ రాణీల జోలికెళ్ళకు"

మహా మాటలకి చాలా ఆశ్చర్యంగా చూశాడు సుబ్బు.

"అదేంటి వాళ్ళమీద కక్ష తీర్చుకోవడానికే కదా. నువ్వు మాలాంటి వాళ్ళ మధ్య వుండి ఇన్ని కష్టాలు పడుతున్నావు."

మహా సుబ్బూ వైపు చూసి తలదించుకుంది.

"సీతని చూశాక నాకు నిజమైన కష్టాలేమిటో తెలిసాయి. నువ్వూ, అమ్మాజీ, పాపాయమ్మ మామ్మ, ఇంకా అమ్మాణమ్మగారు వీళ్ళందరినీ చూశాకగానీ నాకు తెలియని ప్రపంచమొకటుందని తెలియదు. రాణీ, కౌశిక్ నాకు ద్రోహం చేసారు. నిజమే. వాళ్ళని చంపేసినా పాపం లేదని అనిపించింది నాకు. కానీ ఇప్పుడింత పనిగట్టుకుని వాళ్ళని విడదీస్తే నాకు ఒరిగేదేమిటి? నా కాలాన్ని మనసుని, నా డబ్బుని మంచిపనులకి ఉపయోగిస్తే కలిగే తృప్తి ఒక పగ తీర్చుకోవడంలో లేదనిపిస్తోంది. నేను అసహ్యించుకున్న మనుషుల మీద నేనింతకాలాన్ని వాడటం వేస్టుకదా!"

సుబ్బూ చాలా ఆశ్చర్యంగా విన్నాడు మహా మాటల్ని. తను ఏదయితే చెబుదామనుకున్నాడో ఆ మాటల్నే మహా నోటివెంట వినడం ఎంతో ఆనందాన్ని కలిగించింది అతనికి. సుబ్బూ ఆమె చేతిని పట్టుకుని మెత్తగా నొక్కాడు అభినందనపూర్వకంగా.

"మహా"

మహా తలెత్తి చూసిందతనివైపు.

"నేను సరిగ్గా ఏం చెబుదామనుకున్నానో ఆ మాటలే నీనోటివెంట విన్నాను. నాకు కూడా ఇక్కడకి రాకముందు ఈ ప్రపంచం తెలియదు. నేను నీ అంత ధనవంతుడ్ని కాకపోయినా మన్ననా మర్యాదలున్న మధ్యతరగతి కుటింబీకుణ్ణి. ఒక ఆవేశం నన్నిక్కడికి తీసుకొచ్చింది. నేను చేసే వృత్తి కోసం కొన్ని అలవాట్లు చేసుకోవాల్సి వచ్చింది. నాకు నీడనిచ్చిన కాళిదాసుగారికి వడ్డీలు వసూలు చేసే బాధ్యత స్వీకరించాను. పాపం, ఆయనా దుర్మార్గుడు కాదు. ఇప్పుడు వాళ్ళు కూడా ఆ పని వదిలేసారు. నేనూ నీలానే ఈ ప్రపంచంలోని మరో కోణాల్ని చూడటం తటస్థించింది. రాణీలాంటివారు, కౌశిక్‌లాంటి వారూ సొసైటీ అడుగడుగునా తారసపడుతూనే వుంటారు. వారికి ఎప్పుడూ పైకి ఎగబ్రాకాలనే ఆశే. దానికోసం వాళ్ళు స్నేహధర్మాన్ని, ప్రేమల్ని తాకట్టుపెడతారు. ఎప్పుడో, ఎక్కడో నిలువునా కూలతారు. అలాంటి వారిని స్మరించడం వృథా" అన్నాడు సుబ్బూ.

"అవును"

సుబ్బూ మహావైపు చూశాడు.

మహా టెర్రస్ మీద విచ్చుకున్న పూలవైపు చూస్తోంది. కానీ ఆమె దృష్టివాటి మీద లేదన్నది అతనికి అర్థమవుతోంది.

"మరిక నీవనుకున్న పనిఅయిపోయినట్లే కదా! వెళ్ళిపోదామనుకుంటున్నావా? మీ నాన్నగారిచ్చిన గడువు పూర్తవ్వడానికి మరో ఆరునెలల కాలం వుంది" అన్నాడు సుబ్బూ.

అలా మాట్లాడటానికి నిజంగా అతని గొంతు పట్టేసింది.

మహా అతనివైపు కళ్ళెత్తి చూసింది.

ఆమెకు ఏదో చెప్పాలని సుబ్బూని గట్టిగా కౌగిలించుకుని నిన్ను ప్రేమిస్తున్నానని... నిన్ను వదిలి వెళ్ళలేనని... ఇంకా ఏదో చెప్పాలనివున్నా ఒక్కమాట కూడా బయటకి రావడంలేదు.

"నాకు.. నాకు.. అక్కడికి వెళ్ళాలని లేదు సుబ్బూ" అంది మెల్లిగా.

"అలా ఎలా కుదురుతుంది? మీ నాన్నగారికిచ్చిన మాట గుర్తుతెచ్చుకో"

"మాట. ఏం మాట? నేను మేజర్ని. నా జీవితాన్ని నేను నిర్ణయించుకునే హక్కు నాకు లేదా? అక్కడికెళ్ళగానే ఆ చింబోతు వెధవకి నన్నిచ్చి పెళ్ళి చేయాలని చూస్తుంది మా మమ్మి. మళ్ళీ కథ మొదలవుతుంది. అక్కడ ఆమె మాట తప్ప ఎవరిదీ చెల్లదు." అంది మహా ఆవేశంగా.

"ఎంతయినా అమ్మేకదా మెల్లిగా యిష్టంలేదని నీ ఉద్దేశ్యం చెప్పి ఒప్పించు" అన్నాడు సుబ్బూ.

బదులుగా నిస్పృహగా నవ్వింది మహా.

"నీకు తెలియదు సుబ్బూ మా మమ్మీ గురించి. ఆమెకి స్టేటస్, డబ్బూ అంటే చాలా పిచ్చి. ఆ చింపాంజీగాడికి చెప్పలేని ఆస్తివుంది. అదొక్కటే వాడి క్వాలిఫికేషన్. ఆ డబ్బుతో వాణ్ణి అతి గారాబంగా పెంచారు. వాడికి చదువురాలేదు. వాడితో ఏం జీవితముంటుంది? అయినా వాడి ఆస్తికోసం మా మమ్మీ ఈ నిర్ణయం తీసుకుంది."

సుబ్బూ నిట్టూర్చాడు.

"ఇందులో నేను చెప్పడానికేముంది మహా! నేను మీ డాడీకి ఒక సంవత్సరం తర్వాత నిన్ను అప్పచెబుతానని మాట యిచ్చాను. దానికి కట్టుబడక తప్పదు కదా! అయినా ఎంతకాలం యిలా అజ్ఞాతవాసం చేస్తావు? నీకంటూ ఒక జీవితం వుండాలి కదా!"

మహా మాట్లాడలేదు.

సుబ్బూ ఆమె వైపే చూస్తున్నాడు.

"నీ ముక్కు ఎక్కడంటే మొహం చుట్టూ గిరికీలు కొడుతుందే కాని.. నిన్ను ప్రేమిస్తున్నానని ఒక మాట చెప్పదే? అసలు తనంటే ప్రేమవుందా?" అర్థమే కావడంలేదు సుబ్బూకి.

ఎండ చుర్రుమనిపిస్తుంటే పైకి లేచి "లోపలికి రా!" అన్నాడు సుబ్బూ లేచి నిలబడుతూ.

మహా అతనివెంట లోనికి నడిచింది మౌనంగా.

ఆ రోజు ఎలాగైనా దెబ్బలాడి అత్తగారిని బయటకి వెళ్ళడానికి ఒప్పించి లేవదీసింది లత.

"మాయదారి సంత. నడవలేను మొర్రో అంటే నా యెంటపడుతుంది యీ పిల్ల. ఈ కోడళ్ళకి పేమొచ్చినా పగొచ్చినా తట్టుకుని సావలేం" అంటూ గింజుకుని గింజుకుని చివరికి చీరసింగారించింది పాపాయమ్మ.

ఆ తతంగమంతా పకపకా నవ్వుతూ గమనిస్తోంది అమ్మాజీ.

అమ్మాణమ్మగారు, సరస్వతమ్మగారు కూడా చిన్నగా నవ్వుతూ పాపాయమ్మ మేకప్ గమనిస్తున్నారు.

"నేను తలదువ్వి ముడి చుట్టనా మామ్మా?" అంటూ విరగబడి మళ్ళీ నవ్వింది అమ్మాజీ.

సుబ్బూ కాళిదాసుగారింటి వెళ్తానని వెళ్ళడంతో మహా కూడా క్రిందకు వచ్చి ఆ తతంగాన్ని చిరునవ్వుతో వీక్షిస్తున్నది.

"నీకు బాగా ఎకసక్కాలెక్కువయ్యాయే. నాదొకతల మళ్ళీదాన్ని నువ్వు దువ్వడం. ఎక్కణ్ణుంచి తన్నుకొస్తుందే ఆ మాయదారి నవ్వు" అంటూ చేతిలోని దువ్వెనతో ఒక్కటిచ్చింది అమ్మాజీకి.

అమ్మాజీ నవ్వు ఆపలేదు "ఇప్పుడీ సీరలో అచ్చు యిందిరాగాందీలాగున్నావనుకో. కావాలంటే అద్దంతో సూసుకో" అంటూ మళ్ళీ పకపకా నవ్వింది.

"నిన్నీ బెడ్డిచ్చుకొట్టానంటే మూతీ ముక్కూ ఏకవయిపోతాయి. ఎదవసన్నాసి ఎదవ నువ్వూ యిది" అంటూ పాపాయమ్మ రాయికోసం వెదికింది.

ఇంతలో బయట వీర్రాజు ఆటో తెచ్చి హారన్ కొట్టాడు. వీర్రాజు పాపాయమ్మ దగ్గర దోసెల ఖాతాదారే.

"రాండి మామ్మగోరూ! అవతల నా బేరాలు పోతాయి" అంటూ గట్టిగా కేకేసాడు వీర్రాజు.

"పదండి పదండి" అంటూ లత అత్తగారి చెయ్యిపట్టుకుని లాక్కెళ్ళింది. అమ్మాజీ, లత కష్టపడి పాపాయమ్మని ఆటో ఎక్కించారు చిన్నగా.

అందరూ టాటా చెబుతుంటే ఆటో కదిలింది మెల్లిగా.

"ఎక్కడికండి? సినివాకా?" అనడిగాడు వీర్రాజు.

"కాదు కోటగుమ్మానికి పోనియ్" అంది లత.

"అక్కడికెందుకే?" అంది పాపాయమ్మ నీరసంగా.

లత నవ్వింది కానీ జవాబు చెప్పలేదు.

"భజన్‌లాల్ బంగారం షాపు దగ్గర ఆపు" అంది లత వీర్రాజుతో.

ఆటో షాపుముందాగింది.

"ఇక్కడికెందుకే?" అంది పాపాయమ్మ అర్థంకాక.

"చెబుతాను కదండీ" అంటూ వీర్రాజు సాయంతో పాపాయమ్మని ఆటోలోంచి దింపింది లత.

"నువ్వుండు. వెళ్ళిపోకు" అని వీర్రాజుని హెచ్చరించి చిన్నగా పాపాయమ్మని చెయ్యిపట్టుకుని లోనికి తీసుకెళ్ళింది లత.

షాపులో తోటి సేల్స్ గరల్స్, తదితరులు చిన్నగా నవ్వి "మీ అత్తగారా?" అనడిగారు లతని.

పాపాయమ్మ స్టూల్ మీద కూర్చోలేదని ఒకరు కుర్చీ తెచ్చి వేసారు.

పాపాయమ్మకి ఆ వాతావరణం సిగ్గుగా వుంది.

భయంగా కుర్చీలో కూర్చుంది. బిక్కుబిక్కుమని చూస్తూ.

లత చెప్పిన ప్రకారం పాపాయమ్మ వయసుకి తగిన దుద్దులు, గొలుసులు తెచ్చి చూపించిదొక అమ్మాయి.

ఏడురాళ్ళు దుద్దులు, గుళ్ళగొలుసులు, పలకసర్లు చూపించి అత్తా యిందులో ఏవి నచ్చాయో చెప్పు" అనడిగింది లత.

కోడలివైపు అయోమయంగా చూస్తూ "దేనికివన్నీ?" అనడిగింది పాపాయమ్మ.

"నీకే అత్తా. నీ చెవులు బోసిగా వున్నాయి. మెళ్ళో ఆ నల్లతాడసలు బాగోలేదు" అంది లత.

"మాయదారి సంత. అక్కళ్ళేవు, ఇక్కళ్ళేవు మురికి కాళ్ళకి మువ్వలపట్టీలన్నట్లు ఈ సోకులు సచ్చేదానికి నాకెందుకు. వయసు పిల్లవి నువ్వు కొనుక్కో" అంది పాపాయమ్మ విసుగ్గా.

"ష్! గట్టిగా మాట్లాడకత్తా. చెప్పు పలకసర్లయితే గుచ్చుకుంటుంది. ఈ గుళ్ళగొలుసు తీసుకుంటా" అని ఒక పేట గుళ్ళగొలుసు. ఏడురాళ్ళ దిద్దులు తీసుకుంది.

ఇంతలో భజన్‌లాల్ తమ్ముడొచ్చాడు నవ్వుతూ.

లత లేచి నిలబడి నమస్కరించింది వినయంగా. పాపాయమ్మ కూడా లేవబోయింది.

కూర్చోండి, కూర్చోండి. మీరిప్పుడు మా కస్టమర్స్. ఇవి నచ్చాయా? అని వాటికి తరుగు, మజూరి లేకుండా రేటు కట్టించాడాయన. ఆ తర్వాత లత నెలవారీ బంగారానికి కడుతున్న డబ్బుని మినహాయించి బిల్లు వేయించాడు.

లత వాటిని తీసుకుని పాపాయమ్మని ఆటో ఎక్కించి దేవీ చౌక్‌కి పొమ్మని చెప్పింది వీర్రాజుకి.

"నాకెందుకే ఇయ్యన్నీ రేపోమాపో సచ్చేదాన్ని" అంటూ దారి పొడుగునా గొణుగుతూనే వుంది పాపాయమ్మ.

దేవీ చౌక్‌లో అమ్మవారికి పూజచేయించి, అక్కడే పాపాయమ్మ మెడలో గొలుసు వేసి, చెవులకి దిద్దులు పెట్టింది లత.

పాపాయమ్మ కోడలి బుగ్గలు ప్రేమగా పుణికి "నా తల్లి! నిన్ను ఆడిమీద పేవతో తిట్టిపోసేదాన్ని. ఆడికెన్ని ఎదవేసాలున్నా దాచి పెట్టి నిన్ను మోసం చేసి పెళ్ళి చేసాను. ఏదో ఆడు బాగుపడతాడని ఆస. ఇన్నాళ్ళకి ఆ సుబ్బు పున్నేన నాలుగు మెతుకులు తింటున్నాం" అంది కన్నీళ్ళతో.

"అవన్నీ తలచుకోకండి. తలరాతలు ఎవరూ మార్చలేరు" అంటూ పాపాయమ్మని ఆటోలో కూర్చోబెట్టి పక్క మిఠాయి షాపులో ఒక కేజి మిఠాయి తీసుకుని ఆటో ఎక్కింది లత.

పాపాయమ్మ కోసం ఎదురు చూస్తూ బయటే కూర్చున్న అమ్మాజీ జిగేల్ మంటున్న పాపాయమ్మని చూసి కేరింతలు కొడుతూ "ఓరిదేవుడో యిందిరాగాందీలా ఎల్లి పాత సినిమాలో కన్నాంబలా వచ్చేసేవేంటి మామ్మా!" అంటూ నవ్వింది.

"సాల్లేవె ఎదవ్వాగుడూ నువ్వూను. ఈ పిల్ల వద్దంటున్నా సచ్చే వయసులో నాకీ సోకులు సేసింది" అంటూ లోపలికి నడిచింది.

"నిజం మామ్మా మహారాణీలా వున్నావు. లతా, భలే చేసావు నువ్వు" అంది అమ్మాజీ మెచ్చుకోలుగా.

లత అందరికీ స్వీట్స్ పంచింది.

అమ్మాణమ్మ, సరస్వతమ్మగారు కూడా లతని అభినందించారు.

మహా కూడా క్రిందకి దిగొచ్చి పాపాయమ్మని కౌగలించుకుని ముద్దుపెట్టుకుని "బాగున్నావ్ మామ్మా లవ్‌లీ" అంది ప్రేమగా.

ఎన్నో ఏళ్ళ తర్వాత ఎండిపోయిన గుండెలో తడి కదిలి పాపాయమ్మ కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

సుబ్బూ కొన్ని పళ్ళు కొనుక్కుని మొదట సీత దగ్గరకెళ్ళాడు.

సుబ్బూని చూసి సీత లేచి నిలబడింది.

"అక్కా, కూర్చో వంట్లో ఎలా వుంది? ఇక్కడెలా చూసుకుంటున్నారు?" అనడిగాడు.

సుబ్బూ తనని 'అక్కా' అని పిలుస్తుంటే ఆమె కళ్ళు నీళ్ళతో వెల్లువయ్యాయి. వాటిని వత్తుకుంటూ" శానా బాగా సూసుకుంటున్నారు సారూ! ఏళకి మందులిస్తన్నారు. మంచి ఒణ్ణమే ఎడతన్నారు. మొన్నావద్య మహ అమ్మగోరు కూడా వచ్చి సూసి కర్సులకి వద్దన్నా డబ్బులిచ్చి ఎల్లారు" అంటూ చెప్పింది సీత.

అంతలో ఎవరో వచ్చి "ఏవే ఉమ్మడి సీతా, నిన్నెవరో పిలుస్తున్నారే! సూడ్డానికొచ్చారు" అని చెప్పి వెళ్ళింది.

"ఉండు సారు," అంటూ సీత వెళ్ళి మరో పదినిముషాల్లో తిరిగొచ్చింది.

"అక్కడ ఇంటాయన అద్దెకోసం వచ్చాడు" అని చెప్పింది సీత.

నిలబడ్డ సీతని "కూర్చో అక్కా" అన్నాడు సుబ్బు.

అతనామెకేసి కాసేపు నిశితంగా చూసి "మీ ఇంటిపేరు 'ఉమ్మడా' అనడిగాడు.

బదులుగా సీత తలదించుకుంది.

ఆమె కళ్ళనుండి బొటబొటా కన్నీళ్ళు కారాయి.

"సారీ, తప్పు మాట్లాడానా?" అన్నాడు సుబ్బూ కంగారు పడుతూ.

"లేదు సారూ, నా బతుకే గుర్తొచ్చి ఏడుస్తున్నా. అన్ని కతల్లాంటిదే నాదీనూ. మా నాన్న తాగుడు, బీదతనం, ఎనక సంతానం- మా నాన్నే బలవంతంగా తన్ని నాచేత ఎబిచారం చేయించాడు. ఆ తర్వాత డబ్బు కోసం దుబాయి పంపేసాడు. అక్కడ నానా కట్టాలూ పడి, పంపిన డబ్బులతో యాళ్ళు బాగుపడ్డారు. జబ్బులతో వచ్చిన నన్ను యీదిలోకి యీడ్సేరు. ఇలా నాలుగిళ్ళలో పనిసేసుకుని బతికే నన్ను సూస్తే అందరికీ ఏళనే. అందుకే నన్నలా పిలుస్తారు. అన్నీ సచ్చినదాన్ని. ఇంకేటి పౌరుసం. ఎలా పిల్చినా పలుకుతాను" అంది ఏడుస్తూ.

సుశీల కథ విని సుబ్బు కళ్ళు తడయ్యాయి.

"ఈసారి ఎవరన్నా అలా పిలిస్తే ఈడ్చి కొట్టు. నీకు నేనున్నాను" అన్నాడు సుబ్బూ.

అతని మాటలు విని తెల్లబోయింది సీత. ఆ వెంటనే ఆమె కళ్ళు ఆనందంతో మెరిసాయి.

'వస్తా' అంటూ వెళ్తున్న సుబ్బూని ఆరాధనగా చూసింది సీత.

సుబ్బూ ఇంటికి తిరిగి రాగానే మహా మొహం వికసించింది.

"వచ్చావా! ఈరోజేం జరిగిందో తెలుసా?" అంటూ పాపాయమ్మ గొలుసు వ్యవహారం అంతా చెప్పి నవ్వింది మహా.

సుబ్బూ కూడా చిన్నగా నవ్వాడు.

"పోనీలే. వాళ్ళిద్దరికీ ఎప్పటికీ కుదరదనుకున్నాను. ఆ శనిగాడు వెళ్ళాక ఆడవాళ్ళిద్దరూ హాయిగా వున్నారు" అన్నాడు.

"నిజం సుబ్బూ, అసలీ వెధవలందరూ పెళ్ళెందుకు చేసుకుంటారో అర్థంకాదు" అంది మహా విచారంగా.

"ఇదంత తేలికైన వ్యవహారం కాదు చర్చించడానికి. పెళ్ళి గురించి అందులో మంత్రాల అర్థం పరమార్థం గురించి మనవాళ్ళు చాలా లెక్చర్లే యిస్తారు కానీ అలా శాస్త్ర ప్రకారం జీవించేవాళ్ళు చాలా అరుదు మహా. పెళ్ళాం అంటే అయాచితంగా పనిచేసిపెట్టే దాసి, పిల్లల్ని కనే యంత్రం. తన కోపతాపాల్ని చూపించి తన్నడానికి, తిట్టడానికి పనికొచ్చే ఒక వస్తువు. డబ్బు అవసరమైనప్పుడు పుట్టింటికి పరిగెత్తుకెళ్ళి తెచ్చే కామధేనువు. తను వ్యసనాలతో తాగి పడుకున్నా పనిచేసి డబ్బులు తెచ్చి పెట్టే, వండి పెట్టే మరమనిషి, ఇంకా చాలా వున్నాయిలే. నీకివన్నీ అర్థంకావు. నువ్వు గురజాడవారి కన్యాశుల్కం చదివేవా?"

"ఆయనెవరు?" అనడిగింది మహా అమాయికంగా.

సుబ్బూ తలబాదుకుని "నిన్నడగడం నాదే బుద్ధి తక్కువ. అయినా మీలాంటి రిచ్‌కిడ్స్‌కి ఆ పుస్తకాలతో పనేంటి? మీకు తెలియని సమాజం, కష్టాలు చాలా వున్నాయి బేబీ" అన్నాడు సుబ్బూ నవ్వుతూ.

మహా నవ్వలేదు.

"నిజమే. నాకేం తెలియదు. నాకు తెలుగు అక్షరాలు కూడా రావు. కానీ యిక్కడ కొచ్చాక చాలా చూశాను సుబ్బూ! ముందివన్నీ అర్థం కాలేదు కానీ అమ్మాజీని, సీతని, పాపాయమ్మ మామ్మని వీళ్ళందర్నీ చూశాక నాకు నిజంగా ఏడుపొస్తుంది. పాపం సీతని చూస్తే చాలా బాధనిపిస్తుంది" అంది వేదనగా.

సుబ్బూ మహావైపు సాలోచనగా చూశాడు.

"నువ్వు సీత దగ్గరకెళ్ళేవటకదా! సీత చెప్పింది" అన్నాడు.

"నువ్వు సీత దగ్గర కెళ్ళావా?"

"అవును. ఒకసారి సీతని చూసి కాళిదాసుగారింటికి వెళ్దామనుకున్నాను. కానీ సీత కథ విన్నాక నేను ఎక్కడికీ వెళ్ళలేక వెనక్కి వచ్చేసాను"

మహా అతని వైపే చూస్తోంది.

సుబ్బూ టూకీగా సీత గురించి చెప్పేసరికి ఆమె తెల్లబోయింది.

"అలాంటి తండ్రికూడా వుంటాడా?" అంది ఆశ్చర్యపోతూ.

"మన దేశంలో అలాంటి వాళ్ళు కో కొల్లలు. మనవన్నీ శ్రీరంగనీతులు. పైకి వల్లించేవి ఒకటి - లోపల చేసేవి వేరొకటి. అందుకే నాకి నీతులు వల్లించేవాళ్ళు, శాస్త్రాలు అడ్డం పెట్టుకుని బ్రతికేవాళ్ళంటే అసహ్యం. న్యాయం వేరు. ధర్మం వేరు. న్యాయం స్థిరంగా వుంటుంది. ధర్మం కాలమాన పరిస్థితులకనుగుణంగా మారుతుంటుంది"

సుబ్బూ ఆవేశంగా చెబుతుంటే మ్రాన్పడి చూసింది మహా.

"నీకు చాలా తెలుసు సుబ్బూ" అంది ఆరాధనగా. సుబ్బూ బదులుగా పకపకా నవ్వేసాడు.

"మరీ అంత ఊహించుకోకు. మాడేడీ ఇవన్నీ చదివారు. ఆయన దగ్గర ఒక చిన్న లైబ్రరీ వుంది. వాటిని అప్పుడప్పుడు నేను చదువుతుండే వాణ్ణి. అంతే"

"నాకు తెలుగు నేర్పుతావా?"

"అలాగే రేపు అమ్మాజీతో వెళ్ళి పలకా, బలపం కొని తెచ్చుకో" అంటుండగానే అమ్మాజీ వచ్చింది "ఏంటన్నా నాగురించి మాట్లాడుకుంటున్నారూ?" అంటూ.

❦❦❦

"**మహా తెలుగు** నేర్చుకుంటుందంట.." అమ్మాజీ వైపు తిరిగి నవ్వుతూ చెప్పాడు సుబ్బూ.

అమ్మాజీ అదివరకులా నవ్వలేకపోయింది. మొగమాటంగా నవ్వుతూ నిలబడింది.

ఆమె మొహం చూస్తే ఏదో చెప్పాలని చెప్పలేక నిలబడిపోయిందని అర్థమయ్యింది మహాకి.

ఎంత ఐశ్వర్యంలో పుట్టినా హృదయమున్న ఆడపిల్లలు ఎదుటివారి హృదయాన్ని ఇట్టే అర్థం చేసుకోగలుగుతారన్న దానికి ప్రతీక మహా. అక్కడవున్న ఇన్ని నెలల్లో మహా తనకి తెలీని ప్రపంచం ఒకటుందని అర్థం చేసుకుంది.

ట్రిమ్ చేసి పెంచిన పూలతోటల్లా, అన్నీ కృత్రిమంగా అమర్చిన స్టార్ హోటల్లాంటి తమ బ్రతుకులకి అసలైన జీవన సౌందర్యం దానిలోని అనుభూతులసలు తెలియవని గ్రహించింది.

"అమ్మాజీ ఏం జరిగింది?" అంది ఆదుర్దాగా.

బదులుగా అమ్మాజీ కళ్ళనుండి కన్నీరు జలజలా రాలింది. ఆ పిల్లకి అన్నిటికీ పకపకా పళ్ళికిలించి నవ్వటంతోపాటు కష్టానికి కడవలకొద్దీ కన్నీరు కార్చడం కూడా తెలుసని సుబ్బూ ఏనాడో గ్రహించాడు.

సుబ్బూ కంగారుగా లేచి అమ్మాజీ భుజమ్మీద చెయ్యేసి అనునయంగా పక్కన కూర్చోబెట్టుకుని "ఏం జరిగింది అమ్మాజీ?" అని అనునయంగా అడిగాడు.

బదులుగా వెక్కెక్కి ఏడ్చింది అమ్మాజీ. ఆమె దుఃఖం తీరేవరకూ సుబ్బూతో సహా మహా కూడా కిమ్మనకుండా కూర్చున్నారు. కొన్ని నిముషాలకి అమ్మాజీ కొంగుతో కళ్ళు తుడుచుకుని వీళ్ళిద్దరి వైపు చూసి సిగ్గుపడుతున్నట్లుగా నవ్వింది.

"అసలు ఏమయ్యిందో ముందు చెప్పు" అన్నాడు సుబ్బూ.

"అతనికి బాగోలేదంట"

"అతనా?" సుబ్బూ సుబ్బూ అర్థం కానట్లుగా అడిగాడు.

అమ్మాజీ ఏం చెప్పాలో తెలియక తలదించుకుంది. మహాకి అర్థమయింది.

"అంటే... వాళ్ళ హజ్బండ్ అనుకుంటా" అంది మహా చిన్నగా.

సుబ్బూ అర్థంకానట్లుగా చూసి "ఏంటీ అమ్మాజీకి భర్త వున్నాడా... బ్రతికి" అన్నాడు ఆశ్చర్యంగా.

మహా చిన్నగా జరిగిందంతా సుబ్బూకి చెప్పింది టూకీగా. అదంతా విని సుబ్బూ మొహం కోపంతో జేవురించింది.

"అయినా కోపాన్ని అదుపు చేసుకుంటూ "ఎవరు మోసుకొచ్చారీ వార్తను?" అన్నాడు చాలా ఓపికగా.

"వాళ్ళావిడ" తలదించుకుని చెప్పింది అమ్మాజీ.

"ఇప్పుడు నీకెందుకీ వార్త చెప్పడం...?"

"అంటే... అతను...అతను పక్షవాతంతో మంచం మీద తీసుకుంటున్నాడు. నోరుకూడా పడిపోయింది. ఈవిడ పోలియో మనిషి కొడుకు అమెరికాలో వున్నాడు. కూతురు కాపురం చేసుకుంటున్నది అంది అమ్మాజీ నసుగుతూ.

మహాకి, సుబ్బూకి అర్థమైంది. ఇప్పుడు అమ్మాజీ సేవలు అతనికి కావాలి.

అందుకోసమే ఈ రాయబారం.

"నిన్ను నీ దారికి వదిలేసి తన మానాన్న తాను కాపురం చేసుకుంటున్న ఆ పెద్దమనిషి కోసం నువ్వు బాధపడుతున్నావా? వద్దమ్మాజీ! ఇక ఆ రొంపిలోకి వెళ్ళకు. వాళ్ళ తిప్పలు వాళ్ళు పడతారు" అన్నాడు సుబ్బూ.

"అతని తప్పేముంది అన్నా. మా వాళ్ళే నానా యాగీ చేసి నా బతుకు ముదనష్టం చేసారు. ఇలాంటప్పుడు చూడకుండా ఎలా?" అంది కన్నీళ్ళతో.

సుబ్బూ ఆమెవైపు నిస్సహాయంగా చూశాడు.

తరతరాలుగా స్త్రీ మెదళ్ళని పూర్తిగా దొలిచి తీసేసి అందులో మూర్ఖత్వాన్ని, అసహాయతని, చేతకాని తనాన్ని, భయాన్ని కూరేసి విజయం సాధించింది ఈ పురుషాధిక్యత ప్రపంచం. చదువుకున్న వారే వాటినుండి బయటపడలేనప్పుడు చదువు సంధ్యలు లేని ఒక దిగువ వర్గానికి చెందిన ఈ అమాయకురాలు తను ప్రేమించి, నమ్మిన వ్యక్తికి తప్పునెలా ఆపాదించగలదు.

పిల్లకోసం, కట్టుకున్న వాడికోసం సర్వం త్యాగం చేస్తూ తనకంటూ తాను మిగలని స్త్రీలనే సమాజం గౌరవిస్తుంది. ఆ గౌరవం కోసం స్త్రీలు తమ సంతోషాన్ని, సుఖాన్ని త్యాగం చేయాలి.

"సరే! ఇప్పుడేం చేయాలనుకుంటున్నావు"

"కొన్ని రోజులు వెళ్ళొస్తాను" అంది అమ్మాజీ మెల్లిగా.

సుబ్బూ, మహా మొహమొహాలు చూసుకున్నారు.

"నీ యిష్టం అమ్మాజీ. కానీ ఒక్కమాట. అక్కడేమాత్రం బాగోకపోయినా తిరిగి వచ్చేయి. ఇక్కడ నేనున్నానని మరచిపోకు" అన్నాడు సుబ్బూ.

ఆ మాటకి చాలాసంతోషించింది మహా.

"అవును అమ్మాజీ. నీకు మేమెప్పుడూ వున్నాం" అంది.

అమ్మాజీ తలూపింది కన్నీళ్ళతో.

అమ్మాజీ బయలుదేరుతుంటే క్రిందకి వచ్చారు సుబ్బూ, మహా సాగనంపడానికి.

ఈ సంగతి తెలిసి పాపాయమ్మ బయటకొచ్చింది పడుతూ లేస్తూ.

"ఓసి నీ దుంపతెగ! ఎక్కడికే? నిన్ను గాలికీ దూళికీ వదిలేసిన ఆ తొత్తుకొడుక్కి సేవ చెయ్యడానికి ఎల్తన్నావంటే? నేలకి పోయేది నెత్తికి రాసుకోటమంటే ఇదేనే పిచ్చిముండా! ఏదో లేసులల్లి నాల్రూపాయలు సంపాదించుకుంటున్నావు. దేవుడిచ్చిన అన్న సుబ్బూ వుండనే వున్నాడు. ఇంక పాపగోరు సరేసరి. నా మాటిను. ఎల్లొద్దే" అంటూ రాగాలు తీసింది.

అమ్మాణమ్మగారు, సరస్వతమ్మగారు కూడా ఇష్టంలేనట్లుగానే నిస్పృహాయంగా చూశారు. అయినా ప్రేమలో వున్న విషాన్ని పూర్తిగా తలకెక్కించుకున్న అమ్మాజీ ఎవరి మాటా వినలేదు.

"మళ్ళీ వచ్చేస్తా మామ్మా" అంటూ ఆటో ఎక్కింది.

అమ్మాజీ నిష్క్రమణతో అక్కడ అందరూ కన్నీళ్ళతో డీలాపడి ఎక్కడివాళ్ళక్కడే కూలబడిపోయారు. చెప్పలేని నిస్త్రాణ, దుఃఖం అందర్నీ ఆవరించేసింది. తన దుఃఖాన్ని, ఒంటరితనాన్ని తెలియనివ్వకుండా అందరి తలలో నాలుకలా తిరిగిన అమ్మాజీ ఆ బిల్డింగులో ప్రాణవాయువులాంటిదని అందరికీ అర్థమయ్యింది.

సుబ్బూ మొదటిసారిగా కన్నీళ్ళతో మంచానికి అడ్డంగా పడుకున్నాడు.

మహా కూడా చాలా నిస్తేజంగా మారిపోయింది.

ఆ బిల్డింగ్‌లోకి రాగానే తనని ఆదుకుని తనతోనే వున్న నెచ్చెలి అమ్మాజీ.

"మహా, మహా, అమ్మాజీ ఇలా చేసిందేవిటి మహా!" అన్నాడు బాధగా.

మహా కూడా అదే దుఃఖంలో వుంది.

"అవును సుబ్బూ.. నాకేడుపొస్తున్నది" అంది మహా ఏడుస్తూనే.

"ఛీ! ఇలా ఏడుస్తూ కూర్చోలేం. ఏదైనా సినిమాకెళ్దాం పద" అన్నాడు సాయంత్రం సుబ్బూ మహాతో.

మహా వెంటనే సుబ్బూతో బయలుదేరింది ఏ సినిమాకి అని అడక్కుండానే.

గాలాడక పాపాయమ్మ గట్టెక్కి కూర్చున్నది తాటాకు విసనకర్రతో విసురుకుంటూ. పక్కనే సరస్వతమ్మగారు, అమ్మాణమ్మగారు కూడా కూర్చున్నారు. వీధి మొహం చూడకుండా లోపల గదిలోనే మగ్గిపోయిన అమ్మాణమ్మగారు కూడా ఈ మధ్య కాస్త మాట్లాడుతూ వీధిలోకి వస్తున్నారు. సరస్వతమ్మగారు పురాణాలు బాగా చెబుతారు. కానీ వాటిని మనుషుల్ని మరింత మూర్ఖంగా తయారు చెయ్యడానికి కాకుండా సమకాలిక పరిస్థితులకి అన్వయించి వాటిని ఎప్పుడెలా స్వీకరించాలో కూడా చెబుతుంటారు.

వాటిని విని విని పాపాయమ్మ కూడా చాలా మారింది.

"ఆ గడ్డాల సచ్చినోడికి అంత అందవైన పెళ్ళావెందుకమ్మా" అని పాపాయమ్మ అహల్య గురించి విని తిడుతుంటే అమ్మాణమ్మగారు కొంగు అడ్డం పెట్టుకుని నవ్వుతుంటారు.

చీకటి బాగా కమ్మేసాక సరస్వతమ్మగారు, అమ్మాణమ్మగారు లోనికెళ్ళిపోయారు.

పాపాయమ్మ కూడా కోడలు పిలిస్తే ఇంత తిని "ఈ పిల్ల ఎల్లిపోయి ఇల్లు సీకటి సేసేసిందనుకో" అంటూ అమ్మాజీని తలచుకుంటూ మళ్ళీ వాకిట్లో కొచ్చి కూర్చుంది.

రోడ్లు నిర్మానుష్యంగా తయారవుతున్నాయి. అప్పుడప్పుడూ ఆటోలూ కారులూ తిరుగుతున్న శబ్దం. గోదావరి గాలికి పాపాయమ్మకి కళ్ళు మూతపడుతున్నాయి. అప్పుడే సరిగ్గా మెడలో గొలుసు ఎవరో లాగుతున్నట్లనిపించి కళ్ళు తెరిచింది.

ఎదురుగా రామక్రిష్ణ.

"ఒరి సచ్చినోడో! తల్లి మెళ్ళో గొలుసే దొంగతనం సేస్తావా? నీ కడుపుకాల" అంటూ గోలగోలగా అరిచింది పాపాయమ్మ.

అందరూ గబగబా పాపాయమ్మ అరుపులకి బయటకొస్తుంటే రామక్రిష్ణ పారిపోబోయాడు.

సరిగ్గా అప్పుడే బైక్ దిగిన సుబ్బూ రామక్రిష్ణని ఒడిసిపట్టుకున్నాడు.

"నన్నొదిలేయండి. మీకు దణ్ణవెడతా!" అంటూ గింజుకుంటున్నాడు రామక్రిష్ణ.

"ఆణ్ణొదలకు సుబ్బూ. ఆణ్ణి పోలీసులకప్పజెప్పు. ముందు ఫోను కొట్టు" అంటూ గీ పెట్టింది పాపాయమ్మ.

లతకూడా వచ్చి నిలబడింది నిస్తేజంగా చూస్తూ. చుట్టూ జనం మూగారు.

"ఇదేం బతుకురా..సీ!" అన్నారొకరు ఏవగింపుగా.

అందరూ తలోరకంగా తిడుతున్నా ఏ మాత్రం సిగ్గుపడటం లేదు రామక్రిష్ణ.

"ఏం జెయ్యమంటారు? ఈ ఆడంగులిద్దరూ కలిసి నన్ను బయటగ్గెంటేసారు. అదేమో బలాదూరు తిరుగుతుంది. దీన్ని వల్లో ఏసుకోటానికి ఒక గొలుసు సేయించి మెళ్ళో ఏసింది. నాకసయ్యమేసి తీసెయ్యబోయాను. ఈ ముసిల్దేమో 'దొంగ దొంగని' కావాలని అరుస్తోంది."

"సీ! నీ మొకం తగలెట్ట! సిగ్గులేదంట్రా? అలా మాట్టాడ్డానికి. పుట్టిన కాణ్ణుంచి దొంగబతుకే నీది. తల్లిని కాబట్టి దాసిపెట్టి కాసుకున్నాను. సుబ్బూ ముందాణ్ణి పోలీసులకి అప్పజెబుతావ లేదా? అంటూ అరిచింది పాపాయమ్మ.

"ఏంటే మాటాడితే పోలీసులంటున్నావు. కొడుకని యిది లేకుండా. ఏంటి మదరిండియాలో నర్గీసుననుకుంటున్నావా? నీకేం బౌమతులివ్వరే ముసిల్దానా!" అన్నాడు రామక్రిష్ణ సిగ్గులేకుండా.

సుబ్బూ మాత్రం పోలీసులకి ఫోను చెయ్యలేదు.

"ఇదిగో రామక్రిష్ణా పోలీసుల్ని పిలవడం పెద్ద పనేం కాదు. ఆ తర్వాత పాపాయమ్మ తప్పక బాధపడుతుంది. అమ్మ మనసేంటో నాకు తెలుసు. నిన్నక్కడ మక్కెలిరగదన్నుతారు. ఇంతమంది నిన్ను ఛీ కొట్టారు. నీదీ ఒక బ్రతుకేనా? కాళ్ళూ చేతులూ అన్నీ బాగానే వున్నాయి. ఏదైనా పనిచేసుకోవచ్చుకదా! కష్టపడి పని చేస్తున్న లతని భార్యని చూడకుండా అన్ని మాటలంటున్నావు. ఆడవాళ్ళకి కేరక్టర్ ఎసాసినేట్ చేస్తే కుమిలి పోతారని కదా నీ ప్లాన్. ఆ రోజులు పోయాయి. భార్యకి శీలం లేదంటే ఆ భర్త వుత్త వెధవని అర్థం. తెలిసిందా?" అన్నాడు సుబ్బూ.

రామక్రిష్ణ తలదించుకున్నాడు.

"వాడు నంగి వేషాలు చూసి నమ్మకు సుబ్బూ. ముందాణ్ణి పోలీసులకప్పగించు" అంది పాపాయమ్మ.

"ఇది నీకు లాస్ట్ ఛాన్స్. నువ్వెక్కడికీ తప్పించుకోలేవు. ఈసారి నేనే వళ్ళు చీరేస్తాను. ఏదయినా కష్టపడి పనిచేసి చెడు అలవాట్లు మానేస్తే నేనే నిన్ను ఇంట్లోకి రానిస్తాను. లేదంటే జైలే" అన్నాడు సుబ్బూ.

బదులుగా రామక్రిష్ణ ఏడుస్తూ "అన్నం లేదుసార్! ఆకలేస్తోంది" అన్నాడు.

ఆ మాట విని వెంటనే పాపాయమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని అలానే అదుముకుంటూ మౌనంగా నిలబడింది.

సుబ్బా జేబులోంచి కొంత డబ్బు తీసి రామక్రిష్ణకిచ్చి "పో! అన్నం తిను. ఇటువేపు రాకు. మళ్ళీ వచ్చి పిచ్చి వేషాలేస్తే ఈసారి ఎవరు చెప్పినా వినను" అన్నాడు.

రామక్రిష్ణ కళ్ళు తుడుచుకుని డబ్బు తీసుకుని "నన్ను సెమించే అమ్మా" అంటూ వెళ్ళిపోయాడు.

సుబ్బా మహాతో మేడమీదికి వెళ్ళిపోయాడు.

అందరూ లోనికెళ్ళిపోయినా పాపాయమ్మ ఆ మెట్టుమీద అలానే కూర్చుంది.

లత వచ్చి పక్కనే కూర్చుని "రా అత్తా, పడుకుందువిగాని" అంది మెల్లిగా.

బదులుగా పాపాయమ్మ వెక్కెక్కి ఏడ్చింది.

"ఎక్కడి న్రిదే వాడు ఆకలేస్తందన్నాడు కదా. ఆ మాటకి నా పేగులన్నీ ముక్కలయిపోయాయే. ఏం కర్మే ఆడికి" అంది.

లత జవాబు చెప్పలేకపోయింది.

ఆ యిద్దరూ గుండెబరువుతో అలా ఎంతసేపు కూర్చున్నారో.

అమ్మాజీని చూడగానే కాంతం క్రరపోటుతో కుంటుకుంటూ వచ్చి కౌగిలించుకుని బావురుమంది. ఆ స్పర్శ అమ్మాజీకి ఎలాంటి ఆనందం యివ్వకపోగా ఏదో తగలరానిది ఒంటికి తగిలినట్లుగా చిన్న కంపరం కలిగించింది.

"అక్కా, ఆయన చూశావా ఎలాగయిపోయారో" అంటూ ఏడ్చింది కాంతం.

అమ్మాజీ నిస్తేజంగా చూసింది.

"అక్కా" అన్న పిలుపు చాలా ఎబ్బెట్టుగా అనిపించింది.

ఏదో వినకూడని శబ్దంలా వుంది.

ఒకప్పుడు తనకొక పదిరూపాయలు చాటుగా సత్యం యిచ్చాడని తెలిసి వూరూ వాడా ఏకం చేసి బంధువుల్ని పిలిచి నానాయాగీ చేసిన కాంతం యిప్పుడు తనని అక్కా అనిపిలుస్తున్నది.

అమ్మాజీ యాంత్రికంగా సత్యం పడుకున్న గదిలోకి వెంబడి నడిచింది. అతన్ని చూడగానే గుండెఝల్లుమన్నది అమ్మాజీకి. ఇతను.. ఇతనేనా తను ప్రేమించిన సత్యం. పెద్దపెద్దకళ్ళతో ఆ కళ్ళనిండా కొంటె చూపులతో ఉంగరాల జుత్తుతో మంచి ఒడ్డూపొడుపుతో వుండి తనని మురిపించి, మైమరపించిన సత్యం ఇతనా? బట్టతలతో నెరసిన కొద్దిపాటి జుత్తుతో ఒక కన్ను పెద్దదిగా నిలబడిపోయి, మూతివంకరపోయి, ఒక చెయ్యికాలు చచ్చుబడి వున్న యితనా ఆ సత్యం.

అతని నోటినుండి చొంగ కారుతుంది. అమ్మాజీ ధైర్యం చేసి అతని ఎదురుగా కుర్చీలో కూర్చుంది. ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. అతను ఏదో అనాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. మాట పెగలక నిస్సహాయతతో అతని కళ్ళవెంబడి నీరు కారుతోంది.

అమ్మాజీ వూరడిస్తున్నట్లుగా అతని చేతిమీద చెయ్యివేసింది.

"నేనిప్పుడే కాఫీ తెస్తానక్కా" అంటూ కాంతం బయటకెళ్ళింది.

"వూరుకోండి.. వూరుకోండి. తగ్గపోతుందిగా" అంది అమ్మాజీ.

బదులుగా సత్యం కూడా కదులుతున్న తన మరో చేతిని ఆమె చేతిమీద వేసి గట్టిగా పట్టుకున్నాడు.

కాంతం పనిపిల్ల చేత కాఫీ పట్టించుకుని వచ్చి మరో కుర్చీలో కూర్చుంది.

అమ్మాజీ కాఫీ తాగుతుంటే కాంతం మాట్లాడటం మొదలెట్టింది.

"ఉన్న ఒక్కడూ అమెరికాలో వూరేగుతున్నాడు. రమ్మంటే సెలవులేదు కుదరదంటున్నాడు. ఎంతడబ్బుపోసి పంపాం. ఏవన్నా గుర్తా.. పాడా? ఇక కూతురుందంటే.. వూళ్ళో వూరయినా అత్తగారింత పొడుగున సాగదీస్తది. అయినా వచ్చిందంటే నాకేం సుఖంలే అక్కా. దానికే నేను చెయ్యాలి. ఆస్పత్రిలో వున్న నాల్రోజులు రమ్మని తమ్ముణ్ణి బతిమిలాడాను. ఏదో ఆస్పత్రిలో వున్న నాల్రోజులు నిప్పుల మీద నిలబడ్డట్టు నిలబడి ఎల్లిపోయాడు. ఏదో చిన్నప్పుడు అన్నలూ తమ్ముళ్ళూ కాని పెళ్ళిళ్ళయ్యాక మనమేం గుర్తుంటాం" అంటూ వాపోయింది కాంతం.

అమ్మాజీకి వాళ్ళకి తన అవసరం ఏంటో తెలిసిపోయింది. అయినా ఏమీ అనలేదు.

అతని వళ్ళంతా శుభ్రం చేయడం దగ్గర్నుండి అతన్ని ప్రభుత్వాస్పత్రికి ఫిజియోథెరపీకి తీసుకెళ్ళి తీసుకురావటం - సమస్తం ఆమె డ్యూటీలో భాగమైపోయాయి.

అయినా సత్యం మీద ప్రేమతో ఆమె అవన్నీ భారంగా భావించకుండా చేయడం మొదలెట్టింది.

కాంతం సత్యం పెట్టిన పచారీ షాపుకెళ్ళి కూర్చుంటున్నది.

ఆమెకిప్పుడు ఎంతో రిలీఫ్.

అడిగినవారందరికి "ఎన్నాళ్ళని సాపు కట్టేసుక్కూర్చుంటాం. పనిమడిసిని పెట్టేసాం" అని చెప్పడం మొదలెట్టింది కాంతం.

ఆ రోజు సాయంత్రం మహా - సుబ్బూ కలిసి సీత వున్నచోటకి వెళ్ళారు. నిజానికి అమ్మాజీ వెళ్ళాక వారినొక శూన్యం ఆవరించినట్లయింది.

స్త్రీ సదన్ వార్డెన్ మాణిక్యాంబకి వీరిని చూడగానే ఒక పెద్ద ఆరాధన.

ఆమె ఎదురొచ్చి "రండి రండి" అంటూ ఆహ్వానించింది.

వెంటనే ఆమె "సీతా, సీతా నీకోసం ఎవరొచ్చారో చూడు" అంది నోరారా నవ్వుతూ.

సీత గబగబా వచ్చి ఇద్దరికీ నమస్కరించింది.

మహా సీత వైపు చూసి నవ్వుతూ "ఎలా వున్నావు సీతా" అనడిగింది.

"మీ దయవల్ల బాగున్నాను మాడం" అంది నవ్వుతూ.

"పగలంతా ఏమిటి నీ కాలక్షేపం"

"తెలుగు నేర్చుకుంటున్నాను మాడం. పెద్దమాడం ప్రత్యేకంగా కూర్చోబెట్టి నేర్పుతున్నారు"

"సీత తెలివైంది. వెంటనే పనిగట్టి నేర్చేసుకుంటున్నది." అంది మాణిక్యాంబ.

సుబ్బూ సీతవైపు చూశాడు. సీత యిప్పుడు ఆరోగ్యంగా కనబడుతుంది. మందులు, మంచి ఆహారం వలన ఆమె బుగ్గలు పూడాయి. కళ్ళలో కాంతి వచ్చింది నిండుగా కనిపిస్తున్నది.

సుబ్బూ, మజా సీత రూమ్‌కి వచ్చారు. మహా తను తెచ్చిన పళ్ళు, బిస్కట్లు సీత గదిలోని టేబుల్ మీద పెట్టింది.

"సీతా.. నీకు లేసులల్లడం వచ్చా?"

"రాదండి" అంది సీత.

"నేర్పితే నేర్చుకుంటావా?"

"నేర్చుకుంటానండి"

సుబ్బూ ఆ సంభాషణంతా మౌనంగా వింటున్నాడు.

అమ్మాజీ వెళ్ళిపోవడం వలన లేసుల అల్లకంలో స్పీడ్ తగ్గిపోయింది. అమ్మాణమ్మగారు - సరస్వతమ్మగారు కొంతవరకు అల్లుతున్నారు. నీవు నేర్చుకుని ఇక్కడ అల్లుతుంటే ఇక్కడ కూడా కొందరు నేర్చుకుంటారు" అంది మహా.

మరి నేనిక్కడున్నాను కదా మాడం" అంది సీత.

సుబ్బూ కలగజేసుకుని "ఒక రెండు గంటలు మన యింటికి వచ్చేట్లు పర్మిషన్ తీసుకుంటాను" అన్నాడు.

సీత సరేనని తలవూపింది. సుబ్బూ, మహా తిరిగొస్తూ ఆ సంగతి మాణిక్యాంబకి చెప్పారు.

మాణిక్యాంబ ఒప్పుకుంటూ స్త్రీ సదన్ అవసరాలు కొన్ని వాళ్ళకి ఏకరువు పెట్టింది.

"ఇక్కడ కొందరికి మిషన్ కుట్టడం వచ్చు సర్. కాని మిషన్స్ కొనేంత ఆర్థిక స్తోమత సదన్‌కి లేదు. మీరేమైనా సహాయ పడగలరేమో ఆలోచించండి" అంది వినయంగా.

మహా వెంటనే జోక్యం చేసుకుని "అలాగే కొంటాం. సదన్‌లో టాయ్‌లెట్స్ కూడా బాగుండలేవు. అవి కూడా బాగుచేయించండి. మీరు ఎస్టిమేట్ తయారు చేయించండి" అంది.

సుబ్బూ మహావైపు ఆనందంగా చూశాడు.

"నాకు చాలా సంతోషంగా వుంది మహా! నువ్వెంతగానో మారిపోయావ్" అన్నాడు అభినందిస్తూ.

తిరిగి గోదావరొడ్డున వస్తుంటే "ఎవరో సుబ్బూ, అరె సుబ్బూ" అని చప్పట్లు కొట్టి పిలుస్తున్నట్లయి వెనక్కి తిరిగి చూశాడు సుబ్బూ. అక్కడున్నవాళ్ళని చూసి గతుక్కుమన్నాడు.

**అక్కడ** చేతులూపుతూ నిలబడివున్నారు కాళిదాసూ సత్యవతులు.

సుబ్బూ గబుక్కున బైక్ దిగి స్టాండు వేసి "ఇప్పుడే వస్తా" అంటూ మహాకి చెప్పి వాళ్ళదగ్గరగా వెళ్ళాడు.

"ఏట్రా బొత్తిగా సీత కన్నేసావు?" అన్నాడు కాళిదాసు నిష్ఠూరంగా. అతని చూపులు మాత్రం దూరంగా నిలబడి వున్న మహా వైపే వున్నాయి.

"సీతకన్నూ, సాయిత్రి కన్నూ అంటూ ఏమీ లేదుగానీ ఎల్లుండి మేం ఎల్లిపోతున్నాంరా! ఓ సారొచ్చి కనపడు" అంది సత్యవతి. అలా చెబుతున్నప్పుడు సత్యవతి కంఠం వణకడం గమనించాడు సుబ్బూ.

"వెళ్ళిపోతున్నారా? ఎక్కడికి? ఎందుకు?" అని కంగారుగా అడిగాడు సుబ్బూ.

"అవున్నా, వూరుకాని వూరు - మనోళ్ళుకాని మడుసులతో ఎన్నాళ్ళు కలుసున్నా ఏంట్రా సుఖం. వయసుమీద పడే కొలది మనసు ఆసరా కోరుకుంటది. ఆడుకూడా ఎల్లిపోయాడు" అంది సత్యవతి దిగులుగా.

"ఆడా?"

"అవున్నా, ఏ వూరినుంచి వచ్చాడో బిడ్డలా చూశాను. చెప్పాపెట్టకుండా రాత్రికి రాతి వుడాయించేసాడు."

"ఆణ్ణి మనం బిడ్డనుకుంటే సరిపోయిందా? ఆడు మనల్ని అమ్మా బాబూ అనుకోలేదు. ఆడెవడో ఎలాటోడో సూడకుండా కొంపలో ఎట్టుకున్నాం. కానీ ఎదవపని సేసి మరీ వుడాయించేసాడు" అన్నాడు కాళిదాసు ఉక్రోషంగా.

ఆ మాట విని ఎవరో చెంప ఛెళ్ళుమనిపించినట్లు ఫీలయ్యాడు సుబ్బూ.

"ఏమన్నా పట్టుకుపోయాడా?" అనడిగాడు కంగారుగా.

"ఏదోలేరా.. సిన్నా సితకా! దానికోసం కాదుగాని పక్కింటి పనిపిల్ల రాణీని లేవదీసుకుపోయాడు. ఆళ్ళేదో మాది తప్పన్నట్లుగా ఇంటిమీదకొచ్చి యీరంగమాడ్తన్నారు. ఎంకి పెళ్ళి సుబ్బి సావుకొచ్చిందంటే యిదే. మాయదారి మేళం" అంది సత్యవతి బాధగా.

"అందుకోసం వెళ్ళిపోతారా అమ్మా.. నేను లేనా?" అన్నాడు సుబ్బూ ఆవేదనగా.

బదులుగా సత్యవతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె సుబ్బూ గడ్డం పట్టుకుని "కాదులేరా.. రేపు నువ్వయినా ఎల్లోటోడివే. ఉజ్జోగాలని, పెళ్ళని మీ గొడవలు మీకుంటాయి. కడుపున పుట్టినోళ్ళయినా అంతే. ఎవరిదారి ఆళ్ళు సూసుకోవాల్సిందే తప్పదు. ఉన్నారయితే మాలాంటి ముసలీ ముతకా వుంటారు. కాస్త నోరిప్పి మాటాడుకోటానికయినా మడుసులుంటారు. అందుకే ఎల్లిపోతన్నాం. ఈలుంటే రేపొకసారి యింటికిరా" అంటూనే దూరంగా నిలబడి వున్న మహాని చెయ్యి వూపి రమ్మని పిలిచింది సత్యవతి.

మహా అనుమానంగా చూస్తూ దగ్గరగా వచ్చింది.

"మా గురించి ఈడు సెప్పేవుంటాడు. రేపు నువ్వుకూడా సుబ్బూతో మా యింటికి రా. వస్తావా?" అనడిగింది సత్యవతి.

మహా సరేనన్నట్లుగా తలూపింది.

"తప్పకుండా రావాలిరా! లేదంటే మమ్మల్ని సుడ్డానికి మావూరిదాకా రావాల్సుంటది" అంటూ మరోసారి హెచ్చరించి వెళ్ళిపోయారు ఆ దంపతులు.

సుబ్బూ మనసు భారంగా అయిపోయింది.

"వాళ్ళుకూడా వెళ్ళిపోతున్నారు" అన్నాడు దుఃఖాన్ని అదుపులో పెట్టుకుంటూ బైక్ స్టార్ట్ చేసి.

మహా దిగులుగా అతనివైపు చూసింది.

తను వెళ్ళే రోజుకూడా దగ్గర పడుతున్నాయని గ్రహించి ఆమె వులిక్కిపడింది.

సుబ్బూ మహా వెళ్ళేసరికి సత్యవతి తమ్ముడు చాలావరకు సామాను పేక్ చేసేస్తున్నాడు.

"రారా! రారా!" అన్నాడు కాళిదాసు ఆప్యాయంగా.

సత్యవతి గబగబా వచ్చి "రారా! రండమ్మా" అని మహా చేయిపట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది.

సత్యవతి పదేపదే ముందే హెచ్చరించి వుండటం వలన కాళిదాసు బుద్ధిగా మహా గురించి ప్రశ్నలేయకుండా వుండిపోయాడు.

మామగారు - బావమరిది అంటేనే మండిపడే కాళిదాసు మొదటిసారిగా వాళ్ళగురించి మంచిగా మాట్లాడటం విని ఆశ్చర్యపోయాడు సుబ్బూ.

"నాకు మాత్రం ఎవరున్నారా? అమ్మా బాబా? అప్పా సెల్లా? ఆయన పెద్ద పేణం వుంది కాబట్టి మాగురించి కొట్టుకుంటావుంది. అల్లుణ్ణని గీరతో ఎప్పుడూ ఆళ్ళని ఎటకారాలాడేవాణ్ణి. ఆ యాపారమని, యీ యాపారమని వున్నదంతా తగలెట్టడవేకానీ రూపాయి సంపాదించలేదు. ఏదో సత్యవతి పొలం అడ్డంవేసి బతికేసాం. ఇప్పుడింక పెద్దోళ్ళవయిపోయాం. ఊరుకాని ఊర్లో ఎన్నాళ్ళున్నా అంతే. కాని మడుసులు, పడని గాలులు. అందుకే ఎల్లిపోతున్నాం" అన్నాడు కాళిదాసు.

సుబ్బూ దేనికీ జవాబు చెప్పలేకపోతున్నాడు.

దుఃఖం ఒడ్డుదాటని వరదలా లోలోపల సుడులు తిరుగుతున్నది.

ఎందుకు వీళ్ళంతా తన జీవితంలో చిత్రంగా ప్రవేశించి, ప్రేమనిపంచి శాపవిమోచన పొందిన దేవతల్లా అదృశ్యమైపోతున్నారు. మొన్న అమ్మాజీ.. ఈరోజు వీళ్ళు. రేపు మహా.

ఎందుకాదేవుడు పిడికెడు గుండె యిచ్చి యిలా పీడించేస్తున్నాడు.

''ఏరా సుబ్బూ ఏం మాట్లాడవేంట్రా? పెళ్ళెప్పుడు సేసుకుంటావ్? నీ పెళ్ళికి మాత్రం పిలవరా. పడతా లేస్తా అన్నా వస్తాం'' అంది సత్యవతి సుబ్బూ బాధ కనిపెట్టి లాలనగా.

సుబ్బూ తలదించుకున్నాడు. ఎంత ఆపుకున్నా ఆగని దుఃఖం రెండు కన్నీటి బొట్లుగా క్రిందకి జారడం గమనించి సత్యవతి అమాంతం సుబ్బూని కౌగిలించుకుంది.

''ఏట్రా పిచ్చి మొకమా! ఎక్కడుకి పోతాన్నాం? గట్టిగా నాలుగు బారలు జాస్తే మావూరొచ్చేస్తది. ఎప్పుడు కావాలంటే అప్పుడు రా. అమ్మా, బాబుని వదిలేసి వచ్చినప్పుడే ఏడవలేదు. ఇప్పుడు మాకోసం ఏడుస్తున్నావా?'' అంటూ వీపు నిమిరి లాలించింది ప్రేమగా.

మహా కూడా సుబ్బూ వైపు బాధగా చూసింది. తను వచ్చినప్పుడు ఒక కరకురాతి రౌడీలా కనిపించిన సుబ్బూ హృదయం ఎంత సుతి మెత్తనిదో గ్రహించి ఆమెకు కూడా వేదనగా వుంది. సత్యవతి వాళ్ళకి వద్దన్నా భోజనాలు పెట్టింది. కాదంటున్నా బట్టలు పెట్టింది. మొదటిసారి సుబ్బూ వాళ్ళ కాళ్ళకి దణ్ణం పెట్టాడు.

సత్యవతి ఇద్దర్నీ దగ్గరికి తీసుకుని ''చల్లగా వుండండి'' అంటూ దీవించింది.

కాళిదాసు ఎడ్రస్ రాసి సుబ్బూ కిచ్చి ''ఎప్పుడన్నా వచ్చి మమ్మల్ని సూసెల్లరా'' అన్నాడు ఎర్రబడిన కళ్ళతో.

సీతని చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

గుర్తుపట్టలేనంత చక్కగా, ఆరోగ్యంగా తయారయ్యింది సీత.

''ఓసినీ దుంపతెగ. ఎంత మారిపోయావే? గోదట్లో రెల్లుగడ్డిలా గాలి యిసురుకే వూగిపోయేదానివి. సక్కగా గుమ్మడిపండులా తయారయ్యావు'' అంది పాపాయమ్మ నవ్వుతూ.

''అవును. పరిస్థితులు పాపాయమ్మగారూ. చక్కని ఆహారం, వాతావరణం వుంటేనే ఎవరైనా కళకళలాడేది'' అన్నారు సరస్వతమ్మగారు.

అమ్మాణమ్మగారు కూడా అవునన్నట్లుగా తలూపారు.

అంతలో మహా కూడా అక్కడికొచ్చింది నవ్వుతూ.

''అవునండి సరస్తమ్మగారూ! నేను కూడా వయసులో సాలా అందంగా వుండేదాన్ని. అందరూ నన్ను అంజలీదేవని పిలిసేవారు'' అంది పాపాయమ్మ గర్వంగా.

అమ్మాజీ వుంటే దొర్లి మరీ నవ్వేసేదే

ఇక అక్కడున్న పెద్దలు చిన్నగా నవ్వి ''అంతేనండి. వయసొస్తే వంకర కాళ్ళు తిన్ననవుతాయని సామెత'' అన్నారు చమత్కారంగా.

''అమ్మాజీ లేదుకదా సీతకి కూడా మీరు లేసులల్లడం నేర్పిస్తే తనుకూడా స్త్రీ సదనంలో వాళ్ళకి నేర్పుతుంది. అందుకనే రమ్మన్నాం నేనూ సుబ్బూ'' అంటూ చెప్పింది మహా సరస్వతమ్మగారికి, అమ్మాణమ్మగారికి.

చాలాసేపు అందరూ అమ్మాజీ గురించే మాట్లాడుకున్నారు.

అమ్మాజీలేని లోటు అక్కడ కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

"అయిందానికి కాందానికి పడీపడీ నవ్వేది మాయదారి పిల్ల. ఎలాగుందో ఏంటో? ఓపాలి ఎల్లి సూసిరావాల" అంది పాపాయమ్మ అమ్మాజీని తలచుకుంటూ.

"అవును. వెళ్ళిరండొకసారి" అన్నారు అమ్మాణీగారు.

"అవును మామ్మా, చూసిరా" అంది మహా.

ఇంతలో పోస్ట్‌మాన్ వస్తే అమ్మాణమ్మగారు వెళ్ళి సంతకం పెట్టి మనియార్డరు తీసుకుంది.

"అమ్మాణమ్మగారికి బంధువులున్నారా?" గుసగుసగా అడిగింది సరస్వతమ్మగారు పాపాయమ్మని.

"ఏమో మరి? నెలకి రెణ్ణెల్లకి డబ్బులొస్తంటాయి. ఆమె ఈ మజ్జెనేగా మడుసుల్తో మాటాడతంది" అంది పాపాయమ్మ చిన్నగా.

సీత చిన్నగా అల్లికలు నేర్చుకుంటుంటే మహా మేడమీదకి వచ్చేసింది.

అప్పటికే సుబ్బూ మంచమ్మీద పడుకుని వున్నాడు.

"సుబ్బూ" అంటూ మెల్లిగా పిలిచింది మహా.

"ఊ"

"అలా వున్నావేంటి? పనికేం వెళ్ళలేదా?"

సుబ్బూ రివ్వున లేచి కూర్చున్నాడు.

"పనా? ఏం పనుంది నాకు. నాకు పనిచ్చినవాళ్ళు వాళ్ళూరి బస్సెక్కేసారు. ఇప్పుడే సాగనంపి వస్తున్నా. రాగానే నాకు అలవాటు లేని వడ్డీవ్యాపారంలో దింపేసారు నన్ను. ఆ వ్యవహారంలోనే సరస్వతమ్మగారి భర్తని పొట్టన పెట్టుకున్నాను నేను. ఇంతలో నువ్వు దాపరించావు నాకు. తాగకూడదన్నావు. తలకి పోసుకోకూడదన్నావు. సరే ... నాకే శనిపట్టిందో చెవులాడించేసాను. ఇప్పుడేమో లాలా చెరువు మస్తాన్‌గాడు పనిచెయ్యడానికి కబురుపెట్టాడు. ఇప్పుడెళ్ళి ఏం చేయగలను నేను? వాడుత్త కసాయి. వాడి దగ్గర పనిచెయ్యాలంటే నేనంతకన్నా కసాయిగా వుండాలి" అంటూ వాపోయాడు సుబ్బూ.

"మహా అతని చేతిని గట్టిగా పట్టుకుని "వద్దు సుబ్బూ.. అలాంటి వాళ్ళదగ్గర పని చెయ్యొద్దు" అంది గాభరాగా.

"మరేం చెయ్యమంటావు?"

జవాబులేక మహా మౌనంగా వుండిపోయింది.

పాపాయమ్మ చిన్నగా వాళ్ళనీ వీళ్ళనీ అడిగి కాంతం కొట్టు ఎడ్రస్ కనుక్కుని నడుచుకుంటూ వెళ్ళింది.

కాంతం షాపులో బిజీగా వుంది.

పాపాయమ్మ కాసేపు తనొచ్చిన వివరం చెప్పకుండా పక్కనున్న బెంచీమీద కూర్చుంది.

కాంతం నవ్వుతూనే గడుసుగా చేస్తున్న వ్యాపారాన్ని గమనిస్తుంది.

ఇంతలో ఎవరో తెల్సినావిడ కాబోలు వచ్చి "వదినా అన్నయ్యకెలా వుంది?" అనడిగింది.

ఆఁ! పర్లేదులే. అదేవన్నా తగ్గేడ్చే జబ్బా? చెయ్యలేక విసుగెత్తిపోయిందనుకో. ఇప్పుడు పనిమనిషినెట్టానులే. అదే చూసుకుంటున్నది" అంది కాంతం విసుగ్గా.

"అంతేలే! అంతేలే" అంటూ ఆవిడ అరకేజి చింతపండు కొనుక్కుని వెళ్ళిపోయింది.

కొంచెం రద్దీ తగ్గాక ఆవిడ బెంచీమీద కూర్చున్న పాపాయ్యమ్మ కేసి "ఏం కావాల?" అనడిగింది.

"ఏవక్కర్లేదు" అంది పాపాయమ్మ.

"మరెందుకిక్కడ కూర్చున్నావ్?" అంటూ రెట్టించింది కాంతం.

"మీ యింట్లో పనిజేసే పనిమడిసి నా సుట్టం. సూద్దారనొచ్చాను" అంది పాపాయమ్మ.

"ఎవరూ...అమ్మాజీనా?"

"అవును."

"సర్లే. అదే ఇంట్లో వుంటం నాకు చీదర. మళ్ళీ దానికి బంధువులు, స్నేహితులు. సాలు సాల్లే ఎల్లెల్లు" అంటూ ఈసడించింది కాంతం.

ఇక తను నటించక తప్పదని గ్రహించింది పాపాయమ్మ.

"అమ్మమ్మా అంత మాటనకు. ఎక్కడో పుల్లేటికుర్రునుండి వచ్చాను. ముసిల్దాన్ని. మళ్ళీ యీ రోజుకి బతికుంటానో లేదో. ఒకసారి కల్లతో సూడ్నీ. బయట్నుంచి బయటకే ఎల్లిపోతాను" అంది ఏడుపు నటిస్తూ.

కాంతం విసుగ్గానే ఒప్పుకుంది.

కొట్టు కట్టేసాక కాంతం పాపాయమ్మని తీసుకుని రెండు వీధులవతల వున్న పచ్చమేడకి తీసుకెళ్ళింది.

అప్పుడే తెలిసింది పాపాయమ్మకి కాంతానికి పోలియో వచ్చి కాళ్ళు చచ్చుపడ్డాయని.

పాపాయమ్మని వరండాలోనో నిలుచోబెట్టి "అమ్మాజీ నీకోసం ఎవరో వచ్చారు" అని గట్టిగా అరిచి చెప్పింది.

"తొందరగా సాగనంపేయ్. సుట్టవని సొల్లుకబుర్లేసుకుని కూర్చోకు" అంటూ వస్తున్న అమ్మాజీని మళ్ళీ హెచ్చరించింది కాంతం.

అమ్మాజీ బయటకొచ్చి పాపాయమ్మని చూసి 'మామ్మా' అంటూ కౌగిలించుకుని ఏడ్చేసింది.

అమ్మాజీ ఆకారాన్ని చూసి పాపాయమ్మ కూడా ఏడ్చేసింది.

"ఏంటే ఈ ఆకారం. ఆళ్ళు తిండిగాని ఎట్టడంలేదా?" అంది కోపంగా.

"ష్, మామ్మా ఆళ్ళుగాని యింటారు" అంది అమ్మాజీ గుసగుసగా.

"ఏం యినడం. ఆళ్ళు నిన్ను పనిమడిసంటున్నారు. సిగ్గూ శరమూ లేకుండా. నిన్ను నట్టేట ముంచిన యీడికి పనిసెయ్యటానికొచ్చావా? నడు. తీసుకెల్తాను నిన్ను" అంది పాపాయమ్మ ఈసడింపుగా.

"ఊరుకో మామ్మా, ఆవిడంతే. పాపం అతనేవీ అనటంలేదు నన్ను. చాలావరకు బాగయ్యింది. ఇప్పుడొదిలేస్తే మళ్ళీ యీళ్ళు చూడరు పాపం. అన్యాయమైపోతాడు" అంది అమ్మాజీ.

పాపాయమ్మ నిర్ఘాంతపోయి చూసింది అమ్మాజీ వైపు.

"నీ తెలివి తెల్లారినట్టే వుండే. కొందరికి మెదడు మోకాళ్ళలో వుందంటే యిన్నాను. నీకు అరికాళ్ళల్లో వుండే నీకు తిండికి లేదనా, గుడ్డకి లేదనా? యెందుకే ఈ గరుడసేవ?" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఇంతలో సత్యం దగ్గు కాంతం గావు కేక వినిపించాయి.

"ఎక్కడ చచ్చావ్? ఇతను దగ్గుతున్నాడు."

"మామ్మా యింకెళ్ళిపో అక్కడేం చెప్పకు" అంటూ లోనికి పరుగుతీసింది అమ్మాజీ.

పాపాయమ్మ కాళ్ళీడ్చుకుంటూ తిరిగొచ్చింది ఇంటికి నీరసంగా.

రాగానే సరస్వతమ్మగారు, అమ్మాణమ్మగారు 'అమ్మాజీ ఎలావుంది?' అంటూ ఆతృతగా అడిగారు.

"సీ! సీ అమ్మాజీ యింత తెలివితక్కువ దద్దమనుకోలేదు. మడిసి పేణం కల్లల్లో వుంది. ఆళ్ళు దీన్ని పనిమడిసికన్నా యీనంగా సూస్తన్నారు. పనిమడిసనే చెబుతున్నారు. ఇది మాత్రం అతనేం అనడంలేదని అడ్డమైన సాకిరీ సేస్తంది. పైగా ఎవరికీ చెప్పొద్దంట. సతీ సాయిత్రిననుకుంటున్నది సన్నాసి ముండ" అని రకరకాలుగా తిట్టిపోసింది పాపాయమ్మ.

"అయ్యోపాపం పిచ్చి పిల్ల" అంది సరస్వతమ్మగారు.

"ఇప్పుడే యిదంతా సుబ్బూకి సెప్పేస్తాను. నాలుగు తగిలించి తీసుకొచ్చేత్తాడు" అంది పాపాయమ్మ.

"ఆపని చెయ్యకండి పాపాయమ్మగారూ" అన్నారు అమ్మాణమ్మగారు.

"అవును" అంటూ వంత పాడారు సరస్వతమ్మగారు.

పాపాయమ్మ వాళ్ళిద్దరి కేసి కోపంగా చూసింది.

"సదూకున్నోరు ఏం చెబుతున్నారు. అది రేపక్కడ సస్తే బాగుంటదా?" అనడిగింది కోపంగా.

"అంతపని జరగదు. ఇప్పుడు మనం బలవంతంగా తీసుకొచ్చేస్తే ఆవిడ వాళ్ళని విడదీసినట్లు అనుకుంటుంది. ఆమెకే పూర్తిగా విరక్తిరావాలి. అంతవరకు మనం ఓపిక పట్టాల్సిందే" అన్నారు అమ్మాణమ్మగారు.

"అవును. ఆ మాట నిజం" అన్నారు సరస్వతమ్మగారు.

"ఏంటో మీరు సెప్పేది నాకర్థంకాదు. అమ్మో, అమ్మో అదెంత గయ్యాలో! నేనే అనుకుంటే నన్ను మించిపోయింది" అంది పాపాయమ్మ గుండెలు బాదుకుంటూ.

వాళ్ళ సంభాషణ అప్పుడే లోనికి వెళ్తున్న సుబ్బూ విన్నాడని ఆ ముగ్గురికీ ఏ మాత్రం తెలియదు.

ఆ సంగతి తెలిసిన సుబ్బూ మనసు మనసులో లేదు. కానీ ఆ పెద్దవాళ్ళు చెప్పినట్లుగా కొంతకాలం వేచి చూడటమే మంచిదనుకున్నాడు. ఆ రోజు సుబ్బూ బయటకెళ్ళి ప్రభుత్వాసుపత్రి ముందు నుండి వస్తుండగా రిక్షాదిగి సత్యాన్ని క్రిందకి దింపుతున్న అమ్మాజీ కనిపించి బండి పక్కకి తీసి దూరంగా నిలబడ్డాడు సుబ్బూ.

నిజంగానే పాపాయమ్మ చెప్పినట్లుగానే అమ్మాజీ చిక్కిశల్యమయ్యింది. సత్యాన్ని దింపలేక మనిషి వంగిపోతున్నది.

మెల్లిగా అతన్ని నడిపించుకుని వెళ్తుంటే వెనకాలే కనపడకుండా నడిచాడు సుబ్బూ. అతన్ని ఫిజియోథెరపి రూమ్‌లోకి తీసుకెళ్ళింది అమ్మాజీ.

ఇక అక్కడ చాలాసేపు పడుతుందని గ్రహించి అమ్మాజీకి కనపడకుండానే తిరిగి వచ్చేసి ఆ సంగతి మహాకి చెప్పాడు సుబ్బూ.

సరస్వతమ్మగారు చెప్పినట్లు ఆగితే అమ్మాజీ చచ్చిపోతుందనిపిస్తున్నది మహా. వెళ్ళి తీసుకొచ్చేయనా?" అనడిగాడు సుబ్బూ బాధగా.

"మరి.. అమ్మాజీ రానంటే?"

"వచ్చేటట్లు చేస్తాను చూడు"

"జాగ్రత్త సుబ్బూ! వాళ్ళంతా లో ప్రొఫైల్డ్ పీపుల్" అంది మహా.

సుబ్బూ తలపంకించాడు.

ఆ మర్నాడు కాంతం షాపుకి తిన్నగా వెళ్ళి "మీరు కాంతంగారేనా?" అనడిగాడు సుబ్బూ సూటిగా.

"అవును. నువ్వెవరివి?" అనడిగింది కాంతం అనుమానంగా చూస్తూ.

"నేను సత్యంగారి మొదటి భార్య తమ్ముణ్ణి" అన్నాడు సుబ్బా.

కాంతం ఆ మాటవిని ఎగిరిపడింది.

"మొదటి భార్యా? అదెవర్తి?" అంటూ.

"అమ్మాజీ"

"అది చప్రాసీది మా ఆయనకి మొదటి పెళ్ళామా పళ్ళు రాల్తాయి" అంది కాంతం బుసలు కొడుతూ.

ఏవీ కాందీ మీ యింట్లో ఎందుకుంది? పళ్ళు రాలగొట్టడం నాకూ వచ్చు" అన్నాడు సుబ్బా అంతకంటే కోపంగా.

"ఏం(రా పేల్తన్నావు. పద యింటికెల్లి తాడో పేడో తేల్చుకుందాం అంది కాంతం రొప్పుతూ.

"పదండి" అన్నాడు సుబ్బా.

ఇద్దరూ ఇల్లు చేరగానే తలుపు తెరచిన అమ్మాజీ జుట్టు అమాంతం పట్టుకుని "ఏంటే నువు నాకు సవతివా? అలా చెప్పుకు తిరుగుతున్నావా?" అంటూ అమ్మాజీని కొట్టబోయింది కాంతం.

సుబ్బా కాంతాన్ని సాచి లెంపకాయ కొట్టాడు.

మా అక్కని ముట్టుకుంటే చంపేస్తాను.

"ఏం బావా? నువ్వు మా అక్క పెళ్ళి చేసుకున్నావు కదా! చెప్పు" అన్నాడు.

అక్కడే సోఫాలో కూర్చున్న సత్యం అర్థంకాక "ఎవరితను అమ్మాజీ" అనడిగాడు.

"మా తమ్ముడు"

ఈ వరసలూ వల్ల కాడికేంటి గాని అది మీ మొదటి పెళ్ళామా, ఉంపుడుగత్తా? ఆ సంగతి తేల్చండి" అంటూ గాండ్రించింది కాంతం.

"అవన్నీ యిప్పుడెందుకు?" అంటూ నసిగాడు సత్యం మెల్లిగా.

"లేదు. ఆ సంగతి యిప్పుడే తేలాలి" అంటూ గట్టిగా గీపెట్టింది కాంతం.

అమ్మాజీ స్థాణువులా నిలబడి జరిగేదంతా చూస్తున్నది.

అంతలో గదిలో వున్న సత్యం కూతురు బయటకి వచ్చింది.

కాంతం కూతుర్ని చూసి ఘొల్లుమంది. "నా కొంప ముంచడానికే యిది తిరిగి నా కొంపలో దూరిందే తల్లో" అంటూ.

"నాన్నా ఏంటిదంతా? ఏం జరుగుతోందిక్కడ? ఈ గేంగంతా ఎవరు? కావాలంటే వాళ్ళతో వెళ్ళు" అంది కూతురు కోపంగా.

నీకేం మతిపోయిందా.. నేను వాళ్ళతో వెళ్ళడమేంటి? వాళ్ళెవరు? నేనెవరు? మీ అమ్మకి మతిపోతే నీకూ పోయిందా? అసలావిణ్ణి పిలవద్దంటే మీ అమ్మే పిలిపించింది. ఏనాడో ఏదో జరిగిందని ఈ దరిద్రం యింకా నన్ను పట్టుకు వేళ్ళాడుతున్నది" అన్నాడు సత్య అమ్మాజీ వైపు ఛీదరింపుగా చూసి.

అమ్మాజీ ప్రాన్పడి చూసింది సుబ్బా వైపు.

సుబ్బా అమ్మాజీ భుజమ్మీద చెయ్యేసి 'పద' అన్నాడు మెల్లిగా.

"**తమ్ముడట తమ్ముడు**.. దీని తమ్ముళ్ళెవరో నాకు తెలియదా? ఎదవ్వేషాలు. వావి వరసల్లేని రకం" అన్నాడు సత్యం చీదరింపుగా.

ఆ మాటకి అమ్మాజీ కళ్ళెర్రబడ్డాయి.

దుఃఖంతోనూ, కోపంతోనూ ఆమె నిలువెల్లా వణికిపోయింది.

"ఓరి దుర్మార్గుడా, ఈ మాట కూడా అనేసావా? సుబ్బూ నాకన్నా చాలా చిన్నోడు. నేనే మొదటిసారి అతన్ని 'అన్నా' అని పిలిచాను. తమ్ముళ్ళని నా రెక్కలసాటున పెట్టి పెంచాను. రెక్కలొచ్చాక ఆళ్ళు ఎగిరిపొయ్యారు. బతకడం చేతనయ్యాక నా మంచి చెడ్డలు బూతద్దంలో కనిపించాయి. అదే పోన్లే అనుకుని సరిపెట్టుకున్నాను. ఒక అన్న వుంటే అతని రెక్కలసాటున బతకొచ్చని ఒక ఆశ. అందుకే సుబ్బూని అన్నని సేసుకున్నాను. ఇన్నాళ్ళూ నీ వంటికే వచ్చింది పక్షవాతమనుకున్నాను. నీ మనస్సుక్కూడా వచ్చిందని తెలుసుకోలేకపోయాను. ధూ... నీ జన్మ తగలడ" అంటూ వూసింది అమ్మాజీ.

"పద అమ్మాజీ, అతనితో మాటలేంటి? ఒకటి కొడితే చచ్చిపోతాడని వదిలేసాను" అని అమ్మాజీని తీసుకుని బయటకి నడిచాడు సుబ్బూ.

అమ్మాజీని చూడగానే గబగబా లేచొచ్చింది పాపాయమ్మ.

"నా తల్లే నా తల్లే! వచ్చేసావా?" అంటూ ఏడ్చింది రాగాలు తీసి.

"హార్మోనియం తర్వాత వాయించొచ్చు. ముందు అమ్మాజీకి తాగడానికేవన్నా యిచ్చి కూర్చోపెట్టండి" అంటూ పైకి వెళ్ళిపోయాడు సుబ్బూ.

"అమ్మాజీని తీసుకొచ్చేసాను మహా" అన్నాడు లోపలకెళ్ళి మహాతో.

మహా చదువుతున్న పుస్తకాన్ని పక్కకి పెట్టి "నిజంగానా?" అంది సుబ్బూ భుజాలు పట్టుకుని వూపుతూ.

"అవును క్రింద అమ్మాణమ్మగారి గదిలో వుంది వెళ్ళి చూడు" అన్నాడు సుబ్బూ.

మహా రివ్వున తూనీగలా మెట్లుదిగి ఆ గదిలోకి పరుగు తీసింది. అప్పటికే సరస్వతమ్మగారు తనదగ్గరున్న హార్లిక్సు పాలలో కలిపి తెచ్చి అమ్మాజీ చేత బలవంతంగా తాగిస్తున్నారు.

మహా గబగబా వెళ్ళి అమ్మాజీని కౌగలించుకుంది.

మహాని చూసి అమ్మాజీ ఏడుపు అధికమయ్యింది.

"అమ్మాయిగారు.. మీ మాట యిన్నాను కాదు. ఆళ్ళు సూడండి... నన్నెంతంత మాటలనేసారో" అంటూ వెక్కెక్కి ఏడ్చింది.

"ఎందుకలా ఏడుస్తావు. ఇప్పటికయినా ఆ ఊబిలోంచి బయటపడినందుకు సంతోషించు. అతనికే ప్రేమ, బాధ్యత వుంటే ఇన్ని సంవత్సరాలు నిన్ను ఇదే ఊరిలో గాలికొదిలేసేవాడా? ఇప్పుడన్నా నీ చేత అడ్డమైన సేవ చేయించుకోవడానికి పిలిచారు. ఇక ఇలాంటి భ్రమలు వదిలి వాస్తవంలో జీవించు. ఊరికే అప్రయోజకుల కోసం కన్నీళ్ళు వృథా చేయకు" అంటూ మందలించారు సరస్వతమ్మగారు.

"అవునవును. మేమంతా మొగుడు సచ్చినోడున్నాడనే బతుకుతున్నావా పిచ్చిముండా! దేవుడెంత ఆయుసిచ్చాడో అంతవరకూ బతకాల్సిందే అటు అమ్మాణమ్మగోరు, ఇటు సరస్తమ్మగోరు, నేనూ లేవేంటే ఎర్రిమొగమా. ఎప్పుడూ సిలకలా నవ్వుతు అందరి సుట్టూ తిరిగేదానివి. ఇకా ఏడుపు మాను" అంది పాపాయమ్మ కోప్పడుతూ.

అమ్మాజీ కళ్ళు తుడుచుకుంది - గుండెలో దుఃఖాన్ని అణచుకుంటూ.

"కొన్నాళ్ళు శుభ్భంగా తిని రెస్టుతీసుకో. ఇక ఆ పాత కథని మరచిపో. అవతల నీకు కొండంత అండ సుబ్బూ, మహా వున్నారు. నిన్నెటికీ వాళ్ళు వదిలేయరు" అంటూ ఊరడించారు అమ్మాణమ్మగారు.

మహా అమ్మాజీ వీపుమీద చేతులుంచి అలానే పక్కన కూర్చుంది చాలాసేపు.

ఆ రోజు...

సెల్ ఫోను రింగవ్వగానే ఆ పేరు చూసి నిలువెల్లా సన్నగా వణికాడు సుబ్బూ. ఒకసారి అతను అలా రిసీవ్ చేసుకోకుండా మౌనంగా వుండిపోయాడు.

ఫోను మళ్ళీ అదేపనిగా రింగవ్వడం మొదలుపెట్టింది. మహా నిద్రలో చిరాగ్గా కదిలింది.

"ఏయ్ సుబ్బూ, సెల్ స్విఛాఫ్ చెయ్యి. ఊరికే డిస్టర్బెన్స్" అంటూ మంచమ్మీద చిరాగ్గా అటు తిరిగి పడుకుంది.

సుబ్బూ లేచి గోడకి చేరబడి కూర్చుని ఫోను ఆన్ చేసి "సర్, సారీ, నిద్రలో వున్నాను" అన్నాడు పొడిగా.

"ఊ, ఊ.. అదే అనుకున్నాను. మనం అనుకున్న డేట్ ఈ రోజుతో పూర్తవుతుంది. గుర్తుందా?" అన్నాడతను.

సుబ్బు కేలండర్‌లో తను రవుండ్‌గా రెడ్ స్కెచ్ పెన్‌తో మార్కు చేసుకున్న తారీఖువైపు చూశాడు.

"గుర్తుంది సర్" అన్నాడు నీరసంగా.

"రేపు నేను నేషనల్ హైవే మీద వున్న వినాయకుడి గుడి దగ్గర కారులో వచ్చి వెయిట్ చేస్తాను. సరిగ్గా సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో. నువ్వు మహాని తీసుకుని రా! మాట తప్పితే యుద్ధాలవుతాయి" అంటూ అతను స్విచాఫ్ చేసాడు.

సుబ్బూ నీరసంగా అలానే స్థాణువులా గొడకి చేరబడిపోయాడు.

అతని కళ్ళు మొదటిసారి ధారాపాతంగా నీళ్ళు కార్చడం మొదలుపెట్టాయి. వాటిని తుడుచుకోవాలన్న ఇంగితాన్ని కూడా అతను మరచిపోయాడు.

ఎండపొడ మీద పడుతుండగా మహా నిద్రలేచింది. ఆమె సుబ్బూ దుఃఖాన్ని గమనించలేదు.

"సారీ సుబ్బూ. బాగా నిద్రపట్టేసింది" అంటూ గబగబా టాయిలెట్‌లోకి వెళ్ళి మొహం కడుక్కుని కాఫీ కలిపి రెండు కప్పులూ తెచ్చి ఒక కప్పు సుబ్బూకివ్వబోయింది. సుబ్బూ దాన్ని అందుకోలేదు.

అప్పుడు చూసిందతనివైపు.

అతను దుఃఖాన్ని బలవంతంగా నొక్కిపెడుతున్నాడు.

మహా తన కప్పు పక్కకి పెట్టి "ఏంటి, సుబ్బూ ఏవయ్యింది? మీ అమ్మగారూ నాన్నగారూ బాగున్నారా? ఎందుకేడుస్తున్నావు?" అంటూ అతని భుజాలు పట్టుకుని కుదిపేసింది.

సుబ్బూ ఆమెకు కేలండర్ వైపు చూపించాడు.

మహాకి ఏమీ అర్థంకాలేదు.

"ఏవుందక్కడ?" అంది అయోమయంగా.

"ప్రొద్దుటే మీ డేడీ ఫోను చేసారు. రేపు నేను నిన్ను అప్పచెప్పాల్సిన రోజు" అతి కష్టం మీద అతని నోటినుండి ఆ మాటలు వెలువడ్డాయి.

మహా వెంటనే షాకయింది.

"నేను ...నేను వెళ్ళను" అంటూ గట్టిగా సుబ్బూని కౌగలించుకుంది.

సుబ్బూ కూడా ఆమెని ఆర్తిగా హత్తుకున్నాడు.

"నేను వెళ్ళను సుబ్బూ. నేను నిన్ను వదిలి వుండలేను" అంటూ ఏడ్చింది మహా.

"కాని.. మనం ఆయనకి మాటిచ్చాం" అన్నాడు సుబ్బూ బాధగా.

"నేను మేజర్ని. ఆయన నన్నేం చేయలేరు" అంది మహా ధీమాగా.

"ఇది చట్టానికి సంబంధించిన విషయం కాదు మహా. మనిషి తనిచ్చిన మాట నిలబెట్టుకోవడం ధర్మం."

"నా మనసుకన్నా నీకు నువ్విచ్చిన మాట ముఖ్యమా? అప్పుడు కేవలం రాణీ కౌశిక్‌ల మీద కసితో ఆ టైము చాలనుకున్నాను. కానీ దాన్నిమించిన ఒక బంధం నీతో ముడిపడిపోయిందని తర్వాత తర్వాత తెలుసుకున్నాను. కౌశిక్‌ని ప్రేమించిన మనిషి తిరిగి నన్ను ప్రేమిస్తున్నానంటుందేమిటా అని గేలి చేస్తావని నేనెప్పుడూ నా హృదయాన్ని నీకు విప్పి చెప్పలేకపోయాను సుబ్బూ. రియల్లీ లవ్ యూ సుబ్బూ, అయ్ లవ్ యూ. నువ్వు లేకుండా నేను బ్రతకలేను. స్త్రీ ఏం ఆశిస్తుందో.. ఆ క్వాలిటీస్ అన్నీ నీలో వున్నాయి. నిన్ను వదిలి నేను చచ్చిపోతాను కాని వెళ్ళను" అంది మహా చాలా ఆవేశంగా.

సుబ్బూ అప్పటికి కొంత తేరుకుని మహాకి దూరంగా జరిగి కూర్చున్నాడు.

మహా అతనివైపు అర్థంకానట్లుగా చూసింది.

"చూడు మహా! నాకేం సంపాదన లేదు. చదువుకూడా మధ్యలో ఆపేసాను. చాలా రోజులుగా ఒక పద్ధతి లేకుండా జీవిస్తున్నాను. నా జీవితం గురించి ఇంకా ప్లానింగ్ లేదు. ఇప్పుడు నేను నిన్ను, నీవు నన్ను ప్రేమించుకున్నాం అనుకోవడం సరికాదేమో. నువ్వు మీడాడీ చెప్పినట్లుగా ఆయనతో వెళ్ళు. వెళ్ళగానే వాళ్ళు నీ బావతో కాళ్ళూ చేతులూ కట్టేసి పెళ్ళి చేయరు. మీ డాడీ అంత దుర్మార్గుడనుకోను. ఇక మీ బావకి చెప్పు. నేను నిన్ను ప్రేమించడంలేదు. ఇష్టంలేని అమ్మాయిని చేసుకోవాలనుకోవడం హీరోయిజం కాదని. ఒక రెండేళ్ళు టైము తీసుకో. నీకేం కావాలో నువ్వాలోచించుకో. అప్పటికీ నా మీద ప్రేమ వుంటే కలుద్దాం. లేదంటే ఎప్పుడైనా గుర్తొచ్చినప్పుడు ఈ ఎపిసోడ్‌ని తలచుకుని చిన్నగా నవ్వుకుందాం. సరేనా?" అన్నాడు చిరునవ్వు కొని తెచ్చుకుని.

మహా బేలగా చూసిందతనివైపు.

"దిగులు పడకు. నేను కూడా స్థిరపడాలి. అది ఎలానో నాకే తెలియదు" అన్నాడు సుబ్బూ తిరిగి.

"నీ సామాను సర్దుకో. మనమేం దేశాలు వదిలి వెళ్ళిపోవడంలేదు. నువ్వెప్పుడొచ్చినా ఎలా వచ్చినా స్వాగతించడానికి నేను సిద్ధమే. ఎన్నేళ్ళయినా సరే. నా యింట్లోంచి పంపించి వేసినా నా మనసులోంచి నిన్నెప్పటికీ పంపించను. ప్రామిస్" సుబ్బూ ఆమె చేతిని తీసుకుని అరచేతిలో చెయ్యివేసాడు.

అంటూనే సుబ్బూ ఆమెకు మరో అవకాశం యివ్వనట్లు గుమ్మం దగ్గరకెళ్ళి అమ్మాజీని పిలిచాడు.

అమ్మాజీ రివ్వున వచ్చింది 'అన్నా' అంటూ.

అమ్మాజీ లోపలికి రాగానే తలుపు దగ్గరకేసాడు సుబ్బూ.

అమ్మాజీ ఆశ్చర్యంగా ఆ యిద్దరికేసీ తిప్పి తిప్పి చూసింది.

ఇద్దరూ ఏదో దుఃఖాన్ని అణచుకున్నట్లుగా వున్నారు.

"ఏంటన్నా ఏం జరిగింది? పాపగారలా వున్నారేంటి?" అంది.

"రేపు మహా వెళ్ళిపోతున్నది"

"వెళ్ళిపోతున్నారా? ఎక్కడికి?" తెల్లబోతూ అడిగింది అమ్మాజీ.

"వాళ్ళింటికి. వాళ్ళ డాడీ మహాని తీసుకెళ్ళడానికిచ్చిన గడువు ఈ రోజుతో తీరిపోయింది."

"అయ్యో అదేంటన్నా" అని బావురుమంది అమ్మాజీ.

"ష్! గొడవ చెయ్యకు. ఆ నాడు చేసిన ఒప్పందం అదే ఇక్కడ అగమ్యంగా ఎన్నాళ్ళుంటుంది. వాళ్ళ మమ్మీ డేడీ ఎంత బాధపడుతుంటారు?"

అప్పటికే అమ్మాజీ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

"అమ్మాజీ"

"అన్నా"

"బాధ అందరికి సహజం. మీ ఆయన పిలిచాడని నువ్వెళ్ళలేదూ? అతను నిజంగా ప్రేమగా చూస్తే నువ్వు తిరిగొచ్చేదానివా? ఇదీ అంతే. ఒక సంవత్సరానికే మనం యింత బాధపడితే వాళ్ళవాళ్ళకి ఎంత బాదుంటుంది? అందుకే మనం సంతోషంగా పంపిద్దాం."

అమ్మాజీ బాధని దిగమింగుకుని బేలగా చూసింది మహా వైపు.

మహా తలదించుకుని కూర్చుంది.

"ఇంకో విషయం నీకు చెప్పాలని పిలిచాను. ఈ విషయాన్ని అప్పుడే ఎవరికీ చెప్పకు. ముఖ్యంగా పాపాయమ్మ రాద్ధాంతం చేస్తుంది. అది నాకిష్టంలేదు. అందుకే నీకు చెబుతున్నాను" అన్నాడు సుబ్బా.

అమ్మాజీ సర్వదష్టలా తల వూపింది.

"సరే... నేను బయటకి వెళ్ళొస్తాను. మీ యిద్దరూ మాట్లాడుకోండి" అంటూ సుబ్బా బయటకి వెళ్ళిపోయాడు.

సుబ్బా వెళ్ళగానే అమ్మాజీ రివ్వున వెళ్ళి మహాని కౌగలించుకుని నిశ్శబ్దంగా ఏడ్చింది.

మహా మౌనంగా అమ్మాజీ తలనిమురుతూ "నువ్వేం బాధపడకు. నేను నీకు డబ్బు పంపుతుంటాను .తిరిగి నువ్వు వాళ్ళ దగ్గరకి ఎప్పుడూ వెళ్ళకు" అని చెప్పింది నిదానంగా.

"డబ్బుకోసం కాదండి పాపగారూ" అంటూ మళ్ళీ నోరునొక్కుకుని ఏడ్చింది అమ్మాజీ.

మార్గశిర మధ్యమం.

సంధ్యా సమయం

అయిదుగంటలకే చీకట్లు ఒక పక్కనుండి కమ్ముకొస్తున్నాయి. క్రుంగిపోతున్న సూర్యకాంతితో కలిసిన చీకటి ఒక వింత రంగుతో ఆకాశమంతా కమ్ముకుంటున్న ఆ సాయంత్రం ఆ యిద్దరూ పొలాల మధ్యన వున్న సన్నని కాలిబాటపై నడుస్తున్నారు.

అతని చేతిలో సూట్‌కేస్.

ఆ అమ్మాయి చేతిలో గిటార్.

..................

.......

అక్కడ కాలిబాట రెండుగా చీలింది.

అక్కడ వాళ్ళిద్దరూ విడిపోయారు.

.............

ఆ అమ్మాయి కారెక్కి సాగిపోయింది.

తెల్లవారి విషయం తెలిసి ఘొల్లుమంది పాపాయమ్మ.

భజన్‌లాల్ బిల్డింగంతా ఏకం చేసి ఏడ్చింది.

"ఎంతపని చేసావురా సుబ్బూ.. ఒక్క ముక్క మాకు సెప్పకుండా సాగనంపేసావా? అయ్యో బంగారం లాంటి పిల్ల" అంటూ గోల గోల చేసింది.

సుబ్బూ సీరియస్‌గా క్రిందకొచ్చాడు.

"ఏంటి? ఎవరో చచ్చినట్లు గోలగోల చేస్తున్నావ్. వాళ్ళింటికి వెళ్ళిపోయింది. అదేవన్నా ఘోరమా?" అన్నాడు కోపంగా.

అమ్మాజీ భయంగా తలుపు వెనుక నక్కింది.

"అదికాదురా! అసలెందుకొచ్చింది? ఎందుకెల్లిపోయిందిరా నాకేం అర్దంకాటం లేదు" అంది పాపాయమ్మ గొంతు తగ్గించి.

సుబ్బూ ఏం జవాబు చెప్పకుండా పైకెళ్ళిపోయాడు.

ఏది ఏవయినా మంచి అమ్మాయి. మనతో కొన్నాళ్ళు కలిసుంది. అదే మన అదృష్టం అనుకుందాం. ఏడవద్దు పాపాయమ్మగారూ! ఎప్పుడెందుకు కలుస్తామో.. మరెందుకు విడిపోతామో ఆ దైవనికి ఎరుక. చూద్దాం. మన కోరిక తీరి మహా తిరిగి మన దగ్గరకే వస్తుందేమో? ఎవరికి ఎరుక" అంటూ పాపాయమ్మని వూరడించింది సరస్వతమ్మగారు.

అమ్మాణమ్మగారు అవునన్నట్లుగా తలూపి అమ్మాజీని పట్టుకుని మనందరికన్నా యీ పిచ్చి పిల్లకి బాధెక్కువ" అంటూ దగ్గరకి తీసుకుంది.

సుబ్బూ ఆ వెళ్ళడం వెళ్ళడం రెండురోజులు యింటికే రాలేదు.

"సుబ్బూ ఏవయ్యాడు?" అనడిగింది ఉతికిన బట్టలు మడుస్తున్న అమ్మాజీని అమ్మాణమ్మగారు.

"ఏమోనమ్మా? పాపగారు ఎల్లేక అన్న బాగా దిగులడిపోయాడు. పైకలా మాటాడతాడుగానీ లోన మనందరికన్నా కుంగిపోతున్నాడు." అంది అమ్మాజీ బాధగా.

"నిజమే. నేను పైకి అనలేదుగాని అమ్మాజీ. వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకుంటారేమోనని ఆశపడ్డాను" అన్నారావిడ బాధగా.

అమ్మాజీ ఆవిడవైపు ఆశ్చర్యంగా చూసి "మీరూ అనుకున్నారా? నేనూ అదే అనుకున్నా. కానీ ఆళ్ళమధ్య డబ్బు అంతరాలు చాలా ఎక్కువ పెద్దమ్మగారూ. పాపగారు చాలా ఆస్తిమంతులంట" అంది.

అమ్మాణమ్మ విరక్తిగా నవ్వింది.

"ఎన్ని జీవితాలు నాశనమైనా మనలో ఈ అంతరాలు నశించలేదు అమ్మాజీ. అందుకే మన కుటుంబ వ్యవస్థ యిలా కూలిపోతున్నది" అన్నారావిడ విచారంగా.

అప్పుడే మంచం మీద పెట్టిన అమ్మాజీ పర్సు జారిపడి అందులోని పులిగోరు పతకం బయటపడింది.

"అమ్మాజీ, చూడు ఏదో నీ గొలుసు పడింది క్రింద" అన్నారావిడ.

అమ్మాజీ గబుక్కున ఆ గొలుసు తీసి కళ్ళకద్దుకుని "అయ్యో యిది అన్నదమ్మా. వెళ్తూ వెళ్తూ పాపగారు యిది అన్నకిచ్చేయమని నా చేతికిచ్చారు, మర్చేపోయాను" అంది కంగారుగా.

అమ్మాణమ్మగారి దృష్టి దానిమీద పడింది.

"ఆమె ఏదీ... ఒకసారి నన్ను చూడనివ్వు" అంది.

అమ్మాజీ ఆమె చేతికిచ్చింది.

ఆమె దాన్ని నిశితంగా తడిమి చూడటం, చూస్తుండగానే ఆమె కనుగుడ్లు పెద్దవి కావడం ఆశ్చర్యంగా గమనిస్తోంది అమ్మాజీ.

"ఆ వెంటనే ఇది.. ఇది.. నీకెక్కడిది?" అంటూ నిలువునా వణికిపోయిందామె.

"చెప్పానుకదమ్మా, సుబ్బాదని" అంది అమ్మాజీ గాభరాగా.

"సుబ్బాదా! సుబ్బా... అయితే.. సుబ్బా" అంటూ ఆమె బి.పితో విరుచుకుపడిపోయారు.

అమ్మాజీ గబగబా పులిగోరు గొలుసు పర్సులో పెట్టి అందర్నీ కేకలేసి పిలిచింది.

అందరూ కలిసి అమ్మాణమ్మగారిని హాస్పిటల్లో జాయిన్ చేసారు.

"సుబ్బా ఎక్కడ? సమయానికి లేడు" అంటూ వాపోయారు సరస్వతమ్మగారు.

"పాపగారెల్లిపోయిన బాదలో ఎక్కడ తిరుగుతున్నాడో? ఫోన్ చేస్తే ఎత్తడంలేదు" అంది అమ్మాజీ విచారంగా.

ఇరవైనాలుగ్గంటల తర్వాత అమ్మాణమ్మకి స్పృహ వచ్చింది.

ఆమె అమ్మాజీని దగ్గరగా పిలిచి "సుబ్బా వచ్చాడా?" అనడిగింది హీన స్వరాన.

"లేదమ్మా. ఫోను కూడా ఆఫ్ చేసి పెట్టాడు" అంది అమ్మాజీ విచారంగా.

ఆమె నిస్పృహగా కళ్ళుమూసుకుంది.

కాసేపటి తర్వాత ఆమె ఒక నంబరు చెప్పి "ఈయనకి ఫోన్ చేసి నేను అర్జెంటుగా రమ్మన్నానని చెప్పు" అంది అమ్మాజీతో.

అమ్మాజీ ఆ నెంబరు తీసుకుని బయట బూత్ కెళ్ళి ఫోను చేసింది.

అతను ఫోనెత్తగానే "అమ్మాణమ్మగారికి ఆరోగ్యం బాగోలేదు. మిమ్మల్ని అర్జెంటుగా ఒకసారి రమ్మంటున్నారు" అని చెప్పింది.

"సరే బయల్దేరుతున్నాను" అన్నాడాయన.

ఆ సంగతే తిరిగి వచ్చి అమ్మాణమ్మగారికి చెప్పింది.

ఒక రెండు గంటల్లోనే వచ్చిన అతన్ని చూసి ఆశ్చర్యపోయింది అమ్మాజీ.

"అప్పుడే వచ్చేసారా?" అని ఆశ్చర్యపోయింది అమ్మాజీ.

"విమానంలో వచ్చాను. ఆవిడెలా వున్నారు?" అనడిగాడతను.

"ఇప్పుడు ఫర్వాలేదండి. లోపలికి వెళ్ళి చూడండి" అంది అమ్మాజీ ఆయన్ని గదిలోకి తీసుకెళ్తూ.

అమ్మాజీ ఆ గొలుసొకసారి యిస్తావా?" అనడిగింది అమ్మాణమ్మగారు అతన్ని చూస్తూనే ఒకరకమైన ఉద్వేగానికి లోనవుతూ.

అతను అర్థంకానట్లుగా చూస్తూ "ఎన్నేళ్ళకి చూసాను మిమ్మల్ని ఎలా వున్నారు? ఏమయ్యిందసలు?" అనడిగాడతను అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ.

అమ్మాజీ గొలుసు తెచ్చి ఆమె చేతికిచ్చింది.

"నువ్వు కాసేపు బయటకూర్చో అమ్మాజీ" అని చెప్పింది. అమ్మాజీ తలుపు దగ్గరకేసి బయట కూర్చుంది.

"ఇది.. ఇది.. మన సుబ్బాదేనా?" అనడిగింది పులిగోరు పతకమున్న గొలుసు అతనిచేతికిస్తూ.

ఈసారి ఆశ్చర్యపోవడం అతని వంతయింది.

అతను కళ్ళు పెద్దవి చేసి "అవును. ఇది సుబ్బూదే సుబ్బూది మీకెలా వచ్చింది? సుబ్బూని మీరు చూశారా? సుబ్బూకి మీరెవరో తెలిసిపోయిందా?" అన్నాడతను కంగారుగా.

"అయ్యో సుబ్బూ, నిన్నెదురుగా పెట్టుకుని ఎవరో అనుకున్నానే. తీరా తెలిసాక నువ్వెటు వెళ్ళిపోయావో?" అంటూ ఏడ్చింది అమ్మాణమ్మ.

"ఏంటి సుబ్బూ ఇక్కడున్నాడా? మీకు సుబ్బూ తెలుసా?" అంటూ తెల్లబోయాడతను.

అకస్మాత్తుగా వచ్చిన సుబ్బూని చూసి ముందు తెల్లబోయి ఆ పైన ఆనందపడ్డారు సత్యవతి కాళిదాసులు.

ఓరి, మామీద నీకెంత బెమరా. ఎంటనే వచ్చేసావ్. "నేను చెప్పలేదాండీ, ఈడు మనల్నొదిలుండలేడని" అని సంబరపడిపోయింది సత్యవతి.

సుబ్బూ దేనికీ జవాబు చెప్పలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

సత్యవతి అతన్ని తన తండ్రికి పరిచయం చేసింది .అందరూ సుబ్బూని అభిమానంగా చూశారు.

సత్యవతి కొసరి కొసరి వడ్డించింది.

అమ్మాయిని కూడా తీసుకురావాల్సింది అంది సత్యవతి మహాని తలచుకుని.

సుబ్బూ ఏం జవాబు చెప్పలేదు.

తలదించుకుని ఏదో తిన్నాననిపించాడు.

సుబ్బూ బయట వరండాలో కూర్చునుండగా సత్యవతి కాళిదాసుని పిలిచి పిల్లాడేదో దిగులుగా వున్నట్టున్నాడు. కాస్తలా మన పొలాలకేసి తీసుకెల్లండి. పచ్చదనం సూసి కాస్త మనసు చల్లబడతది" అంది రహస్యంగా.

సాయంత్రం టీ తాగాక అలా రారా, ఊరు చూపిస్తా అంటూ నడకసాగించాడు సుబ్బూని తీసుకుని కాళిదాసు.

నిజంగానే పచ్చగా ఏపుగా పెరిగి కోతకొచ్చిన వరిపొలాలు అలల్లా గాలికి కదులుతుంటే పహరా కాస్తున్నట్లుగా గట్లమీద కొబ్బరి చెట్లు నిండుగా కాయలతో వంగి పక్కనే ప్రవహిస్తున్న కాలువలో మొహాలు చూసుకుంటున్నాయి. కొంగల బారులు సరేసరి. కాలువ మీద చేపలకోసం బీటు వేసి తిరుగుతున్నాయి.

ఆ అందాల్ని చూసి సుబ్బూ తాత్కాలికంగా తన బాధ మరచిపోయాడు.

"ఇంత అందం యిక్కడ పెట్టుకుని మీరెలా ఆ రాజమండ్రిలో వున్నారు సర్?" అన్నాడు.

"ఏంటోరా, సొంతంగా ఏదన్నా చెయ్యాలని" అంటూ చెబుతుండగా ఆయనకి తెల్లటి పంచె, తెల్లటి జుబ్బా వేసుకుని అంతకంటే తెల్లని గడ్డంతో ప్రశాంతమైన చిరునవ్వుతో ఒక వ్యక్తి ఎదురొచ్చాడు.

ఆయన్ని చూసి కాళిదాసు వినయంగా నమస్కారం పెట్టాడు.

ఆయన చిరునవ్వుతో సుబ్బూ వైపు చూసి "అబ్బాయెవరూ?" అనడిగాడు.

"మనబ్బాయిలానే. పేరు సుబ్బూ" అన్నాడు కాళిదాసు వినయంగా.

ఆయన సుబ్బూని 'ఆయుష్మానుభవ!' అని దీవించి ముందుకు సాగిపోయాడు.

"ఏంరా ఎదవా? నీ గురించి అడుగుతుంటే నవస్కారవన్నా పెట్టవేంటి?" అన్నాడు కాళిదాసు కోపంగా.

"ఏమో నాకు పెట్టాలనిపించలేదు" అన్నాడు సుబ్బూ చిరాగ్గా.

"ఆయన గురించి నీకు తెల్వదు. చాలా గొప్ప మడిసి" అంటూ ఏదో చెప్పబోతుండగా 'మనం యింటికెళ్దాం" అన్నాడు సుబ్బూ అనాసక్తంగా.

"సరే పద" అన్నాడు కాళిదాసు.

ఇంటికి రాగానే "ఈడేంటే ధర్మారావుగారు కనిపిస్తే దణ్ణం కూడా ఎట్టలేదు" అంటూ సత్యవతికి పితూరిగా చెప్పాడు కాళిదాసు.

"అవును ఆడికేం తెలుసని. దణ్ణాలు పెడతాడు" అంటూ సుబ్బూనే వెనకేసుకొచ్చింది సత్యవతి.

ఆ రాత్రి "వాణ్ణి ఏవీ చెప్పకుండా ఆయన ఆశ్రమానికి తీసుకెళ్ళండి. అప్పుడు వాడికి నచ్చితే దణ్ణవెడతాడు" అంది సత్యవతి కాళిదాసుతో.

కాళిదాసు తలపంకించాడు.

**కారు** ఆ ఆశ్రమంలోకి అడుగుపెడుతున్నప్పుడు కొంత అయిష్టంగానే చూశాడు సుబ్బూ.

ఆశ్రమాలన్నా, బాబాలన్నా సుబ్బూకి సదభిప్రాయం లేదు. కానీ గేటు మీద ఆర్చిలో వున్న సూర్యుడి బొమ్మ అతన్ని ఆకర్షించింది. అది తప్ప కారు లోనికి వెళ్తున్నప్పుడు మరే యితర దేవుడి బొమ్మలు ఎక్కడా కనపడలేదు. అంతా పచ్చదనం. పంటభూములు. ఇంకాస్త లోపలికి వెళ్ళాక ఒక స్కూలు, అక్కడక్కడా కుటీరాలు. ఒకచోట నేతపనికేంద్రం, ఇంకొక చోట మిషను కుడుతున్న స్త్రీలు, ఇంకొన్ని చేతి పనికేంద్రాలు కనిపించసాగాయి.

కారు ఒక కుటీరం ముందు ఆగింది.

"రారా" అంటూ కారు దిగాడు కాళిదాసు.

సుబ్బూ, ఆ వెనుక సత్యవతి, సత్తిరాజు కారు దిగారు. లోపల టేబుల్ దగ్గర కూర్చుని ఏవో లెక్కలు చూసుకుంటున్న ధర్మారావుగారు తలెత్తి చూసి చిరునవ్వుతో "రండి" అన్నాడు.

అందరూ అతనికి నమస్కరించి ఎదురు కుర్చీలలో కూర్చున్నారు.

"ఏదైనా పనిమీద వచ్చారా?" అనడిగారాయన.

"పనేం లేదు. ఊరికే మా సుబ్బూకి ఆశ్రమం చూపిద్దామని" అన్నాడు కాళిదాసు.

"చూపించారా?"

"ఏదీ? ఇప్పుడే రావటం ముందు మీ దర్శనం చేసుకుని" అంది సత్యవతి.

"ఆశ్రమం అంటే దేవుడు, ప్రవచనాలు, భక్తితో ఊగిపోయే మనుషులు ఇలా అనుకున్నాను.. కానీ యిక్కడ" అంటూ సందేహంగా చూశాడు సుబ్బూ ఆయన వైపు.

ఆయన చిరునవ్వు నవ్వారు.

"అలాంటి ఆశ్రమం కాదిది. ఊళ్ళో పెద్దలు వ్యసనాలతో పిల్లలు ఆలనా పాలనా లేక పక్కదారులు పడుతుంటే స్త్రీలు దారిద్ర్యంతో చాలా బాధలు పడుతున్నారు. అలంటి వారిని తీర్చిదిద్దాలని యీ ఆశ్రమం పెట్టాను. కొంతవరకు సఫలీకృతం అయ్యాను. కానీ చేయాల్సింది చాలా వుంది. తగిన మనుషులే లేరు" అన్నారు ధర్మారావుగారు.

సుబ్బూ వింటున్నాడు.

"నేనూ పుట్టుకతో గొప్పవాడినేం కాను. నా పూర్వీకులు నాకు అంతులేని సంపదనిచ్చారు వందల ఎకరాల పంటభూమితో, నేనిక్కడ ఒక రాజాలా బ్రతికాను. కానీ జీవితానికి ధ్యేయం లేదు. తినడం తిరగడమేనా 'జీవితమంటే?' అనే ఒక ప్రశ్న నన్ను తొలిచేయసాగింది. 'జీవితమంటే ఏమిటి?' అని చాలామంది పెద్దల్ని అడిగి చూశాను. వారు చెప్పే నిర్వచనాలు నాకు నచ్చలేదు. కొన్ని ఆశ్రమాలు తిరిగి చూశాను. అక్కడ భక్తి ముసుగులో జరిగే అరాచకాలు చూశాను. ఉన్మాదుల్ని, పనిలేకుండా తింటున్న వారిని చూశాను. ఏదీ నాకు నచ్చలేదు. ఎక్కడ చూసినా వ్యాపారమే - మోసమే కనిపించింది. దేవుడి పేరుతో వీళ్ళు ప్రచారం చేస్తున్న కట్టుకథలు, కడుతున్న గుడులు, వాటి వెనుక జరుగుతున్న అధర్మం నన్ను అసంతృప్తికి గురి చేసింది. చాలా యోచించి, తిరిగి తిరిగి మా ఊరు చేరుకుని ఊరి మనుషుల్ని నిశితంగా పరిశీలించటం మొదలుపెట్టాను. చాలావరకు ఆదాయం లేకున్నా మగవారు వ్యసనపరులు కావడం, స్త్రీలు రెక్కలు విరుచుకుని కష్టపడుతూ దుఃఖభారంతో జీవితాల్ని సాగించటం, పిల్లలు కుటుంబ పరిరక్షణ లేకుండా, చదువులు లేకుండా చెడిపోవడం చూశాను.

నాకు చేయాల్సిందేదో కొద్దిగా అవగతమైంది. చిన్నగా నా పొలంలోనే ఈ ఆశ్రమాన్ని నెలకొల్పాను. మొదట ఎవరూ దీనికి ఆకర్షితులు కాలేదు. నిజంగా కష్టపడి పండించే కొందరు రైతులు - తమ భూమి అంటూ లేని వారిని చేరదీసి నా పొలాన్ని కౌలుకిచ్చాను. పేరు కౌలుగాని చాలావరకు ఆదాయం వారికే యిస్తూ, నామ మాత్రంగా తీసుకున్న డబ్బుతో స్త్రీలకి పని కల్పించాను. పిల్లలకి మంచి పాఠశాల తెరిచాను. చిన్నగా ఊరి వారు దీనికి ఆకర్షితులవ్వడం మొదలు పెట్టారు. కారణం స్త్రీలు. వారు తమ పిల్లల్ని చదివించుకోవాలన్న ధ్యేయంతో ముందుకి వచ్చారు" అంటూ చిన్నగా నవ్వారు ధర్మారావుగారు.

సుబ్బూ ఆయన మాటల్ని ఆసక్తిగా విన్నాడు.

"గేటు మీద ఆ సూర్యుడి బొమ్మ..?"

ధర్మారావుగారు అభినందిస్తున్నట్లుగా నవ్వి "నువ్వు తెలివైన కుర్రాడివి. బాగా గమనించావు. సూర్యుడు ఒక పోరాట యోధుడు. నిత్యం అతను చీకటిపై యుద్ధం చేస్తుంటాడు. నిత్య శ్రామికుడు. భూమిమీద జీవరాసులకి ప్రాణ ప్రదాత. అందుకే నేను ప్రకృతిలో సూర్యుణ్ణి మాత్రమే దేవుడిగా భావిస్తాను" అన్నారు నవ్వుతూ.

"మరి మనకు అంతమంది దేవుళ్ళూ...దేవతలూ..." అంటూ సందిగ్ధంగా చూశాడు సుబ్బూ.

చాలామంది మానవోత్తముల్ని మనం వారు చేసిన మంచి పనులు గమనించి దేవుళ్ళని చేసాం. అవతారపురుషులుగా భావించాం. కాలగతిలో కవులు నిరక్షరాస్యులయిన పామర జనాన్ని ఆకర్షించేందుకు కల్పిత గాథలు ఎన్నో రాసుకుంటూ వెళ్ళారు. అది నా ఉద్దేశ్యం. శ్రమ పడటంలోనే దైవత్వముంది" అన్నారాయన.

సుబ్బూకి ఆయన మాటలు నచ్చాయి.

"వస్తాం" అంటూ పైకి లేచారందరూ.

"వెళ్ళొస్తాను" అన్నాడు సుబ్బూ ఆయనకి నమస్కరిస్తూ.

"నాకు తెలుసు" అన్నారాయన గుంభనంగా నవ్వుతూ. సుబ్బూతోపాటు అందరూ ఆయనవైపు ఆశ్చర్యంగా చూశారు.

ఆయన లేచి వచ్చి సుబ్బూ భుజం తడుముతూ "మనం చాలా కావాలనుకున్నవి చెయ్యిజారిపోతుంటాయి. కానీ అనుకోనిదేదో మన కోసం వచ్చి కాచుకుని కూర్చుంటుంది. అంతా శుభం జరుగుతుంది వెళ్ళిరా" అన్నారు.

ఆయన చివరి మాటలు అర్థమయీ అవనట్లుగా వున్నాయి. ఆలోచిస్తూ బయటకి వచ్చి కారెక్కాడు సుబ్బూ.

ఈసారి ఆ ఆశ్రమం మరింత అందంగా ఆకుపచ్చగా కనిపించింది సుబ్బూ కళ్ళకి.

సుబ్బూని చూడగానే పరుగు పరుగున ఎదురొచ్చింది అమ్మాజీ.

"అన్నా.. అమ్మాణమ్మగారికి సీరియస్సయింది. ఆస్పత్రిలో వున్నారు. చెపుదామంటే నువ్వేమో ఫోను సిచ్చాపు చేసి కూర్చున్నావు" అంది కంగారుగా.

"అయ్యో.. ఏమయింది?" అన్నాడు సుబ్బూ ఆందోళనగా.

అమ్మాజీ జరిగిందంతా టూకీగా ఏకరువు పెట్టేసింది.

"నీ పులిగోరు పతకం నా దగ్గరే వుంది. పాపగారు ఎళ్తూ ఎళ్తూ నాకిచ్చారు నీకివ్వమని. అది చూసి ఎందుకో మరి యిరగబడిపోయారు" అంది అమ్మాజీ.

"పులిగోరు గొలుసా? అది మహా దగ్గరుందా? సరిగ్గా చెప్పు" అన్నాడు అయోమయంగా చూస్తూ.

"అవునన్నా ఆ రోజు ఆ గొలుసు తన దగ్గరే పెట్టుకుని డబ్బిచ్చారు పాపగారు. ఆ మాట నీతో చెప్పొద్దన్నారు" అంటూ సంజాయిషీ యిచ్చింది అమ్మాజీ.

"ముందు హాస్పిటల్‌కి వెళ్దాం పద" అన్నాడు ఆటో ఎక్కుతూ.

దారిలో అమ్మాజీ చెప్పింది. ఆయనెవరో వచ్చారన్నా ఆళ్ళిద్దరూ నీ గురించే మాట్లాడుకున్నారు. అదేంటో నాకు సరిగ్గా అర్థంకాలేదు కానీ ఆయనకి నువ్వు బాగా తెలుసు" అంటూ.

సుబ్బూకి మరింత టెన్షన్ పెరిగింది.

ఆలోచిస్తూ అతను అమ్మాణమ్మగారి గదిలోకి వెళ్ళగానే ఆయన సుబ్బూని చిరునవ్వుతో చూసి "రారా" అన్నారు ఆప్యాయంగా.

సుబ్బూ ఆయన్ని చూసి మరింత ఆశ్చర్యపోతూ "నాన్నా!" అన్నాడు.

"అవును నేనే. రా.. ముందు కూర్చో" అన్నారు ప్రభాకరరావుగారు.

సుబ్బూకి తండ్రిని చూసి తలతిరిగిపోయింది.

చాలా అయోమయంగా పక్కనున్న కుర్చీలో కూర్చుని అమ్మాణమ్మగారి వైపు చూశాడు.

ఆమె కళ్ళు సుబ్బూని చూసి అదేపనిగా వర్షిస్తున్నాయి.

"అమ్మా సుబ్బూకి ముందు మంచి నీళ్ళివ్వు" అన్నారు ప్రభాకరరావుగారు అమ్మాజీకేసి తిరిగి.

అమ్మాజీ గబగబా మంచినీళ్ళిచ్చింది ప్రభాకరరావుగారిని విభ్రమంగా చూస్తూ.

"కొంచెం కాఫీ కూడా" అన్నారాయన నవ్వుతూ.

అమ్మాజీ ఫ్లాస్కులోని కాఫీ మూడు కప్పుల్లో వంచి ముగ్గురికీ అందించింది.

సుబ్బూ కాఫీ తాగుతుండగా మెల్లగా అన్నారు "ఈ అమ్మాణమ్మగారు నిన్ను కన్నతల్లి" అని.

సుబ్బూ మరింత అయోమయానికి గురయ్యాడు.

"అయ్యో, ఎందుకు చెప్పేసారు? అమ్మాణమ్మ ఆందోళనగా.

"చెప్పనివ్వండి. ఇన్నాళ్ళకి కన్నతల్లి కళ్ళ ఎదుట వుంటే కూడా అబద్దాలు చెప్పే దుర్గతి నాకు లేదు. అవునా మేము నిన్ను పెంచిన తల్లిదండ్రులమి మాత్రమే" అన్నారాయన.

"నాన్నా నాకు చాలా కన్ఫ్యూజన్‌గా వుంది ఏం మాట్లాడుతున్నారు మీరు" అన్నాడు కన్నీళ్ళతో.

అమ్మాజీ కూడా తెల్లబోయి వింటున్నదంతా.

"అవును. ఒకరోజు నేను మీ అమ్మా ఏదో వూరు వెళ్ళి రైలు మారడం కోసం విజయవాడ రైలు వెయిటింగు రూంలో కూర్చుని వున్నాం. అప్పుడే హడావుడిగా ఈమె ఒక చేతిలో చంటిబిడ్డతో వచ్చి మా పక్కన కూర్చుంది. ఆ తర్వాత వెక్కెక్కి ఏడుస్తూ నిన్ను మా చేతుల్లో పెట్టి చేతులు జోడించింది.

మాకేం అర్ధంకాలేదు. "దయచేసి ఈ బిడ్డని పెంచుకోండి. నేను ఆపదలో వున్నాను" అంది.

అప్పటికే పిల్లలులేని మీ అమ్మ నిన్ను పెంచుకోవడానికి సిద్ధపడిపోయింది. నన్ను నమ్మండి. నన్ను శత్రువులు వెంటాడుతున్నారు. పసిబిడ్డ ప్రాణాన్ని కాపాడండి" అంటూ ప్రాధేయపడింది. నేను ఏం చేయాలో పాలుబోక ఆమె మాట కాదనలేక తలపంకిస్తూ నా ఫోను నెంబరు ఆవిడకిచ్చి మీరు కుదుటపడ్డాక బిడ్డ కావాలంటే ఫోను చెయ్యండి" అని చెప్పాను. ఆమె వడివడిగా వెళ్ళిపోయారు. ఆవిడే ఈ అమ్మాణమ్మగారు. తర్వాత ఆవిడ ఫోను చేసారు కానీ నిన్నిమ్మని అడగలేదు. ఆమెకు నేనే నెలనెలా డబ్బు పంపుతుంటాను. కానీ చిత్రంగా నువ్విక్కడ వున్నావని నేను కలలో కూడా అనుకోలేదు. అంతా విధిలీల అనుకుంటాను" అన్నారాయన నిట్టూరుస్తూ.

సుబ్బూ అమ్మాణమ్మగారి వైపు చూశాడు. ఆమె ఆర్తిగా సుబ్బూ వైపు చూసింది.

ఆమె ఏడుస్తూ "అవున్నాయనా మీ నాన్న చరిత్రహీనుడు. నాకు చిన్నతనంలోనే పెళ్ళయింది. అయిన రెండేళ్ళలోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఉన్న ఒక్క అన్న నన్ను ఆదరించే స్థితిలో లేడు. అతను మరొకతనితో కలిసి ఏవేవో అరాచకపు పనులు చేస్తున్నాడని తెలిసినా వారించే పరిస్థితి నాకు లేదు. చివరికి మీనాన్నకీ అతనికీ ఏదో విషయంలో చెడింది. మీ నాన్నని చంపించడానికి అతను ప్రయత్నిస్తున్నాడని తెలిసి మీ నాన్న నన్ను పారిపొమ్మని రైలెక్కించేసాడు. అతని మనుషులు నన్ను వెంబడిస్తున్నారనే భయంతో నేను నిన్ను వీరికిచ్చేసి అజ్ఞాతవాసంలో వుండిపోయాను. ప్రభాకరరావుగారు నీ క్షేమ సమాచారాలు నాకు అప్పుడప్పుడూ తెలియజేస్తూనే వచ్చారు. నేనెవరో నీకసలు తెలియచేయాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ చిత్రంగా నువ్వు నా కళ్ళెదుటే తిరుగుతున్నావు' అంది సుబ్బూని దగ్గరకి తీసుకుని.

అమ్మాజీ అంతా సినిమాలా చూస్తోంది.

"నాయినా నువ్వెప్పటికీ ప్రభాకర్రావు సుజాతగార్ల కొడుకువే. నేను జన్మ యిచ్చాను అంతే" అంది సుబ్బూ బుగ్గలు పుణుకుతూ.

అలా అనకండి. కన్నతల్లి మీరు. నాది ఒక్కటే రిక్వెస్టు. ఈ నిజం సుజాతకి మాత్రం తెలియనివ్వకండి. తను హార్టు పేషంటు. సుబ్బూ అంటే పంచప్రాణాలు తనకి. సుబ్బూ కోసం కలవరిస్తుంది. సుబ్బూ యికనైనా అజ్ఞాతం వీడి తనని చూస్తే సంతోషపడతాను" అన్నారు ప్రభాకర్రావుగారు లేచి నిలబడుతూ.

"అవును సుబ్బూ, ఆ మహా యిల్లాలు నిన్ను కనకపోయినా అల్లారుముద్దుగా పెంచింది. వెళ్ళు. వెళ్ళి కనపడు. ఈ నిజాన్ని ఎన్నడు ఆమెకు తెలియజేయొద్దు" అన్నారు అమ్మాణమ్మగారు.

సుబ్బూ తండ్రి చేయి పట్టుకున్నాడు.

"అమ్మాణమ్మగారిని...సారి అమ్మని జాగ్రత్తగా చూసుకో" అని అమ్మాజీకి చెప్పాడు సుబ్బూ.

అమ్మాణమ్మగారు చిన్నగా నవ్వి "నాకిప్పుడే జబ్బూలేదు. నువ్వు నా బిడ్డవని తెలిసాక కొండంత బలం వచ్చేసింది నువ్వెళ్ళిరా" అందామె.

సుబ్బూ తండ్రితో వెళ్ళగానే అమ్మాణమ్మగారు డిస్‌చార్జయి యింటికి చేరుకున్నారు.

అమ్మాజీ ఆ నిజాన్ని గబగబా అందరికీ చెప్పేసింది హుషారుగా.

ఇక అక్కడ పండుగ వాతావరణమే వెలిసింది.

"అవును నేనప్పుడే అనుకున్నా. ఈ కుర్రాడికి అమ్మాణమ్మగారి పోలికలున్నాయని." అంది పాపాయమ్మ గర్వంగా.

"నువ్వన్నీ ముందే అనుకుంటావు లెద్దూ. నువ్వు మరి ఈరబెమ్మానివి" అంటూ నవ్వింది అమ్మాజీ.

"పాపాయమ్మగారన్నది కొంతవరకూ నిజమే. ఆ అబ్బాయిలోని మంచితనం నిజంగా అమ్మాణమ్మగారిదే విధి ఎంత విచిత్రం? ఇన్నాళ్ళకి తల్లీబిడ్డల్ని కలిపింది" అన్నారు సరస్వతమ్మగారు సంతోషంగా.

సుబ్బాని చూడగానే సుజాత ప్రాణం లేచొచ్చింది. కొడుకుని గట్టిగా కౌగిలించుకుని వెక్కెక్కి ఏడ్చింది.

"నువ్వెంత దుర్మార్గుడివిరా! నన్నొదిలేసి వెళ్ళిపోతావా? నేనేం తప్పు చేస్తానా?" అంటూ.

సుబ్బా తల్లిని అనునయిస్తూ "నేనేం వెళ్ళిపోలేదమ్మా. నాన్నగారితో ఎప్పుడూ కాంటాక్టులోనే వున్నా. మన యిల్లు పేకాట క్లబ్బుగా మారిపోతే నేనెలా భరించగలను. అందుకే వెళ్ళిపోయాను" అన్నాడు.

"సర్లే జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇక మమ్మల్ని వదిలి వెళ్ళకు" అంటూ కొడుకుని గట్టిగా కౌగిలించుకుంది. సుబ్బా జవాబేం చెప్పలేదు.

హిప్‌బోన్ ఫ్రాక్చర్‌తో మంచంలో వున్న అమ్మమ్మని వెళ్ళి పలకరించాడు ప్రేమగా.

ఆమె సుబ్బాని ఆర్తిగా నిమిరి "నాయనా నా వల్లనే ఇంత అనర్థం జరిగిందిరా. మీ అమ్మా నాన్నలు నావల్ల చాలా బాధలు పడ్డారు. క్షమించరా" అంది ఏడుస్తూ.

"అలా ఎందుకనుకుంటున్నావ్ అమ్మమ్మా నీ వలనే ప్రపంచాన్ని చూశాను. ఎన్నెన్నో తెలుసుకున్నాను" అన్నాడు ఆమె తల నిమురుతు.

ఆరోజు సుబ్బా తిరిగి ప్రయాణమవుతుంటే "అయ్యో, మళ్ళీ వెళ్ళిపోతావా?" అంటూ బాధపడింది సుజాత.

"వెళ్ళనీ. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక మనల్నే అంటిపెట్టుకుని వుంటారా? వాళ్ళకి వాళ్ళుగా నిలబడొద్దూ" అంటూ సుజాతని వారించారు ప్రభాకర్రావుగారు.

"నేనెక్కడికీ వెళ్ళడం లేదమ్మా. త్వరలో మీరూ నా దగ్గరకొస్తారు" అని తల్లికి చెప్పి బయల్దేరాడు సుబ్బా.

అతని కళ్ళలో యిప్పుడు కనిపిస్తున్నది ధర్మారావుగారి ఆశ్రమం మాత్రమే.

రెండు సంవత్సరాలలో అక్కడ మొక్కలు చెట్లయ్యాయి. చెట్లు పెనువృక్షాలయ్యాయి. పళ్ళతో, పూలతో వాటిని ఆశ్రయించిన పక్షుల కిలకిలారావంతో ఆ ప్రాంతంలోనే ఒక ప్రత్యేకతని సంతరించుకుని విలసిల్లుతోంది.

ఇప్పుడు పేరుకి అది ధర్మారావుగారి ఆశ్రమం అయినా ఒక నిష్ణాతుడైన వ్యక్తి సారథ్యంలో అది మూడుపువ్వులూ ఆరుకాయలై భాసిల్లుతోంది. నిజమైన సూర్యుడిప్పుడు ఉదయించాడని ధర్మారావుగారు అతన్ని అందరికీ పరిచయం చేస్తుంటారు.

అతనే సుబ్బా.

సుబ్బా మనసా వాచా ఆ ఆశ్రమాన్ని ప్రేమించి దాన్ని అన్నివిధాల ముందుకు తీసుకువెళ్ళే ప్రతి ప్రయత్నమూ చేస్తున్నాడు.

అక్కడంతా ఉన్నది శ్రామికులు.

సోమరులకి అక్కడ స్థానం లేదు.

కబుర్ల రాయుళ్ళకి, రాజకీయ నాయకులకి అక్కడ ప్రవేశంలేదు. ప్రకృతి ప్రతిరూపాలైన స్త్రీలు నిండుగా పూచిన చెట్లలా కళకళలాడుతూ పనులు చేస్తుంటారు. పిల్లలు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తుంటారు.

దాదాపు భజన్‌లాల్ బిల్డింగ్ ఖాళీ అయి అక్కడికి చేరుకుంది. మొదట అమ్మాణమ్మగారిని, అమ్మాజీని తీసుకొచ్చాడు సుబ్బా. ఆ తర్వాత ఒక్కొక్కరూ అక్కడికి చేరుకున్నారు. ఇక పాపాయమ్మ అక్కడ వుండలేక ఆశ్రమానికే చేరుకుంది.

పాపాయమ్మ వెళ్ళాక ఒంటరిగా వుండలేక లత తన ఉద్యోగం వదిలి ఆశ్రమానికి చేరుకుంది.

అందరికీ అక్కడ తగిన పని దొరికింది.

ధర్మారావుగారు అందరిని మనస్ఫూర్తిగానే ఆహ్వానించారు.

సరస్వతమ్మగారు సాయంత్రం పాడే భక్తిపాటలు వారికి మంచి కాలక్షేపం. అమ్మాజీ, సీత లేసులు అల్లడం నేర్పిస్తున్నారు. అమ్మాణమ్మగారు, పాపాయమ్మ తోటపనులు పర్యవేక్షిస్తుంటారు.

ఒకరోజు మొక్కలకి నీళ్ళు పెడుతున్న సుబ్బా వెనక ఒక వ్యక్తి నిలబడి వున్నాడు. వెనక్కి తిరిగి చూశాడు సుబ్బా.

రామక్రిష్ణ

సుబ్బాకి నమస్కరించి "నన్నుకూడా మీలో చేర్చుకోండి. నేను మారిపోయాను. కష్టపడి పని చేస్తాను" అన్నాడు.

పాపాయమ్మ నమ్మలేదు.

"వద్దొద్దు. వాణ్ణి చేరనివ్వొద్దు. కడివెడు పాలల్లో విషం చుక్కలాంటివాడు ఆడు" అంది ఛీదరిస్తూ.

"మామ్మా, ఇది నీ వ్యవహారం కాదు - నీ పని నువ్వు చూసుకో" అని మందలించాడు సుబ్బా.

పాపాయమ్మ గప్‌చిప్‌గా వెళ్ళిపోయింది.

సుబ్బా రామక్రిష్ణని ధర్మారావుగారి దగ్గరకి తీసుకెళ్ళాడు. రామక్రిష్ణ కథంతా విని తలపంకించారాయన.

ఒక మనిషిని అతని గత చరిత్ర విని చెడ్డవాడని ముద్రవేయలేం. కాలం మన మనుగడలో ఎన్నో మార్పులు తెస్తుంది. వాటి ద్వారా పరివర్తన చెంది సక్రమ మార్గంలోకి అడుగుపెట్టినవాడే నిజమైన మనిషి. వెళ్ళు. వెళ్ళి సుబ్బా నీకు అప్పచెప్పిన పనులు సక్రమంగా నిర్వర్తించు" అన్నారాయన.

రామక్రిష్ణ ఆయనకి నమస్కరించి విధుల్లో చేరాడు.

లత మొహం అతని మార్పు చూసి వికసించింది.

రోజూ సత్యవతి కాళిదాసులు సాయింత్రాలు ఆశ్రమానికొస్తారు. దూరం నుండే సుబ్బాని చూసి పుత్రవాత్సల్యంతో పొంగిపోతుంటారు.

ఎంత గుర్తింపు వద్దని అనుకుని అజ్ఞాతంగా సేవలందిస్తున్నా 'సూర్యుడి వెలుగుని దాచతరమా' అన్నట్లుగా ఆ ఆశ్రమానికి జాతీయ బహుమతి లభించింది.

పేపర్లలో, టి.వి వార్తల్లో మొదటిసారిగా బహుమతి అందుకుంటున్న సుబ్బా అందరి దృష్టిలో పడ్డాడు.

ఫలితంగా ఎప్పుడో ఇల్లువదిలి వెళ్ళిన తాతగారు ఆశ్రమాన్ని వెదుక్కుంటూ వచ్చేసారు.

సుజాత న్యూస్‌లో చూసి ఆనందంతో పొంగిపోయింది. వెంటనే తల్లిని, భర్తని తీసుకుని ఆశ్రమానికి వచ్చేసింది.

ఆ రెండు రోజుల తర్వాత ఒక కారు ఆ ఆవరణలో ఆగింది.

ఆ కారులోంచి దిగిన వ్యక్తుల్ని చూసి దిగ్భ్రమకి లోనయ్యారందరూ.

ధనుంజయరావు వెంట నడచి వస్తున్న మహాని చూసి అందరూ ఆనందంతో పొంగిపోయారు.

"పాపగారూ" అంటూ పరిగెత్తికెళ్ళి కౌగిలించుకుంది అమ్మాజీ ఆనందంతో.

మహా నవ్వింది అందర్నీ చూస్తూ.

ఆమె వేషభాషల్లో ఎంతో మార్పు.

నేత చీరలో జడవేసుకుని హుందాగా తండ్రివెంట నడచి వస్తున్న మహాని దూరంగా మౌనంగా చూస్తూ ఉండిపోయాడు సుబ్బూ.

వాళ్ళు తిన్నగా ధర్మారావుగారి గదిలోకి వెళ్ళి తమని తాము పరిచయం చేసుకున్నారు.

"ఈ అమ్మాయి నా ఒక్కగానొక్క కూతురు. పేరు మహాలక్ష్మి. నా భార్య ఈ మధ్యనే హార్టెటాక్‌తో చనిపోయింది. నా కూతురు నేను చేయాలనుకున్న వివాహాన్ని తిరస్కరించింది. ఒక ట్రస్టు తెరచి తనకి తోచిన సేవలు చేస్తున్నది. నా ఆస్తికంతటికీ ఏకైక వారసురాలు. మొన్న జాతీయ బహుమతి అందుకున్న మీ సంస్థని చూడాలని ఉబలాటపడింది. అందుకే తీసుకొచ్చాను" అన్నాడు ధనుంజయరావు ధర్మారావుగారితో.

"చూడటానికేమీ లేదు. ఒక్కో మనిషికి ఒక్కో అభిరుచి. అది మంచిదయితే దాని సార్థకత దానికి లభిస్తుంది" అంటూ మహావైపు చూసి 'నిజంగానే నువ్వు సార్థక నామధేయవి. లక్షణంగా వున్నావు. పెళ్ళి ఎందుకొద్దనుకుంటున్నావు?' అనడిగారు చిరునవ్వుతో.

మహా జవాబులేనట్లుగా చూసి తలదించుకుంది.

"సరే! నీ కిష్టమైతేనే చెప్పు. నా వలన జరగాల్సిన పనేమైనా వుందామ్మా?" అనడిగారు తిరిగి.

"నేనొక ట్రస్టు నడుపుతున్నాను. అది నాకంత తృప్తి కలిగించడం లేదు. నేనొక్కర్తినే ఆ భారాన్ని మోయలేకపోతున్నాను. మీరు అంగీకరిస్తే దాన్ని మీ సంస్థతో కలిపి ఉమ్మడిగా సేవ చేయాలని ఇక్కడికొచ్చాను. మీరంగీకరిస్తారనే భావిస్తున్నాను" అని వినయంగా తన అభిలాషని వ్యక్తం చేసింది మహా.

ధర్మారావుగారు మందహాసం చేసి "అలాగే కానివ్వమ్మా" అన్నారు.

వెంటనే బెల్ మోగించి సుబ్బూని పిలవమన్నారు.

సుబ్బూ వచ్చి తలదించుకుని నిలబడ్డాడు.

మహా ధనుంజయరావుగారి చూపులు ఒక్కసారే అతనిమీద నిలబడ్డాయి.

సుబ్బూ ఎత్తుకి తగ్గ లావులో తెల్లని లాల్చీ పైజమా ధరించి వాళ్ళకళ్ళకి సరికొత్తగా కనిపిస్తున్నాడు.

సుబ్బూ వారివైపు చూడలేదు.

"చూడు సుబ్బూ ఈయన హైదరాబాదునుండి మన ఆశ్రమం గురించి తెలుసుకుని వచ్చారు. వారికి మన ఆశ్రమ ధర్మాలు తెలియజేసి వారికి అంగీకారమైన పక్షంలో వారి ట్రస్టుని మనతో విలీనం చేసే ఏర్పాట్లు లాయరుగారితో మాట్లాడి చెయ్యి" అన్నారు.

సుబ్బూ తలపంకించి వారిని తనగదికి తీసుకెళ్ళి కూర్చోబెట్టీ లాయర్‌తో ఎగ్రిమెంటు చేసే ఏర్పాట్లు చేసాడు. అంతా వ్యావహారికంగానే నడిచింది తప్ప సుబ్బూ మహా తెలిసినట్లుగా ఏ మాత్రం ప్రవర్తించలేదు.

ఆ సాయంత్రం -

సుబ్బూ ఆశ్రమంలో వున్న తామరకొలను దగ్గర వున్న పనసచెట్టు అరుగుమీద కూర్చుని చిన్న చిన్న గులకరాళ్ళని కొలనులో విసురుతూ వాటి వలన పుడుతున్న అలల్ని గమనిస్తున్నాడు. మహా అతని దగ్గరగా వచ్చి "నేను ఆ గులకరాయిలా అనిపిస్తున్నానా?" అనడిగింది చిరునవ్వుతో.

బదులుగా సుబ్బూ నవ్వి "రా, కూర్చో. నువ్వు గులకరాయివయినా నేను కొలనుని కాదులే" అన్నాడు.

మహా కూర్చుని "జీవితం అలసిపోయినట్లుగా అనిపించడంలేదా?" అంది.

"లేదు నిత్యనూతనంగానే ఉంది. రోజూ ఎంతమంది శ్రమజీవుల గాథలు వింటుంటానో. వారందరి ఆలోచనా విధానాలని మారుస్తూ వారి పురోగతిని గమనిస్తున్నప్పుడు ఒక చిరుమొక్క దశలవారీ పెరిగి పూలూ, పళ్ళూ అందిస్తున్న భ్రాంతి కలుగుతుంది.

"ఏమో నేను అలసిపోయాను. అమ్మ నాతో పోరాడి పోరాడి చనిపోయింది. నాన్న నేను ఒంటరినయిపోయానని కుమిలిపోతుంటారు.వీరి దృష్టిలో పెళ్ళి ఆడపిల్లకి ఒక గమ్యంలాంటిది. ఆ ఒడ్డుచేర్చలేక పోయామని వారి వేదన."

"మరి చేసుకోవాలిందికదా!"

"నిజమే. చేసుకోవాల్సిందే ఒకసారి మోసగాణ్ణి ప్రేమించి – మరోసారి ప్రేమించినవాడిని పొందలేక విరక్తి చెందాను. ఇప్పుడసలా వ్యామోహం లేదు. కానీ ప్రయాణం చెయ్యాలి. ఎటు చేయాలో ఎందుకు చేయాలో తెలియక ఒక ఆపన్న హస్తంకోసం మాత్రమే ఇక్కడికి వచ్చాను. నిన్ను ఇబ్బంది పెట్టి నీ ఆశయాలు భంగం చేయాలని ఎంతమాత్రం కాదు" ఆమె మాటల్లోని నిస్పృహ, అందులోంచి పుట్టుకొచ్చిన ఆత్మాభిమానం కొట్టొచ్చినట్లుగా కనబడి తలదించుకున్నాడు సుబ్బూ.

"అందుకు నీకే యిబ్బందీ వుండదు. నువ్వనుకున్న ఆశించిన స్నేహ సహకారాలు నీకు తప్పక అందుతాయి. ధర్మారావుగారు చాలా మంచిమనిషి. పద వెళ్దాం. చీకటి పడుతున్నది అని లేచి నిలబడ్డాడు సుబ్బూ. అతని వెంట నడచి వస్తున్న మహాని అస్తమిస్తున్న సంజెకెంజాయ రంగు ఆకాశపు కాంతిలో దూరం నుండి చూసిన ధర్మారావుగారు గుంభనంగా నవ్వుకున్నారు.

వెళ్తూ వెళ్తూ ధనుంజయరావుగారు చెప్పిన మాటలు, సత్యవతి, కాళిదాసులు చెప్పిన సంగతులూ – అన్నీ అతనికి వారం రోజుల్లోనే తెలిసిపోయాయి.

అందరిదీ ఒకటే మాట. సుబ్బూ మహాలు పెళ్ళి చేసుకోవాలి..

ఆ రోజు ధర్మారావుగారు సుబ్బూని పిలిచి "పెళ్ళి చేసుకోవా?" అనడిగారు.

సుబ్బూ ఒక్కసారి ఆయననుండి వచ్చిన ప్రశ్నకి తెల్లబోయి "అదంత అవసరమా గురూజీ" అన్నాడు.

"అవసరమే. వివాహం స్త్రీ పురుషుల జీవితానికి ఒక పరిపూర్ణతని తెస్తుంది. ఒకరితో మరొకరు కలిసి వేసే అడుగులు సంతోషాన్నీ ధైర్యాన్నీ, నమ్మకాన్నిస్తాయి. మనో నిబ్బరాన్నిస్తాయి. వద్దనుకోవాల్సిన నిబంధనలు కానీ, అవసరంకానీ మన ఆశ్రమానికి లేదు. పైగా ఒకే సేవా ప్రవృత్తి వున్న యిద్దరు వ్యక్తులు కలిసి పనిచేస్తే మన ఆశయాలు మరింతగా ఫలిస్తాయి. ఆలోచించు"

సుబ్బూ మౌనంగా బయటకి వెళ్ళాక మహాని పిలిచి అవే మాటలు చెప్పారు ధర్మారావుగారు.

ఆ రోజు అందరి సమక్షంలో సింపుల్‌గా సుబ్బూ, మహాల రిజిస్టర్ మారేజ్ అయిపోయింది.

ఆ సాయంత్రం సత్యవతీ కాళిదాసులు ఆశ్రమంలో అందరికీ విందుభోజనం ఏర్పాటు చేసారు. ప్రభాకర్రావు, సుజాత, అమ్మాణమ్మ తదితరులందరి సమక్షంలో జరిగిన ఆ వివాహం వీరూ – వారూ అని లేకుండా అందరూ ఆనంద భాష్పాలే అక్షితలుగా వారిపై కురిపించారు.

ఇప్పుడా దంపతులు మునుపటి గిల్లి కజ్జాలాడుకునే చిలిపి పిల్లలు కాదు. ఒక గొప్ప బాధ్యతని స్వీకరించి ముందుకడిగేసిన పరిపక్వత పొందిన యువతీ యువకులు.

(సమాప్తం)

*అంకితం -*

*దాదాపు పదిహేను సంవత్సరాలు రచనాలోకానికి దూరమైన నన్ను ఉత్సాహపరచి తిరిగి వారి అంతర్జాల పత్రికద్వారా నా చేత రచనలు చేయించి గత అయిదు సంవత్సరాలుగా నా రచనలు 'నిదురించే తోటలోకి' - 'మన కథ నిజం కాదా' సీరియల్స్ ప్రచురించిన కౌముది పత్రిక సంపాదకులు కిరణ్‌ప్రభగారికి , వారి శ్రీమతి కాంతికిరణ్‌గారికి ప్రేమాభిమానాలతో ఈ నవల అంకితం -*

*రచయిత్రి,*

*మన్నెం శారద*